ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 43 సంచిక : 12 అభివృద్ధి మాసపత్రిక అక్టోబరు 2015 ₹ 20

ప్రత్యేక సంచిక

## నైపుణ్యాభివృద్ధి : నూతన శిఖరాల అధిరోహణ


భారతదేశంలో నైపుణ్యాభివృద్ధి పునర్విభజన
దిలీప్ షెనాయ్

ఉద్యోగాలు, ఉపాధి, సాంకేతికత మరియు నైపుణ్యాలు
అరుణ్ మైరా, మదన్‌పడకి

అణగారిన వర్గాలకు ఉపాధి అవకాశాలు
సునీత సంఘి

ప్రత్యేక వ్యాసం
చేనేతకు చేయూత - మన సంప్రదాయ పరిరక్షణ
మోనిక గార్గ్

విశేష వ్యాసం
ఉపాధ్యాయ శిక్షణార్థులతో గాంధీజీ సంభాషణల నుండి...




## విద్యారుణాలపై సమాచారానికి ఏకగవాక్ష సేవ

విద్యారుణాలు తీసుకునేవారి సౌలభ్యంకోసం విద్యాలక్ష్మి పేరిట ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను కేంద్రప్రభుత్వం 15 ఆగష్టు,2015న ప్రారంభించింది. కేంద్ర బడ్జెట్ 2015-16లో విద్యారుణాల పర్యవేక్షణ, సమాచారంకోసం ఐటి ఆధారిత విద్యార్థి సహాయక సంస్థను ప్రారంభించడానికి సంకల్పించారు. దీని ద్వారా ప్రధానమంత్రి విద్యాలక్ష్మి కార్యక్రమం క్రింద జారీ చేసిన విద్యారుణాలను కూడా పర్యవేక్షిస్తారు. విద్యారుణాలు అందుకోలేక ఉన్నత చదువులకు దూరమవుతున్నవారికి ఇది సహాయకారిగా ఉంటుంది. ఈ కార్యక్రమ లక్ష్యాలను సాధించడంలో ఇది ప్రథమ మెట్టు. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు అందించే విద్యారుణాలపై సమగ్ర సమాచారాన్ని అందించే ఏకైక వెబ్‌పోర్టల్ ఈ విద్యాలక్ష్మి. ఈ పోర్టల్‌లో ఈ క్రింది అంశాలున్నాయి.

◆ బ్యాంకు అందించే విద్యారుణాల వివరాలు. ◆ అన్ని విద్యారుణాలకూ వర్తించే ఒకే దరఖాస్తు. ◆ విద్యారుణాలకై వివిధ బ్యాంకులను సంప్రదించే అవకాశం ◆ బ్యాంకుల్లో రుణ దరఖాస్తు స్థితిని తెలుసుకునే సౌకర్యం ◆ విద్యారుణాలపై ఫిర్యాదులు, సలహాలు స్వీకరించే అవకాశం ◆ విద్యారుణ దరఖాస్తు స్థితి. ◆ ప్రభుత్వ ఉపకార వేతనాలు.

ఇప్పటి వరకూ 20 బ్యాంకులు ఇందులో అనుసంధానమవ్వగా, 34 రకాల విద్యారుణాలను ఈ విద్యాలక్ష్మిద్వారా అందిస్తున్నారు. బ్యాంకులు తమ సర్వర్లను ఈ పోర్టల్‌తో అనుసంధానించడం ద్వారా దరఖాస్తుదారులు తమ దరఖాస్తు స్థితిగతులను తెలుసుకోగలుగుతున్నారు. ఈ సదుపాయం ద్వారా బ్యాంకు తక్షణమే రుణాలను మంజూరు చేసే సౌలభ్యం కలిగింది. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది విద్యార్థులు ఈ ఏకగవాక్షం ద్వారా లబ్ధిపొందుతున్నారు.

### చేనేత ఉత్పత్తులకు ఈ-మార్కెటింగ్

చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహంతోపాటు, ఈ-మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి భారత ప్రభుత్వం ఒక ప్రణాళిక (పాలసీ ఫ్రేమ్‌వర్క్)ను రూపొందించింది. దీని ద్వారా మరింత మెరుగైన మార్కెటింగ్ జరగడమేకాకుండా, యువతరానికి చేనేత చేరువకాగలదు. ఈ ప్రణాళిక చట్రం ప్రకారం డిప్యూటీ కమిషనర్ ( చేనేత) గుర్తింపు పొందిన ఈ-వ్యాపార సంస్థతో కలిసి ఈ-మార్కెటింగ్‌ను చేపడతారు. చేనేత ఉత్పత్తులను ఈ-మార్కెటింగ్ చేయదలచిన సంస్థలు డిప్యూటీ కమిషనర్ (చేనేత) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వ్యాపార సంస్థ అర్హతను ఒక కమిటీ పరిశీలించి అనుమతులు జారీ చేస్తుంది. దరఖాస్తు ప్రక్రియను మూడు వారాల్లో పూర్తి చేస్తారు. ఒకసారి అనుమతి లభించిన వెంటనే ఈ-కామర్స్ సంస్థలు తమ హోమ్ పేజీలో తమ ఉత్పత్తులను ప్రదర్శించవచ్చు. ఇవి ప్రత్యేక ఇండియా హ్యాండ్‌లూమ్ గుర్తు మీద ఉన్న సెక్షన్‌లనూ ప్రదర్శించాల్సి ఉంటుంది. డిప్యూటీ కమిషనర్ (చేనేత) కార్యాలయం ఈ క్రింది చేనేత ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

- ◆ అధికృత ఈ- కామర్స్ సంస్థల పేర్లను డిసి(హ్యాండ్‌లూమ్) తన వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. అలాగే చేనేత సేవా కేంద్రాలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తారు.
- ◆ చేనేత కార్మికుల సేవా కేంద్రాలు మరియు ముఖ్య చేనేత కేంద్రాల్లో ఈ-కామర్స్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడతారు.
- ◆ చేనేత ఉత్పత్తుల క్యాటలాగ్‌ను డిసి(హ్యాండ్‌లూమ్) తన వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.
- ◆ చేనేత కార్మిక సేవాకేంద్రాల్లో, చేనేత క్లస్టర్స్‌లో లభ్యమయ్యే స్థలం, ఐటి సదుపాయాలపై సమాచారం అందిస్తారు.

గుర్తింపు పొందిన ఈ-కామర్స్ సంస్థ పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. వాటి పనితీరును బట్టి గుర్తింపును పొడిగించడమా లేదా నిర్ణయిస్తారు. ఈ ప్రణాళిక చట్రాన్ని కూడా మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సమీక్షిస్తుంటారు. ఈ ప్రణాళిక చేనేత ఉత్పత్తులకు, చేనేత రంగానికి ఊపునివ్వగలదని ఆశిస్తున్నారు. చేనేతను ప్రోత్సాహపరచడానికి ప్రభుత్వం చేపడుతున్న చేనేత దినోత్సవం, భారతీయ చేనేత బ్రాండ్‌లాంటి కార్యక్రమాలు మంచి ఫలితాలిస్తున్నాయి.

*యోజన సంపాదకవర్గం*

ISSN : 0971-8729

సంపుటి : 43 సంచిక : 12

అక్టోబరు 2015

# యోజన

ముఖ్య సంపాదకులు : దీపికా కచ్చల్
వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : షఫి మహమ్మద్

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్): వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in,
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రాః క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. సంపాదకీయం 4
2. నైపుణ్యాభివృద్ధికి కొత్త నిర్వచనం 5
దిలీప్ చెనోయ్
3. ఉపాధికి సాంకేతిక విజ్ఞానం – నైపుణ్యాల ఆవశ్యకత 8
అరుణ్ మైరా, మదన్ పడకి
4. నైపుణ్యాభివృద్ధి మెరుగుకు వనరులు – సామర్థ్యాల సద్వినియోగం 14
ప్రొ. మనోజ్ జోషి, డా. అరుణ్ బహదౌరియా, డా. శైలజా దీక్షిత్
5. నైపుణ్యంతోనే మానవ వనరుల అభివృద్ధి 18
సచిన్ అధికారి
6. గిరిజనుల నైపుణ్యాభివృద్ధి – ప్రస్తుత స్థితి భవిష్యత్ వ్యూహాలు 22
రాజేంద్ర సింగ్ గౌతమ్, నవీన్ టి., శశాంక్‌సింగ్
7. నైపుణ్యాభివృద్ధి – వృత్తివిద్య 25
డా. స్వాతిముజుందార్
8. సమ్మిళిత వృద్ధికి నైపుణ్యం : రానున్న నవకల్పన మరియు మిశ్రమ శిక్షణల దశాబ్దం 27
పూజా జ్ఞాన్ చందాని
9. మిశ్రమ అధ్యయనం ద్వారా – నైపుణ్య వృద్ధి 31
ఎం. సాయిరాం, శరణ్యా రమేష్
10. విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్యశర్మ 33
11. దర్పణం – యోజన సంపాదకవర్గం 36
12. నైపుణ్య భారతం దిశగా శిక్షణా కార్యక్రమాలు 38
పి. రత్నాకర్
13. మహిళల నైపుణ్యాభివృద్ధి ఆటంకాలు 42
దేవ్‌నాథన్
14. చేనేతకు చేయూతతో సంప్రదాయ పరిరక్షణ 44
మోనిక ఎస్. గార్గ్
15. ఆంధ్రుల స్వప్నం : అమరావతి నిర్మాణం 48
విజయ భాస్కర్ పైడి
16. అణగారిన వర్గాలకు ఉపాధి అవకాశాలు 51
సునీత సంఘీ
17. ప్రపంచ శాంతికి, మానవీయ విలువలకు గాంధీ సిద్ధాంతాలు 53
దిరిశాల వెంకటేశ్వర రావు
18. ఆధునిక గ్రంథాలయ శిల్పి డా. ఎస్.ఆర్.రంగనాథన్ 55
డా. జి.ఎ. ప్రసాదరావు
19. మావనజాతి మనుగడకు మూగజీవాల సంరక్షణ 58
సుసర్ల మాధవి
20. పోలీసు అమరులు 60
ఎ. కుమారస్వామి
21. నూతన దీక్షపథంలో ఉపాధి అవకాశాలు : సమగ్ర అభివృద్ధి 63
అలఖ్ ఎన్. శర్మ
22. విద్య – వృత్తి విద్య 67

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

**యోజన (తెలుగు) చందా వివరాలు**

**1 సంవత్సరానికి - రూ. 100/- 2 సంవత్సరాలకు - రూ. 180/- 3 సంవత్సరాలకు - రూ. 250/-**

**మరిన్ని వివరాలకోసం : 040-23310162**


**చందాను మనియార్డరు/డి.డి. ద్వారా పంపవలసిన చిరునామా :** ఎడిటర్, యోజన (తెలుగు), 10–2–1, ఎఫ్‌డిసి కాంప్లెక్స్, మహావీర్ హాస్పిటల్ ఎదురుగా, ఏ.సి. గార్డ్స్, హైదరాబాద్ – 500 028 ఫోన్ : 23315288, 23314823

యోజనలో ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరచిన భావాలు ఆయా రచయితలవే. వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం/సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు

యోజన

చీఫ్ ఎడిటర్ డెస్క్

# నైపుణ్య భారతం - విజయ భారతం




ఏదైనా రంగంలో విజయం సాధించడమంటే 'హాంఫట్' అని మాయ చేయడం కాదని మనందరకూ తెలుసు. నేటి యువతరానికి కూడా ఇదే విజయసూత్రం. ఏ దేశానికైనా, సరిగా మార్గ నిర్దేశం చేస్తే, యువ శక్తే ప్రధాన విజయ సాధనమవుతుంది. ఈ మార్గనిర్దేశంలో నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు అనేవి ప్రధానాంగాలు. నిజం చెప్పాలంటే, దేశంలో యువ శక్తి అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, నేటి మన సమాజంలో పారిశ్రామికవేత్తలు లేదా ఉపాధి కల్పించగలవారు, సరైన నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి కోసం వెంపర్లాడుతున్నారు. కారణమేమంటే, ఆయా రంగాలకు ఆవశ్యకమైన నైపుణ్యాలు మన సిబ్బందిలో లోపించడమే! లేబర్ బ్యూరో నివేదిక 2014 ప్రకారం, మన దేశ కార్మిక శక్తిలో సరైన నైపుణ్యం గలవారు కేవలం రెండు శాతం మాత్రమే! దీనితో పాటు, సాధారణ అక్షరాస్యత కలిగిన వారికి ఉపాధి కల్పించడం కూడా ఒక సవాలే. మన విద్యా విధానం అనేక వేల మంది మేధావులైన వారిని విద్యావంతులుగా తీర్చిదిద్ది ప్రతి సంవత్సరమూ సమాజంలోకి పంపుతున్నది. అయితే, వారికి తగిన వృత్తి నైపుణ్యాలు మాత్రం కరువవుతున్నాయి. దానితో మన పరిశ్రమలకు, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలకూ, ప్రతి సంవత్సరమూ కళాశాలలూ-విశ్వవిద్యాలయాలనుండి ఉత్పత్తి అవుతున్న విద్యావంతులకూ మధ్య పెద్ద అఘాతం ఏర్పడుతున్నది. ఇలాంటి ఆంగ్ల ప్రాధాన్య విద్యావంతులు ఖచ్చితంగా దేశీయ/అంతర్దేశీయ అవసరాలను తీర్చగలరు. కావలసిందల్లా, తగిన శిక్షణ అంతే!

ఖచ్చితంగా ఈ లక్ష్య సాధనకే కేంద్ర ప్రభుత్వం "నైపుణ్య భారత్" పథకాన్ని ప్రారంభించింది. 2022 నాటికి 40 కోట్ల మంది యువతకు తగిన శిక్షణా నైపుణ్యాలను గరిపి ఉపాధికి సంసిద్ధులను చేయాలనేది ఈ పథకం లక్ష్యం. అన్నీ స్థాయిలలో సరైన శిక్షణ పొందిన నైపుణ్యం గల శ్రామిక శక్తి సమ్మిళిత వృద్ధికి ఎంతో అవసరం. అయితే నైపుణ్య వృద్ధి అనే అంశాన్ని ప్రత్యేకంగా చూడలేము. ఈ ఉపాధి పొందిన తరువాత కూడా మధ్య మధ్యలో స్వల్ప కాలిక శిక్షణ/నైపుణ్య వృద్ధి కార్యక్రమాలు అన్నీ కలిసి ఉంటాయి. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు, ప్రజలూ అందరూ కలిసి ఉమ్మడిగా ఈ లక్ష్య సాధనకు కృషి చేయాలి. సాధారణ విద్యలో వృత్తి విద్య అనివార్య అంశంగా ఉండాలి. అదే సమయంలో సమాజంలోని మహిళలు, పేదలు, గిరిజనులు వంటి వివిధ వర్గాలవారి అవసరాలకు తగినట్లుగా వివిధ శిక్షణా కార్యక్రమాలు, ఉండాలి. అయితే ఇలాంటి వర్గాలలో అధిక శాతం మంది నైపుణ్యాభివృద్ధికి నిరక్షరాస్యత ఒక పెద్ద ఆటంకం కనుక, సాధారణ అక్షరాస్యతా కార్యక్రమాలతో ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కూడా కలిసి వుంటే, మరింత విజయవంతమవుతుంది. దీనివల్ల, వారి వారి కుటుంబ సమస్యల పరిష్కారం కూడా సులభసాధ్యమవుతుంది. అయితే ఏదైనా శిక్షణా కార్యక్రమం పూర్తిగా విజయవంతం కావాలంటే, ఆయా వర్గాల వారికి సమాజంలో ఉన్న ప్రతిబంధకాలను కూడా దృష్టిలో పెట్టుకుని తగిన విధంగా రూపొందించాలి. మన దేశం ఇప్పటికే వేగవంతమైన వృద్ధి పథంలో సాగుతున్నది. ఈ అభివృద్ధి వేగాన్నిఅలాగే కొనసాగించాలంటే, మన శిక్షణా కార్యక్రమాలను అంతర్జాతీయ అవసరాలకనుగుణంగా సవరించుకుంటూ ఉండాలి. ఇలా ప్రత్యేక నైపుణ్యం పొందిన వారికి ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు, నైపుణ్యాలు మారుతున్న అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా ఉండేటట్లు, కాలానుగుణంగా రూపొందించుకుంటూ ఉండటం కూడా ఒక పెద్ద సవాలు. ఈ దృష్టితోనే, మన జాతీయ నైపుణ్యాభివృద్ధి విధానం రూపొందించబడింది. దేశంలోని అన్నీ రంగాల నైపుణ్యాభివృద్ధి పథకాలూ కూడా ఇలా ఒకే గొడుగు కింద పనిచేయడం ఈ విధాన లక్ష్యం. అంతేకాదు, ఆయా శిక్షణా కార్యక్రమాలను ప్రామాణీకరించి, గిరాకీకి తగినట్లుగా రూపొందిస్తారు. నైపుణ్యము, కృషి కలిస్తే విజయమే కదా! అందుకనే, ఈ శిక్షణా కార్యక్రమాలను ఒక ఉద్యమంలాగా ప్రారంభించారు. అయితే వీటి ఫలాలు మాత్రం కొంత కాలం తరువాతనే మనకు కనిపిస్తాయి. కౌశల్య భారతమే భవిష్యత్తులో ఆనందకరమైన, అభివృద్ధికరమైన భారతావనిని ఆవిష్కరిస్తుంది. **"కౌషల్ భారత్ - కుశల భారత్"!**

# నైపుణ్యాభివృద్ధికి కొత్త నిర్వచనం

N·S·D·C National Skill Development Corporation

**దేశ జనాభాలో ఉత్పాదక సామర్థ్యంగల 15-60 సంవత్సరాల మధ్య వయస్కులు అధిక సంఖ్యలో ఉండడం మనకు మాత్రమే ఉన్న ఓ చక్కని అవకాశం. అభివృద్ధి చెందిన దేశాలు, కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఈ నేపథ్యంలో మన యువతకు చక్కని ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంలో తీసుకుపోవచ్చు.**

మనదేశంలో అభివృద్ధి దృక్పథంలో మార్పు చోటు చేసుకుంటున్నది. ఆ మార్పు వేగంగా జరుగుతున్నది. మరో వంక వాస్తవ సూచికలు కూడా అభివృద్ధి వేగాన్ని పుంజుకుంటున్న సంకేతాలనే ఇస్తున్నాయి. ఇటీవల భారతీయ రిజర్వు బ్యాంకు విడుదల చేసిన 2014-15 వార్షిక నివేదిక అంచనాల ప్రకారం స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో వృద్ధి రేటు 7.6 గా ఉంది. అలాగే రిజర్వు బ్యాంకు నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల రంగానికి చేసిన కేటాయింపులు వ్యాపార వర్గాలలో విశ్వాసాన్ని పెంచాయి. ఇప్పుడు పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య వర్గాల విశ్వాస స్థాయి బలంగానే కాదు, స్థిరంగానూ ఉంది. దీంతో ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెరగడం తద్వారా వినియోగదారులలో ద్రవ్యోల్బణం భయం తొలిగి పోయి సెంటిమెంట్ పునరుత్తేజం పొందడం కనిపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఆర్థికమాద్యం పరిస్థితులు నెలకొన్నా మన దేశంలో అలాంటి పరిస్థితులు లేవు, 'రావు' అనేందుకు ఈ సూచికలు సంకేతాలుగా నిలుస్తున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారతీయ ఆర్థిక వ్యవస్థలో మాత్రమే జీడీపీ వృద్ధి కనిపిస్తోంది.

మరో వైపు ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక ప్రగతికి అవసరమైన అనేక చర్యలను చేపట్టి వాటిని వేగంగా ముందుకు తీసుకుపోతున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు మన దేశంలో వస్తువులను తయారు చేసి విదేశాలలో విక్రయించేందుకు వీలుగా విదేశి ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సడలించడంద్వారా ఉత్పాదక రంగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టిన భారత్ లో - తయారీ (మేక్ ఇన్ ఇండియా) వివిధ రంగాలలో ఉత్పత్తి కార్యక్రమాలను విస్తృత పరచడంతో పాటుగా, జీడీపిలో ఉత్పత్తి రంగం వాటాను పెంచుతుందని భావిస్తున్నారు. అలాగే ఉత్పత్తి రంగంలో కార్యకలాపాలు వేగం పుంజుకోవడం ద్వారా నైపుణ్యము గల కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశిస్తున్నారు. మరో వంక,ఇందుకు తగ్గట్లుగా ప్రభుత్వం ఇటీవల 'నైపుణ్య భారత్ మిషన్ (స్కిల్ ఇండియా మిషన్) కార్యక్రమాన్ని ఒక ఉద్యమం లాగా చేపట్టింది. ఈ కార్యక్రమం మేక్ ఇన్

**దిలీప్ చెనోయ్,** ముఖ్యకార్యనిర్వాహణాధికారి, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్. e-mail : dilip.chenoy@nsdcindia.org

ఇండియా, డిజిటల్ ఇండియా, స్మార్ట్ సిటీస్ వంటి ఇతర కార్యక్రమాలకు ఇరుసు లాగా పనిచేస్తుంది. ఇలా సిద్ధమైన నైపుణ్య కార్మికులు జాతీయ కార్యక్రమాలన్నింటికీ సారథ్యం వహించి దేశ ఆర్థిక ప్రస్థానాన్ని విజయపథంలో తీసుకుపోతారు. తద్వారా జీడీపీలో వృద్ధి కనిపిస్తుంది. తలసరి ఆదాయం పెరుగుతుంది. దేశాభివృద్ధిలో యువత తమ వంతు వాటాను సొంతం చేసుకునేందుకు చక్కని అవకాశం ఏర్పడుతుంది. యువత వ్యక్తిగతంగా, వృత్తి పరంగా ఎదిగేందుకు నైపుణ్య శిక్షణ తోడ్పడుతుంది. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే ఆధునిక సాంకేతిక విద్యారంగాల్లో ముందుకు దూసుకు పోతున్నాయి. కానీ మన దేశంలో ఇంకా విద్యావ్యవస్థ సర్దుబాట్ల దశలోనే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం విద్యా రంగంలో చేపట్టిన కొన్ని చర్యలు మన దేశ యువత అవసరాలను తీర్చేదిశగా సాగుతున్నాయి. మన దేశం ముందు నుండీ విద్యపట్ల శ్రద్ధ కనబరుస్తోంది, కానీ, నైపుణ్యాభివృద్ధి పట్ల అవసరమైన శ్రద్ధ లేకుండా పోయింది. ఇప్పుడు అదే తక్షణ అవసరంగా మారింది. ప్రపంచ జనాభాలో మన వాటాఎంత ఉందో అదే స్థాయిలో అభివృద్ధి వాటాను అందుకునేందుకు, నైపుణ్యం నేడు ప్రబల అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో మన దేశాన్ని ప్రపంచ వనరుల రాజధానిగా మార్చేందుకు, మన ముందున్న సవాళ్ళను ఎదుర్కునేందుకు రానున్న పది పదిహేను సంవత్సరాలు అత్యంత కీలకం కానున్నాయి.

మన దేశ చరిత్రలో దేశ జనాభా ప్రతిఫలాల మీద ఆధారపడిన కాలం ఏదైనా ఉందటే అది ఇదే. నడుస్తున్న కాలమే. 2013 సెప్టెంబర్‌లో విడుదల చేసిన దేశ జనాభా లెక్కల ప్రకారం 15-24 సంవత్సరాల మధ్య వయస్కులైన వారే అత్యధిక శాతం ఉన్నారు.దేశ జనాభాలో యువత శాతం పెరుగుతున్న నేపథ్యంలో సుస్థిర ఉపాధి మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. దీనికి తోడు అస్థిర ఆర్థిక వృద్ధి పరిశ్రమలకు సవాలుగా మారింది.

మన దేశ జనాభాలో ఉత్పాదక సామర్థ్యంగల 15-60 సంవత్సరాల మధ్య వయస్కులు అధిక సంఖ్యలో ఉండడం మనకు మాత్రమే ఉన్న ఓ చక్కని అవకాశం. చాలా వరకు అభివృద్ధి చెందిన దేశాలు, కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఈ నేపథ్యంలో మన యువతకు చక్కని ఉపాధి అవకాశాలు కలిపించడం ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోయే అవకాశం ఏర్పడుతుంది. 2022 నాటికి ప్రపంచ కార్మిక శక్తిలో సుమారు 15 నుంచి 17 శాతం భారతీయులే ఉంటారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం చూస్తే, 2040 నాటకి మన దేశంలో ఉన్న కార్మికుల సంఖ్య చైనా కార్మికుల సంఖ్యను దాటి పోతుంది. పని చేసే సామర్థ్యం గల చేతుల సంఖ్య పెరగడం అంటే ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న వారి సంఖ్య పెరగడం మాత్రమే కాదు, ఉత్పత్తి పెరగడం కూడా అనే విషయాన్ని మరిచి పోరాదు. ఇది మన దేశానికీ ఎంతో సానుకూల పరిణామం. అయితే, దేశ అభివృద్ధికి కేవలం పని చేసే సామర్థ్యంగల చేతులపై మాత్రమే ఆధార పడలేము.

ప్రస్తుత విషయానికి వస్తే ప్రస్తుతమున్న 500 మిలియన్ల మంది కార్మికులలో కేవలం 14 శాతం మంది మాత్రమే సంఘటిత రంగంలో పని చేస్తున్నారు. మిగిలిన 86 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. ఈ 86 శాతం మంది కార్మికులు సంపూర్ణ నైపుణ్యంలేని వారు లేదా ఉపాధి మార్కెట్లో గుర్తింపు లేని వారు, ఇదే ఇప్పుడు మన ముందున్న పెద్ద సవాలు.

ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే విద్యా, నైపుణ్య శిక్షణ, ఉపాధి అర్హతల మధ్య చాలా పెద్ద అగాధం ఉంది. అసమానతలు ఉన్నాయి.మెక్ కిన్సీ నివేదిక ప్రకారం కేవలం 54 శాతం మంది యువత మాత్రమే మాధ్యమిక విద్యకన్నా పైచదువులు తమ ఉపాధి అవకాశాలను మెరుగు పరిచాయని భావిస్తున్నారు. అలాగే 65 శాతం మంది యువత హై స్కూల్ ఆ తదుపరి ఉన్నత విద్యకు మధ్యలో స్పష్టి చెపుతున్నారు. ఈ భావనలు, వాస్తవాల నడుమ కొద్ది మంది మాత్రమే ఉపాధి, శిక్షణ పొందుతున్నారు. అలాగే, ఉపాధి కల్పించే యాజమాన్యాలలో 53 శాతం మంది నైపుణ్యం గల కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉపాధి ఆరంభ దశలో నైపుణ్య లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అంటే భారతీయ యువత ఉపాధి అవసరాలు, అర్హతలకు యాజమాన్యాల అవసరాలకు మధ్య నైపుణ్య లేమి అడ్డుగోడ కడుతోంది. పరస్పర పూరకాలైన ఈ రెండు అంశాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. అంటే, ఉపాధికి అర్హతలకు మధ్య పెద్ద ఆగాధం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో దేశ జనాభాలో 50 శాతం వరకు ఉన్న 25 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న యువతకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడం కీలక సవాలుగా మారింది.

ఈ పరిస్థితులలో నైపుణ్య ఆవశ్యకతను, ప్రాధాన్యతను దేశం అనివార్యంగా గుర్తించింది. ప్రభుత్వం, వివిధ మంత్రిత్వ శాఖలు, పరిశ్రమలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ రంగం, వ్యక్తులు సమిష్టి లక్ష్య సాధన కోసం ఒకరితో ఒకరు చేతులు కలిపారు. మన దేశాన్ని "ప్రపంచ నైపుణ్య రాజధాని'' గా చేసేందుకు ఒకటయ్యారు.

ప్రస్తుత పరిస్థితులలో నైపుణ్య అభివృద్ధికి సానుకూల వాతావరణమే సర్వత్రా కనిపిస్తోంది. ఇది మన దేశాన్ని ప్రపంచ దేశాల్లో ఒక బలీయమైన ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు, అలాగే, పెట్టుబడులు పెరిగేందుకు ఎంతగానో దోహదం చేస్తుంది. అందులో ఎలాంటి సందేహం లేదు.

అందుకే ఇంతకు ముందు ఎప్పుడు లేని విధంగా కేంద్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల మంత్రిత్వ శాఖ ( ఎం ఎస్ డీ ఈ ) ని ఏర్పాటు చేసి నైపుణ్య నిర్మాణం దిశగా తొలి అడుగు వేసింది. అదిగాక దేశంలో ఇప్పటికే ఎన్ ఎస్ డీ సీ ఏర్పాటు చేసిన నైపుణ్య వ్యవస్థ ఉండనే ఉంది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా 450 జిల్లాల్లో 37 నైపుణ్య మండళ్ళు, 225 మంది భాగస్వాములతో కూడిన 3611 శిక్షణ కేంద్రాలున్నాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి చర్యల్లో మలిఅడుగుగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యవస్థను బలోపేతం చేసే చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ నిర్దేశిత విధానాలతో ఆ వ్యవస్థలు సాధికరితను సాధించుకునేలా సంపూర్ణ సహాయ, సహకారాలను అందిస్తోంది. జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్‌డిసి), కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి కల్పన మంత్రిత్వశాఖ (ఎం.ఎన్.డి.ఇ.)- సంయుక్తంగా వివిధ రంగాలకు నైపుణ్య ప్రక్రియను రూపొందించడం, అదే విధంగా వివిధ ఉద్యోగ, ఉపాధులకు సంబంధించి జాతీయ వృత్తి ప్రమాణాలను, వృత్తి విద్యా కోర్సుల బోధనాంశాలను నిర్ధారించడం చేస్తున్నాయి. ఇంతవరకు ఎన్ఎస్‌డీసీ 5.5 మిల్లియన్ల మందికి శిక్షణ ఇచ్చింది.ఇందులో 61 శాతం మంది ఉపాధి లేదా ఉద్యోగం పొందారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి పరిశ్రమలు ఎదుర్కొంటున్న నైపుణ్య కార్మికుల కొరతను తీర్చవలసిన అవసరం ఉంది. మరో వంక 2020 నాటికి 40 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఉద్దేశించిన నైపుణ్య భారత్ మిషన్, జాతీయ నైపుణ్య విధానం 2015 ఫలితాలను ఇస్తున్నాయి. ఈ మిషన్, ఆర్థిక వ్యవస్థకు సాధికరితను చేకూర్చేందుకు గానూ, ఉపాధికి అవసరమైన నైపుణ్య కార్మికులను సిద్ధం చేస్తున్నది. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో యువతకు పరిశ్రమ గుర్తించిన ప్రమాణాల ప్రకారం వేగంగా, ఉన్నతమైన నైపుణ్యాన్ని అందిస్తుంది. అలాగే ప్రజలందరికి సుస్థిర జీవన ప్రమాణాలు కలిపించే విధంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సంపద సృష్టి, ఉపాధి కల్పనలలో అవసరమైన శిక్షణ ఇస్తుంది.

ప్రస్తుతం 70కి పైగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు (ఎస్‌డిపి) నడుస్తున్నాయి. ఇవ్వన్నీ కూడా అర్హత, శిక్షణ కాలం, శిక్షణ వ్యయం, ఫలితాలు, నిర్వహణ, నియంత్రణ తదితర విషయాలలో వేటికవి ప్రత్యేక విధి విధానాలను పాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విధానపరమైన సవరణల ద్వారా నైపుణ్య అభివృద్ధి ప్రక్రియలో హేతుబద్ధతమైన మార్పులు తీసుకొచ్చింది. తద్వారా, అందరి చూపు ఒకే లక్ష్యం వైపు చూసేలా చేసింది.

అదే విధంగా, ఇటు కార్పొరేట్ రంగం సంస్థలు, అటు ప్రభుత్వ రంగ సంస్థలు మరింతగా తమ భాగస్వామ్యాన్ని పెంచుకుంటున్నాయి. కార్పొరేట్ రంగ సంస్థలు స్వదేశానికి తిరిగి వచ్చి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కార్యక్రమం క్రింది దేశీయ యువత నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలలో పెట్టుబడులు పెడుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహకారం, ముందస్తు శిక్షణ గుర్తింపు, జాతీయ అర్హత, వృత్తి ప్రమాణాలు మొదలైన అంశాలలో భాగస్వాములు అవుతున్నాయి. పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ, కోల్ ఇండియా, అంభుజా సిమెంట్, సీఐఎఫెల్, ఎస్సార్, కోకకోల ఇందుకు కొన్ని ఉదాహరణలు. ప్రభుత్వ రంగ సంస్థలు నైపుణ్య అభివృద్ధి విషయంలో చాలా చురుకైన పాత్రను పోషిస్తున్నాయి. కోల్ ఇండియా లిమిటెడ్, ఎన్టీపీసీ ఇందుకు గానూ 200 కోట్ల రూపాయలను ఖర్చు చేశాయి.

ఇదిలా ఉంటే ప్రభుత్వం ప్రధాన కార్యక్రమమైన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, (పీఎమ్కెవీవై), స్కిల్ లోన్ స్కీం, దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన (డీడీయు-జీకేవై), నయీ మంజిల్, క్రెడిట్ గ్యారెంటీ స్కీం వంటి వివిధ పథకాల ద్వారా నైపుణ్య అభివృద్ధి ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా యువతకు ఉత్తమ నైపుణ్య శిక్షణ లభించడమే కాదు, ఇంతవరకు అందుబాటులో లేని శిక్షణ సదుపాయాలుకూడా అందరికీ సమానంగా అందుబాటులోకి వచ్చాయి. అలాగే, సంస్థాగత రుణ సదుపాయం పథకం ద్వారా నైపుణ్య అభివృద్ధి యువతను మరింతగా ఆకర్షిస్తోంది.

పి.ఎం.కె.వై. వంటి పథకాలు ఒక పక్క యువతను కార్యోన్ముఖులను చేయడమే కాకుండా వారి ఉపాధి/ ఉద్యోగ అర్హత యోగ్యతలను, ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. ఈ పథకం ద్వారా శిక్షణ పొంది సర్టిఫికేట్ పొందిన యువతకు నగదు బహుమతులను ఇవ్వడం వలన యువత శిక్షణ పొందేందుకు మరింతగా ఉత్సాహం చూపుతున్నారు. శిక్షణకు ముందు పని సామర్థ్యాన్ని అంచనా వేయడం ద్వారా శిక్షణ తర్వాత వారి వారి పని సామర్థ్యాన్ని గుర్తించేందుకు ఈ పథకం ఉపకరిస్తోంది. రానున్న సంవత్సర కాలంలో 24 లక్షల మంది యువతకు ప్రయోజనం చేకూర్చడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. మొత్తంగా చూస్తే నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు అందరికి ప్రయోజనాన్ని పంచుతున్నాయి. అందరి ఆమోదాన్ని పొందుతున్నాయి.ప్రగతిశీల భారత దేశం పయనానికి ఇప్పుడు నైపుణ్య ప్రస్థానం ఒక చక్కని చుక్కానిలా నిలిచి దిశా నిర్దేశం చేస్తోంది.అందుకే మనకి మనం 'కుశలభారత్ – 'కౌషల్ భారత్' లక్ష్యాలతో మమేకం అయ్యేందుకు ఇదే సరైన సమయం. ఆర్థిక వ్యవస్థలోని కొన్ని విభాగాలలో వృద్ధి కనబడుతోంది. ఇప్పుడు నైపుణ్య భారత్ కార్యక్రమం/ ప్రచారం విస్తృతమై ఆర్థిక వ్యవస్థపై మరింత ప్రభావాన్ని చూపుతుంది. పెరుగుతున్న పరిశ్రమల డిమాండ్‌కు తగిన విధంగా శిక్షణాసామర్థ్యాన్ని పెంచడం, శిక్షణ పొందిన కార్మికులకు తగిన ఉపాధి కల్పించడం ఇవే ఇక ఇప్పుడు దేశం ముందున్న తాజా సవాళ్ళు. ■

# ఉపాధికి సాంకేతిక విజ్ఞానం - నైపుణ్యాల ఆవశ్యకత



మన దేశంలో 18 సంవత్సరాలకంటే తక్కువ వయసున్న యువతీ, యువకులు 470 మిల్లియన్ల మంది ఉన్నారు. 2014 ఆర్థిక సర్వే ప్రకారం ప్రతి సంవత్సరం మన దేశంలో పనిచేసే వయోపరిమితిలోకి 63 మిలియన్ల మంది కొత్తగా వచ్చి చేరుతున్నారు.

యువతకు అవసరమైన స్థాయిలో ఉద్యోగాలను కల్పించవలసిన బాధ్యత ప్రపంచంలో మరే దేశం పైనా లేనంతగా మన దేశం పై ఉంది. ప్రపంచ వ్యాప్తంగా జనగణన (జనాభా) సరళిలో వస్తున్న మార్పులను గమనిస్తే, చైనా సహా అన్ని అభివృద్ధి చెందిన దేశాలలోనూ వారి ఆర్థిక వ్యవస్థలను నిలబెట్టే శక్తి , సామర్థ్యం గల పని చేసే వయసున్న వారి సంఖ్య ( కార్మిక శక్తి) ఏటికేడాది తగ్గిపోతోందని తెలుస్తుంది. అదే సమయంలో మన దేశంలో పని చేసే వయసున్న యువత సంఖ్య విస్తరిస్తున్నది. మన దేశంలో 18 సంవత్సరాలకంటే తక్కువ వయసున్న యువతీ, యువకులు 470 మిల్లియన్ల మంది ఉన్నారు..2014 ఆర్థిక సర్వే ప్రకారం ప్రతి సంవత్సరం మన దేశంలో పనిచేసే వయోపరిమితిలోకి 63 మిలియన్ల మంది కొత్తగా వచ్చి చేరుతున్నారు.

మన దేశంలో యువ జనాభా పెరుగుదల మనకో వరం.శక్తివంతమైన యువత నుంచి మన దేశం, మన ఆర్థిక వ్యవస్థ ఎంతైనా ప్రయోజనం పొందే వీలుంది. నిజానికి ఇది తరచూ అందరూ అంటున్న మాటే, భారతీయ యువ జనాభా దేశానికి ఒక వరం...కానీ ఈ వరం ఫల ప్రదం కావాలంటే మన యువతకు ఆదాయం ఉండాలి, అలా ఆదాయం ఉన్నప్పుడే వారు దాన్ని ఖర్చు చేస్తారు, దాన్నుంచే పొదుపు చేస్తారు, ఆ విధంగా దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తారు. ఆర్థికవృద్ధికి ఊత మిస్తారు.ఒక వేళ అందుకు విరుద్ధంగా వారికి ఉద్యోగం లేదా ఉపాధి లభించక పోయినా, తగినంత సంపాదనకు అవకాశాలు లేకపోయినా, వారు కోరుకున్న జీవితం ఎండమావిగా మిగిలిపోయినా పెద్ద ఎత్తున యువతలో సామాజిక అశాంతి చోటు చేసుకుంటుంది. రిజర్వేషన్ల కోసం యువత చేస్తున్న ఆందోళనలు, యువత గ్రామాల నుంచి పట్టణాలు, నగరాలకు వలసలు పోవడం, నగరాలలో పెరిగిపోతున్న హింసాత్మక చర్యలు యువతలో పెరుగుతున్న అశాంతికి అద్దం పడుతున్నాయి.

భారత ప్రభుత్వం ఈ అనివార్య వాస్తవ పరిస్థితి గుర్తించింది. అందుకే, 500 మిలియన్ల మంది యువతను నైపుణ్య వంతులుగా తీర్చి దిద్దేందుకు, నైపుణ్య

**అరుణ్ మైరా,** ఛాన్సలర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హిమాచల్ ప్రదేశ్, కేంద్ర ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు,
**మదన్ పడకి,** వ్యవస్థాపకులు, హెడ్ హెల్డ్ హై సర్వీసెస్

అభివృద్ధి కార్యక్రమం ('స్కిల్ డెవలప్మెంట్ మిషన్') ను ఏర్పాటు చేసింది. అలాగే, నైపుణ్యం పొందిన వారికి ఉపాధి కల్పించేందుకు, భారత్ లో తయారీ ('మేక్ ఇన్ ఇండియా') ప్రచార ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. చైనాలో ఒక వంక కార్మికుల వేతాలు పెరుగుతున్నాయి, మరో వంక ఆ దేశ కరెన్సీ యువాన్ విలువ పడిపోతోంది, వీటన్నింటిని మించి పని చేసే సామర్థ్య వయసు గల జనాభా సంఖ్య పడిపోతోంది. ఈ క్రమంలో క్రమక్రమంగా ఆ దేశ ఫాక్టరీలు ఖాళీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఖాళీని భర్తీ చేసే సామర్థ్యం, అవకాశం మన దేశానికి ఉంది. అయితే, మన దేశం మన ఆర్థిక వృద్ధి ప్రక్రియను మార్చుకోకుండా మంచి పద్ధతులను అవలంబించకుండా ఇది అయ్యే పని కాదు, అనే భయాన్ని ఆర్థిక వేత్తలు వ్యక్త పరుస్తున్నారు. ఈ భయానికి కారణం లేక పోలేదు. ఎందుకంటే 1990వ దశకంలో మన దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం స్థూల జాతీయోత్పత్తి పెరుగుతూనే ఉంది, కానీ ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో లాగా మన దేశంలో జీడీపీ తో సమానంగా లేదా అదే స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ నిర్వహించిన సుస్థిర అభివృద్ధి అంచనా విశ్లేషణలో ఈ వాస్తవం వెలుగు చూసింది. ఇతర అధ్యయనాలు , విశ్లేషణలు కూడా అదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి.

ఇక ఇప్పుడు మన దేశంలో మరింత వేగంగా, విస్తృతంగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, మన ఆలోచన ధోరణిలో, సంస్థాగత స్వరూప స్వభావాల్లో ఎలాంటి మార్పులు అవసరమో ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేశాము. ఇందులో ముందుగా ఉద్యోగ, ఉపాధి కల్పనకు మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వాతావరణం, ఎలాంటి నైపుణ్యం అవసరం అనే అంశాన్నీ, దానితో పాటుగా, ఈ వాతావరణాన్నీ ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక విజ్ఞానం ఏ విధంగా మారుస్తోంది, పాత విధానాలను ఎలా కలచి వేస్తోంది అన్న విషయాలను తెలుసు కుందాము. ఆ తర్వాత మనం మన దేశంలో అలాంటి అవకాశాన్ని అంది పుచ్చుకునేందుకు మన ఆలోచన ధోరణిలో, సంస్థాగత స్వరూప, స్వభావాల్లో ఎలాంటి మార్పులు అవసరమో తెలుసుకునే ప్రయత్నం చేద్దాము.

సహజంగా, శక్తికి మించిన పనిని అదికూడా అత్యంత వేగంగా చేయవలసి వచ్చినప్పుడు నిధులను కుమ్మరించడం, అధికారాన్ని చెలాయించడం జరుగుతుంది. ఈ విధానం మార లేదు. సమస్య దానంతట అది తొలిగి పోతుందన్న అంచనాతో మరింతగా నిధులను, అధికారాన్ని వినియోగిచడమే జరుగుతోంది. అయితే, ఆల్బర్ట్ ఐన్స్టీన్ సమస్యను సృష్టించిన విధానాలనే అనుసరించి అసాధ్యాలను సుసాధ్యం చేయడం సాధ్యం కాదని స్పష్టంగా పేర్కొన్నారు.

జేఈటీఎస్ ప్రభావితం చేస్తున్న రెండవ నిబంధన అనిశ్చిత పరిస్థితి. నూతన సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చే కొలదీ ఉపాధి కల్పన సంస్థల స్థితిగతులు, స్వరూప స్వభావాలతో పాటుగా ఉద్యోగ స్వరూప స్వభావాలు కూడా మారిపోతుంటాయి. రిటైలింగ్, ప్రచురణ, ప్రజా రవాణా, సమాచార సాధికారత వంటి అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయి. అదే విధంగా ఉత్పత్తి రంగంలోనూ డిజిటల్ టెక్నాలజీ , ఆటోమేషన్ ప్రయోగం తో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఉదాహరణకు, ప్రస్తుతం 3-డి ప్రింటర్లను ఉపయోగిస్తున్న చిన్న చిన్న ప్రింటింగ్ యూనిట్లు సైతం ప్రత్యేక యంత్రాలను సమకూర్చుకుని పెద్ద పెద్ద ఫ్యాక్టరీలుగా సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశాలు ఏర్పడతాయి. సాంకేతిక విజ్ఞానాన్ని వేగంగా పెంచుకుని అధునాతన పద్ధతుల్లో వినియోగించుకునే సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఈ పరిస్థితుల్లో రానున్న పది సంవత్సరాల్లో పారిశ్రామిక, సేవా రంగాలు ఏ విధంగా మారి పోతాయో ఉహించడం అలాగే భవిష్యత్ లో ఆ పరిశ్రమలలో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయో, వాటికి ఎలాంటి నైపుణ్యం అవసరం అవుతుందో ఉహించడం అంత సులభంగా అయ్యే పని కాదు. ఈ సమస్య కేవలం అతర్జాతీయంగానే కాదు దేశీయం గానూ ఎదురవుతున్నది. అంటే, సంకేతికవిజ్ఞానం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలకు అనుగుణంగా భారతీయ నైపుణ్య కార్మికులు, ఉద్యోగులను తీర్చి దిద్దడంలో మాత్రమే కాదు దేశీయంగా పరిశ్రమలు, సేవా సంస్థల అవసరాలలోను గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ నేపథ్యంలో రేపటి అవసరాలు ఎలా ఉంటాయనేది ముందుగా ఉహించడం, అందుకు తగ్గటుగా నైపుణ్య శిక్షణ ఇవ్వడం సాధ్యం కాదు. దీంతో ఇటు దేశీయం గానూ అటు అంతర్జాతీయంగాను కూడా అనిశ్చిత పరిస్థితులే ఎదురవుతాయి.

ఇక మూడవ విషయానికి వస్తే, అది గ్రామీణ ఉపాధి కల్పన, ఈ విషయంలో మన దేశం ఇప్పటికే చాలా పెద్ద ఎత్తున ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. గ్రామీణ ప్రజానీకం ఆదాయం పెరగాలంటే,

ఉత్పాదకత పెరగాలి. ఇది అనివార్యం. అయితే, ఉత్పాదకత పెరిగిన కొద్దీ వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తరిగిపోతాయి. దీంతో గ్రామీణ యువత ఉపాధిని వెతుక్కుంటూ వలస బాట పడతారు. పట్టణాలు, నగరాలకు చేరుకుంటారు. పట్టణ జనసాంద్రత పెరిగి పోతుంది. ఇలా గ్రామాల నుంచి పట్టణాలు, నగరాలకు చేరిన వారికి నివాసం, నీరు, పారిశుధ్యం, రవాణా, భద్రతా వంటి మౌలిక సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత, భారం ఇప్పటికే అనేక అపరిష్కృత సమస్యలతో సతమత మవుతున్న పట్టణాలు, నగరాల పై పడుతుంది. ఇందుకు అవి సంసిద్ధం కావలసి ఉంటుంది. ఈ అవసరాలను తీర్చేందుకే కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీస్, అమృత యోజన పథకాలను ప్రవేశ పెట్టింది. అయితే, రానున్న దశాబ్ద కాలంలో మన నగరాలు, పట్టణాలు మన యువతకు అవసరమైన ఉద్యోగ, ఉపాధితో పాటుగా ఇతర మౌలిక సదుపాయాలు కలిపించ గలవని ఆశించలేము. కాబట్టి, గ్రామీణ యువత అవసరాలు, ఆకాంక్షలను తీర్చేందుకు, వారికి సుస్థిర, గౌరవప్రదమైన ఉపాధి కలిపించేందుకు ఆధునిక ఉపాధి అవకాశాలను కల్పించే పరిస్థితులను బలోపేతం చేయక తప్పదు.

ఈ నేపథ్యంలో గ్రామీణ పరిస్థితులు – పట్టణ పరిస్థితుల వైపుగా చర్చ వేగంగా సాగవలసిన అవసరం ఉంది. గ్రామాలలో అయినా, పట్టణాలలో అయినా చక్కని జీవనోపాథికి అంతే చక్కని పర్యావరణ వ్యవస్థ అవసరం. ఇందులో మరో అభిప్రాయానికి తావు లేదు. పట్టణ ప్రాంతాల్లో ఆధునిక ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన తీరు తెన్నులు ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా సాంకేతిక పరిణామాలతో ముడిపడి మారుతున్నప్పటికీ, కొంత వరకు అయినా స్పష్టంగా ఉన్నాయి. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి అలా కాదు. గ్రామీణ ప్రాతాలలో ఆధునిక జీవనోపాధి కల్పనకు మన దేశం వినూత్న పరిష్కారాలను కనుగొన వలసి ఉంది. ఇక్కడ ప్రపంచ అనుభవాలు పనికి రావు.

జేఈటీఎస్ (ఉద్యోగాలు–వ్యాపార సంస్థలు– సాంకేతిక విజ్ఞానం– నైపుణ్యం) కోసం ఏదైనా ఒక కార్యాన్ని భారీ స్థాయిలో చేయాలంటే, ఉన్నత స్థాయి నియంత్రణగల సమగ్ర వ్యవస్థను రూపొందించు కోవడం అనేది విస్తృత స్థాయిలో వాడుకలో ఉన్న విధానం. తుది ఉత్పత్తి పై స్పష్టత ఉన్నప్పుడు ఇదే సరైన విధానం. ఫోన్లను తయారు చేసే ఫ్యాక్టరీ ఎన్నో రకాల, ఎన్నో రంగుల ఫోన్లను తయారు చేస్తుంది, కానీ, ఆ ఫ్యాక్టరీ దుస్తులను లేదా కారు విడి భాగాలను తయారు చేయలేదు. ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా 21 వ శతాబ్దిలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో, నైపుణ్యాభివృద్ధి సంస్థల నిర్మాణం అంత సులభమైన విషయం కాదు. ఇది ఎన్నో సవాళ్లతో కూడు కున్నది . అందులో ముఖ్యమైనది. రేపు మనకు ఎలాంటి నైపుణ్యం కావాలి అనే విషయంలో స్పష్టత లేక పోవడం. ఇంతవరకు, ఉత్పత్తి రంగంలో ఒక క్రమపద్ధతి లేదా ఒక శ్రేణి మాత్ర విధానం ఉండేవి. కానీ ఇప్పుడు అవి పని చేయవు.

భవిష్యత్ ఆర్థిక వ్యవస్థ అవసరాలు, అంచనాల ఆధారంగా భారీ స్థాయిలో చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం చివరాఖరికి, కొన్ని సంవతరాల తర్వాత ఉన్న వాస్తవ అవసరాలను తీర్చడంలో విఫలం కావచ్చును. భవిష్యత్‌లో ఎలాంటి వ్యాపార సంస్థలు తెరపైకి వస్తాయో, ఎలాంటి నైపుణ్యం అవసరం అవుతుందో ఇప్పుడే అంచనా వేయడం కుదరదు. క్రమానుగతి నైపుణ్యాభివృద్ధి ప్రక్రియ చాలా కాలంపాటు సాగే ప్రక్రియ. అలాకాదని, వెనక నుంచి వస్తే, అంటే, ఫ్యాక్టరీలు తమకు ఎలాంటి నైపుణ్యం ఉన్నవారు కావాలి, ఎంత మంది కావాలి అన్నది తెలియ చేస్తే, సాంకేతిక శిక్షణ సంస్థలు అవసరమైన నైపుణ్యం గల వారిని అవసరమైన సంఖ్యలో అందించడం– అయితే, ఇదీ అంత సాఫీగా సాగే వ్యవహారం కాదు. ఇందులో ఉండే చిక్కులు ఇందులోనూ ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు వృత్తి విద్యా నైపుణ్యాలలో ప్రాథమిక అవగాహన కలిపిస్తే సాంకేతిక విద్యాసంస్థలు ఆపై నైపుణ్యాన్ని అందిస్తాయి. ఇదొక క్రమానుగత గొలుసు కట్టు విధానం. ఈ విధానంలో ముందుకు వెళ్ళాలంటే యువతీ యువకుల జీవితాల్లో చాలా భాగం శిక్షణకే సరిపోతుంది. గొలుసు కట్టులో ఆ చివర ఉన్న ఉద్యోగం లక్ష్యంగా జీవితాన్ని ప్రారంభించిన యువతీ, యువకులు ప్రత్యేక ప్రావీణ్యం ద్వారా ముందుకు సాగవలసి ఉంటుంది. ఇదంతా జరిగి అన్ని అర్హతలు సంపాదించుకునే సరికి, కోరుకున్న కొలువు దొరక్క పోవచ్చును.

దీన్ని బట్టి మనకు అర్ధం అవుతున్న విషయం ఏమంటే, మనకు ఈ విధానలేవి పనికి రావు. మనకు ఒక ప్రత్యేక స్వరూప స్వభావాలు గల వ్యవస్థ అవసరం. ఈ వ్యవస్థకు ఏడు పునాది సూత్రాలున్నాయి, అవి ఏవంటే ...

1. ఇంతకూ ముందే వివరించిన విధంగా ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని అంచలంచెలుగా అందించే (సప్లై– చైన్) విధానం లేదా సాముహిక (అసెంబ్లీ) విధానం వలన ప్రయోజనం ఉండదు. అలాగే, అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాన్ని సమకూర్చే విధానం వలన కూడా

ప్రయోజనం ఉండదు. కాబట్టి, యువతీ, యువకులు వారికి వారుగా అవకాశాలను, ఉద్యోగాలను కనుగొని అందుకు అవసరమైన నైపుణ్యాన్ని వేగంగా నేర్చుకునే విధంగా జేఈటీఎస్ ను రుపొందిచుకోవడం ఒక్కటే సరైన విధానం అవుతుంది.

2. మన విద్యార్థులలో అవగాహనా శాతాన్ని మరింతగా పెంచడం పై దృష్టిని కేంద్రీకరిచ వలసి ఉంది. విశ్వ విద్యాలయాలు, సాంకేతిక విద్యా సంస్థలు, మన పాఠశాలలు కేవలం మంచ్ కార్మికులను తయారు చేయడం మాత్రమే కాదు, వారిని మంచి అవగాహనా శక్తిగల అభ్యాసకులుగా తీర్చి దిద్దవలసిన అవసరం ఉంది.(నిజానికి, జీవనోపాధి కల్పించే సంస్థల దృష్టిని ఎంతగా కేంద్రీకరిస్తామో అంతగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలలో, ఉద్యోగార్దులలో అభ్యాస, అవగాహనా శక్తిని పెంచవలసిన అవసరముంది. ఈ విషయాన్ని ముందు ముందు సోదాహరణగా తెలుసు కుందాము)

3. పారిశ్రామిక వేత్తలు, యజమానులు కేవలం నైపుణ్య వినియోగ దారులు మాత్రమే కాదు, కారాదు. నైపుణ్యాభివృద్ధిలో వారు కూడా అంతర్గత భాగస్వాములు కావలసి ఉంది.ఇంతకు ముందేచెప్పుకున్నట్లుగా యాజమాన్యాలు క్రియాశీలక పోటీని తట్టుకుని నిలబడేందుకు వారి సంస్థల స్వరూప, స్వభావాలు ఉత్పత్తి తీరు తెన్నులను పరిశ్రమలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మార్చుకుంటూ, మలచు కుంటూ ముందుకు సాగాలి. ఈ ప్రక్రియ ప్రస్తుతం మరింత వేగంగా ముందుకు సాగవలసిన అవసరం ఉంది. అంటే పారిశ్రామిక వేత్తలు, నిరంతరం ఉత్పత్తి ప్రక్రియను మార్చుకుంటూ, కార్మికుల నైపుణ్యం లో మార్పులు చేర్పులు చేసుకుంటూ ముందుకు సాగవలసిన అవసరం ఉంది. ఈ మార్పులు చాలా వేగంగా ఉంటాయి కాబట్టి, యాజమాన్యాలు తమ ఉద్యోగులు, శ్రామికుల నైపుణ్యాన్ని పనిలో భాగంగా, కార్య క్షేత్రంలోనే అభివృద్ధి చేసుకుని కొత్త సాంకేతిక విజ్ఞానాన్ని, నూతన ప్రక్రియలను అక్కడే ప్రవేశ పెట్ట వచ్చును.

4. ప్రపపంచ వ్యాప్తంగా పోటీ పెరుగుతోంది. ఈ పోటీ కేవలం విదేశాల నుంచి మాత్రమే కాదు. పరిశ్రమ ప్రస్తుత సరిహద్దుల ఆవలి నుంచి కూడా పోటీ పెరుగుతోంది. ఈ పోటీ ప్రపంచంలో ఎవరు ఇతరుల కంటే వేగంగా కొత్త పోకడలను, కొత్త సాంకేతిక, నైపుణ్యాలను అలవర్చు కుంటారో వారే నిలబడగలరు.ఇందుకు యాజమాన్యాలు కూడా మినహాయింపు కాదు. కాబట్టి, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, యాజమాన్యాలు నూతన రీతుల అభ్యాస వేగాన్ని పెంచుకోక తప్పదు.

5. ఏవ్యాపార సంస్థకు అయినా, అభ్యాస సామర్థ్యం పెంచుకునేందుకు తద్వారా సంస్థ సామర్థ్యం పెంచుకునేదుకు గల ఏకైక మార్గం, మానవ వనరుల వినియోగం. అలాగే, ప్రతి సంస్థకు దినదినాభివృద్ధి చెందే సంపద కూడా మానవ వనరులే. మానవ వనరుల నైపుణ్యం పెరిగిన కొద్దీ సంస్థ విలువ పెరుగుతున్నది. భవనాలు, యంత్రాలు, ఇతర వస్తువుల విలువ కాలక్రమంలో కరిగి తరిగి పోతుంది. కానీ, మానవ వనరుల విలువ మాత్రం దినదినాభివృద్ధి చెందుతుంది. కాబట్టి , యాజమాన్యాలు తమ తమ సంస్థలను సాంకేతిక విజ్ఞానంతో డిజిటలైజ్ చేయడమే కాదు మానవ సంపదను పెంచుకుని మానవీయం (హ్యూమనైజ్) చేయడం పట్ల కూడా శ్రద్ధ వహించడం అవసరం.

6. జేఈటీఎస్ ఎకోసిస్టం స్వరూపం క్రియాశీలకంగా ఉండాలే కానీ, సరఫరా గొలుసు (సప్లయి-చైన్) లాగా ఉండరాదు. ఉద్యోగాలు, సంస్థలు కొత్త రూపు దాల్చే సమయంలో వివిధ కార్యక్రమాలలో ఉద్యోగులు నైపుణ్యం పెంచుకునేందుకు, అభ్యాసం కొనసాగిచేందుకు వీలైన ప్రత్యేక నెట్ వర్క్ ను ఏర్పాటు చేసుకోవాలి. కంటెంట్ డెవలప్మెంట్, ట్రైనింగ్, సపోర్ట్, వంటి వివిధ విభాగాల్లో ప్రత్యేక అనుభవం ఉన్న స్పెషలిస్టులు ఉండడం అవసరం.అలాంటి వారు అదే రకమైన సేవలు అందించే వారితో పోటీ పడతారు. అందులో ఉత్తమ ఫలితాలను ఇచ్చే వారు ఎదగ గల్గుతారు. జేఈటీఎస్ ఎకో- సిస్టం లో నూతన ఆవిష్కరణలు వెలుగులు విరజిమ్ముతాయి.

7. సంస్థలు నిర్దేశిత ప్రమాణాలను పాటించడం ద్వారా వినియోగ దారుల ప్రయోజనాలనుకాపాడటం వీలవు తుంది. అలాగే పోటీని క్రమబద్ధీకరించి. కొత్త వారి ప్రవేశానికి పాత కాపులు అడ్డుగోడలు కట్ట కుండా చూడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వాల పై ఉంటుంది. చిన్నచిన్న సంస్థలకు నైపుణ్య శిక్షణ ప్రక్రియలో సాధారణ సదుపాయాలను కూడా ప్రభుత్వాలు కల్పించవచ్చును. అయితే,ఇక్కడ కూడా

ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాభివృద్ధి ప్రధాన బాధ్యత సంబంధిత యాజమాన్యాల పైనే ఉంటుంది. కాబట్టి సాధారణ సదుపాయాలను ప్రభుత్వ సహకారం తోనే అయినా ఏర్పాటు చేసుకోవడం మరింత మంచిది,

ఇంత వరకు మనం ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, వాణిజ్య సంస్థలు – సాంకేతిక విజ్ఞానం – నైపుణ్యం జీవావరణ పరిస్థితులను పై స్థాయి నుంచి క్రింది స్థాయికి చూశాము. ఇక ఇప్పుడు ఈ వ్యవస్థాగత సూత్రాలు ఏమేరకు, ఏ విధంగా ఉపకరిస్తున్నాయో చూద్దాం. అంతకంటే ముందుగా, ఒక విషయం, ఇక్కడ మనం చూస్తున్నది ఒకే ఒక్క ఉదాహరణ, అది అత్యుత్తమమవే కావచ్చును, అయినా బేర్ ఫుట్ ఎకానమీ లాంటి ఉదాహరణలు ఇంకా ఎన్నో ఉన్నాయి. చాలా వరకు పాత తరం ఉదాహరణలలో సాంకేతిక విజ్ఞానాన్ని ప్రధాన చోదకంగా చూపరు.కానీ, ఇక్కడ్స ఉదహరించిన ఆధునిక ఉదాహరణలు సాంకేతిక విజ్ఞానాన్ని చాలా విస్తృతంగా వినియోగించు కున్నవే కావడం గమనించ వలసిన విశేషం.

ఉపాధి అవకాశాలను అన్వేషించడానికీ, గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్య వృద్ధికి సాంకేతికతను వినియోగిస్తున్నాం. అంతేకాదు, ఇదే సాంకేతికత సహాయంతో గ్రామీణ యువతను నూతన ఉపాధి అవకాశాలను చేపట్టేవిధంగా ప్రోత్సహిస్తున్నాము. ఆ విధంగా, గ్రామీణ విద్యావంతులు మిగిలిన వెనుకబడిన వారికి శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగపడతారు. ఈ విధంగా సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో దీర్ఘకాలిక ఉపాధిని పొందవచ్చును.

జీవనోపాధిని జీవనాధారం, అని కూడా నిర్వచిస్తారు. అయితే ఇప్పుడు మన యువత కేవలం జీవనోపాధి గురించి మాత్రమే ఆలోచించడం లేదు. తమ ఎదుగుదలతో పాటుగా సామాజిక గౌరవ, మర్యాదలను కూడా కల్పించే జీవన ప్రగతిని (కెరీర్) కోరుకుంటోంది. అయితే, వాస్తవిక పరిస్థితులను గమనిస్తే గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ జీవనోపాదే గానీ, ఆధునిక ఉద్యోగ, ఉపాధి గానీ, జీవనప్రగతి గానీ అంతగా లేవు. ఈ పరిస్థితులలో గ్రామీణ యువత విధిలేని పరిస్థితులలో పట్టణాలకు, పట్టణ మురికివాడలకు చేరుతున్నారు. అక్కడ, అందుబాటులో ఉన్న జీవన ప్రగతి మార్గాలను ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వెలువడిన మెక్ కిన్సే నివేదిక ప్రకారం, రానున్న పది సంవత్సరాలలో మన దేశం, మన ఆర్థిక వ్యవస్థ 115 మిలియన్ల మంది యువతకు ఉపాధి కలిపించవలసి ఉంటుంది. సాధారణ సంస్థలు ఇంత మందికి ఉద్యోగాలు కలిపించడం అయ్యే పనికాదు.

ఈ పరిస్థితులలో జీవన ప్రగతి (కెరీర్) కోరుకునే యువత కోరికలు తీర్చడం ఎలా? ఇందుకు ఒకే ఒక్క సమాధానం, యువత జీవన ప్రగతికి వ్యాపార, వాణిజ్య,పారిశ్రామిక రంగాలను ఎంచుకునేలా చేయడం, వారిని ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడం ఒక్కటే సమాధానం. దీన్ని మరోలా చెప్పుకోవాలంటే, 'స్టార్ట్ అప్ ఇండియా – స్టాండ్ అప్ ఇండియా' ఒకటే మార్గంగా కనిపిస్తోంది. యువత, మరీ ముఖ్యంగా గ్రామీణ యువత సగర్వంగా తలెత్తుకుని నిలిచేందుకు అత్యంత వేగంగా అనేక అవకాశాలను సృష్టించవలసి ఉంది. నిజానికి గ్రామీణ యువత పట్టణ జీవితం పట్ల అంత ఆసక్తి చూపడం లేదు. ఇటీవల నిర్వహించిన ఒక సర్వే లో గ్రామీణ యువత గత్యంతరం లేకనే పట్టణాలు, నగరాల వైపు చూస్తున్నారు అన్న నిజం నిగ్గుతేలింది. స్వగ్రామాలు, సొంత జిల్లాలలో వారికి లాభ ప్రదమైన ఉపాధిని కలిపిస్తే గ్రామాలలో ఉండేందుకు అత్యధిక శాతం మంది యువత మొగ్గు చూపుతున్నారు. మన దేశం ముందున్న ఉద్యోగ, ఉపాధి సవాళ్ళకు, వ్యక్తిగత ఉద్యోగాల వేట సరైన సమాధానం కాదు. పది మందికి ఉపాధి కలిపించే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మన యువత ముందుకు రావడం మాత్రమే సరైన సమాధానం అవుతుంది.

గ్రామీణ భారత దేశం అంటే, ఎందుకనో గానీ, అందరిలోనూ ఒక సాధారణ తప్పుడు అభిప్రాయం పాదుకుని పోయింది. గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి , జీవన ప్రగతికి అవసరమైన అర్హతలు అంతగా ఉండవనే తప్పుడు భావన బలపడిపోయింది.గ్రామీణ యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం, సమాచార నైపుణ్యం, నిర్ణయ సామర్థ్యం ఉండవు కాబట్టి వారు ఆధునిక ఉద్యోగ, ఉపాధికి పనికిరారనేది సాధారణ అభిప్రాయం! కానీ ఇది తప్పుడు అభిప్రాయం. ఈ తరం గ్రామీణ యువత ఈ రంగంలోనూ పట్టణ యువతకు తీసిపోని విధంగా అన్ని అర్హతలను సొంతం చేసుకుంటున్నారు.

గ్రామీణ భారత దేశం సాంకేతిక విజ్ఞానంలో బాగా వెనకబడి పోయింది, ఇదొక సాధారణ అభిప్రాయం . కానీ ఇటీవల ఉత్తర కర్ణాటకలోని నాలుగు జిల్లాల్లో నిర్వహించిన సర్వేలో 54 శాతం మంది స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. అందులో 73 శాతం మందికి ఇంటర్నెట్ సదుపాయం ఉంది. అలాగే, మరో ఈ – కామర్స్ సర్వేలో 90 శాతం మందికి ఆన్ లైన్ షాపింగ్ గురించి తెలుసని తెలిపారు. అందులో 47

శాతం మంది నిజంగానే, ఆన్ లైన్ లో ఆర్డర్ చేశారు. దీన్ని బట్టి సాంకేతిక విజ్ఞానం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే కాదు, గ్రామీణ యువత దాన్ని సులభంగా వినియోగించ గల్గుతున్నారు.

నూతన జీవన ప్రగతి నమూనాల రూపకల్పనలో సాంకేతిక ఆవిష్కరణలు గ్రామీణ/జిల్లా స్థాయిలో ఉద్యోగ, జీవన ప్రగతి అవకాశాలను, నైపుణ్య అభివృద్ధి అవకాశాలను గుర్తించేందుకు సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. అలాగే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు గల అవకాశాలను గుర్తించేందుకు కూడా సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. గ్రామీణ యువత సరైన కెరీర్ ఎంచుకునేందుకు,వారికీ తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ( కౌన్సిలింగ్) కూడా సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఆ విధంగా స్థానిక యువకులు కెరీర్ ట్రైనీలుగా మారుతున్నారు. అంటే, స్థానిక సహాయం అన్ని వేళలా అందుబాటులో ఉంటోంది. అలాగే, ఉద్యోగార్థులకు ఉద్యోగం లేదా ఉపాధి పొందేందుకు, వారికి గల నైపుణ్యాన్ని బట్టి ఒక వేదికను తయారు చేయడం జరుగుతోంది. తద్వారా గ్రామీణ యువత దీర్ఘ కాల కేరీర్‌ను ఎంచుకునే అవకాశం ఏర్పడుతుంది.

గ్రామీణ యువత సగౌరవంగా తలెత్తుకునేలా చేసేందుకు ఉద్దేశించిన' హెడ్ హెల్డ్ హై' తక్కువ స్థాయి అక్షర జ్ఞానం గల యువతను సైతం ఇంగ్లిష్ మాట్లాడే, కంప్యూటర్ అక్షరాస్యత గల వృత్తి నిపుణులుగా మలిచేందుకు కూడా సాంకేతిక విజ్ఞానం ఉపయోగ పడుతోంది.

**నైపుణ్యంతో నాణ్యమైన ఆదాయం**

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందడుగు వేయాలంటే వారికి మార్కెట్ సదుపాయం అవసరం. ఇందుకు గాను గ్రామీణ ప్రాంతాలలో సాంకేతిక విజ్ఞాన ఆధారిత ముఖద్వారాలను (గేట్వే), వేదికలను రూపొందించ వచ్చును. దీని ఉద్దేశ్యం గ్రామీణ యువత కార్పొరేట్ రంగానికి మార్కెట్ సదుపాయం కల్పించడమేకాదు, వ్యాపార సేవలను అందించేందుకు కూడా సహాయ పడగలరు. వ్యవసాయ, ఆరోగ్య పరిరక్షణ, విద్య, ఆర్థిక సేవలు, చిల్లర వ్యాపారం, ఉపకరణాలు (నీరు, విద్యుత్, టెలికాం) ఇలా కార్పొరేట్ రంగం అనేక కార్యకలాపాలను గ్రామీణ ప్రాతాలలో నిర్వ హించ వచ్చును.

హెడ్ హెల్డ్ హై 'రుబాన్ బ్రిడ్జి' నివేదికను రూపొందించింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి గడపకు ఆరోగ్యం, విద్య, అపేక్షిత సేవలు, వినోదం, ఈ– కామర్స్ ఉత్పత్తులు, సేవలు అందేలా చేస్తుంది. హెడ్ హెల్డ్ హై కొద్ది నెలలలోనే కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు తలుపులు తీసింది. వంద మంది నిరుద్యోగులకు ఉపాధి కలిపించింది.


'హెడ్ హెల్డ్ హై' సాధించిన మరో విజయం, ప్రభుత్వం ముందు చూపుతో చేపట్టిన డిజిటల్ ఇండియాకు ఉపకరించే మార్కెట్ సదుపాయాన్ని కలిపించడం. ఇంటర్నెట్ సంతలు గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విజ్ఞానం వినియోగం పై అవగాహన కలిపిచేందుకు ఉపకరిస్తున్నాయి. కర్ణాటక లోని ఆరు జిల్లాల పరిధిలో గల పది తాలుకాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. 8000 మందికిపైగా ఈ సంతల ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరిలో చాలా మంది ఇంటర్నెట్ ఆధారిత యాప్స్, టూల్స్ ఉపయోగించి నూతన అవకాశాలను కనుగొనేందుకు, అనుభవాలను, విజ్ఞానాన్ని పంచుకునేందుకు, ఆదాయ సృష్టికి కృషిచేస్తున్నారు.

**ముగింపు**

అంతర్జాతీయ ఉద్యోగాలు– వ్యాపార సంస్థలు, సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యం (జేఈటీఎస్) చాల క్రియాశీలకంగా మారింది. కనీసం ప్రస్తుతానికి, రేపు పరిశ్రమలు, కర్మాగారాలు, ఉత్పత్తి సంస్థలు ఏ రూపు తీసుకుంటాయి అనే ఉహించడానికి కూడా సమయం కాదు. దేశ ప్రజలను ముఖ్యంగా యువతను నైపుణ్య వంతులుగా చేసేందుకు, నైపుణ్య దేశంగా గుర్తింపు పొందేందుకు ఎంతో విలువైన కాలాన్ని వెచ్చించ వలసి వస్తున్నది. ఇంత చేసి చివరకు సంపాదించుకున్న నైపుణ్యం ఉద్యోగం , లేదా ఉపాధి సాధనకు పనికి రాకుండా పోతే, శ్రమంతా వృథా అవుతుంది, దీని కంటే, నైపుణ్యం లేని నిరుపేద దేశంగా మిగిలి పోవడమే మంచిది అనిపిస్తుంది. కాబట్టి జేఈటీఎస్ ద్వారా అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అన్ని విధాల శ్రేయస్కరం. అలాగే మరో ముఖ్య విషయం నైపుణ్య శిక్షణ ప్రధానంగా సంస్థ పరిధిలోనే ఉండడం మరింత అవసరం.

నిజానికి కేవలం సాంకేతిక విజ్ఞానం ఒకశక్తి మాత్రమే సర్వ రోగ నివారిణి కాదు. జేఈటీఎస్ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. సంస్థలను, ఉద్యోగాలను విచ్ఛిన్నం చేయ గలదు, అదే సమయంలో, నైపుణ్యాన్ని పెంచ గలదు. జే ఈ టీఎస్ ఎకో సిస్టం ప్రస్తుత గొలుసు కట్టు సరఫరా ( సప్లై చైన్) నమూనా నుంచి నెట్ వర్క్ ఎంటర్ ప్రైజెస్ నమూనాకు మార్చడానికి సాంకేతిక విజ్ఞానాన్ని జోడించాలి. అప్పుడే మన దేశం మన యువతకు గౌరవ ప్రదమైన ఉద్యోగాన్ని, ఉపాధిని కలిపించగల్గుతుంది. అలాగే అప్పుడు మాత్రమే, సుస్థిర అభివృద్ధిని సాధించాలన్న ప్రభుత్వ రాజకీయ సంకల్పం నెరవేరుతుంది. హెడ్ హెల్డ్ హై లాంటి నూతన రీతులు కొత్త బాటలు వేస్తున్నాయి. ■

# నైపుణ్యాభివృద్ధి మెరుగుకు వనరులు-సామర్థ్యాల సద్వినియోగం



**భారత కార్మికశక్తిలో 2022 నాటికి 5.6 కోట్ల మంది అదనంగా చేరుతారు. ప్రస్తుత లెక్కల ప్రకారం చూసినా ఏటా సుమారు 1.2 కోట్ల మంది దేశ కార్మికశక్తిలో భాగమవుతున్నారు. వీరందరినీ తగురీతిలో విద్యావంతులుగా, నిపుణులుగా తయారుచేస్తే దేశానికి తిరుగులేని మానవ వనరుల నిధిగా మారుతారు.**

**పరిచయం**

భారత్ వంటి దేశంలో ఆర్థిక ప్రగతిని సాధించాలంటే దేశంలోని అపార యువశక్తిలో నైపుణ్యాభివృద్ధికి అగ్ర ప్రాధాన్యం ఇవ్వడం అవశ్యం. ఆర్థిక ప్రగతి సాధనకు రెండు మార్గాలున్నాయి. ఒకటి... ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలిచే ప్రస్తుత వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచి వృద్ధిని సాధించడం. రెండోది... స్వయం ఉపాధి కల్పించుకునే యువత లేదా వ్యవస్థాపకులకు అనువైన పర్యావరణ వ్యవస్థకు అండగా నిలిచే సరికొత్త చట్రానికి రూపకల్పన చేయడం. ఈ దిశగా ఉత్పాదక నైపుణ్య సామర్థ్యాన్ని కల్పిస్తూ అదనపు ఆర్థిక ప్రగతికి ఆ చట్రం ఇంధనంలా ఉపయోగపడేలా చేయాలి. రెండింటికీ సామర్థ్యాలు, పరిమితులు ఉన్నా ఈ ప్రతిపాదిత విధానపత్రంలో చర్చకు నైపుణ్యాభివృద్ధే కీలకం. ఏదేమైనా వర్తమాన మెరుగుపరచిన నైపుణ్యాలు, వనరుల గరిష్ఠ వినియోగం ద్వారానే ఆర్థిక ప్రగతి, అభివృద్ధి భావనవైపు పయనించే మార్గాలను అన్వేషించాలి.

**వ్యవస్థాగత కృషి... నేర్చుకున్న పాఠాలు**

సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించేందుకు ఇటీవలి సంవత్సరాల్లో భారీ పెట్టుబడులు పెట్టడంపై భారత ప్రభుత్వం నిశితంగా దృష్టి సారించింది. ఇందుకోసం పేదరికం తగ్గింపు, సాధికారత ప్రధాన కార్యక్రమాలుగా అమలుచేయ తలపెట్టింది. ఇందులో భాగంగానే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం, జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ వంటివాటిని ప్రారంభించింది. దీంతోపాటు సంపూర్ణ సౌభాగ్యం, వృద్ధి లక్ష్య సాధనకోసం 'మేక్ ఇన్ ఇండియా'ను ముందుకు తెచ్చింది. ఇలాంటి చొరవను ప్రదర్శించడంద్వారా ఒకవైపు వనరులను గరిష్ఠంగా వినియోగించుకోవడమేగాక, కొత్త వనరులను గుర్తించవచ్చు. కొన్ని సందర్భాల్లో వాటిని అవసరాల ఆధారంగా పరిశోధన, ఆవిష్కరణ ద్వారానూ సృష్టించుకోవచ్చు. ఈ దిశగా నైపుణ్య భారతాన్ని ఆవిష్కరించడమే నిర్దిష్ట మార్గం. ప్రజానీకానికి జీవనోపాధి భద్రతపై చర్చలో తొలి ప్రాధాన్యం నైపుణ్యాధారిత అవకాశాలకే స్వీయ నైపుణ్యాభివృద్ధి అన్నది అరుదుగా సంభవించే అంశం. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏ లోటూలేని జీవితం

**ప్రొఫెసర్ మనోజ్ జోషి, డాక్టర్ అరుణ్ బహదౌరియా, డాక్టర్ శైలజా దీక్షిత్,** ఎమిటీ విశ్వవిద్యాలయం, ఉత్తరప్రదేశ్.

గడపాలంటే నైపుణ్యానికి మెరుగులు దిద్దుకునే ప్రక్రియ నిరంతరం సాగుతుండాల్సిందే. సమకాలీన విద్యారంగం, విధాన రూపకల్పన నడుమ నైపుణ్యాభివృద్ధిపై సాగబోయే చర్చలో వ్యవస్థాపనకు సంబంధించి ప్రస్తుత నైపుణ్య పద్ధతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. వ్యాపార రంగంలో ఇప్పటిదాకా అన్వేషించని వినూత్న అవకాశాలను అందిపుచ్చు కునేందుకు వీలుగా కొత్త పరిశ్రమ ఆరంభానికి ఔత్సాహిక, ఇతర పెట్టుబడిదారులు ఎదురు చూస్తున్నారు. దీంతోపాటు నైపుణ్య వ్యాప్తికి, ప్రాధాన్యం ఇస్తున్నారు. అయినప్పటికీ మానవ సామర్థ్యాలు విజయ వంతమైన ప్రయత్నాలుగా రూపొందడం, తగుమేర ఉద్యోగిత వనరుల సృష్టి అరుదుగానే కనిపిస్తున్నాయి. సమాజంలోని పేదరికం, సామాజిక సమస్యలు ఏకమై ఆర్థిక శ్రేయస్సు, వృద్ధి, ప్రగతి లక్ష్యాల సాధనకు అడ్డంకిగా పరిణమిస్తున్నాయి.

**ఆర్థిక ప్రగతి దిశగా నైపుణ్యాభివృద్ధి పాత్ర**

శిక్షణ లేదా అనుభవంద్వారా సముపార్జించుకున్న లేదా మెరుగు పరచుకున్న సామర్థ్యాన్నే నైపుణ్యాభివృద్ధిగా నిర్వచించవచ్చు. నైపుణ్యాభివృద్ధి పాత్ర, దాని ప్రభావాన్ని ప్రపంచంలోని అగ్రదేశాలు తమ జాతీయ విధానాలద్వారా చాటాయి. మారుతున్న విపణిఅవసరాలకు అనుగుణంగా వ్యక్తులు తమ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడానికే కాకుండా వినూత్న ఆవిష్కరణలు, వ్యవస్థాపన కార్యకలాపాల నుంచి లబ్ధి పొందటానికి కూడా నైపుణ్యాభివృద్ధి తోడ్పడుతుంది. నైపుణ్యాభివృద్ధికి ప్రాథమిక నిర్ణాయకాల మాట అటుంచి, ప్రస్తుత పోటీ వాతావరణంలో మారుతున్న ఆర్థిక అవసరాలు, సవాళ్లు, అవకాశాలకు అనువైనదిగా ఉండటం అవసరం. అంతిమంగా ఎంతమందికి ఉపాధి లభించింది? పని ప్రదేశంలో వారి ఉత్పాదక సామర్థ్యం ఎంత? వంటి అంశాలపైనే ఆయా దేశాల భవిష్యత్ సౌభాగ్యం ఆధారపడి ఉంటుంది. అత్యంత విజయవంతమైన, ప్రగతిశీల దేశాలు అస్థిరత, అనిశ్చితి, సంక్లిష్టత, అసందిగ్ధతలను ఏ మేరకు ఎదుర్కోగలవన్న అంశానికి ఇదో క్రియాశీల దృష్టాంతం అవుతుంది. అందువల్ల ప్రభుత్వ పాత్రను తప్పనిసరి చేస్తూ విస్తృత వృద్ధి, ఉద్యోగితప్రగతికి నైపుణ్యాభివృద్ధిని అనుసంధా నించవచ్చు.

**పోటీతత్వంలో భారత్‌కు సానుకూలత**

ప్రపంచవ్యాప్తంగా 2020 నాటికి 4.7 కోట్ల మేర కార్మికశక్తి కొరత ఉంటుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనం వెల్లడించింది. అదే సమయంలో వృద్ధి పథంలో పయనిస్తున్న భారత జనసంపద సామర్థ్యం ప్రపంచమంతటా పతాక శీర్షికకు ఎక్కుతున్నది. జనాభాలో పని చేయగల 15-59 ఏళ్ల మధ్య వయస్కులు 62శాతానికి పైగా ఉన్నారు. అంతేకాకుండా మొత్తం భారత జనాభాలో 25ఏళ్లలోపు యువత 54 శాతం ఉంది. 2022నాటికి భారత కార్మికశక్తికిమాన్ 5.6 కోట్ల మంది అదనంగా చేరుతారు. ప్రస్తుత లెక్కల ప్రకారం చూసినా ఏటా సుమారు 1.2 కోట్ల మంది దేశ కార్మికశక్తిలో అదనంగా చేరుతున్నారు. వీరందరినీ తగురీతిలో విద్యావంతులుగా, నిపుణులుగా తయారుచేస్తే వీరు దేశానికి తిరుగులేని మానవ వనరుల నిధిగా మారుతారు. వేగంగా వికసిస్తున్న భారత విపణికి సేవలందించడమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ వనరు కాగలరు (ప్రణాళిక సంఘం విధాన పత్రం, 12వ పంచవర్ష ప్రణాళిక)! అనేక ఆసియా దేశాల తరహాలోనే భారత్‌లోనూ కార్మిక విపణి ఐదు రకాలుగా పరివర్తన చెందుతోంది... "వ్యవసాయం నుంచి వ్యవసాయేతర, గ్రామీణ నుంచి పట్టణ, అసంఘటిత నుంచి సంఘటిత, కనీస స్వయం ఉపాధి నుంచి ఆకర్షణీయ వేతనం, పాఠశాల నుంచి పనికి" అనే రూపాల్లో ఈ పరివర్తన క్రమం సాగుతోంది. దేశానికి అధిక జనాభా ఒక శాపమన్న పాత భావన ఇప్పుడు జనాభా వాంఛనీయ జనసంపద అన్నట్లుగా రూపాంతరం చెందింది. జనసంపద అంటే కేవలం జనసంఖ్య కాదు... నైపుణ్యం, విద్యార్హతలు లేదా ఉపాధి పొందినవారి సంఖ్య అన్నది తాత్పర్యం. చౌకైన కార్మికశక్తి, సుసంపన్న ప్రతిభా నిధి భారత్‌కుగల సానుకూలతలు. విజ్ఞానం పునాదిగా ప్రపంచంతో పోటీపడగల సమాజానికి చేవనిస్తున్నది ఇవే!

**నైపుణ్య లోపం భర్తీ: దేశంలో నైపుణ్య శిక్షణ అవకాశాలు**

ప్రపంచ దేశాల జనాభా వేగంగా వయసు మీరుతున్న దశలో తరుణదేశాల్లో ఒకటిగా ఉన్న భారత్, జనసంపద రీత్యా వ్యూహాత్మక ప్రయోజనం పొందగల స్థితిలో ఉంది. కానీ, జనాభాలో దాదాపు మూడొంతులు నైపుణ్యం లేనివారే. అందువల్ల భారత్, బ్రెజిల్ వంటి వర్ధమాన దేశాలు కూడా భారీ నైపుణ్య లోటును ఎదుర్కొనాల్సి వస్తుందని విశ్వ ఆర్థిక వేదిక రూపొందించిన ప్రపంచ నైపుణ్యలేమి ముప్పు నివేదిక హెచ్చరిస్తోంది. పరిశ్రమకు కావాల్సిన నైపుణ్యానికి, విద్యావ్యవస్థ అందిస్తున్న విజ్ఞానానికి నడుమ పెద్ద అగాధం ఉంది. దీన్ని పూడ్చేందుకు జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంద్వారా కృషి సాగుతున్నా, 2022 నాటికి 50 కోట్ల మందితో నైపుణ్య మానవశక్తి నిధిని సృష్టించుకోవాలన్న లక్ష్యం నెరవేరడం కష్టసాధ్యమే!

**అవకాశాల సద్వినియోగం-ఆర్థిక వృద్ధిలో లోపాలు**

1. అంతగా అభివృద్ధి చెందని దేశాల్లో జీవనోపాధి వ్యవస్థలు నిర్మాణపరంగా బలహీనంగా ఉన్నాయి. దీనివల్ల వనరుల పంపిణీలో అసమానత, భూ కమతాల విభజన, అనుసంధాన లోపం, అతి తక్కువ అవగాహన స్థాయి, విద్య, ప్రగతి ప్రక్రియ దిశగా పయనంలో సందేహాస్పద, వెనుకబాటు

పద్ధతులు వెరసి నిరుపేద, జీవించశక్యంగాని, ఆర్థికంగా బలహీనమైన, అస్థిర ఆవాసాలకు దారితీశాయి.

వ్యవసాయం-పర్యావరణ హితకరమైన పంట వైవిధ్యీకరణద్వారా దిగుబడులను స్థిరీకరించాలి. ఇందుకోసం ఉత్పాదకత, శుద్ధికి సంబంధించిన ఆధునిక సాంకేతికతపై దృష్టి సారించడం, అవగాహన కల్పించడం అవసరం. దీనితోపాటు సహజ వనరుల నిర్వహణ, ఆర్థిక-రాజకీయ పంపిణీ వ్యవస్థల్లోని లోపాల సవరణ, వ్యయ నియంత్రణ, వ్యాపారానుగుణ చర్యలు (ఉదా. భూసార, జల సంరక్షణ) వంటివి అత్యంత అవశ్యం.

స్వీయాధారిత వ్యవస్థ (ఉదా. చిన్నతరహా పరిశ్రమలు అభివృద్ధి ప్రణాళిక) లక్ష్య సాధన దిశగా ప్రత్యామ్నాయ ఆదాయ కార్యకలాపాల సృష్టికి ఆచరణాత్మక కార్యాచరణను అనుసరించాలి.

ఆర్థికంగా, పర్యావరణపరంగా, ప్రపంచ వ్యాప్తంగానేగాక స్థానికంగానూ సుస్థిరతకు భరోసానివ్వగల వ్యూహాలను (ఉదా. ఆయా రుతువులకు తగిన వ్యవసాయేతర ఉపాధి) బలోపేతం చేయడం అవసరం.

ఆకస్మిక కుదుపు నుంచి ఆదుకోగల విధంగా ముందస్తు నిల్వలను అందుబాటులో ఉంచుకునే దిశగా క్షేత్రస్థాయి నిర్వహణను, ఆచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలి.

సామాజిక భాగస్వామ్యంతో ఉమ్మడి ఆస్తులు, వ్యూహాత్మక నిర్వహణను మెరుగుపరచుకోవాలి. గిరాకీతో సరఫరా పోలిక-అనుసంధానంలో సమస్యలు నిరుద్యోగంపై తీసిన లెక్కలు దేశంలో అందుబాటులో ఉన్న కార్మికుల సంఖ్యను ప్రతిబింబించడం లేదు. అలాగే ఉద్యోగ ఖాళీలపై నిర్ధారిత అంచనాలు అందుబాటులో ఉన్న ఉద్యోగాల సంఖ్యను ప్రతిఫలించడం లేదు. అనేక ముఖ్యమైన అంశాలు సరిపోకపోవడాన్ని ఉపాధి, ఉత్పాదకత నమూనాలు బహిర్గతం చేస్తున్నాయి. దేశ కార్మికశక్తిలో 93 శాతం దిగువస్థాయి, సగటున తక్కువ ఉత్పాదకతగల పరిశ్రమల్లో ఉపాధి పొందుతోంది. మొత్తం కార్మిక శక్తిలో 58శాతం వ్యవసాయ రంగంలో ఉండగా స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా కేవలం 18శాతం మాత్రమే. చైనా కార్మికశక్తిలో 50 శాతం తయారీ రంగంలో ఉపాధి పొందుతుండగా, భారత్‌లో అది కేవలం 12 శాతం కావడం గమనార్హం. కష్టమైన వ్యవసాయ రంగం నుంచి వ్యవసాయేతర రంగంవైపు పరివర్తనకు తక్కువ నైపుణ్యంగల సంఘటిత తయారీరంగం ఒక అంచెను సృష్టిస్తుంది. దేశ కార్మిక శక్తిలో సగానికిపైగా స్వయం ఉపాధి పొందుతున్న వారే. అయితే వారిలో అధికశాతం పనిపాట్లు చేసుకునే పేదలే కావడం వల్ల దురదృష్టవశాత్తూ వ్యవస్థాపక శక్తికి సంకేతంగా నిలవలేకపోతోంది (మెకిన్సే, 2014). రానున్న రెండు దశాబ్దాలపాటు నెలకు 10 లక్ష మంది కార్మికశక్తిలో చేరడంపై మాత్రమే చాలామంది దృష్టి సారిస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే వ్యవసాయం వంటి తక్కువ ఉత్పాదకతగల రంగాల్లోని కార్మికశక్తిలో భాగమైన 20 కోట్లమందిని నిపుణులుగా తీర్చిదిద్ది కార్మిక నిధిగా మార్చుకోవడానికి ఇదే అతిపెద్ద అవకాశం. ప్రభుత్వం నడిపే 1,200 ఉపాధి కల్పన కార్యాలయాల్లో నమోదైనవారి సంఖ్య 2011 నాటికి 4 కోట్లు కాగా, ఆ కార్యాలయాలు కల్పించిన ఉద్యోగాలు 3లక్షలు మాత్రమే (మెకిన్సే, 2014).

**విద్యావంతులు - నిపుణులైన కార్మిక నిధి సృష్టిలో సమస్యలు**

మెరుగైన విద్యావ్యవస్థకు అంతే మెరుగైన నాణ్యత నియంత్రణ, ప్రోత్సాహక సూత్రాలు అనుసంధానమై ఉండాలి. అలాగే భవిష్యత్ అవసరాలకు తగువిధంగా విద్యావంతులైన, నిపుణులైన కార్మికులను తీర్చిదిద్దే వాతావరణాన్ని సృష్టించాలి. విద్యాభ్యాసంలోని వివిధ దశల్లో చదువు మానేస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉండటమే విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. పాఠశాల స్థాయిలో విద్యనభ్యసించేవారిలో సుమారు 35 శాతం పదో తరగతి స్థాయికి చేరటం లేదు. ఇక పదో తరగతి పరీక్షలు రాస్తున్న 2.6 కోట్ల మందిలో కోటి మంది ఉత్తీర్ణులు కావడం లేదు. అలాగే 12వ తరగతి పరీక్షకు హాజరయ్యే 1.6 కోట్లమందిలో 50 శాతం (80లక్షలు) విఫలమవుతున్నారు. ఉత్తీర్ణుయ్యే 80 లక్ష మందిలోనూ కేవలం 50 లక్ష మందే కళాశాల మెట్లెక్కుతున్నారు. ఏతావాతా తేలుతున్నదేమిటంటే... విద్యావంతులు, నిపుణులు, వృత్తి సామర్థ్యంతో కూడిన బలమైన కార్మిక నిధిని సిద్ధం చేసుకోవడానికి దిగువస్థాయి నుంచి ఎగువస్థాయికి విద్యావిధానంలో మార్పులు రావాలన్నదే! కింది స్థాయిలోనే చదువు మానేస్తున్నవారిలో అధికశాతం పేదలు, చదువుకునే అవకాశం లేనివారే. కాబట్టి తృతీయస్థాయి విద్యలో నమోదు, ఉత్తీర్ణతలో అసమానతలు సహజం. ఆరోగ్యం, విద్య, సామాజిక అవసరాలు వంటి ప్రాథమిక భద్రత, రక్షణల కల్పనద్వారా వాంఛనీయ నైపుణ్య స్థాయిని సృష్టించాల్సి ఉంది. వీటి ఫలితంగా లభించే జీవనోపాధి కూడా వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. అవేమిటంటే:

1. వ్యాపారావకాశాలు, అభివృద్ధికి భద్రత
2. ఆర్థిక భద్రత (ఆదాయం, నైపుణ్యం, సమయం)
3. పౌష్టికత భద్రత (నివాసం, మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, మంచినీరు, పారిశుధ్యం)
4. పర్యావరణ అవగాహన భద్రత
5. విద్యాభాగస్వామ్య భద్రత

6. సామాజిక భాగస్వామ్యం (లైంగిక సమానత్వం, జాతి, మతానుబంధం)
7. ఆవాస భద్రత.
8. ఆహార భద్రత
9. ఆరోగ్య భద్రత
10. రాజకీయ, చట్ట భద్రత

**నైపుణ్యాభివృద్ధి/మానవ మూలధన వృద్ధిఎలా?**

1. సమాజంలో అట్టడుగు వర్గాల నైపుణ్యా స్థాయిని పునర్నిర్మించాల్సి ఉంది. నైపుణ్యా నిధిని సమకూర్చుకోవడంలో వైఫల్యానికి అందుబాటు, ఆచరణీయతలో ఎదురవుతున్న సమస్యలే ఈనాటికీ మూల కారణాలు.
2. అవకాశాలను గుర్తించి, అందిపుచ్చుకునేందుకు సిద్ధంకాగల అవగాహన ఆధారిత సామర్థ్యం యువతలో అవసరం.
3. యువతలోనూ, ఏదో ఒక రకమైన వ్యాపారంలో ఉన్నవారిలోనూ ప్రాథమిక వ్యవస్థాపన నైపుణ్య సామర్థ్యం వాంఛనీయం.

విధివిధానాల రూపకల్పనలో నైపుణ్యాభివృద్ధి, నిర్వహణ, వినియోగాలను మెరుగుపరిచే ప్రక్రియే కీలకమైనదిగా పరిగణన పొందుతోంది. దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పనకు మద్దతునివ్వడమేగాక ఆదాయం, అవకాశాల సమాన పంపిణీకి అది తనవంతు తోడ్పాటు నిస్తుందన్న మాట. ఇటీవలే విడుదలైన ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ నైపుణ్య వ్యూహ నివేదిక ప్రభుత్వాలు కార్యాచరణకు దిగాల్సిన మూడు కీలకాంశాలను గుర్తించింది. ఆయా రంగాలకు సంబంధించిన నైపుణ్యాభివృద్ధి, ఆ నైపుణ్యాలను ఉత్తేజితం చేయడం, వాటిని ఏదో ఒకవిధంగా వినియోగించడంపై దృష్టి సారించాలని ఓఈసీడీ దేశాలకు ఈ వ్యూహం నిర్దేశిస్తోంది.

**నైపుణ్యాభివృద్ధికో చట్రం**

ఈ విధానపత్రం ఆరంభంలో చెప్పిన విధంగా ఆర్థిక ప్రగతి సాధనకు రెండు మార్గాలున్నాయి. మొదటిది... ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలిచే ప్రస్తుత వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచి వృద్ధిని సాధించడం. కానీ, దీని పరిధి పరిమితం. రెండోది... స్వయం ఉపాధి కల్పించుకునే యువత లేదా వ్యవస్థాపకులకు అనువైన వాతావరణ వ్యవస్థకు అండగా నిలిచే సరికొత్త చట్రానికి రూపకల్పన చేయడం. ఈ దిశగా ఉత్పాదక నైపుణ్య సామర్థ్యం కల్పిస్తూ అదనపు ఆర్థిక ప్రగతికి ఆ చట్రం ఇంధనంలా పనికొచ్చేలా చేయాలి... ఇప్పుడు ఈ రెండోదానికే విస్తృత అవకాశం ఉంది. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి మార్గంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోగల దిద్దుబాటు చట్రాన్ని ఈ పత్రం రూపకర్తలు ప్రతిపాదిస్తున్నారు.

**మార్గం 1:**

ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ పరిధిలోనే వ్యక్తిగత నైపుణ్య కల్పనతో కార్మికశక్తి సామర్థ్యాన్ని పెంచడంద్వారా వృద్ధిని సాధించడం. అంటే వర్తమాన పరిశ్రమ రంగానికి అవసరమైన నైపుణ్య సామర్థ్యం పెంచడం... ఇది సంతులన దశకు చేరువలో ఉన్నందు వల్ల దీని పరిధి పరిమితం. అయితే, ఈ మార్గాలన్నీ మనం వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికశక్తిలో ఉద్యోగిత లోపంవల్ల ఇప్పటిదాకా గుర్తించని కొన్ని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఉద్యోగితకు అవసరమైన ముందస్తు అర్హతలు, నైపుణ్యాల మధ్య భారీ అగాధమే కార్మికశక్తిని ముందడుగు వేయనీయడం లేదన్నది సుస్పష్టం. ప్రపంచంలోని పాత, కొత్త ఆర్థిక వ్యవస్థల్లోగల సంప్రదాయ పరిశ్రమల్లోనే ఉద్యోగిత, ప్రస్తుత అవకాశాల మధ్య అగాధానికి కారణమవుతున్న వ్యక్తిగత నైపుణ్య లోపాన్ని మనం గమనించవచ్చు.

**మార్గం 2:**

ఇది ప్రధానంగా వ్యవస్థాపన చట్రానికి సంబంధించింది. వర్తమాన ఆర్థిక వ్యవస్థలో సరికొత్త అవకాశాల సృష్టితోపాటు రాబోయే 20 ఏళ్ల పరిణామాలకూ వర్తింపజేయదగినది. అపరిమిత పరిధిగల వ్యవస్థాపన సృష్టిని ఇది అంతర్గతంగా వాంఛిస్తున్నా, ఇందులోనూ రెండు ఉప మార్గాలున్నాయి.

**మార్గం 2లో తొలి బాట:**

అందుబాటులోగల, ఇప్పటివరకూ వినియోగించుకోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా యువతరానికి అదనపు సామర్థ్యాలు కల్పించడం ద్వారా ఉద్యోగార్హతలను పెంచడం. సామర్థ్యాలను మెరుగుపరచడం ఇందులో ప్రధానం.

**మార్గం 2లో మలి బాట:**

వ్యవస్థాపకుల దన్నుతో సాగే కొత్త ఆర్థిక వ్యవస్థలో పూర్తిగా సరికొత్త అవకాశాల సృష్టిపై ఇది దృష్టి సారిస్తుంది. ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించేందుకు మెరుగైన సామర్థ్యాల కోసం సదా అన్వేషిస్తూంటుంది. అటు సామర్థ్యం, ఇటు వనరుల అభివృద్ధిని ఇది అనివార్యం చేస్తుంది. దీంతోపాటు నైపుణ్యాభివృద్ధి కల్పనద్వారా వ్యవస్థలోని భాగస్వాములు తమకు అందుబాటులోఉన్న సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రేరేపిస్తుంది. అదే సమయంలో ప్రతిపాదిత కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సంసిద్ధం చేస్తుంది.

సరికొత్త లేదా వర్తమాన అవకాశాలను, వాటిలో ఉద్యోగార్హతలకు అవసరమైన నైపుణ్యాలను ఈ రెండు మార్గాలు తప్పక సరిపోల్చి చూడాలి. తద్వారా ఉత్పాదకత, ఉద్యోగిత, వ్యవస్థాపనను మెరుగుపరచేందుకు ఈ ప్రక్రియ దారితీస్తుంది. అలాగే ప్రస్తుతం రంగంలో ఉన్న ప్రధాన భాగస్వాములంతా ఈ మొత్తం ప్రక్రియలో పాలుపంచుకుంటారు కాబట్టి భారతదేశం ప్రగతిశీల, పురోగమన పథంలో నడుస్తుంది. ■

# నైపుణ్యంతోనే మానవ వనరుల అభివృద్ధి



**ఓ అంచనా ప్రకారం ప్రస్తుతం దేశంలోని ఐటీ మరియు దాని అనుబంధ సంస్థల అవసరాలకు సుమారు 23 లక్షల మంది నిపుణులు అవసరం. కానీ గడిచిన పదిహేనేళ్లలో భారత్ కేవలం 16 లక్ష మంది ఐటీ నిపుణులను మాత్రమే తయారు చేయగలిగింది.**

భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా పేరుగాంచింది. దేశంలో సుమారు 64 శాతం మంది జనాభా 'పనిచేసే సమర్థత' కలిగిన వయస్సువారే కావడం విశేషం. ఈ స్థాయిలో మానవవనరులు కలిగి ఉండటం దేశానికి తరగని బంగారు గని. 2020 నాటికి ఈ శక్తి దేశ పురోభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుంది.

దేశంలో కొనసాగుతున్న వేగవంతమైన ఆర్థికాభివృద్ధి దేశంలో పెట్టుబడుల వాతావరణానికి ప్రోత్సాహకరంగా మారుతోంది. మరో వైపు నైపుణ్యం కలిగిన మానవవనరుల అవసరం కూడా చాలా ఉంది. ఓ అంచనా ప్రకారం 2015 సంవత్సరానికి గానూ దేశంలోని ఐటీ మరియు దాని అనుబంధ సంస్థల అవసరాలు తీర్చేందుకు సుమారు 23 లక్షల మంది నిపుణులు అవసరం. కానీ గడిచిన పదిహేనేళ్లలో భారత్‌లో కేవలం 16 లక్ష మంది ఐటీ నిపుణులను మాత్రమే తయారు చేయగలిగింది. అంటే మరో ఎనిమిది లక్ష మంది నిపుణులను తయారు చేయడానికి రాబోయే రెండు సంవత్సరాలు సరిపోవు అనేది స్పష్టం అవుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం లెక్కల ప్రకారం దేశంలో కేవలం 25 శాతం మంది ఉద్యోగులు మాత్రమే అసంఘటిత రంగంలో ఉన్నారు. మిగితా వారంతా అసంఘటిత రంగంలో ఉన్నారు. అసంఘటిత రంగంలో నైపుణ్య శిక్షణ లాంటి వాటికి చోటు ఉండదు. ఉద్యోగుల నైపుణ్యాన్ని పెంచేలా ఎలాంటి చర్యలు తీసుకోరు.

ఇక 2015 సంవత్సరానికి గానూ దేశ వ్యాప్తంగా సుమారు 50 లక్ష మంది గ్రాడ్యుయేట్లు ఉత్తీర్ణులు అవుతున్నారు. వారిలో సుమారు 34 శాతం మంది మాత్రమే ఉద్యోగ నైపుణ్యత కలిగి ఉన్నారు. మిగితా వారికి పరిశ్రమకు కావాల్సిన నైపుణ్యతలు లేవని తేలింది. మరోవైపు కంపెనీలు ముఖ్యంగా సాఫ్ట్ స్కిల్స్ (వ్యవహార జ్ఞానం) లాంటి అంశాల్లో ఆరితేరిన

**సచిన్ అధికారి,** వ్యవస్థాపక సంచాలకుడు, గ్లోబల్ సక్సెస్ యూనివర్సిటీ

ఉద్యోగుల పైననే దృష్టి సారిస్తున్నాయి. అనంతరం వృత్తినైపుణ్యతను పెంచుకునేలా ట్రైనింగ్ ఇచ్చేందుకు పరిశ్రమలు ఆసక్తి చూపిస్తున్నాయి. కేవలం విశ్వవిద్యాయం ఇచ్చే డిగ్రీ పట్టా ఆధారంగా పేరున్న కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం కష్టంగా మారిపోయింది. తీవ్రమైన పోటీతో ఒకే తరహా విద్యార్హత కలిగిన వారు పెద్ద సంఖ్యలో ఉండటం వల్ల కంపెనీలు అవసరమైన వారిని ఎంపిక చేసుకునేందుకు వృత్తి నైపుణ్యంతోపాటు ఇతర అంశాలను సైతం పరిగణనలోకి తీసుకుంటున్నారు. వృత్తినైపుణ్యం పెంచుకునేందుకు కేవలం విషయ పరిజ్ఞానం పెంచుకుంటే సరిపోతుంది. కానీ ఉద్యోగాన్ని నిర్వర్తించే క్రమంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు వృత్తి నైపుణ్యంతో పాటు ఇతర విషయాలు కూడా చాలా అవసరంగా మారింది. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ (మానవ సంబంధాలు), సాఫ్ట్ స్కిల్స్ (వ్యవహార జ్ఞానం) లాంటి అంశాలు ఉద్యోగులకు కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీల్లో ఒక బృంద నాయకుడిగా ఉద్యోగులను ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంటుంది. ఆ సమయంలో ఉద్యోగులతో మెలిగేందుకు నాయకత్వ లక్షణాల అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ వల్ల ఉద్యోగుల మధ్య, తమ సాంకేతిక అంశాల పట్ల స్పష్టమైన అభిప్రాయాలు వెల్లిబుచ్చే వీలవుతుంది. ఫలితంగా కార్పొరేట్ ప్రపంచంలోని పోటీని తట్టుకొని నిలబడేందుకు దోహదపడుతుంది.

'నాస్కామ్' అంచనా ప్రకారం ప్రతీ ఏటా నగటున 30 లక్ష మంది గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు ఉత్తీర్ణులై మానవ వనరులుగా మారుతున్నారు. అయితే వీరిలో కేవలం 25 శాతం మంది వృత్తి నైపుణ్య పరమైన గ్రాడ్యుయేట్లు, మరో 10 నుంచి 15 శాతం గ్రాడ్యుయేట్లు మాత్రమే ప్రస్తుత పరిశ్రమ వర్గాల్లో ఉద్యోగార్హులుగా గుర్తింపు పొందుతున్నారు. అలాగే ప్రస్తుత విద్యా విధానం సైతం వృత్తి నైపుణ్యతను పెంచేలా లేకపోవడం మాత్రమే కాదు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోనూ విఫలం చెందుతోంది. అలాగే దేశంలో పెద్ద సంఖ్యలో కార్మికులు కాలం చెల్లిన నైపుణ్యత కలిగి ఉన్నారు.

మనం ఆశిస్తున్న ఆర్థిక వృద్ధి విసురుతున్న సవాళ్లను అధిగమించాలంటే మాత్రం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు ఏమాత్రం సరిపోవు. ఇక నూతన ఉద్యోగావకాశాల్లో సుమారు 75 శాతం వరకూ వృత్తినైపుణ్యం కలవారికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వృత్తి నైపుణ్యం పెంచేందుకు శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మానవ వనరుల విషయంలో వివిధ దశల్లో నాయకత్వ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా విధాన నిర్ణయాల్లోనూ కమ్యూనికేషన్ స్కిల్స్‌దే కీలక పాత్ర అవుతోంది. కేవలం వృత్తి పరమైన నైపుణ్యం మాత్రమే కాదు. పరిశ్రమ వర్గాల్లో వినియోగదారులతో మానవసంబంధాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే మానవ సంబంధాలు నెరపడంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌దే కీలక పాత్ర అవుతోంది. సంభాషణా చాతుర్యం లాంటి వాటి ప్రాధాన్యత పెరిగింది. ఇలాంటి ప్రత్యేకతలు కలవారికే ఉద్యోగం లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఇక సాఫ్ట్ స్కిల్స్ విషయానికి వస్తే ఈ తరహా మెళకువలను శిక్షణ ద్వారా పొందవచ్చా అనే సందేహాలు కలుగు తుంటాయి. కానీ ఇది సాధ్యపడని విషయం సాఫ్ట్ స్కిల్స్( వ్యవహార జ్ఞానం) జీవితంలోని వివిధ దశలలో ద్వారా మన అనుభవాల ద్వారా సంపాదించుకోవాల్సి ఉంటుంది. మనిషి స్వభావ రీత్యా పొందాల్సిన జ్ఞానమే సాఫ్ట్ స్కిల్. ఒక వ్యక్తి సహజ స్వభావాన్ని పూర్తి స్థాయిలో మార్చలేక పోయినప్పటికీ కొంత మేర వారిని ప్రభావితం చేయవచ్చు.

ఇదిలా ఉంటే మన దేశంలో మాత్రం సాఫ్ట్‌స్కిల్స్ పట్ల శిక్షణ అవసరంగానే కనిపిస్తోంది. అందుకు మన విద్యావిధానం కూడా ఒక కారణం. విద్యార్థి దశలో వ్యక్తిత్వ వికాసం కలిగేలా పరిస్థితులు లేకపోవడం దీనికి ఒక కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీల్లో కలివిడిగా ఉంటూ కొత్త ఆలోచనలను ఇతరులతో పంచుకునే వీలు కల్పిస్తుంది.అలాగే అన్ని స్థాయిల్లోని ఉద్యోగుల నుంచి కొత్త ఆలోచనలతో పాటు సలహాలు, స్వీకరిం చేందుకు కార్పొరేట్ కంపెనీలు ముందుంటాయి. ఒక టీంలో పనిచేసేటప్పుడు వ్యవహరించాల్సిన తీరు లాంటి అంశాలు కూడా పరిగణలోకి తీసుకుంటారు. ఒక విద్యార్థి కార్పొరేట్ సంస్కృతిలో మనగలగాలంటే మాత్రం ఇలాంటి కొత్త ఆలోచనలకు పదును పెడుతూ ఒక ఆశావాహ దృక్పథాన్ని అలవరుచుకోవాల్సి ఉంటుంది.

ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీల్లో

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు నాయకత్వ లక్షణాలు, సమయపాలన లాంటివి అత్యంత కీలకంగా మారాయి. అందుకే విద్యార్థుల చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ లాంటి వాటిలో శిక్షణ తీసుకుంటే లాభదాయకం. ఇలాంటి శిక్షణ వల్ల విద్యార్థి దశ ముగియగానే ఉద్యోగంలో ఇమిడేందుకు వీలవుతుంది.

ఇక ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా కంపెనీలు కార్పోరేట్ ప్రపంచంలో ఎదురవుతున్న పోటీని తట్టుకునేలా సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుంది. అలాగే కంపెనీ ప్రయోజనాలను కూడా కాపాడుకునే ప్రయత్నమూ జరుగుతుంది. ఇక సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవడం ద్వారా అవి కేవలం మన ఉద్యోగ విషయంలోనే కాదు వ్యక్తిగత జీవితంలోనూ దోహదపడతాయి. సామాజికంగానూ, వ్యక్తిగతంగానూ, విజయాలను సాధించడంలోనూ సాఫ్ట్ స్కిల్స్ ఉపయోగపడతాయి.

ఏ తరహా నైపుణ్య శిక్షణ అయినా విద్యను మినహాయిస్తూ ఇవ్వలేము. తాజాగా విడుదలైన ఏఎస్ఈఆర్ రిపోర్టు ప్రకారం మన దేశంలో ప్రాథమిక విద్య నిర్లక్ష్యం చేయ బడింది. పాఠశాల నాణ్యత తగ్గి పోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో ఈ తరహా తిరోగమన ఫలితాలు నమోదయ్యాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థు లంతా భవిష్యత్తులో మన మానవవనరులు. కానీ ఈ పాఠశాలల్లో బడిమానేసిన పిల్లల సంఖ్య పెరుగుతోంది. ఇతర సమస్యలు కూడా పాఠశాల విద్యను కుంగదీస్తున్నాయి. పాఠశాల స్థాయి నైపుణ్య శిక్షణ కూడా ఉంటే వీరంతా భవిష్యత్తులో వృత్తి నైపుణ్యంతో కూడిన యువతగా దేశానికి అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అలాగే పాఠశాలల్లో విద్యార్థులు, బోధనా సిబ్బంది నిష్పత్తులలో హెచ్చుతగ్గులు గమనించవచ్చు. ఫలితంగా బోధనా సిబ్బంది కొరతతో పాఠశాల విద్య పునాది కోల్పోతోంది.

ప్రపంచీకరణ ఫలితంగా దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు విస్తరించాయి. ముఖ్యంగా సరికొత్త రంగాలు ఆవిష్కృతం అయ్యాయి. ఆయా రంగాలకు సరిపడా నైపుణ్యంతో కూడిన మానవవనరులను అందించడంలో విఫలం చెందుతున్నాము. అలాగే ప్రపంచీకరణ ఫలితంగా ఉద్యోగులు పని తీరులోనూ విపరీతమైన మార్పులు సంభవించాయి. ఇక నైపుణ్యంతో కూడిన మానవవనరులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అసంఘటిత రంగం సైతం ముందుకు వస్తోంది. వృత్తి నైపుణ్యమే ప్రస్తుత కాలంలో పెట్టుబడిగా మారుతోంది. నైపుణ్యం కలిగిన మానవవనరులతోనే దేశ ఆర్థిక వృద్ధి మెరుగయ్యే సూచనలు ఉన్నాయి. భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో మార్కెట్‌ను విస్తృత పరిచేందుకు నైపుణ్యంతో కూడిన విద్య తప్పనిసరిగా పరిణమించింది.

ముఖ్యంగా అసంఘటిత ఆర్థిక రంగం స్వతంత్రంగా వృత్తులను ఎంచుకొని ఒక వ్యవస్థగా పరిణమించింది. వీరంతా జీవన భృతికోసం ఆయా వృత్తుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. చిరు వ్యాపారస్తులు, దినసరి వేతన కార్మికులు, ఇతర రంగాలకు చెందిన కార్మికులు అసంఘటిత రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. వీరంతా వృత్తి నైపుణ్యం కారణంగానే ఆయా రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ అసంఘటిత రంగమే బలీయమైన శక్తిగా అవతరిస్తోంది.

ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక రంగం పురోభివృద్ధి సాధించింది. సమాచార సాంకేతిక వ్యవస్థ ఆర్థిక వ్యవస్థను బలంగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా ఇంటర్నెట్ సమాచార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిపెట్టింది. దీనిని ఒడిసి పట్టేందుకు ప్రయత్నాలు కొనసాగించాలి. ముఖ్యంగా నైపుణ్యం పెంచుకునేందుకు ఇంటర్నెట్ వంటివి అత్యంత ఆవశ్యకంగా మారాయి. అలాగే మొబైల్ యాప్స్ ద్వారా సైతం కావాల్సిన నైపుణ్య శిక్షణను అందుబాటులో ఉంచితే యువతకు ఎంతో ఉపయోగం. అలాగే మిగితా ప్రపంచంతో కలిసేందుకు ఒక వారధిలా ఇంటర్నెట్ ఉపయోగపడుతోంది.

అసంఘటిత రంగానికి సంబంధించి నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్ ప్రైజెస్, ప్రభుత్వానికి ఓ సలహా మండలిగా ఉంది. 2004లో ఈ సలహా మండలి అసంఘటిత రంగంలో ఉత్పాదకతను మెరుగు పరిచేందుకు తగు సూచనలు చేసింది. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బలంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలా ఈ అసంఘటిత రంగం రూపాంతరం చెందింది. దేశంలోని 5.9 కోట్ల వ్యాపార సంస్థలు సుమారు 12.7 కోట్ల మందికి ఉపాధిని అందిస్తున్నాయి. 2005 సంవత్సరానికి గానూ మరో 1.7 కోట్ల వ్యాపార సంస్థలు అదనంగా వృద్ధి చెందాయి.

ఇదిలా ఉంటే అసంఘటిత రంగంలో తక్కువ వృత్తి నైపుణ్యత, స్వల్ప వేతనాలు, ఉత్పాదకతలో హెచ్చుతగ్గులు,

తక్కువ పెట్టుబడులు లాంటి అంశాలు సహజంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ అధిగమించాలంటే విద్యతో పాటు ఉపాధి మెళకువలు, శిక్షణ కల్పిస్తే అసంఘటిత రంగంలోనూ వృత్తి నైపుణ్యతను పెంచి సంపద సృష్టి చేయవచ్చు. ఫలితంగా ఉత్పాదకత పెరిగి సరికొత్త ఉపాధి మార్గాలు ఆవిష్కరించబడతాయి.

ఉపాధి కల్పనలో నైపుణ్య శిక్షణ కీలకంగా మారుతోంది. విద్యతో పాటు వృత్తి నైపుణ్యం పెంచేలా శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సంబంధిత రంగాల పట్ల వృత్తి నైపుణ్యం ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక పోవడం వల్ల ఉపాధి కల్పనలో వెనుకబడుతున్నారు. అందుకు సరైన కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడం వల్ల మన నైపుణ్యాన్ని ఇతరులకు తెలియ జేయడానికి ఉపయోగపడుతుంది.

సరికొత్త వృత్తి విద్యను ప్రవేశ పెట్టడం ద్వారా కొత్త రంగాలు ఏర్పాటవుతాయి. ఫలితంగా ఉత్పాదకత పెరుగుతుంది. అలాగే ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. అసంఘటిత రంగంలో వృత్తి నైపుణ్యతను పెంచేందుకు మార్కెట్‌కు అనుగుణంగా డిమాండ్‌ను అనుసరించి కోర్సులను ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులు కూడా చదువుతో పాటు వృత్తి విద్యను కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. చదువు పూర్తయిన వెంటనే ఉపాధి లభించే అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చు. ఈ తరహా వృత్తి నైపుణ్యం పెంపొందించే సంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోనూ ఉన్నాయి.

అసంఘటిత రంగంలో ఉద్యోగుల నైపుణ్యాన్ని పెంచడం ద్వారా ఆర్థికవృద్ధి, సంపదను సృష్టించవచ్చు. ముఖ్యంగా మానవ వనరులు ఎంత పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ ఉత్పాదకత పెరగదు. మానవ వనరులతో పాటు నైపుణ్యతను పెంచడం ద్వారా మాత్రమే ఉత్పాదకతను పెంచవచ్చు. అలాగే ఉత్పాదకతను పెంచేందుకు ఉద్యోగులకు నైపుణ్యశిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఇది నైపుణ్యతతో కూడిన మానవవనరుల సంపద సృష్టిలోనూ దేశ ఆర్థిక వృద్ధి పురోగమనం లోనూ దోహదపడుతుంది.

ఇక ఉద్యోగ నైపుణ్యాలను పెంచేందుకు జాతీయ నైపుణ్య అభివృద్ధి ఏజెన్సీ ప్రస్తుతం నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి కల్పన, మానవవనరుల అభివృద్ధికి తోడ్పడుతోంది. ఉన్నత లక్ష్య సాధనతో దేశ వ్యాప్తంగా ప్రభావితం చేస్తోంది.

స్కిల్ ఇండియా మిషన్ ద్వారా దేశంలోని ప్రతిభావంతమైన మానవవనరుల వికాసానికి ముందడుగు పడుతోంది. దేశం నలుమూలల నుంచి ప్రతిభను గుర్తించి వారిలో నైపుణ్యతను పెంచడం ద్వారా మానవ వనరుల వికాసం జరుగుతోంది. 2020 నాటికి స్కిల్ ఇండియా ద్వారా సుమారు 50 కోట్ల మంది యువతకు శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా ఉంది.

ఇక నైపుణ్య శిక్షణ కోసం ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటించాల్సి ఉంది. మన దేశంలోని యువతకు మన దేశంలో మాత్రమే కాదు, ఇతర దేశాల్లో పనిచేసేందుకు సైతం సిద్ధంగా ఉండేలా నైపుణ్యత అందించాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వం దేశంలో నైపుణ్య శిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. దేశాభివృద్ధికి నైపుణ్య శిక్షణ కూడా అవసరం అని ప్రభుత్వం గుర్తించింది. సాంప్రదాయ ఉద్యోగాలతోపాటు అన్ని రకాల వృత్తులలో నైపుణ్యం అందించేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. గతంలో నైపుణ్య శిక్షణ ఆయా శాఖల్లో విడివిడిగా ఉండేది. కానీ ప్రభుత్వం నైపుణ్య శిక్షణను ఒక ఎజెండాగా తీసుకొని ఏకీకృతం చేసింది. తద్వారా వ్యవస్థ మరింత సమర్థవంతంగానూ పారదర్శకంగానూ మారే అవకాశం ఉంది. ■

## యోజన

నవంబర్ 2015 సంచిక **"రవాణా రంగం"** అనే అంశంతో వెలువడుతుంది.

యోజన (తెలుగు) పత్రిక చందా వివరాలు, చిరునామా మార్పు, పత్రిక అందకపోవడం వంటి విషయాలపై ఫోన్ నెంబర్ 040–23310162 పై నేరుగా సంప్రదించవచ్చు. యోజన పత్రిక చందాకు సంబంధించిన వివరాల కోసం yojana_subscribe@yahoo.in కి మెయిల్ చేయగలరు.

**– *సీనియర్ ఎడిటర్***

# గిరిజనుల నైపుణ్యాభివృద్ధి - ప్రస్తుత స్థితి -భవిష్యత్ వ్యూహాలు



**మానవాభివృద్ధి నివేదికలో షెడ్యూల్డ్ జాతుల వారు అత్యంత హీన స్థితిలో ఉన్నట్లు తెలుస్తున్నది. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ జాతుల అక్షరాస్యత కేవలం 59శాతం మాత్రమే! దీనిలో పురుషుల అక్షరాస్యత 68.5 శాతం, మహిళా అక్షరాస్యత 49.4 శాతం.**

భారత ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా అనేక కార్యక్రమాల ద్వారా నైపుణ్యాల వృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చింది. అయితే ఈ పథకాలన్నీ, ప్రత్యేకంగా గిరిజనుల జీవన నైపుణ్యాలను మెరుగు పరచడంలో విఫలమైనాయని ఒక సర్వే తెలియ చేస్తున్నది. అందుచేత, వారి అవసరాలకనుగుణంగా ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి పథకాలను ఈ సర్వే సిఫారసు చేస్తున్నది. అవి ఎలా వుండాలంటే:

- వ్యవసాయం, పండ్లు-పూలతోటల పెంపకం, పాడి, చేపల పెంపకం మరియు ఇతర వ్యవసాయేతర కార్యక్రమాల ద్వారా ప్రస్తుతమున్న జీవన స్థితిగతులను మెరుగు పరచడం,
- ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంగా ఆ రంగాలకోసం నైపుణ్యాలను మరింత మెరుగు పరచడం, మరియు
- స్వయంఉపాధి పథకాలను, మరింత మందికి ఉపాధి కల్పించే లాగున వ్యక్తులను, సంఘాలను ప్రోత్స హించడం.

మానవాభివృద్ధి నివేదికలో షెడ్యూల్డ్ జాతుల వారు అత్యంత హీన స్థితిలో ఉన్నట్లు తెలుస్తున్నది. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ జాతుల అక్షరాస్యత కేవలం 59శాతం మాత్రమే! దీనిలో పురుషుల అక్షరాస్యత 68.5 శాతం, మహిళా అక్షరాస్యత 49.4 శాతం.

పాఠశాల స్థాయిలోనే బడి మానేస్తున్న పిల్లలు ఈ వర్గంలో ఎక్కువ. అంతేకాదు, గిరిజనులలో విద్యావంతులు అతి కొద్దిమందే! దీనితో గిరిజనులలో పనిచేసే వయసులో ఉన్న వారికి నైపుణ్యాలు లేకపోవడం వల్ల మరే ఇతర జీవనాధార వృత్తులను గానీ చేపట్టడం దాదాపు అసాధ్యమై, సంప్రదాయ వృత్తులలోనే స్థిరపడుతున్నారు. ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు నైపుణ్యం గల శ్రామికులకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ, గిరిజనులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోలేక వెనుకబడి పోతున్నారు. దేశ భౌగోళిక వనరుల ద్వారా దేశం ప్రయోజనాలను సాధించుకోవాలి కానీ,

**రాజేంద్ర సింగ్ గౌతమ్, నవీన్.టి., శశాంక్ సింగ్,** ఇన్స్టిట్యూట్ ఆఫ్ లైవ్లీహుడ్ రీసెర్చ్ & ట్రైనింగ్, హైదరాబాద్

గిరిజనులకు మాత్రం ఈ అవకాశం దొరకడం లేదు.

నేడు దేశంలో షెడ్యూల్డ్ జాతులవారు నిజం చెప్పాలంటే, ఎటూ నిర్ణయించుకోలేని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నారు. నీరు, అడవి, భూమి అనే మూడు సహజ వనరులపై సంప్రదాయపరంగా గిరిజనులు ఆధారపడి ఉండేవారు. అయితే ఈ వనరులు నేడు వేగంగా అడుగంటి పోతున్నాయిగదా! దీనితో వారి సహజ సిద్ధ జీవన వనరులు మృగ్యమైపోతున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తామూ మారాలా లేక నశించిపోవాలా అన్న సంకట స్థితిలో పడిపోయారు. మారుతున్న పరిస్థితుల ప్రకారం తామూ మారడమంటే, వారి జీవన విధానంలోకి వొత్తిడులను కొని తెచ్చుకోవడమే కదా! తప్పుడు అభివృద్ధి విధానాలతోనూ, సహజ వనరులను వాణిజ్య లక్ష్యాలతో అధికంగా వినియోగించడము వల్ల, వారి వనరుల సంపద, సామాజిక ఆర్థిక జీవన విధానము అత్యంత సంక్షోభంలో పడిపోతున్నాయి.

ఆర్థిక, సామాజిక మరియు సంస్కృతిక శక్తులు గిరిజన జీవితాన్ని తలక్రిందులు చేస్తుంటే, దీనికి పరిపూరకంగా, గిరిజన యువతకు సవాళ్ళనెదుర్కొనే విధంగా జీవితాలను మలచుకునే అవకాశాలు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. అవకాశాలు పెరుగుతుంటే, గిరిజన యువకుల ఆశలు కూడా మరింత విస్తృతమవుతున్నాయి. అయితే, తగిన శిక్షణా నైపుణ్యాలు తమకు లేకపోవడంతో వీరు అనేక సవాళ్లను ఎదుర్కోవలసివస్తున్నది. దీనితో వీరు మరింత వెనుకబడిపోతున్నారు. వీరి నిరుద్యోగితకు వృత్తి విద్య కొంతవరకూ సమాధానం కాగలదు.

పదకొండవ, పన్నెండవ పంచ వర్ష ప్రణాళికలలో నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేశారు. 'జాతీయ నైపుణ్యాభివృద్ధి విధానం, 2009 తో ప్రారంభించి, ఇటీవల కేంద్రం ప్రకటించిన "జాతీయ నైపుణ్యాభివృద్ధి–పరిశ్రమల ప్రోత్సాహ విధానం" వరకూ నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం లభిస్తూనే ఉన్నది. ఈ ప్రోత్సాహక చర్యల ద్వారా, 2022 నాటికి 500 మిలియన్ల మంది యువకులకు నైపుణ్యాలను గరపాలని లక్ష్యం. దీనికి అనుకూలమైన వాతావరణాన్నీ, ఉపాధి అవకాశాలనూ వాటిని అందిపుచ్చుకునేందుకు తగిన సహాయాన్ని అందించేందుకు National Skill Development Corporation (NSDC)మరియు National Skill Development Authority (NSDA) లను ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం అమలవుతున్న ఉపాధి అవకాశాలన్నింటినీ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో ముడిపెట్టారు. శిక్షణానంతర ధృవీకరణకు Skill Development Councils (SDC) ను ఏర్పాటుచేసి, వాటిని సమీప పెద్ద పరిశ్రమలకు అనుసంధానం చేశారు. నైపుణ్యాభి వృద్ధి ప్రోత్సాహక పథకాలను ఉపాధి అవకాశాలకు ముడిపెట్టి, ప్రాంతాల వారీగా ఈశాన్య భారతం, జమ్ము–కాశ్మీర్ మరియు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు ముందు ప్రాధాన్యమిస్తూ, ప్రారంభించారు. వీటిని ప్రైవేటు భాగస్వామ్యంలో మరింతగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి విభాగానికీ తమ శిక్షణా/ నైపుణ్యాభివృద్ధి అంగాలను ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు.

ఈ గిరిజన నైపుణ్య సర్వేక్షణను చత్తీస్‌గఢ్‌రాష్ట్రంలో మూడు దశలలో చేశారు. ఆరు జిల్లాలలోని 12 బ్లాకులు–24 గ్రామ పంచాయతీలలో 13–30 సంవత్సరాల వయసు మధ్యనున్న 480 మందినుండి అభిప్రాయాలను సేకరించారు. ఈ అధ్యయనంలోని ముఖ్యాంశాలు:

**తక్కువ అక్షరాస్యత:** ఈ 480 మందిలో 27.6 శాతం, అంటే దాదాపు నాలుగ వంతుమంది ప్రాథమిక స్థాయిని దాటి చదువుకోలేదు. మొత్తంలో మూడింట రెండువంతులమంది కుటుంబ సమస్యలవలన మధ్యలో చదువు మానేసినవారే!

**నైపుణ్య లేమితో ఉపాధి అవకాశాల కొరత :** సాధారణంగా గిరిజన యువత నైపుణ్యంలేని సంప్రదాయ వృత్తులనే ఎంచుకుంటారు. మూడు వంతులమంది వ్యవసాయదారులు, లేదా కూలీలు. దాదాపు 59 శాతం మంది నైపుణ్యంలేని కూలీలు. అంటే, తగిన భద్రత లేని, సరైన వేతనాలు లేని ఉపాధిలో ఉన్నట్లే కదా! దాదాపు సగం మంది రోజు కూలీలు.

**శిక్షణా–నైపుణ్యాలకు తక్కువ అందుబాటు:** వీరికి నైపుణ్య శిక్షణ అందుబాటు ఉండదు. కేవలం 11 శాతం మందికి మాత్రమే ఒక మాదిరి శిక్షణ ఉన్నది. అందునా సగం మంది అనియత రంగంలో ఉన్నారు.

**అవకాశాలను మించిన ఆశలు:** నేటికీ గిరిజన యువత పరిస్థితి దయనీయంగానే ఉన్నది. అయినప్పటికీ, వారి ఆశలు ఉన్నతంగానే ఉన్నాయి. సగం మందికి పైగా ఉన్నత చదువులపై ఆశ పెట్టుకున్నారు. పదకొండు శాతం మంది వృత్తి విద్యను కోరుకుంటున్నారు. వీరిలో సగం మంది ప్రభుత్వ ఉద్యోగాలను ఆశిస్తే, 25 శాతం మంది స్వయం ఉపాధిని కోరుకున్నారు.

**సేవ రంగ నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యం:** నైపుణ్య శిక్షణా విషయానికి వస్తే, 17 శాతం మంది కంప్యూటర్ శిక్షణకు ప్రాధాన్యమిచ్చారు. 16 శాతం మంది వస్త్ర పరిశ్రమ,

డ్రైవింగ్ మరియు భవన నిర్మాణం వంటి అంశాలలో శిక్షణకు ప్రాధాన్యమిచ్చారు. ఆరోగ్యం, విద్యుత్, యాంత్రిక అంశాలలో నాలుగు శాతం మంది చొప్పున ప్రాధాన్య మిచ్చారు. మొత్తం మీద 24 శాతం మంది వ్యవసాయ సంబంధిత రంగాలకు ప్రాధాన్యమిచ్చారు.

**రాయితీతో కూడిన స్థానిక నైపుణ్య శిక్షణ కు ప్రాధాన్యం:** సర్వే చేయబడిన వారిలో దాదాపు సగం మంది తమ స్వంత గ్రామంలోనే శిక్షణకు ప్రాధాన్యమిచ్చారు. 44 శాతం మంది ఎటువంటి ఫీజులు లేని ఉచిత శిక్షణను కోరారు.

**ముగింపు సిఫారసులు:** గిరిజన యువకులు నిదానంగా విద్యావంతులు అవుతున్నారు. ఎక్కువమంది కొంచం కష్టమైనా, నైపుణ్యం గల వృత్తులలో స్థిరపడటానికే ప్రాధాన్య మిస్తున్నారు. కనుక నైపుణ్య శిక్షణకు ఈ సర్వే క్రింది సిఫారసులను చేసింది:

- యువజనుల జీవనాధార ఆకాంక్షలను గుర్తించాలి,
- గిరిజన యువతను పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలి.
- పరిశ్రమలకు ఎంతమంది నైపుణ్యంగల కార్మికులు కావాలో గుర్తించాలి.
- గిరిజన యువత నైపుణ్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమాలు పథకాలను సరిగా అమలు చేయాలి. మొత్తమ్మీద నాలుగు రంగాలలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నట్లు అధ్యయనం గుర్తించింది.

**వ్యవసాయ సంబంధిత:** గిరిజన ప్రాంతాలలో అత్యధిక ఉపాధిని కల్పించేది వ్యవసాయమే! వ్యవసాయ రంగం అంటే కేవలం సాగుబడే కాదు, ఫల-పుష్ప పంటలు, రసాయనాలు వినియోగించని సాగు, పశుపాలన, పునరుత్పాదక ఇంధన వనరులు, Waste management; మరియు పర్యావరణహిత పర్యాటక రంగం మొదలైనవి.

**రెండవ ప్రాధాన్య రంగం:** వ్యవసాయ ఉపకరణాల తయారీ, ఫర్నీచర్ తయారీ, చేనేత, చెక్క, లోహ కళాకృతులూ, నిర్మాణ రంగం, రవాణా సంబంధ రంగాలు మొదలైనవి.

**సేవ రంగం:** గిరిజన ప్రాంతాలలో కూడా సేవ రంగం వేగంగా విస్తృతమవుతున్నది. ఈ సేవల రంగాన్ని ఒక ప్రాంతంనుండి పొందే సేవల రంగం మరియు, ఎక్కడినుండైనా పొందే సేవల రంగం అంటూ రెండు భాగాలు చేయవచ్చు. మరమ్మత్తులు, హోటళ్లు, చిల్లర వర్తకం, రవాణా, ఆరోగ్య రంగం వంటివాటిని ఒక ప్రాంతం నుండి అందించే సేవలుగానూ, సమాచార-సాంకేతిక సేవలు, టెలికాం, ఆర్థిక, దూర విద్యా వంటి సేవలను ఎక్కడినుండైనా పొందే సేవలుగా పరిగణించవచ్చు. ఈ రెండు రకాల సేవలనూ గిరిజన ప్రాంతాలలో మరింత విస్తరించడం ఎంతో అవసరం.

యువతలో నైపుణ్యాలను పెంపొందించాలంటే, బహుముఖ వ్యూహము కావాలి. గిరిజన ప్రాంతాలలో నైపుణ్యాభివృద్ధికి కింద పేర్కొన్న వ్యూహాలు వుపయోగపడతాయి:

- గిరిజనులలో వృత్తివిద్యలు, లేబర్ మార్కెట్లను గురించిన అవగాహనను పెంచడం,
- రాయితీ ఆధార/ఆదాయ ఆధార నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన,
- ప్రభుత్వ, పారిశ్రామిక శిక్షణా సంస్థల సహకారము, ఇతర వృత్తి విద్యా శిక్షకుల సహకారంతో తగిన శిక్షణా కార్యక్రమాల అమలు, ముఖ్యంగా గిరిజనుల జీవన విధానాన్ని మార్చుకునే విధంగా శిక్షణ,
- మారుమూల ప్రాంతాలకు సైతం ఇట్టి వృత్తివిద్య శిక్షణా కేంద్రాలను విస్తరించడమ్,
- ప్రస్తుతం నడుస్తున్న కోర్సులలో వ్యవసాయానికీ, పర్యావరణ హితంగా సేవల రంగానికి కూడా ఉపయోగపడేటట్లు తగిన మార్పులు చేసి, లేబర్ మార్కెట్లకు అనుసంధానించడం,
- విద్యావంతులైన గిరిజనులనుండే, నిపుణులైన వృత్తివిద్య శిక్షకులను ఎంపిక చేసి వారిచే తగిన శిక్షణనిప్పించడం,
- నిరంతర సంప్రదింపులతో పరిశ్రమల సహకారాన్ని మరింతగా పెంచి ఈ శిక్షణా కార్యక్రమాలను ఉపయోగ కరంగా మార్చడం,
- వీలైనంతవరకూ శిక్షణ పొందిన ప్రతివారికీ తగిన వుపాధి కల్పించేలాగున కార్యక్రమ రూపకల్పన మొదలైనవి.

గిరిజనులకు నైపుణ్య శిక్షణ అంటే, వారికి జీవితంలో అన్నీ విషయాలగురించిన సమగ్ర అవగాహనతో విజయవంతమైన ఉపాధి పొందేలాగున శిక్షణ అవసరము. దీనికోసం, విద్యావేత్తలు, పారిశ్రామిక యాజమాన్యం, సామాజిక శాస్త్రవేత్తలు అందరూ కలిసి తగిన ప్రణాళిక రూపొందించాలి. ■

# నైపుణ్యాభివృద్ధి - వృత్తివిద్య



**ఇతర దేశాలతో పోలిస్తే, మనదేశంలో నైపుణ్యం కలిగిన శ్రమ శక్తి కేవలం 10 శాతం మాత్రమే ఉంటే, అదే కొరియాలో 93శాతం. ప్రభుత్వం 2022 నాటికి 150 మిలియన్లకు పైగా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించాలని సంకల్పించింది.**

నేడు మనదేశం ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీనికి తోడు పని చేయగలిగిన వయస్సులోనున్న జనాభా మనకొక వరం. అయితే, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందాలంటే మాత్రం, మన యువతకు నైపుణ్య శిక్షణ ఎంతో అవసరము. ఇతర దేశాలతో పోలిస్తే, మనదేశంలో నైపుణ్యం కలిగిన శ్రమ శక్తి కేవలం 10 శాతం మాత్రమే ఉంటే, అదే కొరియాలో 93శాతం! ఈ విషయాన్ని గ్రహించే, కేంద్ర ప్రభుత్వం, ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖతో సహా, నైపుణ్యాభివృద్ధికి ఒక ప్రత్యేక విభాగాన్ని (National Skill Development Corporation, NSDC)నెలకొల్పింది. మన ప్రధాన మంత్రి ప్రారంభించిన భారత్‌లో తయారీ ఉద్యమం ఈ NSDC కి మరింత ఊపునిచ్చింది. ప్రభుత్వం 2022 నాటికి 150 మిలియన్లకు పైగా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించాలని సంకల్పించింది. అయితే పారిశ్రామిక రంగం, విద్యా రంగం, ప్రభుత్వం కలిసికట్టుగా శ్రమిస్తేనే ఈ లక్ష్యం సాధించగలిగేది. ఈ వుద్దేశ్యంతోనే ప్రభుత్వం వివిధ రంగాలలో, వివిధ ప్రత్యేక అంశాలలో ఎక్కడ తగిన నైపుణ్యం కొరవడింది అని గుర్తించడానికి కొన్ని ప్రత్యేక నిపుణులతోకూడిన సంఘాలను ఏర్పరచింది. దీనిలో భాగంగా, మహారాష్ట్ర ప్రభుత్వం 11 మంది సభ్యులతో ఈ వ్యాస రచయిత్రి డా. స్వాతి మజుందార్ అధ్యక్షతన ఒక సంఘాన్ని ఏర్పరచింది.

ఆమె గమనించిన కొన్ని ముఖ్యాంశాలు ఏమంటే:

1. ఎక్కువ శాతం వృత్తి విద్యా కోర్సులు స్వల్ప కాలీనమైనవి, ఒక వృత్తికి సంబంధించి ఒక డిప్లొమా కోర్సు తరువాత మరింత సమగ్రమైన డిగ్రీ కోర్సుకు అవకాశమే ఉండటంలేదు. దానితో తమ పిల్లలకు ఒక వృత్తిలో పుట్టుకతోనే కొంత నైపుణ్యం ఉన్నదని

**డా. స్వాతిముజుందార్,** ఉపాధ్యక్షురాలు, సింబియోసిస్ ఫౌండేషన్, న్యూఢిల్లీ

నమ్మిన తల్లితండ్రులకు ఆయా కోర్సులకు మార్కెట్లో తగిన గిరాకీ ఉన్నప్పటికీ, తగిన శాస్త్రీయమైన శిక్షణఅందుబాటులో లేదు.


2. మిగతా కోర్సులతో పోల్చినపుడు వృత్తివిద్యలకు సమాజంలో తగిన గౌరవం లభించడమే లేదు. ఇతర గౌరవప్రదమైన కోర్సులలో అవకాశం లభించనపుడు మాత్రమే యువత ఈ కోర్సులకు మళ్ళుతున్నారు.

3. శిక్షకుల కొరత. కొన్ని కొన్ని కోర్సులలోనైతే, సమర్ధ శిక్షకులకు సైతం కొరత ఉన్నది. దానితో 'యధా గురు, తధా శిష్య' పరిస్థితి ఉత్పన్నమవు తున్నది. దానితో ఉపాధి అవకాశాలు కూడా వారికి సన్నగిల్లుతున్నాయి.

4. పరిశ్రమలనుండి తగిన ప్రోత్సాహం లేకపోవడం. చాలామటుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సిబ్బందికి అధీకృత అర్హతా ధృవపత్రం ఉన్నదో లేదో పట్టించుకోవడం లేదు. దీనివల్ల తక్కువ చెల్లించే వెసులుబాటు కోసం తగిన అర్హతలు లేని వారిని కూడా నియమించు కుంటున్నారు.

5. కొరవడిన ప్రామాణికీకరణ. ఒకే రకమైన అంశాలపై ఒకటి కన్నా ఎక్కువ మంత్రిత్వ శాఖలు శిక్షణ సౌకర్యాలను అందించడంతో, తగిన ప్రమాణాలు కొరవడుతున్నాయి.

మొత్తమ్మీద ఈ రంగం రోజువారీ ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సరైన ధృక్పధంతో పరిశీలించకుండా, ప్రభుత్వం చర్యలను ప్రకటిస్తున్నది. అంతేకాదు, ఈ రంగంలోని అన్నీ విషయాలనూ




ప్రతిబింబించే ఒక సమగ్ర నమూనా కూడా లేదు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ వ్యాస రచయిత్రి క్రింది సిఫారసులను చేస్తున్నది:

1. డిప్లొమా తరువాత, డిగ్రీ, మరియు ప్రత్యేక పరిశోధనలకు తగిన అవకాశాలను కల్పించాలి. అంతేకాదు, నైపుణ్యాభివృద్ధికోసం ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని కూడా ప్రారంభించాలి.

2. కనీసం పదవ తరగతి, లేదా ఇంటర్మీడియట్ కోర్స్ తరువాత వృత్తివిద్యలలో డిప్లొమా చేసేవారికి సాధారణ స్రవంతిలో డిగ్రీ చదవడానికి అనుమతించాలి.

3. అన్నిరకాల వృత్తివిద్యా శిక్షణలలో పరిశ్రమల పాత్ర మరింత పెరగాలి. ఆధునిక యంత్ర పరికరాలూ, నిర్వహణ, నిపుణులైన శిక్షకులను అందుబాటులో ఉంచాలి. నిర్ణీత కాల వ్యవధితో శిక్షణలను పునర్విమర్శ చేస్తుండాలి.

4. పరిశ్రమలు సిబ్బందిని నియమించు కునే సమయంలో గుర్తింపు ఉన్న శిక్షణ పొందిన వారికే ప్రాధాన్యతనివ్వాలి.

5. ఒక ప్రామాణికమైన పరీక్షావిధానాన్ని రూపొందించి, వివిధ సంస్థల చేత శిక్షణ పూర్తి అయినవారిని పరీక్షించాలి.

6. శిక్షకులకు సైతం నిర్ణీత కాలవ్యవధితో వారి వారి అంశాలలో వస్తున్న ఆధునిక మార్పుల అవగతం కోసం తగిన స్వల్ప కాలిక శిక్షణను ఇస్తూఉండాలి.

ఈ విధమైన చర్యలను తీసుకుంటే, తల్లితండ్రులు తమ పిల్లలను వృత్తులలో ఎటువంటి సంకోచం లేకుండా ప్రోత్సహిస్తారు. పరిశ్రమలకు కూడా తగిన శిక్షణ పొందిన రెడీమేడ్ సిబ్బంది దొరుకుతారు. ఈ మార్గంలో NSDC ఇప్పటికే అనేక చర్యలను ప్రకటించింది. ఈ సంస్థ యొక్క రాష్ట్ర స్థాయి విభాగాలన్నీ కూడా అనేక చర్యలను ఇప్పటికే ప్రారంభించాయి.

# సమ్మిళిత వృద్ధికి నైపుణ్యం : రానున్న నవకల్పన మరియు మిశ్రమ శిక్షణల దశాబ్దం



**దేశంలో ప్రతి పది మంది స్నాతకుల్లో ఒకరు పెద్ద మొత్తంలో ప్రైవేటు కళాశాలల్లో ధనం వ్యయం చేసి ఉపాధి అందించలేని యూనివర్సిటీ డిగ్రీలు పొందుతున్నారు. ఇది ప్రస్తుత భారత విద్యా మరియు శిక్షణ వ్యవస్థలోని ద్వంద్వతను స్పష్టం చేస్తోంది. మన దగ్గర ఉద్యోగాలు, పని చేయగలిగే యువత ఉన్నప్పటికీ నైపుణ్య శిక్షణ స్వల్పం.**

సంజీతా నాయక్(19) దక్షిణ ఒడిషాలోని రాయగడ జిల్లాలో ఓ గిరిజన గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఏడుగురు సభ్యులన్న వీరి కుటుంబానికి వ్యవసాయ కూలిగా ఉన్న తండ్రి సంపాదన ఒక్కటే భుక్తి మార్గం. వీరి పేదరికం కారణంగా పిల్లలు ఎప్పుడో చదువుకు స్వస్తి చెప్పారు. సంజీతా చేసుకున్న ప్రేమవివాహం ఫలవంతమవ్వలేదు. భర్త వేధింపులతో ఆమె ఆరునెలలకే అతన్ని వదిలివేయడంతో మానసిక వ్యథకు లోనయ్యింది. చివరకు మావోయిస్టుల్లో చేరడానికి సంకల్పించింది. అయితే ఆమె అందరిలాగా కాకుండా ఆర్థిక-సామాజిక అడ్డంకులను ఛేదించడానికి నిర్ణయించుకుంది. అదృష్టంకొద్దీ ఆమె ఉపాధిని కల్పించే శిక్షణను ఇచ్చే కౌన్సిలర్‌ను కలుసుకుంది. తన పేరును ఉచిత శిక్షణకోసం నమోదు చేసుకుంది. భారత ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఉచిత కుట్టు శిక్షణను ఎన్నుకుని తన జీవితానికి కొత్త బాట వేసుకుంది. వివిధ పరీక్షల అనంతరం శిక్షణకు ఎంపికైంది. అక్కడ సంజీతాకు మూడు పూటల ఉచితంగా భోజనం దొరకడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తోంది. 45 రోజుల శిక్షణ అనంతరం కుట్టు యంత్రాలు నియంత్రించడం నేర్చుకుంది. ఉచిత భోజనం, వసతితో పాటు నెలకు రూ. 8వేల జీతానికి తమిళనాడు తిర్పూరులో ఉన్న ఒక సంస్థ ఆమెకు ఉద్యోగాన్ని ఇచ్చింది. సంజీతా ఇప్పుడు తన కుటుంబాన్ని ఆదుకునే స్థాయికి చేరింది.

ఇది ఒక కల్పిత పాత్రకాదు. ఇది స్కిల్ ఇండియా ప్రసాదించిన వరం. సంజితా ఒడిషాలోని రాయగడలో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ స్కిల్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంది. ఆమె కథ ఈ కార్యక్రమంలో ముందుకు వచ్చే శిక్షణార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. దేశంలో నడుస్తున్న నైపుణ్య శిక్షణకు ఎటువంటి అడ్డంకులు లేవని ఈ కథనం చెబుతోంది. అయితే ఇది మార్కెట్ చోధితంగా మరియు సమ్మిళత స్థాయిలో ఉండాలి.

**వృద్ధి ఆవశ్యమైన సమ్మిళిత నైపుణ్య కార్యక్రమాలు**

ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం భారత్ ప్రపంచ యువ జనాభాకు ఇల్లు

**పూజా జ్ఞాన్‌చందాని,** గ్రూప్ హెడ్, పాలసీ & కమ్యూనికేషన్ గ్రూప్ (పిసి) & కార్పొరేట్ ఎంగేజ్‌మెంట్, ఐ.ఎల్.& ఎఫ్.ఎస్.
e-mail : poojagianchandani@gmail.com



ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లోనైపుణ్య శిక్షణ పొందుతున్న 4 లక్ష 50వేల శిక్షణార్థుల్లో సంజిత ఒకరు.

వంటిది. దేశంలో 883 మిలియన్ల మంది అంటే 66శాతం మంది 35 ఏళ్లలోపు ప్రాయంలో ఉన్నారు. ఇదే చైనాలో 44 శాతం మంది మాత్రమే యువకులు. అయితే భారత్‌లో 2014 గణాంకాల ప్రకారం 12.9శాతం మంది నిరుద్యోగులున్నారు. 179.6 మిలియన్ మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. ప్రపంచ జనాభాలో 17.5శాతం మంది ప్రజలు భారత్‌లో ఉండగా, ప్రపంచ పేదల్లో 20.6శాతం ఇక్కడే ఉన్నారు. ఒడిషా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ మరియు ఉత్తర ప్రదేశ్‌లో 25 శాతం కన్నా ఎక్కుమంది దారిద్యరేఖ దిగువన ఉన్నారు. ఇది కఠోర వాస్తవం, మన వద్ద ఉత్పత్తిదాయక యువత ఉన్నప్పటికి నిరుద్యోగం మన సామాజిక , ఆర్థిక స్థితిని ప్రభావితం చేస్తోంది. ఇందులో అధిక శాతం మంది ఎటువంటి విద్య, వృత్తి విద్య లేకుండా (నాట్ ఇన్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ ఆర్ ట్రయినింగ్ – (NEET) ఉన్నారు. వీరికి సాధారణ చదువు మినహా ఎటువంటి వృత్తి శిక్షణను అందించే సంస్థలు అందుబాటులో లేవు. ఇదిలా ఉండగా దేశంలో ప్రతి పది మంది స్నాతకుల్లో ఒకరు పెద్ద మొత్తంలో ప్రైవేటు కళాశాలల్లో ధనం వ్యయం చేసి ఉపాధి అందించలేని యూనివర్సిటీ డిగ్రీలు పొందుతున్నారు. ఇది ప్రస్తుత భారత విద్యా మరియు శిక్షణ వ్యవస్థలోని ద్వంద్వతను స్పష్టం చేస్తోంది. మన దగ్గర ఉద్యోగాలు, పని చేయగలిగే యువత ఉన్నప్పటికీ నైపుణ్య శిక్షణ స్వల్పం. మరోవైపు అర్హతలున్న వారు ఉన్నప్పటికీ పని లేదు. వివిధ నేపథ్యాల్లో అభివృద్ధిలో భాగం పంచుకునే యువతను సమ్మిళిత వృద్ధిలో చేర్చడానికి నైపుణ్యవృద్ధి అత్యవసరం. మేక్ ఇన్ ఇండియా ఒరవడిలో కేవలం మూడు శాతం ఉన్న సంఘటిత రంగం పెద్ద సంఖ్యలో కార్మిక మార్కెట్‌లో చేరుతున్నవారందరికి అవకాశం కల్పించలేకపోవచ్చు. అయితే డిజిటల్ ఇండియా, స్వచ్ఛభారత్, నమామి గంగే లాంటి అభివృద్ధి కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో నైపుణ్య కార్మికులు అవసరం కావచ్చు. పెద్ద సంఖ్యలో వృత్తికార్మికులకు ఉస్తాద్, లెర్న్ అండ్ ఎర్న్ లాంటి కార్యక్రమాలతో అసంఘటిత రంగంలో ఉన్న సంప్రదాయ వృతుల్తకు గుర్తింపు కల్పించడం నైపుణ్య శిక్షణలో మొదటిసారిగా జరుగుతోంది. అయితే యువతకు ఉద్యోగాలు, స్వయం ఉపాధి కోసం నైపుణ్య విద్యను అందించే కార్యక్రమాల అవశ్యకత చాలా ఉంది.

**పెరుగుతున్న నైపుణ్య వృద్ధి వాతావరణం**

నైపుణ్య విద్య వాతావరణాన్ని పెంపొందించడానికి భారత ప్రభుత్వం ఐఎల్ఒ, ప్రపంచ బ్యాంక్, ఒఇసిడి, ఈయూలతో పాటు పలు ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్య మైంది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఇరవైకి పైగా విభాగాల్లో వివిధ నైపుణాభివృద్ధి కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇవి మారుమూల ప్రాంతాల్లో కూడా నైపుణ్యాభివృద్ధి వాతావరణం పెంపొందించడానికి పెట్టుబడులు పెట్టడంతో పాటు, ఉపాధికి బాటు వేస్తున్నాయి. భారత ప్రభుత్వ అతిపెద్ద కార్యక్రమమైన డిడియూ– గ్రామీణ కౌశల్య యోజన (జికెవై) గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ మరియు జౌళిశాఖ నేతృత్వంలోని సమగ్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం (ఐఎస్‌డిఎస్) వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలు, మైనారిటీలకు అందుబాటులో ఉంది. అలాగే కార్యక్రమం మహిళలు, ప్రత్యేక ప్రతిభావంతులు (పిడబ్ల్యూ)పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. వీటికి తోడు ప్రైవేటు రంగం కూడా తన వంతు కృషి చేస్తోంది. ఎంఎస్‌డిఇలో ఉన్న జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్‌డిసి) పరిశ్రమల్లో యువతకు శిక్షణ అందించడానికి విశేషకృషి చేస్తోంది. ఇది సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ ఏర్పాటు ద్వారా భారత యువతను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి కృతనిశ్చయంతో ఉంది.

నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఎస్‌క్యూఎఫ్) ద్వారా ప్రమాణిత నేషనల్ అక్యూపేషనల్ స్టాండర్డ్స్( ఎన్ఓఎస్)లో 35కు పైగా కార్పొరేట్ సంస్థల్లో సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఇది యువతకు పని ప్రపంచంలో పాస్‌పోర్టులాంటిది. ఈ సంస్థలు స్కిల్ ఇండియా సాధనకు అన్ని రంగాల్లో వారికి శిక్షణ ఇవ్వడానికి యంత్రాంగాన్ని తయారు చేశాయి. నైపుణ్య వాతావరణం గత ఐదేళ్లలో హెచ్చుస్థాయిలో ఉత్తేజితంగా ఉంది. అయితే పెద్దస్థాయి మరియు సమస్యలు లాంటి వివిధ జోక్యాలు ఉన్నప్పటికీ శిక్షణార్థుల మనస్సులను ఉద్యోగంవైపు మరల్చగలగాలి.

**మార్కెట్ చోదిత నైపుణ్య కార్యక్రమాలు**

పరిశ్రమలో పోటీలను కల్పించడమే నైపుణ్య కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. శిక్షణలో నాణ్యతను పెంపొందించడం ప్రధాన అవశ్యకత. ఇది శిక్షణార్థులు మేధస్సు వృద్ధిని దృష్టిలో ఉంచుకుని వివిధ సాంకేతిక మరియు లబ్ధిదారుల భాగస్వామంతో చేపట్టే కార్యక్రమంతో సాధ్యమవుతోంది. ఉద్యోగమే ప్రధానాంశం అయితే పరిపూర్ణమైన సాధన శిక్షణార్థులను పరిశ్రమతో పాటు ఎదిగే అవకాశం కల్పిస్తుంది. దీనికై వివిధ కార్యక్రమాలు దేశవాప్తంగా నడుస్తున్నాయి. వీటికి అంటే ప్రమాణీకత, కొలత, ఆచరణీయత నైపుణ్యాభివృద్ధికి ప్రధాన చోదితాలు.


**1) పరిశ్రమ భాగస్వామ్యం** : ఉద్యోగాలు మరియు కార్మికుల మధ్య నైపుణ్యత ఒక వారధిగా ఉంటుంది. వేగంగా వృద్ధి చెందుతున్న పరిశ్రమలైనటువంటి ఔళి, ఇంజినీరింగ్, నిర్మాణ, సేవా పరిశ్రమల్లో 2013-2022 మధ్య మానవ వనరుల అవశ్యకత 120.8 మిలియన్లు ఉంటుందని అంచనా! విద్యకు మరియు విద్యలో పెట్టుబడులకు ఉద్యోగాలే ప్రభుత్వానికీ, శిక్షణార్థులకూ చోదకాలు. ఎస్ఎస్‌సి ద్వారా స్థాపించబడిన ఎన్ఓఎస్‌ను అధికృత శిక్షణ భాగస్వాముల్లో అమలు చేయడానికి యాజమాన్యాలు ముందుకు రావాలి. వీరు ఎస్ఎస్‌సి సర్టిఫికేట్ ఉన్నవారికే ఉద్యోగాలు ఇవ్వాలి.

**2) మౌలిక సదుపాయాలు** - చిన్న మధ్యస్థాయి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లేమి నైపుణ్య కార్యక్రమాల అమలుకు పెద్ద అవరోధంగా మారింది. ప్రస్తుతం 14వేల వరకూ ప్రభుత్వ మరియు ప్రైవేటు ఐటిఐలు మరియు 200 పైచీలుకు ఎస్‌డిసి భాగస్వామ్యంతో నడిచే శిక్షణ సంస్థలతో పాటు వివిధ మంత్రిత్వశాఖలు, స్వచ్ఛంద సంస్థలు నడిపే వృత్తి విద్యా శిక్షణా సంస్థలు దేశంలో నడుస్తున్నాయి. వేలాది ప్రైవేటు శిక్షణ సంస్థలు కూడా సముచిత కోర్సు యువతకు అందిస్తున్నాయి. కొన్ని సంస్థలు 'లెర్నింగ్ బై డూయింగ్' సిద్ధాంతంతో శిక్షణనిస్తూ మంచి ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత సాంకేతిక అభివృద్ధి మరియు మారుతున్న పరిశ్రమల క్రమంలో శిక్షణ సంస్థలను పరిశ్రమలున్న ప్రాంతాల్లో (పరిశ్రమల క్లస్టర్స్, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, స్మార్ట్ సిటీస్ ) స్థాపించాల్సిన అవశ్యకత ఉంది.అలాగే పని సంస్థలోనే శిక్షణసంస్థలు (ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, యూనివర్సిటీలు) ఏర్పాటు చేయాల్సి ఉంది.

**3) సాంకేతికత- శిక్షణ** : ఉన్న శిక్షకుల కొరత నాణ్యతకు అవరోధంగా మారింది. 2020 నాటికి 300 మిలియన్ల ప్రజలకు సేవలందించడానికి వివిధ రంగాల్లో నైపుణ్యత కలిగిన 10 మిలియన్ శిక్షకుల అవశ్యకత ఉంది. వీరికి వయోజన విద్య, సంస్థాగత నైపుణ్యం, క్లాస్ మేనేజ్‌మెంట్, ప్రాక్టికల్ శిక్షణ, వివిధ శిక్షణ సాధనాలతో పరిపూర్ణ శిక్షణనివ్వాల్సి ఉంది. జార్ఖండ్, ఈశాన్య భారతం, జె అండ్ కె లాంటి రాష్ట్రాల్లో శిక్షకుల కొరత చాలా ఉంది. దాన్ని అధిగమించడానికి సాంకేతిక మధ్యవర్తిత్వం తప్పనిసరి. ఏదిఏమైనా సాంకేతిక వృత్తి విద్యాబోధన (టివిఇటి) కార్యాచరణలో మార్పు త్వరితగతంగా జరిగేటట్టు చూడాలి.

**తరువాత ఏమిటి?**

ఒక అంచనా ప్రకారం 2022 నాటికి 500 మిలియన్ల మంది ఇంటర్నెట్‌కు అనుసంధానమవుతారు. గ్రామీణ ప్రాంతాలవారు కూడా 29 శాతం మంది 2013లో ఇంటర్నెట్ వినియోగించగా మూడేళ్లలో 50 శాతం పెరిగారు. మహిళా వినియోగదారులు కూడా 2013లో ఉన్న 28 శాతం నుంచి 2018కి 35 శాతానికి చేరుకోనున్నారు. దీనర్థం కేవలం వినోదానికే కాకుండా ఎడ్యూటైన్‌మెంట్‌కు కూడా పెద్ద సంఖ్యలో అనుసంధానమవుతున్నారు. స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియాతో చేతిలోని చేయి వేసుకుని ముందుకు సాగుతోంది. ఆన్‌లైన్ మొబైల్ సేవలు కూడా శిక్షణార్థుల్లో వివిధ శిక్షణలపై శోధించే ఒక వేదికను ఏర్పాటు చేశాయి. ఒక నిర్దిష్టమైన పని లేదా నైపుణ్యానికే స్థిరమైన మౌలిక సదుపాయాలు అవసరమా? కాదు. వృత్తి విద్య కార్యక్రమాల యొక్క అవశ్యకత అన్ని రంగాలకూ అవశ్యకం. నవకల్పనతో కూడిన అన్‌లైన్ శిక్షణ మాడ్యూల్స్ ప్రదేశిక హద్దులను తుడిచి వేయడమే కాకుండా 24 గంటలు, ఏడు రోజులు శిక్షణార్థులకు అందుబాటులో ఉన్నాయి. టివిఇటిలో ఉన్న మిశ్రమ




*మిశ్రమ శిక్షణ ఫ్రేమ్ వర్క్*

శిక్షణయొక్క సంకల్పం ఇక్కడ కొత్త రూపంలో అవిష్కృతమవుతోంది. రైల్వేలు, మెట్రో స్టేషన్లు, మాల్స్‌లాంటి ప్రదేశాల్లో స్కిల్ ఆన్ వీల్స్ లాంటి కార్యక్రమాల అవశ్యకత ఎంతైనా ఉంది. బ్రెజిల్‌లో నడుస్తున్న స్కిల్ ట్రక్స్ కార్యక్రమాన్ని ఎస్ఇఎన్ఎఐ గ్రామీణ ప్రాంతాలకూ నైపుణ్య శిక్షణను తీసుకువెళ్తోంది. ఇది డిజిటల్ వనరులు మరియు అన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ పద్ధతిన పూర్తిగా లీనమయ్యే సాంకేతికతకు మంచి బాటగా నిలుస్తోంది. మిశ్రమ శిక్షణ మోడల్ నైపుణ్య మోడల్ కు ఆత్మశోధన చేయడానికి ఉపకరంగా ఉంటుంది. ఇది యాజమాన్యాలు, ఉపాధి కల్పించేవారికి నైపుణ్యాన్ని 'ఔట్‌కం'కి బదులుగా 'ఔట్‌పుట్' దృష్టికోణంలో చూసే విధంగా చేస్తోంది. ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలు సోషల్ రిటర్న్ ఆన్ ఇన్వేస్ట్‌మెంట్ (ఎస్ఆర్ఒఐ) లాంటి సాధనాల ప్రభావాన్ని గుర్తించాలి. ముందు చెప్పుకున్న సంజీతా నాయక్ కథనంలో సాధికారత ద్వారా ఒక్క ఆమెకే ప్రయోజనం కలగకుండా పూర్తి కుటుంబం, గ్రామానికి ప్రయోజనం కలిగింది.

**ముగింపు**

స్కిల్ ఇండియా కష్టతరమైన మానవవనరులను పరిశ్రమలకు మరియు మౌలిక అవసరాలను అందించడానికి నైపుణ్య లక్ష్యాలను సాధించే దృష్టితో ఉంది. ఈ నైపుణ్య రంగంలో కొత్త వర్గాలు చేరుతున్న తరుణంలో, శిక్షణ యొక్క నాణ్యతను పెంపొందించడానికి మూడు 'ఐ'పై దృష్టి కేంద్రికరించాల్సి ఉంది. అవి ఇన్వెస్ట్‌మెంట్, ఇన్నోవేషన్ మరియు ఇన్‌స్టిట్యూషన్. చాలా విజయవంతవమైన పరిశ్రమలు పోటీతో కూడిన శిక్షణ మరియు శిక్షణార్థులు ప్రయోజనం లాంటి నమూనాలపై అధారపడ్డాయి. దీనిలో భాగంగానే సాంకేతికత ముఖ్యపాత్ర పోషించగా నైపుణ్య కార్యక్రమాలు కూడా తమ వంతు కృషి చేస్తున్నాయి. నైపుణ్యత అనేది యువతలో సామాజిక మార్పులకు అనివార్యం. పాఠశాల విద్యను మధ్యలో వదిలివేసిన వారికి. పని చేయదల్చినవారికి నైపుణ్య విద్య ఒక వారధిగా ఉంది. సమాచారం, శిక్షణ, సాఫ్ట్‌స్కిల్స్, మరియు అనుభవం వారికి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించగలవు. ■

# మిశ్రమ అధ్యయనం ద్వారా - నైపుణ్య వృద్ధి



**మిశ్రమ శిక్షణా విధానాన్ని అట్టడుగు స్థాయి వరకూ తీసుకువెళ్లడానికి శిక్షణా వనరులు తగినంత ఉండాలి. మనదేశంలో ఇలా రూపొందించిన ప్రాథమిక వనరులు ఎల్లవేళలా వినియోగానికి రాకపోవచ్చు. అలా వినియోగంలో లేని వనరులను అన్నింటినీ ఒక దగ్గరకు చేర్చి, మిశ్రమ నైపుణ్య శిక్షణ కోసం గరిష్టంగా వినియోగించుకోవచ్చు.**

ఆర్థికంగానూ, ఆశయాలలోనూ దేశం ఒక సంచలనాత్మక పరిణామ క్రమంలో ఉన్నపుడు, మానవ వనరులకు కూడా ఒక వినూత్న విధానంలో శిక్షణ అందించవలసిన అవసరం ఎంతో ఉంటుంది. మనదేశం ఎదుర్కొంటున్న సవాళ్లను చూసినప్పుడు ఈ పరిణామక్రమం ఎలా వుండాలో మనకు అవగతమవుతుంది. మనకు ఈ విషయంలో ఉన్న సవాళ్లను మనం ఇక్కడ చర్చిద్దాం.

దేశంలో నిజంగా నైపుణ్య శిక్షణ అవసరమైన ప్రజలు అసంఖ్యాకంగా ఉన్నారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డిసి) వారి అంచనాల ప్రకారం 2022 నాటికి హీనపక్షం 11.92 కోట్ల మందైనా సుశిక్షుతులైన మానవ వనరులు మనకు అవసరం. అదికూడా అత్యంత అధునాతన నైపుణ్యం! విభిన్న జాతులు, వర్గాలే కాదు, విభిన్న దేశ కాల మాన పరిస్థితులు ఉన్న మనదేశంలో ఒక అంశంలో నైపుణ్యం ఒక ప్రాంతానికీ, మరో ప్రాంతానికీ మారాలి. స్థానిక ప్రజల అవసరాలు, ఆదాయ స్థాయిలను బట్టి మార్చాలి. అదికూడా సాధారణ సాక్షరతతో కూడి ఉండాలి. మన దేశంలోని కార్మిక వనరుల గిరాకీని బట్టి ఈ శిక్షణ ఉండాలి.

తికమకగా ఉన్న ఈ నైపుణ్య శిక్షణా కార్యక్రమ విధానం దానివల్ల వచ్చే ప్రయోజనాల గణింపుతో ఉండాలి. వినూత్నంగా, మారుతున్న కాలానికి, సాంకేతిక అవసరాలకూ తగినట్లుగా ఉండాలి. మనదేశంలో ఈ నైపుణ్య శిక్షణా అంశాలను నిర్వహించడానికి ప్రత్యేకంగా కేంద్రప్రభుత్వం ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఒక జాతీయ విధాన పత్రంతో ఈ నైపుణ్య శిక్షణ ఆవశ్యకాలను కూర్చడం అప్పుడే మొదలయ్యింది. ఉత్సుకత, సామర్థ్యం, నాణ్యత, సమ్మిళిత వనరుల సమీకరణ, భౌగోళిక భాగస్వామ్యం, అవగాహన, అందుబాటు, సమాచార రూపకల్పన, శిక్షకుల తయారీ వంటి పది ప్రాధాన్యాలను గుర్తించి ఈ విధాన పత్రాన్ని రూపొందించారు. దీనివల్ల, శాస్త్రీయమైన విధానంలో నైపుణ్య శిక్షణకు కావాలినది ఏమిటో ఒక అవగాహన వస్తుంది. అయితే, చేస్తున్న పని ద్వారా నేర్చుకోవడం అనే Cement and Brick విధానంనుండి మళ్ళీ, ఆధునిక వినూత్న విధానాలు నేటి అవసరం. ప్రస్తుతమున్న నైపుణ్యాలలోని లోపాలను గుర్తించి, వాటిని

**ఎం. సాయిరాం,** హెడ్, ఐ.ఎ.ఎం.ఎ.సిహెచ్, **శరణ్యా రమేష్,** కన్సల్టెంట్, ఐ.ఎ.ఎం.ఎ.సిహెచ్.

సవరిస్తూ, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలోపెట్టుకుని మరింత పకడ్బందీగా ఈ వ్యూహాలను రూపొందించాల్సి ఉన్నది.

1. దీనికోసం శిక్షణా కార్యక్రమాలను మరింత పటిష్ట పరచవలసి వస్తుంది. సాధారణ అక్షరాస్యతతో మిశ్రమం చేసిన వర్చువల్ తరగతి గదులను నిర్వహించాలి. దీనికోసం ఆవశ్యక నైపుణ్యాలను తక్షణమే అన్వేషించాలి. శిక్షణావిధానాలను సమూలంగా మార్చాలి.

**అసలు మిశ్రమ శిక్షణ అంటే ఏమిటి?**

సైద్ధాంతిక, యధార్థ శిక్షణా విధానాల మేలు కలయికే ఈ మిశ్రమ శిక్షణ అంటే! సహచరులనుండి వినూత్న నైపుణ్యాలను, ఒకే పనిని వివిధ ప్రాంతాలవారు చేసే విధానాల్లో ఉన్న ప్రయోజనాలనూ కూడగట్టాలి. ఒకే సారి అనేక మందికి ఈ నైపుణ్య శిక్షణను అందచేస్తూ (వివిధ మార్గాల ద్వారా), మరింత సులభమైన శిక్షణా విధానాలను రూపొందించుకోవాలి. ఈ మిశ్రమ శిక్షణా విధానాన్ని మనదేశం లాంటి పని పరిస్థితులలో అన్వయించడానికి నాలుగు రకాల విధానాలుండాలి. అవి:

**విధాన చట్రం వ్యూహం:** అసలు శిక్షణా కార్యక్రమం ఎలా వుండాలో నిర్ణయించే విధాన పత్రాన్ని ప్రస్తుతం అమలులౌన్న విధానంతో తప్పనిసరిగా అనుసంధానించాలి. నేడు దేశంలోని నైపుణ్యాలలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వివిధ రంగాల నైపుణ్య సంస్థలు జాతీయ స్థాయి ప్రమాణాలను రూపొందిస్తున్నాయి. ఈ నూతన విధానం శిక్షకులకు సులభంగా అనుసరించేటట్లుగా ఉండాలి. ఇలాంటి వినూత్న మిశ్రమ శిక్షణా విధానాలు అనేక ప్రయోజనాలనిస్తున్నాయని ప్రపంచవ్యాప్త అనుభవాలు తెలియ చేస్తున్నాయి. మన దేశంలోనైతే, ఇలాంటి మిశ్రమ శిక్షణ విధానాలలో కాలానుగత పరీక్షా విధానాలు కూడా ఉండాలి.

### గమనిక

**వ్యాసకర్తలకు సూచన :** యోజన మాసపత్రికకు వ్యాసాలు రాసేవారు తమ వ్యాసాల సాఫ్ట్‌కాపీని పేజీమేకర్ 6.5, అను 6.0 ఫాంట్‌లలో టైప్ చేసి పంపుతూ, వ్రాత ప్రతిని కూడా తప్పనిసరిగా హామీపత్రంతో జతచేసి పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదము /అనుకరణ కాదని మాత్రమే కాక, ఈ వ్యాసాన్ని మరే పత్రికకు పంపలేదు / పుస్తకంగా ముద్రించలేదు అని కూడా పేర్కొనాలి. వ్యాసాలను పేజీమేకర్,మరియు పిడిఎఫ్ ఫార్మెట్‌లోనూ, అలాగే యూనికోడ్‌లో టైప్‌చేసి వర్డ్ ఫార్మెట్‌లోనూ అందచేయవచ్చును. రచనలు 15వ తేదీలోపు హామీ పత్రంతో పంపాలి.

ప్రచురణను నోచుకోని వ్యాసాలు తిరిగి పంపబడవు. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వ్యాసకర్తలు గమనించగలరు.

– *సీనియర్ ఎడిటర్*

అదేమంటే, శిక్షణా కాలంలో కార్మికులు ఎంతవరకు నేర్చుకున్నారు అనే విషయం అవగతమవుతుంది.

**ప్రాథమిక వనరుల నియంత్రణ:** మిశ్రమ శిక్షణా విధానాన్ని అట్టడుగు స్థాయి వరకూ తీసుకువెళ్లడానికి శిక్షణా వనరులు తగినంత ఉండాలి. మనదేశంలో ఇలా రూపొందించిన ప్రాథమిక వనరులు ఎల్లవేళలా వినియోగానికి రాకపోవచ్చు. అలా వినియోగంలో లేని వనరులను అన్నింటినీ ఒక దగ్గరకు చేర్చి, మిశ్రమ నైపుణ్య శిక్షణ కోసం గరిష్టంగా వినియోగించుకోవచ్చు. దీనివల్ల దూరం నుండి ప్రాథమిక వనరులను తరలించే వ్యయం తగ్గడమే కాక, అందుబాటులోనున్న వనరులను గరిష్టంగా వినియోగించుకోవచ్చు.

**సుశిక్షితులైన శిక్షకుల అందుబాటు:** నేటి మన శిక్షణా రంగంలో మరింత రాటుదేలిన ఆధునిక అర్హతలతో కూడిన శిక్షకుల అవసరం ఎంతో వుంది. నైపుణ్య పరిధిని విస్తరించాలని నిర్ణయించినపుడు, శిక్షణా విధానాన్ని కూడా మరింత పదునుతేల్చడం అవసరం. ఈ మిశ్రమ విధానంలో శిక్షకుడు కేవలం చోదకునిగా వుండి, కార్మికులు తమంత తామే నేర్చుకునేందుకు తోడ్పడతాడు.

**సరైన పెట్టుబడి:** భారీ స్థాయిలో చేపట్టే ఇలాంటి ఏ కార్యక్రమానికైనా, వనరులు విస్తారంగా అందుబాటులో ఉండాలి. అవసరమైతే బయటి పెట్టుబడులను ఆకర్షించాలి.

ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే, శిక్షణా కార్యక్రమాలలో అధునాతన విధానాలను రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆయా శిక్షణా కార్యక్రమాలు కూడా కేవలం ఒక విధమైన పనికే కాక, వివిధ రకాల జీవనోపాధులకు ఉపయోగపడాలి. ముఖ్యంగా మనదేశంలోనైతే బహుళ సాధక శిక్షణా కార్యక్రమాలు అవసరం. దీనికి సంప్రదాయ ఆలోచనలు కాక, ఆధునిక శైలి అవసరం. నేడు మనదేశంలో నిత్యజీవితంలో సాంకేతిక పరిజ్ఞానమ్ అవిభాజ్యమైంది. భారత్‌లో తయారీ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం మరిన్ని అవకాశాలను కల్పించవలసి ఉన్నది. ఇప్పటివరకూ మనం చెప్పుకున్నదంతా సిద్ధాంతపరమైన పరిజ్ఞానమే గాని, యధార్థ ప్రయోజనానికి దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణమైన విధానాలను రూపొందించుకోవాలి. ■



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్యశర్మ

1. రూ. 1500 కోట్లు కేటాయించిన, దీన్ దయాళ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన లక్ష్యం ఏమిటి?
(ఎ) గ్రామీణ ప్రాంతాలలోని యువతీ యువకులకు ఉపాధి / ఉద్యోగ అవకాశాలు కల్పించడం (బి) గృహాలు నిర్మించడం
(సి) గ్రామాలు దత్తత తీసుకోవడం
(డి) బాలికల రక్షణ, విద్య
2. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్? (పథకాలు : చేపట్టిన కార్యక్రమాలు)
(ఎ) స్వచ్ఛ్ విద్యాలయ : ప్రభుత్వ పాఠశాలలో 4,19,092 మరుగుదొడ్ల నిర్మాణం (బి) డిజిటల్ ఇండియా : 2.5 లక్షల గ్రామ పంచాయతీలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడం
(సి) సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన : పార్లమెంట్‌లోని 689 పార్లమెంట్ సభ్యులు తమ నియోజకవర్గంలో మోడల్ గ్రామాలు ఏర్పాటు చేయనున్నారు, దత్తత తీసుకుని (డి) పైవన్నీ (ఇప్పటివరకు చేసినవి)
3. యుఎస్ఎ ఇటీవల తమ రాయబార కార్యాలయాన్ని ఎక్కడ పునః ప్రారంభించింది?
(ఎ) హవానా, క్యూబా (బి) ఇండోనేషియా
(సి) ఇరాన్ (డి) సిరియా
4. ''చందువట్ల''శాసనం ఎవరి గురించి తెలుపుతుంది? వివరాలేమిటి?
(ఎ) రుద్రమ దేవి మరణం
(బి) మల్లికార్జున నాయకుడి మరణం
(సి) క్రీస్తు శకం 27.11.1189 నాడు, త్రిపురాంతకం నెల్లూరు జిల్లా (డి) పైవన్నీ
5. వైగై నది తమిళనాడులోని ఏ జిల్లాలో పుట్టింది?
(ఎ) థేనిజిల్లా (బి) బళ్ళారి జిల్లా
(సి) ధార్వాడ్ (డి) చిత్తూరు
6. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) CUS : క్రియోజెనిక్ అప్పర్ స్టేజ్ (బి) GSAT-6 లాంచ్ బరువు : 2117 కిలో గ్రాములు (సి) GSLV రాకెట్, దేశీయ CUSలో విజయవంతంగా ప్రయోగించింది ISRO
(డి) పైవన్నీ
7. జూన్ 30, 2015 నాటికి ప్రధానమంత్రి జన్‌దన్ యోజన కింద ఎన్ని బ్యాంకు అకౌంట్‌లు తెరవబడ్డాయి. (మిలియన్లలో)
(ఎ)165.7 (బి) 120 (సి) 130 (డి) 140
8. 2014-15లో భారతదేశ ఎక్స్‌టర్నల్ డెట్ (విదేశీ అప్పు) ఎంత? (బిలియన్ డాలర్లలో)
(ఎ) 446.3 (బి) 475.8
(సి) 350 (డి) 400
9. మొదటి సన్‌హాక్‌శాంతి బహుమతి ఇటీవల ఎవరికిచ్చారు?
(ఎ) డా. మోదదుగు విజయ్‌గుప్తా & అనోట్ టోంగ్, కిరిబాటిదీవుల అధ్యక్షుడు (బి) హాక్ జాహాక్ మూన్ (సి) రెవరెండ్ సన్ మ్యుంగ్ మూన్ (డి) వీరెవరు కారు
10. 10 కింగ్ హెన్రీ రోడ్, లండన్‌లో 1920 దశకంలో ఎవరు నివశించేవారు?
(ఎ) డా. బి.ఆర్. అంబేద్కర్ (బి) మహాత్మాగాంధీ
(సి) సరోజిని నాయుడు
(డి) జవహర్‌లాల్ నెహ్రూ
11. కర్నాటక రాష్ట్ర సముద్రతీర ప్రాంతంలో 'తుళు' భాష మాట్లాడేవారు ఎంతమంది? (లక్షల్లో సుమారుగా)
(ఎ) 75 (బి) 60 (సి) 40 (డి) 30
12. 2011 భారతదేశ జనాభా లెక్కల ప్రకారం సుమారు ఎంతమంది ఎప్పుడూ స్కూల్‌కి వెళ్ళలేదు? (మిలియన్లలో)
(ఎ) 400 (బి) 200
(సి) 300 (డి) 350
13. 1972లో ఏర్పాటైన మణిపూర్ రాష్ట్రంలో ప్రధాన కమ్యూనిటీలు ఏవి?
(ఎ) మెయిటీ (బి) కుకి
(సి) నాగా (డి) పై అందరూ
14. భారతదేశం వచ్చిన జేమ్స్ అలిక్స్‌మిచెల్ ఏదేశ అధ్యక్షుడు?
(ఎ) మారిషస్ (బి) సీషెల్స్
(సి) మాల్దీవులు (డి) శ్రీలంక
15. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 2015 వర్షాకాలంలో ఎక్కడ సర్‌ప్లస్ (మిగులు) వర్షపాతం కురిసింది?
(ఎ) పశ్చిమ రాజస్థాన్
(బి) గాంజెటిక్ - పశ్చిమ బెంగాల్
(సి) పశ్చిమ మధ్యప్రదేశ్ (డి) పైవన్నీ
16. భారతదేశంలో అత్యధికంగా ఉల్లిపాయలు పండించే రాష్ట్రం ఏది?
(ఎ) మహారాష్ట్ర (లసల్ గావ్ & పింపుల్ గావ్) (బి) మధ్యప్రదేశ్
(సి) కర్నాటక (డి) ఆంధ్రప్రదేశ్
17. సెప్టెంబర్ 2014లో ప్రారంభించిన ఇండియా న్యూబార్న్ యాక్షన్ ప్లాన్ లక్ష్యం ఏమిటి?
(ఎ) నవజాత శిశు మరణాలరేటు & స్టిల్ బర్న్ రేటుని సింగిల్ డిజిట్‌కి తగ్గించడం, 2030 నాటికి (బి) స్త్రీ మరణాలు తగ్గించడం
(సి) అందరికి ఆరోగ్యం (డి) క్షయ నివారణ
18. 2011 జనాభా లెక్కల ప్రకారం ఏ మతం వారిలో సెక్స్ రేషియో ప్రతి 1000 మంది పురుషులకి 903 మహిళలుగా ఉంది?
(ఎ) సిక్కులు (బి) ముస్లింలు
(సి) హిందువులు (డి) క్రైస్తవులు
19. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) మిడ్ నైట్స్ ఫ్యైరీస్ : నిసిద్ హజారీ
(బి) ' ది కంట్రీ ఆఫ్ ఫర్ బాయిస్ : అమర్త్యసేన్
(సి) ట్రాన్సెన్ డెన్స్ పైస్పిరిట్యూవల్ ఎక్స్‌పీరియన్సెస్ విత్ ప్రముఖ్ స్వామిజీ : ఎపిజె అబ్దుల్ కలాం (డి) పైవన్నీ
20. గల్లిపోలి పెనిన్స్యులా ఎక్కడ ఉంది? (మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఇక్కడ 1400 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు)
(ఎ) టర్కీ దేశానికి దగ్గర్లో (బి) యుకె
(సి) ఇటలీ (డి) రష్యా
21. సింగపూర్, మలేషియా నుండి ఎపుడు విడిపోయింది?
(ఎ) 1947 (బి) 1965
(సి) 1958 (డి) 1945
22. 1941లో మార్లవాయ్‌గ్రామం (జైనూర్ మండల్) ఆదిలాబాద్ జిల్లాలో నివాసం ఏర్పాటు చేసుకున్న ఆంధ్ర పాలజిస్ట్ ఎవరు?
(ఎ) క్రిస్టోఫర్ వాన్ ఫ్యూరర్ - హెయ్ మెన్ డార్ఫ్ (బి) కొమురం భీం
(సి) జ్యోతిబా పూలే (డి) నదీం హుసేన్
23. ఏ రోగాన్ని హెన్‌సన్ డిసీజ్' అనికూడా అంటారు?
(ఎ) కుష్ఠు (బి) మలేరియా
(సి) డెంగ్యూ (డి) స్వాయిన్ ఫ్లూ
24. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) రాజీవ్ ఖేల్ రత్న : సానియా మీర్జా
(బి) అర్జున్ అవార్డు : పి.ఆర్. శ్రీ జేష్, దీపా, కర్మాకర్ (సి) ద్రోణాచార్య అవార్డు నావల్ సింగ్
(డి) పైవన్నీ
25. టెన్జింగ్ నార్గే నేషనల్ ఏడ్వెంచర్ అవార్డు 2014 ఎవరికిచ్చారు?
(ఎ) అరుణిమ సిన్హా (బి) జోట్ సింగ్
(సి) పదం వీర్‌సింగ్ (డి) పై అందరూ
26. 1965 టర్నింగ్ ది టైడ్ , హై ఇండియా వన్‌ది వార్ రచయిత ఎవరు?
(ఎ) నితిన్ గోఖలే (బి) సప్తర్షి సర్కార్
(సి) అమృతాషా (డి) భీంసింగ్
27. రైల్వేల జీరోయాక్సిడెంట్ మిషన్‌లో ముఖ్య ప్రణాళిక లేవి?
(ఎ) రైల్వే ట్రాక్‌ల పునరుద్దరణ (బి) ఎక్కువ రైల్వే బ్రిడ్జిలు (సి) మంచి సిగ్నలింగ్, సేఫ్ రైల్వే కోచ్‌లు, ఇంజిన్‌లు (డి) పైవన్నీ (ఇందుకోసం రాబోయే 5 ఏళ్ళల్లో రూ. 8.5 లక్షల కోట్లు కావాల్సి ఉంటుంది)

28. రైల్వే పునర్వ్యవస్థీకరణ కోసం నియమించిన కమిటి ఏది?
(ఎ) కె.వి. చౌదరి (బి) బి.బేక్ దేబ్రాయ్ ప్యానెల్
(సి) కె. శివన్ (డి) ఆర్.సి. తాయల్
29. సంథార మతపరక్రతువు ఎవరిలో ఉంది?
(ఎ) జైనులు (బి) బౌద్ధులు
(సి) పార్సీలు (డి) యూదులు
30. ఈ క్రిందివాటిల్లో ఏది స్వైన్ ఫ్లూకి సంబంధించిన వైరస్?
(ఎ) H1N1 (బి) HIV
(సి) ఎబోలా (డి) ప్లాస్మోడియం వి
31. సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ ప్రకారం ఏప్రిల్ – జూన్ 2015 (క్వార్టర్)లో భారతదేశ జీడిపి వృద్ధి రేటు ఎంత?
(ఎ) 4% (బి) 7%
(సి) 7.5% (డి) 3%
32. GVA వివరాలేమిటి?
(ఎ) గ్రాస్ వాల్యూయాడెడ్ (బి) ఏప్రిల్ – జూన్ 2015లో భారతదేశ GVA 7.1%
(సి) రివైజ్ పద్ధతిలో జీడిపి లెక్కలు కట్టటానికి గాని GVA కి సబ్సిడీ మైనస్ చేసి, పన్నులు కలుపుతారు (డి) పైవన్నీ
33. ఏ బ్యాంకుల్ని ఆర్‌బిఐ, డొమెస్టిక్ సిస్టమాటికల్లీ ఇంపార్టెంట్ బ్యాంక్స్ (డి–ఎస్ఐబిఎస్)గా ప్రకటించింది?
(ఎ) ఎస్‌బిఐ & ఐసిఐసిఐ
(బి) హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు
(సి) యస్ బ్యాంకు
(డి) కోటక్ మహీంద్ర బ్యాంక్
34. మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్‌లో పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్‌లో గల 5 ఉప ఇండెక్స్‌లేవి?
(ఎ) ఉత్పత్తి స్థాయి : కస్టమర్ల నుండి కొత్త ఆర్డర్లు
(బి) సప్లయర్స్ డెలివరీలు
(సి) ఇన్‌వెంటరీలు & ఎంప్లాయ్‌మెంట్ స్థాయిలో (డి) పైవన్నీ
35. ఆలివర్ శాక్స్ రాసిన పుస్తకాలేవి?
(ఎ) మైగ్రేన్ (బి) ఎవేకెనింగ్స్
(సి) ఆన్ ఆంత్రపాలజిస్ట్ ఆన్ మార్స్
(డి) పైవన్నీ
36. ఐస్‌క్యూబ్ (న్యూటినో అబ్జర్వేటరీ) లాబ్ ఎక్కడ ఉంది?
(ఎ) సౌత్‌పోల్ (అంటార్కిటికా మంచుక్రింద)
(బి) యుఎస్ఎ (సి) బ్రెజిల్ (డి) రష్యా
37. లేబరేటరీ ఫర్ ది కన్సర్వేషన్ ఆఫ్ ఎండేంజర్ స్పీసీస్ ఎక్కడ ఉంది?
(ఎ) సిసిఎంబి, హైదరాబాద్
(బి) ఐఐసిటి, హైదరాబాద్
(సి) శ్రీహరికోట (డి) చెన్నయ్
38. 'దిలోలాండ్' రచయిత్రి ఎవరు?
(ఎ) శశిబాలా (బి) జుంపాలాహిరి
(సి) షీలా కౌల్ (డి) ఎస్. సోమనాథ్
39. భారతదేశపు మొత్తం మర్చండైజ్ ఎగుమతులలో ఇంజనీరింగ్ ఎగుమతులు ఎంత శాతం?
(ఎ) 10శాతం (బి) 22శాతం
(సి) 4శాతం (డి) 6 శాతం
40. జి–20 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశం (2015)లో ఎక్కడ నిర్వహించారు?
(ఎ) ఆస్ట్రేలియా (బి) అంకారా, టర్కీ
(సి) జర్మనీ (డి) ఇండోనేషియా
41. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) నిర్మల్ మథోల్ ప్రాజెక్టు (బి) ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టు (కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్)
(సి) తుమ్మిడి హట్టి (ఆదిలాబాద్ జిల్లా)
(డి) పైవన్నీ (గోదావరికి దాని ఉపనదులకు సంబంధించినవి)
42. తెలంగాణాలో బాసర నుండి భద్రాచలం వరకు ప్రవహించే గోదావరి నది పొడవు ఎంత (కి.మీ.లలో) ?
(ఎ) 1628 (బి) 750 (సుమారు)
(సి) 900 (డి) 1000
43. గోదావరి ఉపనదులేవి?
(ఎ) ప్రాణహిత (బి) ఇంద్రావతి
(సి) పెన్‌గంగ (డి) పైవన్నీ
44. 89 స్మాల్ & మార్జినల్ చమురు క్షేత్రాలు వేలం వేసే కొత్త పాలసీని ఆమోదించి, కేంద్ర ప్రభుత్వం ఎన్ని కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని భావిస్తోంది?
(ఎ) 70 వేలకోట్లు (బి) 50వేలకోట్లు
(సి) 40వేల కోట్లు (డి) 30వేల కోట్లు
45. ఈ క్రింది విద్యుత్ ప్రాజెక్టు ఎక్కడున్నాయి?
(ఎ) కోహాలా (1,100 ఎండబ్ల్యు)
(బి) నీలం – జీలం (969 ఎం.డబ్ల్యు)
(సి) ఛకోఠీ హత్తియా (500 ఎం.డబ్ల్యు)
(డి) పైవన్నీ పిఓకె ఏరియాలో
46. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం & లైబ్రరీ (ఎన్ఎంఎంఎల్) ఎక్కడుంది?
(ఎ) న్యూఢిల్లీ (బి) అలహాబాద్
(సి) అహ్మదాబాద్
(డి) శ్రీనగర్ & జమ్ము కాశ్మీర్
47. గ్రీక్ ఏజియన్ కోస్ దీవి ఎక్కడుంది?
(ఎ) ఏజియన్ సముద్రం (మధ్యధరా సముద్ర భాగం) (బి) ఆస్ట్రేలియా దగ్గర (సి) న్యూజిలాండ్ దగ్గర (డి) చైనా దగ్గర
48. మినియం ఆల్టర్నేట్ టాక్స్ (మ్యాట్) వివరాలేమిటి?
(ఎ) మ్యాట్‌ని 1987లో ప్రవేశపెట్టారు
(బి) జస్టిస్ ఎ.పి. షా కమిటి (సి) 2000 సంవత్సరంలో చేసిన మ్యాట్ రూల్స్ ఇపుడు అమలులో ఉన్నాయి (డి) పైవన్నీ
49. పార్టిసిపేటరీ నోట్ (పి–నోట్) వివరాలేమిటి?
(ఎ) ఇవి ఓవర్‌సీస్ డెరివేటివ్ ఇన్‌స్ట్రుమెంట్స్
(బి) వీటిని ఫారెన్ పోర్ట్ పోలియో ఇన్వెస్టర్లు ఇస్తారు (సి) విదేశాలలో ఉండే ఇన్వెస్టర్లు వీటిని తీసుకుంటారు. (ఎస్ఇబిఐతో రిజిస్ట్రేషన్ చేసుకోవద్దనుకునేవారు) (డి) పైవన్నీ
50. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) XAU : బంగారం రేటు
(బి) XAG : వెండిరేటు
(సి) XPT : ప్లాటినం రేటు
(డి) పైవన్నీ (వాటి రేట్లని తెలుపుతాయి)
51. అంకారా, టర్కీలో సమావేశమైన జి–20 దేశాల ఆర్థిక మంత్రులు వేటిని సాధించడానికి కట్టుబడి ఉన్నామన్నారు, చైనా తన దేశ కరెన్సీ యువాన్ విలువ తగ్గించినప్పటికి?
(ఎ) లెక్కలు కట్టటానికి, తమ చర్యలు ఇతరులకు, తెల్పటానికి (బి) నెగటివ్ స్పిల్ ఓవర్స్ తగ్గించటానికి (సి) అనిశ్చితను తగ్గించటానికి & పారదర్శకతను పెంచటానికి
(డి) పైవన్నీ
52. సిరియాదేశ కాందిశీకులు ఏ దేశాలకు వెళుతున్నారు?
(ఎ) ఆస్ట్రియా (బి) జర్మనీ
(సి) టర్కీ (డి) పైవన్నీ
53. 90 దేశాల ప్రతినిధులు వచ్చిన ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ కాన్ క్లేవ్ ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
(ఎ) అమరావతి (బి) బుద్ధగయ
(సి) సాంభి (డి) సారనాథ్
54. లిడార్ (లైట్ డిటెక్షన్ & రేంజింగ్ సర్వే దేనికోసం చేశారు. ఇటీవల?
(ఎ) గోదావరిలో నీరు (బి) కృష్ణానది
(సి) గంగానది (డి) యమునా నది
55. క్రీస్తు పూర్వం 332 సంవత్సరంలో ఈజిప్ట్‌లో అలెగ్జాండ్రియా నగరం స్థాపించినదెవరు?
(ఎ) జూలియస్ సీజర్ (బి) అలెగ్జాండర్
(సి) అగస్టస్ (డి) పాంపీ
56. 2015 పీటర్ మాక్లర్ అవార్డు ఫర్ కరేజియస్ & ఎథికల్ జర్నలిజం ఎవరికిచ్చారు?
(ఎ) జైనా ఎర్‌హెయిమ్
(బి) రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్
(సి) నేషనల్ ప్రెస్ క్లబ్
(డి) అర్చనారామసుందరం
57. కావల్ టైగర్ రిజర్వ్ (కెటిఆర్), ఆదిలాబాద్ వివరాలేమిటి?
(ఎ) 892.23 చదరపు కిలో మీటర్ల కోర్ ఏరియా (బి) 1123.21 చదరపు కిలోమీటర్ల బఫ్ఫర్ ఏరియా (సి) నిర్మల్, జన్నారం డివిజన్లు కోర్ ఏరియాలో ఉన్నాయి (డి) పైవన్నీ
58. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ మినిస్ట్రీ చేత మోడల్ సోలార్ / గ్రీన్ సిటీస్ (నగరాలు)గా ఎంపిక చేయబడినవి ఏవి?
(ఎ) మహబూబ్‌నగర్ (తెలంగాణ) & విజయవాడ (ఆంధ్రప్రదేశ్) (బి) వరంగల్
(సి) కరీంనగర్ (డి) నిజామాబాద్
59. భారతదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఏది కరెక్ట్? (సంఖ్య మిలియన్లలో) (బ్రాకెట్స్‌లో శాతంలో)
(ఎ) హిందువులు : 966.3 (79.8%)
(బి) ముస్లింలు : 172.2 (14.23%)
(సి) క్రిస్టియన్లు : 2.3% (డి) పైవన్నీ
60. గతంలో స్పెషల్ కేటగిరి స్టేట్స్ గా వర్గీకరించబడిన రాష్ట్రాలేవి?
(ఎ) అస్సాం, జమ్ము & కాశ్మీర్ : నాగాలాండ్
(బి) హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్
(సి) సిక్కిం, ఈశాన్య రాష్ట్రాలు (డి) పైవన్నీ

61. నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌డిసి) & గతంలో కేంద్రప్రభుత్వం తెలిపిన అంశాలేవి? స్పెషల్ కేటగిరి స్టేట్స్ గా గుర్తించబడటానికి?
(ఎ) పర్వతప్రాంతం, తక్కువ జనాభా సాంద్రత, ఎక్కువమంది గిరిజనులు ఉండడం (బి) దేశ సరిహద్దులో ఉండడం (సి) ఆర్థిక & మౌలిక సదుపాయాల వెనుక బాటుతనం, రాష్ట్రపు ఆర్థిక వనరులు తగినంతగా లేకపోవడం (డి) పైవన్నీ

62. బీహార్ వంటి రాష్ట్రాలు స్పెషల్ స్టేటస్‌కోసం డిమాండ్ చేయగా, దీన్ని అధ్యయనం చేయడం కోసం నియమించిన కమిటిఏది? ఫార్ములాఏది?
(ఎ) డి.ఆర్. గాడ్గిల్ ఫార్ములా
(బి) డా. రఘురాం రాజన్ కమిటి (2013)
(సి) గాడ్గిల్ ముఖర్జీ ఫార్ములా (డి)ఇవేవికావు

63. డబ్ల్యు–20 (మమెన్–20) సమ్మిట్ ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
(ఎ) అంకారా, టర్కీ (బి) న్యూయార్క్
(సి) మాస్కో (డి) బెర్లిన్

64. డింగ్ పీరిడ్జ్ ఏ రాష్ట్రంలో ఉంది?
(ఎ) చందేల్ జిల్లా, మణిపూర్ (బి) అస్సాం
(సి) అరుణాచలప్రదేశ్ (డి) త్రిపుర

65. 'ఛంగాలికోడాన్' అరటి, నేంద్రన్ అరటికి జియోగ్రాఫికల్ పెడెంటిఫికేషన్ (జి1) ఇచ్చారు. వీటిని ఎక్కడ పండిస్తారు?
(ఎ) కేరళ (బి) గోవా
(సి) గుజరాత్ (డి) రాజస్థాన్

66. శ్రీపతాపసింగ్ మ్యూజియం ఎక్కడుంది?
(ఎ) హైదరాబాద్ (బి) శ్రీనగర్
(సి) కోల్‌కత్తా (డి) న్యూఢిల్లీ

67. ప్రాచీన యక్షగాన మేళాలు ఎక్కడ నిర్వహిస్తారు?
(ఎ) తీరప్రాంత కర్నాటకలో (బి) మహారాష్ట్ర
(సి) ఉత్తరప్రదేశ్ (డి) ఒడిషా

68. 14 సముద్ర దీవుల దేశాల రెండవ ఫోరం ఫర్ ఇండియా పసిఫిక్ ఐలాండ్స్ కోపరేషన్ (FIPIC) సమావేశం ఎక్కడ నిర్వహించారు?
(ఎ) జైపూర్, రాజస్థాన్ (బి) సువా, ఫిజి
(సి) టోక్యో (డి) బీజింగ్

69. లుక్‌వెస్ట్ పాలసీ ఆవిర్భావంగా పిలిచే భారత ప్రధానమంత్రి యాత్ర, ఏద ఏశం వెళ్ళడంతో మొదలయింది?
(ఎ) పాకిస్తాన్ (బి) యుఎఇ
(సి) ఆఫ్ఘనిస్తాన్ (డి) ఇరాన్

70. శ్రీలంక ప్రధానమంత్రిగా ఎన్నికయిన రాణిల్ విక్రమసింఘే, పార్టీ ఏది?
(ఎ) యునైటెడ్ నేషనల్ పార్టీ (UNP)
(బి) SLFP (సి) ITAK (డి) JVP

71. కాలాపథర్ శిఖరం (హిమాలయాలలో ఉంది) ఇటీవల ఎవరు అధిరోహించారు?
(ఎ) కందర్పశర్మ & రిత్విక (బి) అపర్ణా కుమార్
(సి) మలావత్ పూర్ణ (డి) సాధనపల్లి ఆనంద్

72. ఇండియా – ఆఫ్రికా సమ్మిట్ ఎపుడు నిర్వహిస్తారు?
(ఎ) అక్టోబర్ 23, 2015
(బి) ఫిబ్రవరి 2016
(సి) డిసెంబర్, 2015
(డి) జనవరి, 2016

73. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ లోగల సభ్యదేశాలేవి?
(ఎ) యుఎఇ, కతార్ (బి) బాహ్రెయిన్
(సి) ఓమన్ (డి) పైవన్నీ

74. వరల్డ్ లిటరసీ డే ఎపుడు?
(ఎ) మార్చి 8 (బి) సెప్టెంబర్ 8
(సి) సెప్టెంబర్ 5 (డి) జూన్ 5

75. కాళి, హిండాన్ నదులు ఏ రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి ?
(ఎ) పశ్చిమబెంగాల్ (బి) ఉత్తరప్రదేశ్
(సి) కర్నాటక (డి) కేరళ

76. లిపు లేఖ్ పాస్ (మార్గం) ఏరాష్ట్రంలో ఉంది?
(ఎ) ఉత్తరాఖండ్ (బి) పశ్చిమబెంగాల్
(సి) సిక్కిం (డి) జమ్ము & కాశ్మీర్

77. మహాదాయి నది (మాండోవినది) ఏ రాష్ట్రాలలో ప్రవహిస్తోంది?
(ఎ) కర్నాటక & గోవా (బి) ఒడిషా
(సి) పశ్చిమబెంగాల్ (డి) రాజస్థాన్

78. స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌కి సంబంధించి వీటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఆగస్టు 8, 1941న ప్రారంభించారు. (బి) గన్‌ఫైండ్రీలో తొలి బ్రాంచ్ ఏప్రిల్ 5, 1942లో ప్రారంభించారు. (సి) 1953లో హైదరాబాద్ మార్కెంటైల్ బ్యాంక్ లిమిటెడ్ బాధ్యతలు హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ చేపట్టింది. 3 సంవత్సరాల తర్వాత రిజర్వ్ బ్యాంక్, దీన్ని తీసుకుంది (డి) పైవన్నీ

79. నిజాం మిలిటరీలో పనిచేసిన ఫ్రెంచ్ జనరల్ మిచెల్ జోచిం మేరీ రేమండ్ (మాన్సియర్ రేమండ్) స్మార నిర్మాణం ఎక్కడుంది?
(ఎ) మలక్‌పేట, హైదరాబాద్
(బి) బొబ్బిలి (సి) మచిలీపట్నం (డి) యానాం

80. సర్తాజ్ అజీజ్ ఏ దేశ సెక్యూరిటీ ఎడ్వయిజర్?
(ఎ) పాకిస్తాన్ (బి) బంగ్లాదేశ్
(సి) ఆఫ్ఘనిస్తాన్ (డి) ఇరాన్

81. నేషనల్ క్లీన్ ఎనర్జీ ఫండ్‌కి వచ్చే రూ. 13, 316 కోట్లు వేటి కోసం ఖర్చుపెడుతున్నారు?
(ఎ) మినిస్ట్రీ ఆఫ్ న్యూ & రెన్యువబుల్ ఎనర్జీ
(బి) నదుల ప్రక్షాళన
(సి) క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు (డి) పైవన్నీ

82. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఎథెటిక్స్ ఫెడరేషన్స్ )ఐఎఎఎఫ్) కొత్త ప్రసిడెంట్ ఎవరు?
(ఎ) సెబాస్టియన్ కో (బి) లామైన్ దయాక్
(సి) సెర్గీ బబ్కా (డి) హమాద్ కల్‌కాబా

83. ఆర్‌బిఐ ఇటీవల వేటికి పేమెంట్ బ్యాంక్‌లు ప్రారంభించటానికి అనుమతి ఇచ్చింది?
(ఎ) ఇండియా పోస్ట్ (బి) నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్
(సి) టెక్ మహీంద్రా (డి) పైవన్నీ

84. పేమెంట్ బ్యాంకులు చేసే పనులేమిటి?
(ఎ) డిపాజిట్లు సేకరించడం, ధనం ఇతరులకి పంపించడం (బి) కరెంట్ అకౌంట్, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలు తెరవడం (సి) ఎటిఎం కార్డులు / డెబిట్ కార్డులు ఇవ్వడం (డి) పైవన్నీ (కాని పేమెంట్ బ్యాంకులు అపులు ఇవ్వవు)

85. భారత ప్రధానమంత్రి ఇటీవల యుఎఇ సందర్శించినపుడు చేసిన పనులేమిటి?
(ఎ) క్రౌన్ ప్రిన్స్ షేక్‌మొహమ్మద్ బిన్ జయేద్ అల్‌హాన్ ఆఫ్ అబుదాబిని కలవడం
(బి) షేక్ జయేద్ గ్రాండ్ మాస్క్ సందర్శించడం
(సి) దుబాయ్ క్రికెట్ స్టేడియంలో అక్కడ నివశించే భారతీయులను ఉద్దేశించిమాట్లాడటం
(డి) పైవన్నీ

86. రోహతాంగ్ పాస్ (కులు జిల్లా, హిమాచల్ ప్రదేశ్) లో వివరాలేమిటి?
(ఎ) డీజిల్, పెట్రోల్‌తో నడిచే వాహనాల నిషేధం (దీన్ని నవంబర్ 2015 వరకు సడలించాలి) (బి) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం చేశారు (సి) సిఎన్‌జి / ఎలక్ట్రిక్ వాహనాలు తిరగవచ్చును (డి) పైవన్నీ

87. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయితీల సంఖ్య : 8,685 (బి) తెలంగాణ గ్రామాలలో ఈ గ్రామ పంచాయితీలలో నివశించే ప్రజలు 2011 జనాభా లెక్కల ప్రకారం : 2,26,88,576.
(సి) 14వ ఆర్థిక సంఘం రికమండేషన్ ప్రకారం వచ్చే వనరులు : రూ. 5.375.33 కోట్ల (2015 – 16 నుండి) (డి) పైవన్నీ

88. గ్రీస్ దేశం ఎంత ఎయిడ్ అందుకోటానికి ఆమోదం తెలిపింది? (బిలియన్ యూరోలలో)?
(ఎ) 85 (బి) 45 (సి) 35 (డి) 40

**జవాబులు (అక్టోబర్ 2015)**

| | | | |
|---|---|---|---|
| 1 – ఎ | 23 – ఎ | 45 – డి | 67 – ఎ |
| 2 – డి | 24 – డి | 46 – ఎ | 68 – ఎ |
| 3 – ఎ | 25 – డి | 47 – ఎ | 69 – బి |
| 4 – డి | 26 – ఎ | 48 – డి | 70 – ఎ |
| 5 – ఎ | 27 – డి | 49 – డి | 71 – ఎ |
| 6 – డి | 28 – బి | 50 – డి | 72 – ఎ |
| 7 – ఎ | 29 – ఎ | 51 – డి | 73 – డి |
| 8 – బి | 30 – ఎ | 52 – డి | 74 – బి |
| 9 – ఎ | 31 – బి | 53 – బి | 75 – బి |
| 10 – ఎ | 32 – డి | 54 – ఎ | 76 – ఎ |
| 11 – ఎ | 33 – ఎ | 55 – బి | 77 – ఎ |
| 12 – ఎ | 34 – డి | 56 – ఎ | 78 – డి |
| 13 – డి | 35 – డి | 57 – డి | 79 – ఎ |
| 14 – బి | 36 – ఎ | 58 – ఎ | 80 – ఎ |
| 15 – డి | 37 – ఎ | 59 – డి | 81 – డి |
| 16 – ఎ | 38 – బి | 60 – డి | 82 – ఎ |
| 17 – ఎ | 39 – బి | 61 – డి | 83 – డి |
| 18 – ఎ | 40 – బి | 62 – బి | 84 – డి |
| 19 – డి | 41 – డి | 63 – ఎ | 85 – డి |
| 20 – ఎ | 42 – బి | 64 – ఎ | 86 – డి |
| 21 – బి | 43 – డి | 65 – ఎ | 87 – డి |
| 22 – ఎ | 44 – ఎ | 66 – బి | 88 – ఎ |

# దర్పణం

## కలరా వ్యాక్సిన్

గత నెల మనం మలేరియా వ్యాక్సిన్ గురించి తెలుసుకున్నాం. ఇక ఇప్పుడు కలరా వ్యాక్సిన్ గురుంచి తెలుసుకుందాం. మన హైదరాబాద్ నగరంలోని ప్రముఖ మందుల తయారీ సంస్థ శాంతా బయోటెక్ తయారుచేసిన కలరా నిరోధక నోటి చుక్కల వాక్సిన్ ఎంతో ప్రభావవంతంగా ఉన్నదని అనేక జాతీయ అంతర్జాతీయ సంస్థలు కితాబునిచ్చాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో 94,675 మందికి ఈ వ్యాక్సిన్ ఇవ్వగా ఫలితాలు సంతృప్తికరంగా కనిపించాయి. రెండు సంవత్సరాల ప్రయోగం అనంతరం, ఒక డోసు తీసుకున్న రోగులలో 37 శాతం మంది, రెండు మోతాదులు



తీసుకున్నవారిలో 53 శాతం రక్షణ కనిపించింది. అయితే రెండు డోసుల మధ్యలో కనీసం 14 రోజుల వ్యవధి/ అంతరాయం ఉండాలి. రెండు డోసులను పూర్తి ట్రీట్మెంట్‌గా భావిస్తున్న ప్రస్తుత తరుణంలో 53 శాతం రక్షణ పెద్ద విజయంగా పరిగణించరాదు, అయితే సమస్య అధికంగా ఉన్న మురికివాడల వంటి ప్రాంతాలలో ఇది చాలా ప్రభావం చూపిస్తుంది కదా! ఈ వాక్సిన్ తో పాటు చేతుల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని అంచనా! కలరా/అతిసారం ఇటీవలి వరకూ తీవ్రమైన ప్రాణాంతకమైన మహమ్మారి. మనదేశంలో ఒక అంచనా ప్రకారం 41,17,00,175 మంది ఈ మహమ్మారికి బలవుతున్నారు. ప్రతి సంవత్సరమూ 20 వేల మందికి పైగా ఈ వ్యాధి బారిన పడి మరణిస్తున్నారు.

## ప్రత్యేక గ్రామం

ఒడిషా గజపతి జిల్లాలోని లుహంగర పంచాయతీ దేశంలో తన ప్రత్యేకతను, విశిష్టతను నిలుపుకున్నది. అది ఎలాగంటే, ఆ గ్రామంలో ఎవరూ బహిరంగ మల విసర్జన చేయరు. ఈ గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకుని స్థానిక ప్రభుత్వం మొత్తం జిల్లాలో ఉన్న మరో 119 గ్రామాలను కూడా పారిశుధ్య గ్రామాలుగా రూపు దిద్దుతున్నది. ఇది ఎలా సాధ్యమైందంటే, జనాభా లెక్కల ప్రకారమయితే, రాష్ట్రంలో 76.6 శాతం ఇళ్లకు మరుగుదొడ్లు లేవు. దేశంలో మరే



రాష్ట్రంలోనూ ఈ రాష్ట్రంలో ఉన్నంతమంది గిరిజనులు లేరు. మొత్తం 30 జిల్లాలలో కూడా, గ్రామాలు మారుమూల ఉండటంతో ప్రజారోగ్య సేవలు అందరికీ సమంగా అందటం లేదు. అయితే ఒక్క గజపతి జిల్లాలో మాత్రం సంపూర్ణ బహిరంగ మల విసర్జన నిషేధ గ్రామాలు మొత్తం ఐదు ఉన్నాయి. దీనికి జిల్లా కలెక్టర్ మాన్సీ నింభల్ అభినందనీయులు. ప్రజల ఆలోచన విధానాన్ని మార్చడం ద్వారా ప్రతి ఇంటిలోనూ కనీసం ఒక్క మరుగు దొడ్డి అయినా కట్టించాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఈ ప్రభుత్వం ముందడుగు వేస్తున్నది. ప్రజా ప్రాతినిధ్యంతోనే ఈ విజయాన్ని సాధించాలన్న వారి సంకల్పం విజయవంతం కావాలని కోరుకుందాం!

## ఫుట్‌పాత్ పాఠశాల

భక్తుడు రాలేకపోతే భగవంతుడే భక్తుని వద్దకు వెళ్తాడనేది నానుడి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేక పోతే, పాఠశాలే విద్యార్థుల వద్దకు వెళ్తుందనేది న్యూ నుడి. గుజరాత్ లోని వదోద్ర జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఈ విధానంలో వీధి బాలలకు, ముఖ్యంగా వారి పొట్ట వారే పోసుకోవాలన్న స్థితిలోనున్న వారికి దగ్గరగా కాలిబాట (ఫుట్ పాత్) పైననే బాలలకు విద్యాబుద్ధులు నేర్పే పనిని చేపడుతున్నారు. కావలసింది ముఖ్యంగా జ్ఞాన దానమే గానీ, సౌకర్యాలు, ఉపకరణాలు కాదనేది వారి భావన.



శ్రోతస్విని ట్రస్ట్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యావంతులైన నిరుద్యోగులు, యువకులు ఈ ఉద్యమంలో ఉపాధ్యాయులు గా పాలుపంచుకుంటున్నారు. మాతృభాషలో రాయడం, చదవడమే కాక, పిల్లలకు నైతిక వర్తనం పై కూడా పాఠాలు చెపుతున్నారు. భావం ప్రధానం కానీ, భాష కాదన్నట్లుగా ఈ చిరు ప్రయత్నం పదుగురి తోడ్పాటుతో దేశమంతా విస్తరించాలని కోరుకుందాం!

## సరైన పరిష్కారం

మనదేశం వంటి అభివృద్ధిచెందుతున్న దేశాలలో మహిళలకు నెలసరి సమయంలో ఆరోగ్యానికి నాప్కిన్ లను వాడటం అలవాటు చేయడం ఒక ఎత్తైతే, వాడిన వాటిని ఎలా పారవేయాలి అనేది మరో బృహత్తర సమస్య! సమాజ కట్టుబాట్లు, నమ్మకాల వల్ల నెలసరి కాలాన్ని, ఆ సమయంలో వాడే బట్ట/నాప్కిన్ లను అశుద్ధమైనవిగా ఎంతో మంది పరిగణిస్తారు. అయితే, ఇది పేద/ధనిక బేధం లేకుండా ప్రతి మహిళా జీవితంలోనూ తప్పనిసరి చర్య కావడంతో, పేదలకు అనువుగా చౌకలో వాడేసిన నాప్కిన్లను తగులపెట్టే ఇన్సినిరేటర్ (విద్యుత్‌తో పనిచేసే



ఒక రకమైన కుంపటి)ను గుజరాత్ కు చెందిన శ్యాంసుందర్ బేదేకర్ రూపొందించారు. ఆయన సతీమణి స్వాతి ప్రజలలో శాస్త్రీయ అవగాహనను పెంపొందించే చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గిరిజన మహిళలకు ఆమె తక్కువ ధరలో శానిటరీ నాప్కిన్లను అందుబాటులోకి తెచ్చారు. చెత్తను సేకరించే సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతాలలో ఇలా వాడేసిన నాప్కిన్లను పారవేయడం మరింత పెద్ద సమస్యగా గ్రహించిన శ్యాంసుందర్, తన భార్య ప్రయత్నానికి తనవంతు తోడ్పాటుగా చీమలు, ఎలుకలనుండి ఇలా వాడేసిన నాప్కిన్లను అందకుండా, ఒక్క కిస్తీలో ఐదు, ఆరు నాప్కిన్లను మండించే ప్రక్రియను రూపొందించారు. ఎర్రమట్టితో రూపొందించే ఇటువంటి కుంపట్లలో పైన వాడేసిన నాప్కిన్లను పడవేసే చిన్న గిన్నెను మూతతో సహా, కింద కాగితం గానీ, ఎండు గడ్డి గాని ఉంచి నిప్పు రాజేసే సౌకర్యాన్ని (మామూలు కుంపట్లలోలాగా) ఏర్పాటు చేశారు. మండించిన తరువాత మిగిలిన బూడిద, కిందనుండి బయటకు వస్తుంది. ఈ కుంపట్లను తయారు చేయడం, విద్యుత్ లేదా ఇంధనంతో వాడటం అతి సులభం. ఒక్కొక్క కుంపటి తయారీకి, కేవలం రెండు వేల రూపాయలు ఖర్చు అవుతుంది.

### శిశుధనుర్వాతంపై విజయం

భారతదేశ ఆరోగ్య చరిత్రలో మరో ఘన విజయం నమోదు అయ్యింది. ప్రజలందరి సమిష్టి కృషి ద్వారా పోలియో మహమ్మారిని సమూలంగా పారద్రోలిన తరువాత, నేడు నియో నాటల్ టెటా నస్ (నవజాత శిశువుల ధనుర్వాతం) వ్యాధినికూడా సమూలంగా నిర్మూలించుకోగలిగాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ మనదేశాన్ని ఈ మహమ్మారి నుండి కూడా విముక్త దేశంగా ప్రకటించింది. బిడ్డ జన్మించిన వెంటనే ఏవైనా గాయాలుంటే, వాటి ద్వారా సంక్రమించే ఈ ధనుర్వాతం నేటివరకూ మన దేశంలో మాత-శిశు మరణాలకు అతి పెద్ద కారణంగా నిలచింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వారి అంచనాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఒక్క 1988వ సంవత్సరంలోనే, 7.87 లక్షలమంది శిశువులు మరణించారు. మనదేశంలోనైతే, ప్రతి సంవత్సరమూ రెండు లక్షలకు పైగా మాత, శిశువులు ఈ వ్యాధి వలన మరణిస్తున్నారు. అయితే ఏఎస్‌హెచ్ఏ వంటి సామాజిక ఆరోగ్య కార్యకర్తల సేవల వలన నేటికి మనం ఈ మహమ్మారి నుండి విముక్తి పొందాము. ప్రస్తుతం మనదేశంలో అధికారిక లెక్కల ప్రకారం, శిశు మరణాల రేటు 40 గానూ, మాతృ మరణాల రేటు ప్రతి లక్షమంది తల్లులకూ 167 గాను ఉన్నది.


### బిఎస్ఎన్ఎల్ ఖాతాదారులకు వరం

అక్టోబర్ నుండి భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తన ఖాతాదారులకు 02ఎంబిపిఎస్ కన్నా వేగవంతమైన అంతర్జాలాన్ని బహుమతిగా ఇవ్వనున్నది. అది కూడా అదనపు రుసుము లేకుండా! అంటే ఇది ప్రస్తుతమున్న అంతర్జాల వేగానికి నాలుగు రేట్లు ఎక్కువ! ఇప్పటివరకూ బిఎస్ఎన్ఎల్ అందచేస్తున్న కనీస వేగం కేవలం 512 కేబిపిఎస్ మాత్రమే! దీనితో గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1.98 కోట్లమంది ఖాతాదారులు మరింత వేగవంతమైన ప్రైవేటు సేవలకు తరలిపోయారు. దీనివల్ల నిగమ్‌కు కు 7,600 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లింది.



### దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజన

ఇంతవరకూ వ్యవసాయానికీ, వ్యవసాయేతర అవసరాలకు విద్యుత్‌ను ఒకే లైన్ ద్వారా సరఫరా చేస్తుండటం వల్ల అనేక కష్ట నష్టాలను సరఫరా చేస్తున్న సంస్థలు, వినియోగదారులు కూడా ఎదుర్కోవలసి వస్తున్నది. ఈ సమస్యను పరిష్కరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. దీని ప్రకారం వ్యవసాయ విద్యుత్ సరఫరాను, వ్యవసాయేతర సరఫరానూ విడివిడిగా చేస్తూ, అట్టడుగు స్థాయిలో కూడా ప్రతి చిన్న వినియోగాన్నీ కూడా రికార్డు చేసే ఆధునిక మీటర్లను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల సరఫరా నష్టాలను కూడా తగ్గించడం వీలవుతుంది. దీనికి రూ. 43,033 కోట్లు వ్యయమవు తుందని అంచనా! ఇప్పటి వరకూ అసంపూర్ణంగా ఉన్న రాజీవ్ గ్రామీణ విద్యుద్దీకరణ పథకాలను కూడా ఈ కార్యక్రమం క్రింద పూర్తి చేస్తారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గుతాయి. తద్వారా మీటర్ రీడింగ్ ప్రకారం బిల్లింగ్‌లో వచ్చే తప్పులను కూడా సరిచేయవచ్చు. పీక్ లోడ్ సమస్యలు కూడా పరిష్కారమవుతాయి.




### ఆదర్శం

మరియమ్ సిద్దిఖీఅంటే చాలామంది పాఠకులకు గుర్తురాకపోవచ్చు కానీ భగవత్ గీత వచన పోటీలలో మొదటి బహుమతి గెలుచుకున్న ముంబై అమ్మాయి అంటే గుర్తుకు వస్తుంది. ఆమె ఇప్పటివరకూ అనేక పోటీలలో గెలుచుకున్న నగదు బహుమతి మొత్తాన్నీ, దేశంలోని బాలికల విద్యావ్యాప్తికి మద్దతుగా అందచేసింది. కేవలం ఆరవ తరగతి చదువుతున్న చిన్నపిల్లకు ఎంత ఉన్నతమైన ఆలోచనలో! ఆమె భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరుకుందాం!



*యోజన సంపాదకవర్గం*

# నైపుణ్య భారతం దిశగా శిక్షణా కార్యక్రమాలు

**ఒక అంచనా ప్రకారం దేశంలోని మొత్తం కార్మికుల్లో 29 శాతం మంది నిరక్ష్యరాస్యులు, మరో 24 శాతం మంది ప్రాథమిక స్థాయి లేదా అంతకన్న తక్కువ చదువుకున్నవారు. 11వ పంచవర్ష ప్రణాళికలో పేర్కొన్నట్లు 15-29 సంవత్సరాల మధ్యనున్న వారిలో కేవలం రెండు శాతం మంది మాత్రమే వృత్తి విద్యను పూర్తిచేశారు. మరో ఎనిమిది శాతం మంది అనియత విద్య ద్వారా (ఇన్ఫార్మల్ ఒకేషనల్) వృత్తి విద్యను పూర్తి చేయడం జరిగింది.**

ప్రపంచ జనాభాలో చైనా తరువాత రెండవ అతి పెద్ద దేశం భారత దేశం. 2025 నాటికి దేశ జనాభాలో 70 శాతం (15-59 సంవత్సరాల మధ్య వయసు గల వారు) మంది పనిచేసే వారుగా ఉంటారనేది ఒక అంచనా. వీరిలో ఎక్కువమంది సరైన నైపుణ్యాలు లేక నిరుద్యోగులుగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. మన దేశంలో ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు, వృద్ధి వల్ల ఉద్యోగ అవకాశాలు, డిమాండ్ ఎక్కువగానే ఉన్నాయి. మరో వైపు నిపుణుల కొరత వల్ల నిరుద్యోగిత పెరుగుతోంది. భారత ప్రభుత్వానికి చెందిన 17 మంత్రిత్వ శాఖలు నైపుణ్య అభివృద్ధికి సంబంధించిన వృత్తి పరమైన ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి. అయితే జనాభా పెరుగుదల ఒక్కటే నైపుణ్యాల కొరతకు కారణం కాదు. చైనా మన దేశం కన్నా అధికంగా జనాభాను కలిగి ఉంది. అక్కడ ఇస్తున్న శిక్షణ విధానముతో మెరుగైన శ్రామిక ఉత్పాదకత సాధించే దిశగా వారి నైపుణ్యాలను ప్రభుత్వం మెరుగుపరచింది. ఉదాహరణకు మన దేశంలోని నిర్మాణరంగాన్ని పరిశీలిస్తే సరైన నిపుణులులేని ఫలితంగా ఈ రంగం మందగించింది. మరో వైపు ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరిగి భారత మౌలిక రంగానికే ఒక సవాలుగా మారింది. నిరక్ష్యరాస్యులు అధికంగా ఉన్న మన దేశంలో పలు పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, వ్యవసాయ రంగాల, మానవ వనరుల విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి సరైన శిక్షణ, నైపుణ్యం లేక ఉత్పాదకశక్తి ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఒక అంచనా ప్రకారం దేశంలోని మొత్తం కార్మికుల్లో 29 శాతం మంది నిరక్ష్యరాస్యులు, మరో 24 శాతం మంది ప్రాథమిక స్థాయి లేదా అంతకన్న తక్కువ చదువుకున్నవారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో అత్యధిక శాతం మంది నిరక్ష్యరాస్యులుగా ఉన్నారు. వారిలో ఎక్కువ శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. కనీస విద్యార్హతలు లేని గ్రామీణ వ్యవసాయదారులు పట్టణాలకు వలస వచ్చి నిర్మాణ, ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్నారు. సంప్రదాయ పద్ధతి ప్రకారం వస్తున్న వ్యవసాయాన్ని వదిలి వ్యవసాయేతర

**పి. రత్నాకర్,** సహాయ సంచాలకుడు, పత్రికా సమాచార కార్యాలయం, భారత ప్రభుత్వం, హైదరాబాద్

పనులు చేపట్టడం వల్ల వీరికి ఆ పనిలో నైపుణ్యం ఉండటంలేదు. కనీసం ఎనిమిదవ తరగతి కూడా చదవని వారికి వృత్తి శిక్షణ ఇవ్వడం కూడా కొంతమేరకు కష్టంతోకూడుకొన్నది.

వ్యవసాయ రంగం తరువాత ఎక్కువమంది ఆధారపడిన రెండవ అతిపెద్ద పరిశ్రమ భవన నిర్మాణ రంగం. నిర్మాణ రంగంలో మౌలిక మరియు రియల్ ఎస్టేట్ లలో 26 మిలియన్ల మంది పనిచేస్తున్నారు. రానున్న దశాబ్ద కాలంలో 47 మిలియన్ల మంది ఈ రంగానికి అవసరం అని అంచనా! భారత ఆర్థిక వ్యవస్థలో ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ రంగానికి సంబంధించి నైపుణ్య అభివృద్ధికి ఒక విధానం అంటూ లేదు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న వారంతా నైపుణ్యం లేని పనివారే కావడం గమనార్హం . దేశ చరిత్రలో మెదటి సారిగా 11వ ప్రణాళికా సంఘం నైపుణ్యాలకు సంబంధించి భారత దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి ఒక అధ్యాయాన్ని పొందుపరిచింది. వ్యవసాయ దాని అనుబంధ రంగాల్లో పని చేస్తున్న 219 మిలియన్‌ల మందిలో కేవలం 0.75 మిలియన్ల మంది మాత్రమే సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నారు. తయారీ రంగంలో నాలుగ శాతం, సేవా రంగంలో 6 శాతం, ఇతర రంగాల్లో రెండు శాతం మంది మాత్రమే నైపుణ్య పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నారు.

భవన నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతున్న వారి విద్యకు సంబంధించిన వివరాలు

| వర్గం | ఉపాధి పొందుతున్న వారి శాతం | మొత్తం ఉపాధి (మిలియన్లు ) |
|---|---|---|
| నైపుణ్యంలేని పనివారు | 83% | 25.6 |
| నైపుణ్యంగల పనివారు | 10% | 3.3 |
| ఇంజనీర్లు | 3% | 0.8 |
| టెక్నీషియన్లు, ఫోర్మెన్ | 2% | 0.6 |
| క్లరికల్ | 2% | 0.7 |

ఆధారం : ప్రణాళికా సంఘం, భారత ప్రభుత్వం.

11వ పంచవర్ష ప్రణాళికలో పేర్కొన్నట్లు 15–29 సంవత్సరాల మధ్యనున్న వారిలో కేవలం రెండు శాతం మంది మాత్రమే వృత్తి విద్యను పూర్తిచేశారు. మరో ఎనిమిది శాతం మంది అనియత విద్య ద్వారా (ఇన్ఫార్మల్ ఒకేషనల్) వృత్తి విద్యను పూర్తి చేయడం జరిగింది. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినపుడు మన దేశంలో నైపుణ్యంగల సిబ్బంది చాలా తక్కువగానే ఉన్నారని చెప్పవచ్చు. ఈ విషయంలో భారతదేశం తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నది. మొత్తం పనిచేస్తున్న వారిలో కేవలం 2.3 శాతం మంది మాత్రమే శిక్షణ పొందిన నైపుణ్యంగల వారు ఉన్నారు. అదే ఇతర దేశాలతో పోల్చినపుడు బ్రిటన్‌లో 68 శాతం మంది, జర్మనీలో 75 శాతం మంది, అమెరికాలో 52 శాతం మంది, జపాన్‌లో 80 శాతం మంది, దక్షిణ కొరియాలో 96 మంది నైపుణ్యంకల పనివారు ఉన్నారు. చదువుకున్నవారిలో ఎక్కువ మందికి ఉద్యోగానికి సంబంధించి కొద్దో, గోప్పో నైపుణ్యం లేకపోవడం వల్ల చాలా మందికి సరైన ఉద్యోగాలు లభించడంలేదు. ఒక అంచనా ప్రకారం 2013–14 సంవత్సరంలో సుమారు ఏడు మిలియన్ల మంది నిపుణులు అవసరం. జనాభా పరంగా చూస్తే కేవలం మన దేశ అవసరాలను తీర్చుకోవడమే కాకుండా ఇతర అభివృద్ధి చెందిన దేశాల అవసరాలకు అనుగుణంగా ఏర్పడుతున్న కొరతను భర్తీ చేయగల సామర్థ్యం భారత దేశానికి ఉంది. ప్రపంచ దేశాల్లో యువశక్తి అధికంగా ఉన్న దేశాల్లో భారత దేశం ఒకటి. దేశం మొత్తం జనాభాలో 54 శాతంపైగా 25 సంవత్సరాలలోపు యువత ఉన్నారు. 62 శాతం మంది పని చేయగలవయసులో ఉన్నారు.

**దేశంలో వృత్తి విద్యా శిక్షణ:** కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ నిధులు పొందుతున్న ఎనిమిది వేల పారిశ్రామిక శిక్షణా సంస్థలు, కేంద్రాలు ఉన్నాయి. అన్ని సంస్థలు, కేంద్రాలు కలిపి ఏడాదికి కేవలం ఒక మిలియన్ మందికి మాత్రమే శిక్షణ ఇస్తున్నాయి. అయితే మన దేశంలో ప్రతి ఏడాదికి 13 మిలియన్ల మంది అదనంగా పనిలో చేరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కోర్సు అనంతరం శిక్షణ, ఉద్యోగాల విషయంలో పనితీరు ఆశా జనకంగా లేదు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా పాఠ్యాంశాలు లేకపోవడం, ప్రవేటు భాగస్వామ్యం లేకపోవడం, చేసే పనికి ఇచ్చే శిక్షణకూ సంబంధం లేకపోవడాన్ని 11వ పంచవర్ష ప్రణాళికా సంఘం ఎత్తిచూపింది. 2022 నాటికి 500 మిలియన్ల మందికి శిక్షణ ఇవ్వడంలో భాగంగా ప్రభుత్వం నైపుణ్యాల అభివృద్ధికి ఒక సమన్వయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ సంఖ్యను 402 మిలియన్లకు తగ్గించింది. అందులో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసింది. (1) నైపుణ్యాల అభివృద్ధిపై ప్రధానమంత్రి జాతీయ మండలి, (2) జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సమన్వయ బోర్డ్, (3) జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ.

వృత్తి విద్యా శిక్షణ పొందుతున్న వారిలో ఎక్కువ శాతం మంది సేవా రంగానికి సంబందించి, 33 శాతం మంది, ఉత్పత్తి రంగానికి సంబందించి 31 శాతం మంది, వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలకు సంబంధించి 27 శాతం మంది తయారీ రంగం నుండి పరిశ్రమలలో 9 శాతం మంది ఉన్నారు. అయితే సాంకేతిక విద్య తక్కువ స్థాయిలో ఉన్నంత మాత్రాన తయారీ రంగంతో పోల్చినపుడు వ్యవసాయ రంగంలో అంతగా సమస్యలు ఉండవు. 2022 నాటికి వ్యవసాయ రంగంలో 190 మిలియన్ల మంది ఉంటారని, వారిలో 38

మిలియన్ల మంది నైపుణ్యం సాధిస్తారని ఒక అంచనా. ఇదే సమయానికి వ్యవసాయేతర రంగంలో పని చేసే వారి సంఖ్య 215 మిలియన్ల నుండి 385 మిలియన్ల వరకు పెరగవచ్చు. 2022 నాటికి 402 మిలియన్ల మందిని నైపుణ్యం కలవారిగా తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీరిలో 54 శాతం మంది అంటే 215 మిలియన్ల మంది వ్యవసాయ రంగానికి చెందినవారు ఉన్నారు. ఇదే సమయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ దాని అనుబంధ సర్వీసులలోకన్నా నిర్మాణ రంగంలో ఆరు రెట్లు అధికంగా ఉద్యోగాలు సృష్టించబడతాయని భారత ప్రభుత్వం అంచనా. రక్షణ శాఖలో పని చేస్తున్న 60 వేల మందికి పదవీ విరమణకు ఏడాది ముందు నైపుణ్యాల మీద శిక్షణ ఇచ్చి వారిని పారిశ్రామికులుగా తీర్చిదిద్దడానికి వీలుగా రక్షణ శాఖ, నైపుణ్యాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 9 నుండి 12వ తరగతి వరకు దశలవారిగా వృత్తి విద్యా తరగతులను ప్రవేశపెడతారు. అదే విధంగా రసాయనాలు, పెట్రోకెమికల్స్, ఔషధాలు, ఎరువుల రంగంలో ఒక కోటి 10 లక్షలమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 80 శాతం మందికి నైపుణ్య కొరత ఉన్నది. అలాంటి వారందరికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం, నైపుణ్యాల స్థాయిని పెంచడం అవసరం. 2022 నాటికి రసాయనాల రంగంలో ఒక మిలియన్ మంది, పెట్రోకెమికల్ రంగంలో 90 వేలమంది, ఔషధ రంగంలో 35 లక్షల మంది నిపుణులైన సిబ్బంది అదనంగా అవసరం ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియాతో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం ప్రకారం 92 వేల మంది రెగ్యులర్, 90 వేల మంది కాంట్రాక్టు సిబ్బందికి శిక్షణ ఇస్తారు. నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా పెట్రోలియం, బొగ్గు, భారీ పరిశ్రమలు, విద్యుత్, రైల్వేలు, ఆరోగ్యం, రసాయనాల మంత్రిత్వ శాఖలు ఇప్పటికే అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన ఉమ్మడి నిబంధనల ప్రకారం నైపుణ్యాల శిక్షణకు కనీసం 200 గంటలు గానూ, నైపుణ్యాలను మెరుగు పరచుకోడానికి కనీసం 80 గంటలుగా కోర్సును రూపొందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.2కోట్లు మందికి శిక్షణ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు నిపుణులైన ఆర్కిటెక్స్, ప్లంబర్స్, మేస్త్రీలు చాలా అవసరం. ఈ కొరతను అధిగమించడానికి ప్రభుత్వం పలు బహుళ నైపుణ్య అభివృద్ధి చర్యలను దేశ వ్యాప్తంగా ప్రారంభించింది. అయితే ఇవి దినసరి పనివారికి ఒక మార్గం చూపలేక పోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోది నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నైపుణ్యాల అభివృద్ధికి ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా యువతలో నైపుణ్యాలను అభివృద్ధి పరచి వారికి పూర్తి స్థాయి శిక్షణను ఇవ్వడానికి భారత ప్రభుత్వం ప్రధానమంత్రి కౌషల్ వికాస్ యోజన రూపొందించింది. దేశంలో 24 కోట్లమంది యువతకి సుమారు 1500 వందల కోట్ల రూపాయల వ్యయంతో 543 పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా భారత ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

ప్రస్తుతం దేశంలో 40 కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వారికి సరైన వృత్తి నైపుణ్యంగాని, శిక్షణగాని లేదు. అతి కొద్ది మంది మాత్రమే నైపుణ్యంగల పనివారు ఉన్నారు. ఆర్థిక రంగానికి సంబంధించి నైపుణ్యం కలిగిన పనివారు చాలా తక్కువ మంది ఉన్నారు. తక్కువ నైపుణ్యం కల పనివారు ఉండడంవల్ల ఉత్పాదకత కూడా తక్కువగా నమోదు అవుతుంది. ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో యువత ఆర్థిక, జీవనోపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణ దేశానికి ఒక కీలక ప్రాధాన్య అంశం అయ్యింది. ఆర్థిక అభివృద్ధి కోసమే కాకుండా నాణ్యత, మంచి జీతాలు పొందడానికి, స్వయం ఉపాధి అవకాశాలు పొందాలన్న యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాల శిక్షణ సహాయపడుతుంది. పెద్ద సంఖ్యలో శిక్షణ ఉంటే జనాభా పరంగా అది భారతదేశానికి మంచి అవకాశం. అభివృద్ధి చెందిన దేశాలకు మనం నైపుణ్యం, శిక్షణ కలిగిన వారిని సమకూర్చడానికి మంచి అవకాశంగా భావించవచ్చు. ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందిలో ఎలాంటి సర్టిఫికేట్ లేని 80 శాతం మందికి ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.


**ఈ పథకం లక్ష్యాలు :** నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ పొందిన వారిని ప్రోత్సహించంతోబాటు, నిర్దేశిత శిక్షణ విజయవంతంగా పూర్తిచేసిన వారికి నగదు ప్రోత్సాహాలు ఇవ్వడం ప్రధాన లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం రూపొందించింది. యువతను నైపుణ్య శిక్షణ పొందుకునే విధంగా ప్రోత్సహించి, వారిని ఉద్యోగులుగా మార్చడంతోపాటు, జీవనోపాధి సంపాదించుకునే విధంగా తీర్చిదిద్దడం. ప్రస్తుతం ఉన్న పనివారితో ఉత్పాదకత

పెంచడం, దేశఅవసరాలకు తగ్గట్టుగాశిక్షణ, సర్టిఫికేషన్ ఇవ్వడం ఈ పథకం లక్ష్యాలు.

ప్రధానమంత్రి కౌషల్ వికాస యోజన ద్వారా ఉద్యోగ అవకాశాల కోసం గుర్తించిన విభాగాలు: వ్యవసాయం నగలు, పరిశ్రమ, ఆటోమోటివ్, బ్యూటీ, కేపిటల్ గూడ్స్, నిర్మాణ రంగం, ఎలక్ట్రానిక్స్, జెమ్స్, జువెలరీ, ఆరోగ్య రంగం, ఐరన్, స్టీల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తోలు పరిశ్రమ, లైఫ్ సైన్స్, మైనింగ్, మీడియా మరియు వినోదము, ప్లంబింగ్, రిటైల్ వర్తకము, సెక్యూరిటీ, టెలికాం, వస్త్ర పరిశ్రమ, పర్యాటకం, ఆతిధ్యం, మౌళిక సదుపాయాలు, ఫర్నీచర్ ఫిట్టింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ మొదలైనవి భారత ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమంలో భాగంగా 2022 నాటికి నైపుణ్య భారతంగా మారాలంటే ప్రతి రంగంలో నిపుణులైన సిబ్బంది అవసరం చాలా ఉంది. వృత్తి విద్య పట్ల భారతీయులకు చిన్న చూపు ఉందని ఇంతకు ముందు ఒకసారి ప్రపంచ బ్యాంకు వ్యాఖ్యానించింది. మనం నిపుణులుగా మారాలంటే తప్పనిసరిగా చేస్తున్న పనిలో శిక్షణ తీసుకోవాల్సిందే. మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకున్నపుడు దేశ ఆధిక వ్యవస్థ మరింతగా ప్రగతి వైపు పయనిస్తుంది. నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల మన దేశం లోనే కాకుండా ఇతర దేశాలకు వెళ్ళి పని చేసుకోడానికి ఈ శిక్షణ తోడ్పడుతుంది.

## భారత్‌లో స్విట్జర్లాండ్ నైపుణ్య శిక్షణా కేంద్రాలు

భారత్ లో స్విట్జర్లాండ్ తరహా నైపుణ్య శిక్షణా కేంద్రాలు అంతర్జాతీయ నిపుణులకు డిమాండు బాగా పెరుగుతున్నది. డిమాండుకు తగ్గట్టుగా నిపుణులను తయారు చేయడానికి, వారికి శిక్షణ ఇవ్వడానికి స్విట్జర్లాండ్ బెంగళూరులో స్కిల్ సోనిక్స్ పేరు మీద ఒక శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పింది. నైపుణ్య శిక్షణ, విద్యకు సంబంధించి భారత దేశంతో సంబంధాలను విస్తరించుకోవడంలో భాగంగా స్విట్జర్లాండ్ మన దేశంలో మరో నాలుగు నైపుణ్య శిక్షణా కేంద్రాలను ప్రారంభించనున్నది. స్విస్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ లో భాగంగా బెంగళూరులో ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ కేంద్రాన్ని స్థాపించింది. సంప్రదాయ మెకానికల్, ఎలక్ట్రికల్ పనులు కాకుండా ఫుడ్ ప్రాసెసింగ్, ఆతిధ్య రంగం, ఫ్యాక్టరీ నిర్వహణలో శిక్షణనిస్తుంది.




ఆధారం : ప్రణాళిక సంఘం, భారత ప్రభుత్వం

ముందడుగు

# మహిళల నైపుణ్యాభివృద్ధికి ఆటంకాలు



ఒక ప్రముఖ అధ్యయనం ప్రకారం, ప్రసూతి సెలవులు మరియు పిల్లల సంరక్షణా కేంద్రాల నిర్వహణ మొదలైనవి స్త్రీ ఉపాధిలో యజమానులపై పడుతున్న ఆర్థిక భారంగా ఉంది. వీరికి ప్రత్యేక ప్రయోజనాలు వర్తింపచేయటం కంటే అసలు వీరికి ఉపాధి కల్పించాలా, వద్దా అని ఆలోచిస్తున్నారు.

నైపుణ్య భారత్ అన్న విషయానికి సర్వత్రా సమర్థనీయత ఆసక్తి కనబడుతున్నాయి. కానీ, మహిళలకు నైపుణ్యాభివృద్ధి విషయంలో ఏర్పడుతున్న అవరోధకారకాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరొకవైపు వారి నైపుణ్యాభివృద్ధికి దోహదపడే కారకాలను విస్తృత పరచాల్సిన అవసరం కూడా ఉంది. నైపుణ్య శిక్షణలో స్త్రీల సంఖ్యను పెంచటం ఒక్కటే సరిపోదు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ మంది స్త్రీలకు నైపుణ్య శిక్షణ పొందటానికి ఏర్పడే అవరోధాలను నైపుణ్యంపొందిన స్త్రీలకు ఉపాధి పొందడంలోఉన్న అవరోధాలను తొలగించడం చాలా అవసరం.

ఎక్కువ మంది బాలికలు, స్త్రీలు ఐటిఐ సంబంధిత రంగాలలో శిక్షణకు ముందుకు రావడం లేదు. మరో పక్క అదే సమయంలో కంప్యూటర్ శిక్షణకు అసంఖ్యాకంగా ఎగబడుతున్నారు. శిక్షణకు అయ్యే ఖర్చును సమర్థించుకోవడానికి ఒక నైపుణ్యత లేని ఉపాధికన్నా ఎక్కువగా శిక్షణ పొందిన వారికి ఉపాధి హామీ కల్పించడం చాలా అవసరం.

ఇక్కడ ఉత్పాదక రంగంలో పనిచేసే మహిళలకు, ఐటి రంగంలో పని చేసే మహిళలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించవచ్చు. గర్భధారణ రోజుల్లో లేదా పిల్లలు కలిగిన తర్వాత ఒక ఉపాధి పొందుతున్న స్త్రీ తన గురించి తన కుటుంబం గురించి జాగ్రత్త పడాల్సిన అవసరం చాలా ఉంది. సనాతన సంప్రదాయాలు శిశు సంరక్షణ స్త్రీ బాధ్యతగా నిర్దేశిస్తున్నాయి. అందువలన శిశు సంరక్షణ భారం మొత్తం ఆడవారిపైనే పడుతున్నది.

ఐ.టి. రంగంలో లేదా న్యాయ, వైద్య వంటి ఇతర రంగాలలో ఉన్న మహిళల సంపాదన వారి బిడ్డల సంరక్షణకు సరిపోయే విధంగా ఉంటుంది. దీనికి తోడు ఎన్నో ఐటి సంస్థలు శిక్షణ పొందిన స్త్రీలను ఉపయోగించుకునే క్రమంలో సరళమైన పని విధానాలతోటి మరియు వీరి ఇళ్ళ నుండే పనిచేసుకునే వెసులుబాటును అనుమతిస్తున్నాయి. తత్ఫలితంగా అటువంటి రంగాలలో ఉన్న స్త్రీలు పిల్లల సంరక్షణ కోసం వారి వృత్తులను వదలాల్సిన అవసరం లేకపోతున్నది.

ఉత్పత్తి రంగంలో మరొకవైపు ఆడవారి ఆదాయం పిల్లల సంరక్షణకు ఏ రకంగానూ సరిపోని పరిస్థితి. అదేవిధంగా చాలా తక్కువ పరిశ్రమలు మాత్రమే క్రెషస్‌ను కల్పిస్తున్నాయి. తత్ఫలితంగా వస్త్ర పరిశ్రమలో చేసే టైలర్‌లైనా, ఎలక్ట్రానిక్ పరిశ్రమలో పని

**దేవ్‌నాథన్,** అతిథి ఆచార్యుడు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ

పని చేసే ప్లంబ్లర్‌లు అయినా పిల్లలు కలిగిన వెంటనే వారి వృత్తిని వదిలేస్తున్నారు. వీరిలో కొంతమంది వస్త్ర పరిశ్రమలోనే చాలా తక్కువ కూలీకి వారి ఇంటి నుండి పని చేసే విధంగా సర్దుకుంటున్నారు. వారు సరళతతో వారి వృత్తిని సంబాళించుకో గలిగినప్పటికీ చాలా తక్కువ వేతనం పొందుతున్నారు. వారి పిల్లల సంరక్షణా బాధ్యతలతోటి వారి పరిశ్రమ రెగ్యులర్ సమయంలో పని చేయటం కుదరకపోవడం వల్ల వారు ఇలా రాజీ పడుతున్నారు. అధిక ఆదాయం ఉండే వృత్తులు కన్నా ఈ ఉత్పత్తి రంగంలో ఉన్న అడ్డంకుల దృష్ట్యా, మరియు పరిశ్రమ పరంగా పిల్లల సంరక్షణా కేంద్రాలు లేనందువల్ల స్త్రీలు తమ వృత్తిని నైపుణ్య కార్మికులుగా ఎంచుకోవటానికి వెనకడుగు వేస్తున్నారు.

ఇలా తగ్గుతున్న స్త్రీల భాగస్వామ్యం గురించిన ఈ చర్చల్లో ముందుగా స్త్రీల గృహ బాధ్యత మరియు పిల్లల సంరక్షణాబాధ్యతల మీద దృష్టి సారిస్తే కార్మిక శక్తిలోకి వీరు అడుగిడేందుకు ఏర్పడుతున్న అవరోధాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఉత్పాదక రంగంలో ఇంటికి దూరంగా రెగ్యులర్ సమయంలో పని చేయాల్సి రావడం అన్న విషయం మీద దృష్టి సారించాలి.

మరి డిమాండ్ మాటేమిటి? ఎందుకని యజమానులు నైపుణ్యం కలిగిన స్త్రీలు అందుబాటులో ఉన్నపుడు ఉపాధి కల్పించరు? ప్రస్తుతం ఒక స్త్రీకి ఉపాధి కల్పనకు అయ్యే ఖర్చు అనగా పురుడు, పిల్లల సంరక్షణ మొదలైనవన్నీ యజమానే భరించాలి ఖర్చులను గమనించనట్లయితే ఏ యజమాని అయినా పురుడు, పిల్లల సంరక్షణా వంటి ప్రయోజనాలను మగవారికి చెల్లించాల్సిన అవసరం లేని కారణంగా మగవారికి ఉపాధి కల్పించటానికి ఆసక్తి చూపిస్తారు.

అంటే ప్రసూతి, పిల్లల సంరక్షణ వంటి ప్రయోజనాలను స్త్రీకార్మికులకు చెల్లించాల్సిన కారణంగా వారికి ఉపాధి కల్పించకపోవడం వారిని నిరుత్సాహపరచడం కాదా? ఈ విధంగా చేయటం వలన స్త్రీ కార్మికుల వలన ఆ సంస్థ మీద యజమాని మీద అదనపు భారం పడుతున్నది. దీనికి ఉన్న ఒకే ఒక్క పరిష్కారం ఆ బాధ్యతను పన్ను విధానము ద్వారా ప్రభుత్వమే భరించటం. ప్రసూతి మరియు పిల్లల సంరక్షణ ఖర్చులకు సంబంధించిన పన్నులు యజమాని మీద మాత్రమే కాకుండా పన్ను చెల్లింపుదారులు అందరిమీద ఉంటుంది.

కానీ ఈ విధానం పన్ను చెల్లింపు దారులు ఎవ్వరూ సమర్థించరు. మధ్యతరగతి పన్ను చెల్లింపుదార్లు పరోక్షంగా పన్ను చెల్లిస్తున్న మొత్తం జనాభాతో సహా స్త్రీలకుఉపాధి కల్పించటానికి తమ పన్నుల ద్వారా యజమానులకు సహాయం చేయమంటే ఏ రకంగానూ సమర్థించరు. ఈ కారణంగా యజమానుల పైన సెస్సు విధానము ప్రవేశపెట్టడమే సరైన పద్ధతి. ఈసెస్సును పరిశ్రమల వారీగా స్త్రీకార్మికులకు ప్రసూతి మరియు సంబంధిత ప్రయోజనాలకు ఉపయోగించాలి. ఈ సెస్సులు వలన యజమానులు అందరిమీద ఒక నిర్థిష్టమైన భారము పడుతుంది. అదికూడా స్త్రీ ఉపాధి కల్పించే యజమానులు అనిగాకుండా యజమానులు అందరిపైన సమానమైన భారం పడుతుంది. లాభంలో ఇంతశాతం లేదా సిఎస్ఆర్ ఖర్చుల మీద 2శాతం సెస్సుగా చెల్లించాలన్న చట్టంతోటి ఈ సెస్సు వసూలు సాధ్య పడుతుంది. ఈ సెస్సు వసూలు అన్న విషయంగా నైపుణ్యంకలిగిన స్త్రీలకు ఉపాధి కల్పించటంలో ఆ యజమానులకు ఎటువంటి అదనపు భారం ఉండదు.

ఉత్పాదనా రంగంలో నైపుణ్య కార్మికులుగా స్త్రీలు ఉపాధి పొందటంలో అడ్డంకిగా ఉన్న మూడవ కారకం ఉంది. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తిని చేరుకోవటానికి పరిశ్రమలు రాత్రి షిఫ్ట్‌తో సహా మూడు షిఫ్ట్‌లు పనిచేయాల్సి వస్తుంది కానీ భారత్‌లో బహిరంగ ప్రదేశాలలో రాత్రిళ్లు స్త్రీలు సంచరించటం కష్టసాధ్యం! ఢిల్లీలో డిసెంబర్ 2012న ఒక ఫార్మసిస్ట్ శిక్షణలోనున్న యువతిపై జరిగిన భయంకరమైన అత్యాచార మరియు హత్య సంఘటన దేశ రాజధానిలోనే బహిరంగ ప్రదేశాలలో స్త్రీలకు కరువైన భద్రతకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. కాల్‌సెంటర్ సంస్థలు మరియు ఐటి సంస్థలు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులను వారి ఉద్యోగులకు రానూ పోనూ రవాణా సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా కొంత మేర అధిగమిస్తున్నాయి. కానీ ఇటువంటి ఖర్చులను లాభాలు తక్కువగా ఉండే ఉత్పాదక సంస్థలు భరించలేవు. కావున స్త్రీలకు బహిరంగ ప్రదేశాలలో ముఖ్యంగా రాత్రుళ్ళు కొరవడిన భద్రతను నైపుణ్యకార్మికులుగా స్త్రీలు ఉపాధి పొందటంలో మరొక అవరోధకారకంగా చెప్పుకోవచ్చును.

ఒక ప్రముఖ అధ్యయనం ప్రకారం, ప్రసూతి సెలవులు మరియు పిల్లల సంరక్షణా కేంద్రాల నిర్వహణ మొదలైనవి స్త్రీ ఉపాధిలో యజమానులపై పడుతున్న ఆర్థిక భారాన్ని ప్రత్యేక ప్రయోజనాలుగా పరిగణించేయటం కంటే అసలు వీరికి ఉపాధి కల్పించాలా, వద్దా అనే విషయంగా యజమానులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. దీని ప్రకారం ఎక్కడయితే ఆర్థిక సమానత్వం చేపట్టారో, ఎక్కడ మహిళలకు ఉపాధి అవకాశాలపై ఫిర్యాదులు ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయో అక్కడ సరైన కారణాలను తెలుపకుండానే మహిళా నియామకాలను పెంచడానికి ఇష్టపడటం లేదు. డిసెంబర్ 2012లో ఢిల్లీలో జరిగిన భయంకర అత్యాచార హత్య సంఘటనానంతరం రాత్రిళ్లు స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో సంచరించరాదని అనేక మంది వాదిస్తున్నారు. స్త్రీలకు బహిరంగ ప్రదేశాలలో రక్షణ కల్పించటానికి బదులుగా స్త్రీలను రాత్రిళ్ళు తమ గృహాలను వదిలి వెళ్ళరాదు అని కట్టడి చేయటం కూడా నైపుణ్య ఉపాధి మరియు వృత్తులలో స్త్రీలు అడుగిడలేక పోవడానికి ముఖ్య అవరోధంగా చెప్పుకోవచ్చును.

ఈ వ్యాఖ్యానంలోని వాదనాను సారం స్త్రీ నైపుణ్యతను విస్తృత పరచటానికి ముఖ్యంగా మూడు అవరోధకారకాలతోటి వ్యవహరించాల్సి ఉంటుంది. 1. ప్రసూతి సమయంలో పిల్లల సంరక్షణ ఏర్పాటు లేకపోవడం 2. మహిళా కార్మికులకు ఉపాధి కల్పించిన సంస్థల యజమానులు ప్రసూతి ఖర్చులను భరించలేకపోవడం. 3. బహిరంగ ప్రదేశాలలో ముఖ్యంగా రాత్రిళ్ళు స్త్రీలకు ఏ విధమైన రక్షణా భద్రత లేకపోవడం. ■

# చేనేతకు చేయూతతో సంప్రదాయ పరిరక్షణ

HANDLOOM LOGO

**ప్రపంచ చేనేత తయారీలో 85శాతం వాటా మనదే. పరిజ్ఞానం లేనివారు చేనేత, మరమగ్గాల ఉత్పత్తుల మధ్య తేడా గుర్తించడం కష్టం. చేనేత పేరుమీద మరమగ్గాల ఉత్పత్తులను చలామణీ చేస్తుంటారు. చేనేతను గుర్తించడానికి ఒక వ్యాపార చిహ్నం కూడా ఉంది. దీన్ని అసలు చేనేత ఉత్పత్తుల మీదనే ముద్రిస్తారు.**

కొత్త పెళ్ళికూతురు మెరిసిపోయేది ఝరీచీరలోనే ! ఆ మెరుపు మన సంస్కృతిది, ఆ మెరుపు మన వారసత్వానిది. ఆ మెరుపును సృష్టించింది మాత్రం మన చేనేతే. ఈ హస్తకళా నైపుణ్యం రుగ్వేదం నుండి మొదలు పెట్టి మహాభారత, రామాయణాల మీదుగా ఈనాటి వరకు అందరి మెప్పూ పొందుతూ వస్తున్నది. మొహంజాదారో, హరప్పా తవ్వకాల్లో కన్పించిన మన పూర్వీకుల వస్తువుల్లో... చేతితో నేసిన వస్త్రం, ఎముకల నుండి చేసిన సూదులు, కదుర్లు (నేత పనిముట్లు) కూడా ఉన్నాయి. ఈజిప్టు సమాధుల్లో, అద్దకపు వస్త్రాలు వీటితో లభ్యమయ్యాయి. గుజరాత్ ప్రాంతానికి చెందినవి క్రీ.పూ. 19వ శతాబ్ద కాలానికే మన నేత వస్త్రాలు విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. ఈ హస్తకళా నైపుణ్యం తరాల తరబడి కొనసాగుతూ వస్తున్నది. ఈ వేళ మనదేశంలో 40 లక్షల మంది చేనేత పనివారు, వారి సహాయకులు ఉన్నారు. వీరిలో ఎక్కువ భాగం స్త్రీలు, ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి కులాలవారు. వ్యవసాయరంగం తరువాత ఇంత పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే రంగం ఇదే. పర్యావరణ హితమైన ఈ పరిశ్రమ ఏ ఒక్క ప్రాంతానికో పరిమితంకాక, విస్తృతంగా వ్యాపించి ఉంది, ముఖ్యంగా పల్లెప్రాంతాల్లో. అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థకు దీని అసరా చాలా ప్రముఖమైనది.

**సముచిత స్థానం**

అయితే 2010నాటి చేనేత లెక్కలు మరో చిత్రాన్ని చూపుతున్నాయి. చేనేత కార్మికుల సంఖ్య ఏటా 7శాతం చొప్పున తగ్గుతున్నది. మగ్గాల సంఖ్య కూడా తగ్గిపోతున్నది. నవతరాన్ని ఈ రంగం ఆకర్షించలేకపోతున్నది. ఇవన్నీ చూస్తుంటే ఇది అస్తమిస్తున్న పరిశ్రమల జాబితాలోకి నెట్టివేయబడుతున్నదా అన్న ఆందోళన కలుగుతున్నది.

ఈ తిరోగమనానికి కూడా అనేక కారణాలు ఉన్నాయి. ఇతర రంగాలలో కార్మికుల సగటువేతనం నెలకు రూ. 4,500 ఉంటే, చేనేత పని వారికి ఇది రూ. 3,400లు మాత్రమే. కళాకారుడికి కడుపునిండా తిండి దొరకకపోతే వాడిచేతిలోని కళకూడా వెలవెలపోతుంది. చెయ్యితిరిగిన వర్ణచిత్రకారుల చిత్రాలకు లాగా సమాజంలో ఒక సముచిత స్థానం దక్కాలి. ఇది జరగాలంటే ఈ రంగానికి ఉన్న సానుకూలతలను మొదట

**మోనిక ఎస్.గార్గ్,** సంయుక్త కార్యదర్శి, కేంద్ర జౌళిమంత్రిత్వ శాఖ. e-mail : maanikagarg@gmail.com

గుర్తించి వాటిని మరింత బలోపేతం చేసుకోవాలి.

వివిధ రకాలైన హస్తకళా వస్తువులను ముమ్మరంగా తయారు చేయడంలో ప్రపంచంలో భారత్‌కు విశిష్ఠ స్థానం ఉంది. ప్రపంచ చేనేత తయారీలో 85శాతం వాటా మనదే. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, కంబోడియా, ఇండోనేషియాలో కూడా చేనేత చురుగ్గా ఉన్నా, వారి ఉత్పాదక శ్రేణి చాలా తక్కువ. అవి వారి స్థానిక వినిమయానికే సరి పోతాయి. కానీ మన ఎగుమతులు 2009–10లో 26లక్షల డాలర్లు కాగా, 2013–14లో 37లక్షల డాలర్లకు పెరిగింది. అంటే 40శాతం వృద్ధి నమోదయింది. దీనితో మనకు తెలిసొచ్చిందే మిటంటే – ఈ రంగంలో కూడా మనం ఇంత బలంగా ఉన్నామని. ప్రపంచంలో చేనేత ఉత్పత్తులకు గిరాకీ ఎంత పెరిగినా తట్టుకునే సామర్థ్యం మనకుంది. కారణం– మన జనాభా మన బలం. సాంస్కృతిక వారసత్వ వైవిధ్యం మన బలం. ఇక దీనికి కావలసింది... వేగంగా మారుతున్న కాలానికీ, అభిరుచులకు తగ్గట్లు, లక్ష్యాలను నిర్దేశించుకునే ప్రణాళికలే. ఇదే చేనేత పరిశ్రమ నుండి మనం ఆశించేది. సుసంపన్న సంప్రదాయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూనే, ఆధునికతను కూడా అలవర్చుకోవాలి అని. ఉదాహరణకు బనారస్ చీరలు, చందేరీ చీరలు నేసేవాళ్లు వాళ్ళ పనిని ఆధునికీకరిం చుకుంటే వ్యాపారం పెరుగుతుంది, దానితోపాటూ ఆదాయం కూడా. ఆడవాళ్ళు మెడలో వదులుగా వేసుకునే (స్టోల్, చున్నీ) వస్త్రాలు, స్కార్ఫ్‌లు, టైలు, బెల్టులు, వ్యానిటీ బ్యాగులు, పర్సులు, చేతికి కట్టుకునే బ్యాండ్‌లు లేదా ఇంట్లో వస్తువులకు అలంకరణలుగా వాడే కుషన్ కవర్లు, , టేబుల్ క్లాత్‌లు, కర్టెన్లవంటి ఎగుమతి గిరాకీ ఉన్న వస్తువుల తయారీలోకి చేనేత ప్రవేశిస్తే ఆదాయం బాగా పెరుగుతుంది. ఉత్పత్తుల్లో ఇంత వైవిధ్యం కావాలంటే ఒకరో ఇద్దరో చేనేత పనివారితో అయ్యేపనికాదు, వీరికీ డిజైనర్లకూ మధ్య గట్టి వ్యాపార సంబంధాలు ఏర్పడాలి. ఈదిశగా జాతీయ ఫ్యాషన్ టెక్నాజీ సంస్థ (NIFT-National Institute of Fashion Technology) ముందడుగు వేసింది. దాని పాఠ్య ప్రణాళికలో ఈ అంశాన్ని కూడా చేర్చింది. విద్యార్థులను చేనేత పనివారి సందర్శనకు తీసుకెళ్ళి సంప్రదాయ కళల పట్ల అవగాహన కల్పిస్తూనే వీరి విప్లవాత్మకమైన, సృజనాత్మకమైన డిజైన్ల ద్వారా నేత పనివారు ప్రయోజనం పొందేలా కృషి చేస్తున్నది. పూస బొమ్మకు గిరాకీ ఉంది. అది చేసే పనివారికి సంపాదనకూడా ఉంది. ఆ బొమ్మకువాడే ముడి సరుకులతోనే వారు ఆకర్షణీయమైన చెవిరింగులను, కార్లలో వేలాడదీసే బొమ్మలవంటి వైవిధ్య ఉత్పత్తులను రూపొందిస్తే దీనికి పదింతలు ఆదాయం. కోట్‌స్టర్లు, నాప్‌కిన్ హోల్డర్లు చేస్తే పదింతలు సంపాదించవచ్చు. ఇదే జరగాలంటే బాగా అధ్యయనం, మార్కెట్లో డిమాండ్ పరిశీలన, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి.

**వైవిధ్యం**

ఆకర్షణీయమైన డిజైన్‌తో వస్తువు విలువ పెరిగేమాట నిజమే అయినా, మార్కెటింగ్ ఇక్కడ కీలకం. ఈ రోజున మార్కెట్లలో వస్తున్న వైవిధ్యాన్ని గుర్తించడంలో చేనేతరంగం విఫలమవుతున్నది. పటన్ పటోళా, కాణీ, బాబాచారీ, జామ్దానీవంటి వస్తువులు మార్కెట్ స్థాయిని విశ్లేషించి, దానికి వారి పనితనాన్ని, సృజనాత్మక ఆలోచనను పౌరాణిక గాథతో, చిహ్నాలతో జోడిస్తూ 'సంపన్నులను' లక్ష్యంగా చేసుకుని రూపొందించాలి.

**డిజైన్లలో క్లిష్టత**

ఈ వేళ చేనేత మరమగ్గా ఉత్పత్తుల నుంచీ, దిగుమతుల నుంచీ కూడా ఉత్పత్తులకు పెద్ద ప్రమాదం పొంచి ఉన్నది. మరమగ్గం మీద నేసిన బట్ట చౌక. వాటిని వివిధ రకాల ఉత్పత్తులుగా మలచడం కూడా సులువు. చేనేత పరిజ్ఞానం లేనివారు చేనేత, మరమగ్గాల ఉత్పత్తుల మధ్య తేడా గుర్తించడం కష్టం. దానితో చేనేత పేరుమీద రహస్యంగా మరమగ్గాల ఉత్పత్తులను చలామణీ చేస్తుంటారు. అందుకే చేనేతను తక్షణం బ్రాండింగ్ చేయాల్సిన అవసరం ఉంది. చేనేతను గుర్తించడానికి ఒక వ్యాపార చిహ్నం కూడా ఉంది. దీన్ని అసలు చేనేత ఉత్పత్తుల మీదనే ముద్రిస్తారు. కానీ దురదృష్ట వశాత్తూ ఇది చాలా మందికి తెలియదు. దీనికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముంది (టీవీ ఛానెళ్ళలో సీరియళ్ళ ప్రసార సమయంలో ఒక లైను ప్రకటన ఇచ్చినా సరిపోతుంది). అలాగే దేశవిదేశాల్లో మన ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రదర్శనల్లో చేనేత గుర్తులతో ఉన్న వస్తువులను మాత్రమే అనుమతించాలి. దీనివల్ల చేనేతపట్ల అవగాహన పెరగడమే కాక, పనివారికి ప్రయోజనం కూడా చేకూరుతుంది.

ఇక్కడ మరో కీలకాంశాన్ని గుర్తించాలి. సామాజిక ప్రభావం, సంప్రదాయం, వారసత్వం, చేనేతతో అనుబంధం వంటివి ఈ రంగాన్ని స్థిరంగా ఉంచగలవు. అయితే అత్యద్భుత నైపుణ్యంకల పనివారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. డిజైనర్లు కూడా వీరితోనే జత కడతారు. ఉన్నత శ్రేణి చేనేత ఉత్పత్తుల్లో 80శాతం ఈ నిపుణులు రూపొందించినవే ఉంటాయి. వీరు మొత్తం పనివారిలో కేవలం 20శాతం మందే. లబ్ది వీరికే చేకూరుతుంటుంది. కానీ తరతరాలుగా సకుటుంబ సపరివారంగా దీన్ని నమ్ముకుని బతుకుతున్న మిగిలిన 80శాతం మందిని కూడా ఆదుకునే వ్యూహాలు నేడు అవసరం.

**ఉపాధికి ఆపద**

చేతిమగ్గం మీద నేసిన ప్రతి వస్త్రాన్ని అదేవిధంగా మరమగ్గం మీద కూడా చాలా సులభంగా తయారుచేసి అమ్మవచ్చు. ఈ పోటీని సవాలుగా తీసుకున్న చేనేతపనివారు

వారి సామర్థ్యాన్ని, వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుకోగలిగారు. కానీ దీనితో మిగిలిన వారి పొట్ట కొట్టినట్లయింది. ప్రత్యామ్నాయ వృత్తులు చేపట్టడానికి వనరులు లేక, మరమగ్గాలు నడుపుకునే స్తోమత లేక బాగా దెబ్బ తింటున్నారు. మరమగ్గాలు నడుపు కుందామన్నా, దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ కొరత మరో ప్రతికూల అంశం అవుతున్నది. ఈ నేపథ్యంలో లక్షలాది చేనేత పనివారి ప్రయోజనాలను కాపాడాల్సిన ఏకైక దృక్పథంతో పథకాలు అమలు చేయడం అవసరం. అయితే మరమగ్గాలతో ఇబ్బడి ముబ్బడిగా జరగాల్సిన ఉత్పాదనలకు, అభివృద్ధికి - చేనేత అడ్డంకిగా మారిందని వాదించే వారి కోసం ఒక విషయం స్పష్టం చేయదలుచుకున్నాను. ఈ రెండురంగాలు ముఖ్యమే. ఇవి రెండూ అభివృద్ధి చెందాలనే నేను కోరుకుంటున్నాను. అయితే ఒకదానిగొంతు మరొకటి కోసే పద్ధతిలో కాదు. రెండూ చేదోడువాదోడుగా ముందుకు సాగాలి. ఒకటి మరోదానికి బలంగా ఉండేలా ఎదగాలి. ఒకటి ప్రపంచానికి వస్త్రాన్ని అందిస్తే, మరొకటి లక్షలాది మందికి ఉపాధి అందించాలి. ప్రభుత్వ విధానం కూడా అదే. రెండింటినీ ప్రోత్సహించాలనే ప్రణాళిక రచన చేస్తున్నది. అయితే ఈ వ్యాసం చేనేత రంగానికి సంబంధించినదయినందు వల్ల, నేను దాని రక్షణకే ఇక్కడ పరిమితమవుతాను. మరమగ్గాల నుండి చేనేతను రక్షించడానికి 1985లో చేనేత చట్టం తీసుకురావడం జరిగింది. దీనికింద 11రకాల వస్తువులను చేనేత రంగానికి కేటాయించారు. వీటిని ఈ రంగమే ఉత్పత్తి చేయాలి. మరమగ్గాలకు వీటిని నిషేధించారు. ఉల్లంఘిస్తే జరిమానాలు ఉంటాయి.

జాతీయ చేనేత అభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం నేత కార్మికులకు సబ్సిడీ ధరమీద నూలును అందిస్తున్నది. ఇది తగినంత మోతాదులో, సరసమైన ధరల్లో వారికి లభ్యమయ్యేటట్లు చూడడానికి నిత్యావసర సరుకుల చట్టం, 1955 ద్వారా పకడ్బందీ ఏర్పాటు చేసారు. దీని ప్రకారం స్పిన్నింగ్ మిల్లులు అవి తయారు చేసే హాంక్‌యార్న్ రకం నూలులో నిర్దిష్ట శాతం చేనేత రంగాల అవసరాలకు కేటాయించాలి. సహజంగానే మిల్లు యజమానులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. అయితే చేనేత రంగ పరిరక్షణకు ఇది అత్యవసరం. నిజానికి ఈ ఏర్పాటు అమలు సవ్యంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలి.

మరో ఆందోళనకర అంశం –రుణ సౌకర్యం. ఒక సర్వే ప్రకారం చేనేత పని వారిలో 61శాతం మంది స్వతంత్ర పనివారు కాగా, 34శాతం మంది ప్రధాన చేనేత నిపుణుల వద్ద (మాస్టర్ వీవర్స్) పనిచేసే వారు. ఒక్క 5శాతం మంది మాత్రమే సంస్థల్లో పనిచేసే వారు. సర్వసాధారణంగా నేతపనివారికి చేతినిండా డబ్బులుండవు. ఏజంట్లు, ప్రధాన చేనేత నిపుణులు, దళారీలు వీరి శ్రమకు తగిన ప్రతిఫలం ముట్టచెప్పరు. అదీగాక వీరికి చదువుసంధ్యలు, ఇతరత్రా వనరులు తక్కువ. ఇన్ని ప్రతికూలతల మధ్య పెద్ద నిరాశ - వ్యవస్థీకృత రుణం వీరికి దొరకకపోవడం. ఈ దుర్భర పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వం 2011లో చేనేత కార్మికులకు, సంఘాల వారికి రుణాలు రద్దుచేస్తూ రు.3వేల కోట్ల మేర ప్యాకేజీ ప్రకటించింది.దీని ఉద్దేశం పాత బకాయిలు తీరితే కొత్త రుణాలు పొందడానికి వారు అర్హులవుతారని. ప్యాకేజీకి కూడా నిబంధనలను చాలా సరళీకృతం చేసిన తరువాత అందర్నీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే–అన్ని రాష్ట్రాలు కలుపుకుని కేవలం రు.1000కోట్ల మేర మాత్రమే రుణాలు రద్దయ్యాయి. కేవలం 50వేల మంది చేనేత పనివారు, సంఘాలు మాత్రమే లబ్దిపొంద గలిగారు. కారణాలు విశ్లేషిస్తే తెలిసిందే మిటంటే - గత కొన్ని దశాబ్దాలుగా ఈ రంగంలో రుణవితరణ సరిగ్గా జరగ్గలేదని. అప్పుడు ప్రభుత్వం మళ్ళీ విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టింది. సబ్సిడీవడ్డీని కేవలం 6శాతంగా ప్రకటించింది. దీనితో వారికి మూలధన పెట్టుబడి లభించడమే గాక, వర్కింగ్ క్యాపిటల్ కింద పైఖర్చులకు కూడా డబ్బు సమకూరినట్లయింది. దీని అమలు సక్రమంగా జరిగితే ఫలితాలు అనూహ్యంగా ఉంటాయి.

ఇక విద్యాబుద్ధులు విషయానికొస్తే వీరిలో 83శాతం మంది స్కూలు స్థాయి దాటలేదనీ, కేవలం 17శాతం మంది మాత్రమే ఆ గీత దాటగలిగారని సర్వేలు వెల్లడిస్తున్నాయి. అంటే ఈ వృత్తి చదువుకున్న వాళ్ళకోసం కాదనీ, నిరక్షరాస్యులకేనన్న అపప్రథ ప్రచారంలోకి వస్తే కొత్తతరం దీనివైపు కన్నెత్తి చూడదు. ఫొటోగ్రఫీ, సంగీతం వంటి వాటిలాగా దీనిని కూడా ఆధునికీకరించి ఒక హోదా కల్పించాల్సిన అవసరముంది. ఈ దిశలో కూడా తొలి అడుగు జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థల నుండి పడాలి. మిగిలిన వృత్తినిపుణులకు ఇచ్చినట్లుగానే, చేనేత కార్మికుల పిల్లలకు కూడా ఈ సంస్థ ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలి. వారిచ్చే సర్టిఫికేట్ యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. వారి నైపుణ్యాలను పెంచుతుంది. వారి ప్రతిభతో ఉత్పత్తుల ప్రమాణాలు పెరుగుతాయి. మార్కెట్ పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. కొన్ని వేల సంవత్సరాలుగా ఒక తరం నుండి మరొకతరానికి నైపుణ్యాలను అందుకుంటూ పోతున్న ఈ వృత్తి తర్వాతి తరానికి కూడా ఘనమైన వారసత్వాన్ని పదిలంగా అందించడం అవసరం.

## సాంకేతికంగా ఆధునికీకరణ

చేనేత చట్టం, 1985లోని సెక్షన్ 2(బి) ప్రకారం "మరమగ్గం కానిది ప్రతిదీ చేనేత మగ్గానిదే ". భారత ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) నిర్వచనం ప్రకారం " నేయడం ద్వారా వస్త్రాన్ని తయారు చేయడానికి చేతితో యంత్రాలను పనిచేయించడమే చేనేత. కొన్ని సార్లు ఈ యంత్రాన్ని కాలితోకూడా నడుపుతారు." అని తెలిపింది.

చేనేతలోని సాంకేతికత చూస్తే... పడుగూ పేకల్లోనిఅడ్డం, నిలువు దారాలను ఒక వస్త్రంలాగా విద్యుచ్ఛక్తి సాయంలేకుండానే చేనేత పనివారు చేతితో కండెలను కదుపుతూ నేస్తారు. విద్యుచ్ఛక్తిని ఉపయోగిస్తే అది మరమగ్గం అవుతుంది. అయితే దాని అవసరం లేకుండానే పనిలో వేగం పెంచడానికి ఇప్పుడు వారు చేస్తున్న పనిని యాంత్రీకరణ చేయువచ్చు. దీనిమీద ఇప్పటివరకూ ఎవ్వరూ దృష్టి పెట్టలేదు. పరిశోధనలను ముమ్మరం చేసి ఇది సాధిస్తే వారి శ్రమ తగ్గుతుంది, రాబడికూడా పెరుగుతుంది.

ప్రణాళికా సంఘం కూడా ఈ అవసరాన్ని గుర్తించింది. 2013లో దీనిని పునర్ నిర్వచించింది. ఈ మొత్తం "హైబ్రిడ్ మగ్గం ద్వారా జరిగే ప్రక్రియలో ఒకచోట మానవ ప్రయత్నం ఉంటే చాలు" అని చెప్పింది. హైబ్రిడ్ మగ్గాలకు విద్యుచ్ఛక్తి కూడా ఉపయోగించవచ్చని జౌళి మంత్రిత్వశాఖ పేర్కొన్నది. కానీ వెంటనే దీని మీద వృత్తిపని వారినుంచి దేశవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసన వ్యక్తమయింది. నాకయితే వారి నిరసన సమంజసమైనదే అనిపిస్తుంది. ఎందుకంటే– ఇదే జరిగితే చేనేత 'కళ'గా మున్ముందు నీరాజనాలు అందుకోకపోగా మరణ శాసనాన్ని చేతులారా రాసుకున్నట్లవుతుంది.అదీగాక ఇప్పటిదాకా పైకి చేనేత అని చెబుతూ రహస్యంగా మరమగ్గాల ఉత్పత్తులను అమ్ముకుంటున్న వ్యాపారం అంతా బహిరంగంగా జరగడం మొదలవుతుంది. చేనేత రంగానికి ఇచ్చిన ప్రోత్సాహకాలు, సబ్సిడీన్నీ కూడా ఆ తర్వాత మరమగ్గాల వారు ఎగరేసుకుపోతారు. దీనితో చేనేత రంగంలో సూర్యాస్తమయం ముందుగానే అయిపోతుంది. అయితే ఆ ప్రమాదం రాకముందే జౌళి మంత్రిత్వశాఖ 2014లో చేనేతకు పాత నిర్వచనమే (మరమగ్గం కానిదంతా చేనేతే అని)ఉంటుందని స్పష్టంచేసింది.

యాంత్రిక శక్తివేరు, విద్యుచ్ఛక్తి వేరు. యాంత్రిక శక్తిని ఉపయోగించి చేనేత ఆధునికీకరించవచ్చు. చేనేత మగ్గం కూడా ఒక యంత్రమే కదా ! ఆ దిశగా ఆలోచించి సంప్రదాయక మగ్గాన్ని మరింత వైజ్ఞానికంగా, చౌకగా ఉండేటట్లు యాంత్రీకరించాలి. సంప్రదాయక మగ్గాలను నిరంతరం నడపడంవల్ల పనివారిలో వచ్చే శారీరక రుగ్మతలను కూడా ఈ కొత్త ఏర్పాటులో తొగించవచ్చు.

యాంత్రీకరణ పెంచితే పనివారి సామర్థ్యం, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యత కూడా పెరుగుతాయి. 1773లో జాన్‌కే రూపొందించిన ఫ్లయింగ్ షటిల్ పద్ధతిని ప్రవేశపెట్టవచ్చు. అలాగే సాంకేతికంగా ఆధునికీకరిస్తే వస్త్రం అంచును (బార్డర్‌ను) మరింత విప్లవాత్మకంగా ఎక్కువ అందంగా రూపొందించవచ్చు. అలాగే కాళ్ళు తుడుచుకునే పట్టాలు, చున్నీవంటివి నేయడానికి రెండుపొరల పద్ధతిని అవలంబించవచ్చు.

చిన్నచిన్న చేనేత మగ్గాలవారుకూడా తమ ఉత్పత్తులను స్థానిక అవసరాలకు మాత్రమే కాకుండా వాణిజ్య అవసరాలకు కూడా ఉద్దేశించనట్లయితే వారు తమ మగ్గాలను కొంతమేర యాంత్రీకరించుకోక తప్పదు. ఇది వారి శారీరక శ్రమను తగ్గించడమే కాకుండా, ఉత్పత్తినికూడా పెంచుతుంది.

ఇక చేనేత రంగంలో పరిశోధనలను కూడా బాగా ప్రోత్సహించడం అవసరం. చేనేత మగ్గంమీద బట్టనేసే ప్రక్రియలకు ముందు, తర్వాత ప్రక్రియలను, అలాగే ముడిసరుకు శుద్ధి, బట్ట నేసిన తరువాత తుది మెరుగు దిద్దే ప్రక్రియను కూడా యాంత్రీకరించవచ్చు. ఇవేవీ మరనేత నిర్వచనం పరిధిలోకి రావు. అందువల్ల ఈ దిశగా పరిశోధనలను ముమ్మరం చేయాలి.

కొత్త సాంకేతికతను అభివృద్ధి చేయడం వేరు, అమలు పరచడం వేరు. సంప్రదాయ చేనేత పనివారు అంతత్వరగా కొత్తపద్ధతులకు మారరు. అందువల్ల ప్రభుత్వం వీరిని అన్ని పథకాల్లో భాగస్వాములను చేయాలి. పరిశోధన, దాని ఫలాలు లబ్దిదారులకు చేరడం జరిగితే ఉత్పత్తి, ఉపాధి పెద్దఎత్తున జరుగుతాయి.

చేనేత వస్త్రాన్ని భారీ ఎత్తున ఉత్పత్తిచేయడం ఒక ఎత్తయితే , దాన్ని విజయవంతంగా మార్కెటింగ్ చేయడం మరో ఎత్తు. ఇక్కడే ప్రభుత్వం వారికి అండగా నిలవాలి. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలనేది ఈ రంగంనుండి వినవస్తున్న డిమాండ్. దీనిని ప్రభుత్వం కూడా సానుభూతితో పరిశీలించాలి. బడిపిల్లలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉచితంగా యూనిఫారమ్ వంటివి ఇప్పటికే అమల్లో ఉన్నాయి. నిర్దిష్ట లక్ష్యం మేరకు బట్టను నేసిన చేనేత కార్మికులకు ఉపాధిహమీ పథకం అమలు చేయాలి.

చేనేతకు ఉన్న విశిష్టత దెబ్బ తినకుండా దానితో ముడిపడిఉన్న భావోద్వేగాల బంధాన్ని చెదిరిపోనీయకుండా ఉత్పత్తి స్థావరాలను విస్తరింప చేస్తూ, ప్రక్రియను ఆధునికీకరించడానికి పరిశోధకులు, శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలి. ■

# ఆంధ్రుల స్వప్నం : అమరావతి నిర్మాణం



**నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం మొదటగా రాళ్లెత్తింది రైతులే.. సుమారు 33 వేల ఎకరాలు ఇచ్చి స్వర్ణాంధ్రప్రదేశ్ స్వప్నాన్ని సాకారం చేయడానికి దోహద పడటమే కాకుండా, ముందు తరాల భవిష్యత్‌కు బంగారు బాట వేశారు.**

ఏ ప్రాంతం అభివృద్ధిని అంచనా వేయాలన్నా అక్కడ రాజధానిని చూడాలి. ఒక రాష్ట్రం లేదా దేశంలో జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు రాజధానిలో ప్రతిబింబిస్తాయి. అధినేతలకు ఎంత ముందుచూపు (విజన్) వుందో రాజధానిని చూస్తే అర్థమవుతుంది. అభివృద్ధి చెందిన దేశాలకు, రాష్ట్రాలకు రాజధానే ప్రధాన ఆదాయ వనరు. కానీ రాష్ట్ర విభజనతో ఆంధ్ర ప్రదేశ్‌కు రాజధాని లేకుండా పోయింది. విభజన కారణంగా ఎన్నో సమస్యలను తలకెత్తుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి రాజధాని నిర్మాణం ఒక సవాల్ గా మారింది. చంద్రబాబు పాలనా అనుభవం, తెలివి తేటలు.. ఇవన్నీ రాజధాని సమస్యకు సులభమైన పరిష్కారాన్ని చూపించాయి.

### భూసమీకరణతో శ్రీకారం

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం మొదటగా రాళ్లెత్తింది రైతులే.., పెద్ద మనసుతో రాష్ట్ర ఆర్థిక పరిస్థతిని అర్థం చేసుకున్న రైతన్నలు చంద్రబాబు ప్రయత్నానికి పునాది రాయి వేశారు. భూసమీకరణకు సహకరించి కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు. సుమారు 33 వేల ఎకరాలు ఇచ్చి స్వర్ణాంధ్ర ప్రదేశ్ స్వప్నాన్ని సాకారం చేయడానికి దోహద పడటమే కాకుండా, ముందు తరాల భవిష్యత్‌కు బంగారు బాట వేశారు.

### కనివినీ ఎరుగని ప్యాకేజ్

భూసమీకరణకు ముందుకొచ్చిన వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అద్భుతమైన పరిహార ప్యాకేజ్‌ని ప్రకటించింది. ఎకరం పట్టా భూమి ఇచ్చిన రైతుకు మెట్ట అయితే 1000 చ.గ. నివాస స్థలం, 200 చ.గ. వాణిజ్య స్థలం.. జరీబు భూమి అయితే 1000 చ.గ. నివాస స్థలం, 450 గజాల వాణిజ్య స్థలం ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయించింది. అదే అసైన్డ్ భూమి అయితే మెట్టకు 800 చ.గ. నివాస స్థలం, 100 చ.గ. వాణిజ్య స్థలం.. జరీబు భూమి అయితే 800 చ.గ. నివాస స్థలం, 200 చ.గ. వాణిజ్య స్థలం.. ఇవ్వనుంది. అలాగే ప్రతీ ఏటా పరిహారం కింద ఎకరాకు మెట్ట భూమికి 30 వేలు, జరీబుకు 50 వేలు ఇవ్వనుంది. ప్రతీ ఏటా మెట్టకు 3 వేలు, జరీబుకు 5 వేలు చొప్పున పరిహారం పెంచుతుంది. జామ, నిమ్మ, సపోటా, ఉసిరి, మల్లెతోటలు వున్న రైతులకు ఏక మొత్తం కింద లక్ష రూపాయలు చెల్లిస్తున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం

**విజయభాస్కర్ పైడి,** మీడియా లైజన్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

నూతనంగా సేకరించిన భూమిలో 20 శాతం మాత్రమే భూమి యజమానికి ఇవ్వాల్సి వున్నా.. భూసమీకరణతో 25 శాతం వరకు ఇస్తారు.

రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన అనంతరం భూములిచ్చిన రైతులకు సమీపంలోనే ప్లాట్లను కేటాయిస్తారు. నివాస, మరియు వాణిజ్య స్థలాలలను ఆయా కేటగిరీల వారీగా లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు వుంటాయి. ఈ ప్రాంతంలో నివసించే భూములు లేని 12 వేల కుటుంబాలకు (కౌలుదార్లకు కూడా) నెలకు రూ. 2,500 చొప్పున పదేళ్లపాటు రాజధాని ప్రాంత సామాజిక భద్రతానిధి ఏర్పాటు చేసి దాని ద్వారా పెన్షన్ ఇస్తారు. దేవాదాయ శాఖ అందించే భూములకు.. ఆయా దేవాలయాల వారీగా భూమిని కేటాయిస్తారు. రాజధాని ప్రాంతంలో నివాసం వుంటున్న ఇళ్లు లేని వారికి ఉచితంగా ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం మాటిచ్చింది. అలాగే ఇక్కడ 365 రోజులు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. పేద కుటుంబాల స్వయం ఉపాధి నిమిత్తం రూ. 25 లక్షల వరకు వడ్డీలేని రుణాలను అధికారులు అందిస్తారు.

**33 వేల ఎకరాలు ఎందుకంటే ..**

రాజధాని అంటే సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలకు నిర్మాణమే కదా.. ఎందుకు 33 వేల ఎకరాల భూమి అంటూ విమర్శలు వచ్చాయి. అయితే నిబంధనల ప్రకారం రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, గ్రీన్ బెల్ట్ విద్యాలయాలు, ఆస్పత్రులు వంటి సామాజిక అవసరాలు.. ఇంకా రైతులకు వారి వాటా కింద ఇచ్చే భూమి పోగా ప్రభుత్వానికి సరిగ్గా మిగిలేది సుమారు ఎనిమిది వేల ఎకరాలే. అందులోనూ రాజధానిలో రోడ్లను నాలుగు లైన్లు, ఆరు లైన్లకు తగ్గకుండా నిర్మించాలనేది మాస్టర్ ప్లాన్. ఈ లెక్కలన్నీ చూస్తే రాజధానికి ఎంత భూమి సరిపోతుందని అందరూ అంటున్నారో.. అంతే భూమి ప్రభుత్వానికి మిగులుతుంది. ఎయిమ్స్ కు, కేంద్రీయ విశ్వ విద్యాలయానికే 800 ఎకరాలు కావాల్సివుంది. భూమి ప్రభుత్వం చేతిలో లేకుండా అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానించలేము. కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నా.. ఉపాధి అవకాశాలు పెరగాలన్నా, ఇతర ఆదాయ మార్గాల కోసం భూమే ఆధారం. ప్రభుత్వం దగ్గర కొంత భూమైనా లేకుంటే అభివద్ధి సాధ్యం కాదు. అందుకే ముఖ్యమంత్రి మాటల్లో చెప్పాలంటే.. రాజధాని అంటే భవనాలే కాదు.. దానికి జీవం వుండాలి. రాజధాని జనంతో కళకళ లాడితేనే లైఫ్ వస్తుంది.

**అమరావతి.. నామకరణం**

ప్రజా రాజధాని ఆధునిక పరిపాలనా, ఆర్థిక, సామాజిక, సాంఘిక, సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా ఉండాలి. 21వ శతాబ్దంలో ప్రపంచంలో అత్యుత్తమ ప్రమాణాలను అనుసరించడమే కాకుండా రాబోయే శతాబ్దాలలో కూడా నిత్యనూతనంగా వెలుగొందే విధంగా రూపుదిద్దుకోవాలి. దానికి తోడు ఆంధ్రప్రదేశ్ ప్రజల ఘనచరిత్రను, విజయగాథను, శాస్త్ర, సాంకేతిక రంగాలలో సాధించిన కీర్తిని, తాత్విక చింతనలో కనబరచిన గాఢతను ప్రతిబింబింప చేయాలన్నదే మంత్రివర్గ ఆకాంక్ష. ఈ విశాలమైన ఆకాంక్ష దృష్ట్యా నవ్యాంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి అను పేరు అన్నివిధాల సరియైనదని మంత్రివర్గం అభిప్రాయపడింది.

**సీఆర్‌డీఏ**

కేపిటల్ రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ యాక్ట్–2014, డిసెంబర్ 30 2014 నుంచి అమలులోకి వచ్చింది. సీ ఆర్ డీఏ పరిధిలో గుంటూరు జిల్లాలోని 29 మండలాలు, కృష్ణా జిల్లాలోని 29 మండలాలను చేర్చారు. ఇందులో గుంటూరు జిల్లాలోని 15 మండలాలు, కృష్ణా జిల్లాలోని 11 మండలాలు పూర్తిగా విలీనమయ్యాయి. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి సీఆర్ డీఏలోనే వుంటాయి. రాజధానిపైన సర్వాధికారాలు సీఆర్ డీఏకే చెందుతాయి. మొత్తం సీఆర్ డీఏ విస్తీర్ణం 7,420 చ.కి.మీ. ఇందులో కేంద్ర ప్రణాళిక ప్రాంతం 854 చ.కి.మీ. అందులోనూ 217 చ.కి.మీ ఎకరాలు రాజధాని ప్రాంతం. అమరావతి, మంగళగిరి, విజయవాడ, గుంటూరు, నందిగామ, మచిలీపట్నం, నూజివీడు, గుడివాడ, గన్నవరం, తెనాలి, సత్తెనపల్లి, నర్సరావుపేట, చిలకలూరిపేట, బాపట్ల, నిజాంపట్నం పోర్ట్.. రాజధాని ప్రాంతంలో కీలక కేంద్రాలుగా ఎదగనున్నాయి. వీటన్నింటినీ 8 ప్రాంతాలుగా విభజించి వీటికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

**సీసీడీఎంసీ**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రాజధాని నగర అభివృద్ధి నిర్వహణ సంస్థ (సీసీడీఎంసీ) పేరిట ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. అమరావతి అభివృద్ధి, స్మార్ట్ సిటీల్లో వుండే ప్రమాణాల మేరకు మౌలిక సదుపాయాల కల్పన, అమలు, నిర్వహణ బాధ్యత చేపట్టడానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చు కుంటుంది. ఇంకా సీఆర్‌డీఏ పరిధిలో వినియోగ, సేవా రుసుముల వసూలుతో పాటు సీఆర్‌డీఏతో పని చేసేందుకు భాగస్వామ్య సంస్థలు, ఏజెన్సీలను ఎంపిక చేసే బాధ్యత చేపడుతోంది.

**మాస్టర్ ప్లాన్**

ఢిల్లీలోని రాజ్‌పథ్ లా ప్రధాన రహదారి మార్గం, నదికి అభిముఖంగా వినోద–విహార కేంద్రాలు, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, యూనివర్సిటీ, నగరం మధ్యలో కాలువలు, నదిలో వాటర్ టాక్సీలు, లంకల్లో థీమ్ పార్క్ లు, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, పోర్టులకు రైలు, నగరంలో హైస్పీడ్ రైల్వేలైన్, గోల్ఫ్ కోర్సులు, పచ్చదనం, జలమార్గం.. ఇదీ ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి స్వరూపం.

నవ్యాంధ్రప్రదేశ్ అవసరాలకు అనుగుణంగా కోటి 30 లక్షల మంది జీవించేలా సింగపూర్ ప్రభుత్వం అమరావతి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. 2035 నాటికి అమరావతి జనాభా కోటి దాటుతుందని అంచనా వేయగా, 2050 నాటికి కోటి 35 లక్షల మంది నివసిస్తారని, 2050 తర్వాత ఈ సంఖ్య రెండు కోట్లు దాటుతుందని లెక్కలుగట్టారు.

రాజధాని నుంచి వాడరేవు, మచిలీపట్నం పోర్టులకు ప్రతేక రైలు మార్గాల నిర్మాణం ప్రణాళికలో వుంది. నగరంలో 145 కి.మీ మేర మెట్రోరైల్, జలమార్గం 45 కి.మీ, రోడ్డుమార్గం 61 కి.మీ మేర నిర్మించాలని నివేదికలో సింగపూర్ బృందం సూచించింది. అమరావతి బౌద్ధస్థూపం, నీరుకొండ, మంగళగిరి ఆలయం, ఉండవల్లి గుహలు, భవానీ ద్వీపం, కొండపల్లి కోటలను.. జల, రోడ్డు మార్గాల ద్వారా కలిపి ఆధ్యాత్మిక టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని మాస్టర్ ప్లాన్ చెబుతోంది.

పారదర్శకంగా రాజధాని నిర్మాణం జరుగుతుందని, స్విస్ చాలెంజ్ పద్ధతిలో పోటీతత్వంతో కూడిన టెండర్ విధానంలో పనులు అప్పగిస్తామని చంద్రబాబు చెప్పారు. ఉమ్మడి రాజధానిగా వున్న హైదరాబాద్‌లో పదేళ్లు వుండే అవకాశం వున్నా వీలైనంత త్వరగా రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా వుంది. చంద్రబాబు ప్రభుత్వంపైన వున్న విశ్వసనీయతతో సింగపూర్ మంత్రి ఈశ్వరన్ అమరావతి మాస్టర్ ప్లాన్ ను ఉచితంగా రూపొందించారు. రాజధాని నిర్మాణంలోనూ పాలుపంచు కునేందుకు సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చింది.

**సీడ్ కేపిటల్**

సీడ్ కేపిటల్‌గా అభివృద్ధి చేయదలుచుకున్న ప్రాంతానికి ప్రత్యేకతలు చాలా వున్నాయి. ఓవైపు కృష్ణమ్మ పరవళ్లు, మరోవైపు రా రమ్మని పిలిచే దీవులు, అందంగా పరుచుకున్న కొండలు, ఉద్యానవనాలు.. ఇలా అద్భుత ప్రకృతి రమణీయతకు తోడు ఆకాశహర్మ్యాలు, విశాలమైన రహదారులతో అంతర్జాతీయ స్థాయి నగరమంటే ఏమిటో మన కళ్లకు కడుతుంది. ఈ దసరా నుంచి రాజధాని నిర్మాణం పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2018 నాటికి అసెంబ్లీ, సెక్రటేరియేట్, హైకోర్ట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన నివాస సముదాయాల నిర్మాణం.. అంటే కీలకమైన రాజధాని పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందించింది. మొత్తం రాజధాని నిర్మాణాన్ని కేపిటల్ రీజియన్ ప్లాన్, కేపిటల్ సిటీ ప్లాన్, సీడ్ ప్లాన్ అనే మూడు భాగాలుగా విభజించారు.

సీఆర్‌డీఏ నడిబొడ్డున సీడ్ కేపిటల్ నిర్మాణం జరగనుంది. ఇక్కడ ప్రకృతి విపత్తులకు ఆస్కారం తక్కువ. వరద ముప్పు వుండదు. లింగాయపాలెం, ఉద్దండ రాయుని పాలెం, తాళ్లాయపాలెంలో సీడ్ కేపిటల్ విస్తరించి వుంది. సుమారు 3,706 ఎకరాలు సీడ్ కేపిటల్‌కు అవసరమని సింగపూర్ నిపుణుల బృందం నిర్ధారించింది. రాజధాని లోని సుమారు 30 శాతం ప్రాంతంలో వాణిజ్య సముదాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వగా, 21 శాతం భూమిలో పచ్చదనానికి చోటిచ్చారు. అలాగే కాలువలు, చెరువులు, జలాశయాలకు మరో 3 శాతం భూమిని కేటాయించడం జరిగింది. మొత్తం రాజధాని ప్రాంతం 53,621 ఎకరాల్లో విస్తరించి వుంటే.. ప్రాథమిక వసతులకే 22 వేల ఎకరాల వరకు అవసరమవుతుంది. మరో 10 వేల ఎకరాలను భూసమీకరణకు సహకరించిన రైతులకు ఇవ్వాల్సి వుంటుంది. ఇంకా గుట్టలు, జలాశయాలు, అటవీ భూములు, ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన భూములు పోగా సుమారు 8 వేల ఎకరాల వరకు ప్రభుత్వానికి మిగులుతుంది. ఈ భూమిని భవిష్యత్ అవసరాలకు, వాణిజ్య కార్యక్రమాలకు వినియోగించాలనేది ప్రభుత్వ ఆలోచన. ప్రవేశ ద్వారం నుంచే అమరావతి ప్రత్యేకత చాటేలా సింగపూర్ బృందం మాస్టర్ ప్లాన్ ను తయారు చేసింది. కృష్ణానదిపై నిర్మించే భారీ వంతెన.. నగరంలోకి స్వాగతం పలుకుతుంది. మెట్రో రైలు, హైస్పీడ్ రైళ్లు, ఫ్లయ్ ఓవర్లు.. అన్నీ ఈ ముఖద్వారం నుంచే వెళ్తాయి. ఆర్థికంగా, ఉపాధిపరంగా కీలకమైన డౌన్ టౌన్ అంతర్జాతీయ వాణిజ్య సముదాయం కానుంది. ఇక్కడ ఎగ్జిబిషన్ సెంటర్లు, కన్వెన్షన్ కేంద్రాలు, రెస్టారెంట్లు, క్రీడా సముదాయాలు రానున్నాయి. అటు పర్యాటక పరంగా వాటర్ ఫ్రంట్ ను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. జలక్రీడలు, రిసార్ట్స్ ముఖ్యంగా ఇక్కడ వుంటాయి. ఉద్దండ రాయునిపాలెం ప్రాంతం ఐటీ హబ్ కానుంది.


సీడ్ కేపిటల్ లో ప్రజారవాణాకు అత్యధిక ప్రాధాన్యత 12 కిలోమీటర్ల మేర మెట్రోరైల్, 15 కిలోమీటర్ల మేర బీఆర్ టీఎస్ మార్గాలు, డౌన్ టౌన్ రోడ్లు 7 కిలో మీటర్లు, ప్రధాన, ఉప ప్రధానరోడ్లు 26 కిలోమీటర్లు, కనెక్టివిటీ రోడ్లు మరో 56 కిలో మీటర్లు వుండనున్నాయి. పాదచారుల కోసం ప్రత్యేకంగా నడక మార్గాలు, అలాగే సైకిలింగ్ ట్రాక్ లు నిర్మిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే సకల సౌకర్యాలు, విలాసాలతో తులతూగే నవ నగరం.

**ప్రతీ ప్రాంతం ప్రత్యేకమే**

అమరావతి – వారసత్వ సంపద
గుంటూరు – ఆగ్రో ప్రాసెసింగ్
గన్నవరం – విమానాశ్రయ పరిశ్రమలు
నందిగామ – పర్యాటకం
సత్తెనపల్లి – భారీ పరిశ్రమలు
తెనాలి – చిన్నతరహా పరిశ్రమలు
పామర్రు – రవాణా పార్క్
గుడివాడ– ఎలక్ట్రానిక్స్ రంగం
నూజివీడు – ఆహార ఉత్పత్తులు

భవిష్యత్ రాజధాని కేవలం పరిపాలనా రాజధానిగా కాకుండా ఆర్థిక, సామాజిక, ఉపాధి అవకాశాలతో సమగ్ర నిర్ణాయక కేంద్రంగా వుంటుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమదూరంలో, ప్రపంచస్థాయి సౌకర్యాలతో నిర్మాణమయ్యే సరికొత్త ప్రజా రాజధాని అమరావతి.. నవ్యాంధ్రప్రదేశ్ ప్రగతికి కీలక మవుతుందనడంలో సందేహం లేదు. ■

# అణగారిన వర్గాలకు ఉపాధి అవకాశాలు



**విద్యావిషయకంగా వెనుకబడిన వర్గాలలో, లేబర్ మార్కెట్లో ప్రవేశిస్తున్న వారిలో 30 శాతం మంది నిరక్షరాస్యులు, 24 శాతం మంది కేవలం ప్రాథమిక విద్యను మాత్రమే పూర్తిచేసుకున్నవారు. మాధ్యమీక విద్యలోనే బడి మానేస్తున్నవారి వల్ల సమస్య మరింత జటిలమవుతున్నది. అసంఘటిత రంగంలో కూడా 48 శాతం మంది కేవలం 16 శాతం ఆదాయాన్నే దేశానికి సమకూరుస్తున్న వ్యవసాయరంగంలో ఉన్నారు.**

భౌగోళికంగా భారత దేశానికున్న ప్రయోజనమేమంటే, 65 శాతం మంది ప్రజలు శారీరకంగా పనిచేయగల స్థితిలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి జనాభా అంచనాలు 2015 ప్రకారం, మనదేశం సగటు వయసు 2020 నాటికి 29 సంవత్సరాలుగా ఉంటుంది. అదే చైనా, అమెరికాలలో 37 సంవత్సరాలు, యూరోప్ లో 45 సంవత్సరాలుగా ఉండగలదని అంచనా. దీనివల్ల ప్రపంచానికంతటికీ మనదేశమే మానవ వనరుల సరఫరాదారు కావచ్చు. అంటే మన ప్రజలను తగిన నైపుణ్య శిక్షణనిచ్చి ఎంత త్వరగా సంసిద్ధులను చేయాలో మనకు తెలుస్తున్నది. ఈ అవసరం ప్రస్తుతం మనకున్న వృత్తి విద్యా వనరులు, అవకాశాలపై తీవ్రమైన ఒత్తిడిని తెస్తున్నది.

ముఖ్యంగా చదివిన చదువుకు చేసే వృత్తిని అనుసంధానం చేస్తూ ఒక పటిష్ట ప్రణాళిక ద్వారా బహుళ నైపుణ్యాలను వారికి అందచేయవలసిఉన్నది.

అంతర్జాతీయ కార్మిక సమాఖ్యలోని యువ ఉపాధి విభాగం, ఉపాధి, అందరికీ సమానావకాశాలు,పరిశ్రమలకు ప్రోత్సాహం మరియు ఉపాధికి అర్హత అనే నాలుగు అంశాలకు ప్రాధాన్యమిచ్చింది. అంతర్జాతీయ కార్మిక సమాఖ్య వారి తీర్మానం 2000 ప్రకారం యువతకు బహుముఖమైన ప్రతిభా నైపుణ్యాలు ఉన్నపుడే వారి ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, ఈ బహుముఖమైన ఉపాధి అవకాశాలకు అనేక విధాన నిర్ణయాలు, మార్పులు అవసరం. ఈ వ్యాసంలో మనం లేబర్ మార్కెట్ లక్షణాలు, అవసరమైన విధాన నిర్ణయాలు, మార్పులను గురించి చర్చించుకుందాము.

**అణగారిన వర్గాలు, లేబర్ మార్కెట్, నైపుణ్యాభివృద్ధి:** ముందుగా మనం నిర్ధారించుకోవలసింది అసలు అణగారిన వర్గాలంటే ఎవరు అని! ఆర్థికంగానే కాదు, సామాజికంగా కూడా తగిన గౌరవ మర్యాదలు, అవకాశాలు లభించనివారిని వెనుకబడినట్లు చెప్పవచ్చు. కేవలం విద్యావంతులైతే శిక్షణపొంది తద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చునంటే, ముందుగా నిరక్షరాస్యులను వెనుకబడిన వారిగా నిర్ధారించవచ్చు. ఇలా వెనుకబడిన వారు అతి చిన్నవయసులోనే భుక్తికోసం పనికి వెళ్తారు

---

**సునీత సంఘీ,** నీతి ఆయోగ్ సలహాదారు. ఈ-మెయిల్: sunitasanghi1960@gmail.com

కానీ, తగిన శిక్షణ లేకపోవడం తో అతి తక్కువ వేతనాలకు తమ జీవితాలను బలిచేసుకుని, పేదరికం అనే విషవలయంలో కొట్టుమిట్టాడు తుంటారు. కనుక నైపుణ్యాభివృద్ధి గురించి మాట్లాడాలంటే ముందుగా లేబర్ మార్కెట్‌ను నిశితంగా అధ్యయనం చేయాలి.

మన భారతీయ లేబర్ మార్కెట్‌లో సంఘటిత మరియు అసంఘటిత అనే దువిధత ఉన్నది. అసంఘటిత రంగంలో 92.9 శాతం మంది (435.66 మిలియన్లు), అసంఘటిత రంగంలో మిగిలిన 8.1 శాతం మంది (38.56 మిలియన్లు) పనిచేస్తున్నారు. అందునా అత్యధిక శాతం మంది, 68 శాతం ప్రజలు నివశిస్తున్న గ్రామీణ ప్రాంతాలలో ఉన్నారు. మరో సమస్య ఏమంటే, రెండు రంగాలలోనూ మహిళా కార్మికుల శాతం అతి తక్కువగా అంటే కేవలం 22.5 శాతం గా మాత్రమే ఉన్నది.


విద్యావిషయకంగా వెనుకబడిన వర్గాలలో, లేబర్ మార్కెట్లో ప్రవేశిస్తున్న వారిలో 30 శాతం మంది నిరక్షరాస్యులు, 24 శాతం మంది కేవలం ప్రాథమిక విద్యను మాత్రమే పూర్తిచేసుకున్నవారు. మాధ్యమిక విద్యలోనే బడి మానేస్తున్నవారి వల్ల సమస్య మరింత జటిలమవుతున్నది. అసంఘటిత రంగంలో కూడా 48 శాతం మంది కేవలం 16 శాతం ఆదాయాన్నే దేశానికి సమకూరుస్తున్న వ్యవసాయరంగంలో ఉన్నారు. అంటే ఉత్పాదకత తక్కువగానూ, అసంపూర్ణ ఉపాధి ఉన్నట్లు తెలుస్తున్నది కదా! అంతే కాదు అధిక సంఖ్యాకులు తయారీయేతర నిర్మాణ రంగం వంటి వాటిలో అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నారు. ఇంకా, 2011 జనాభా లెక్కల ప్రకారం వికలాంగులు 2.68 కోట్లు ఉన్నారు. వారిలో ఏదైనా పనిచేయగలిగిన వయసులోనున్నవారు 1.57 కోట్లమంది. ప్రయోజనకరమైన ఉపాధికోసం వారి అన్వేషణ ఎన్ని చట్టాలు చేసినా, ఇంకా అసంపూర్ణంగానే ఉన్నది. వీరుకూడా పేదరికం అధికంగా ఉన్న, వైద్య ఆరోగ్య సేవలు తక్కువగా అందుబాటులోనున్న గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా ఉన్నారు. విస్తృతంగా వ్యాపించివున్న అసంఘటితరంగ సమస్యల పరిష్కారానికి అతి కొద్ది అవకాశాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అతి తక్కువ వేతనాలు ఇచ్చే పనులలో చేరి, అక్కడే పని నేర్చు కుంటున్నారు. అయితే వారికి సాధారణ విద్యాతోపాటు, వృత్తివిద్యా శిక్షణను కూడా అందచేస్తే మేలు. బాలురలోకన్నా బాలికల్లో బడి మానేస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో అందుబాటులోనున్న శిక్షణావకాశాలు వారికి అనుకూలంగా లేవు. ఈ లోపాన్ని సరిచేయడం నిజంగా ఒక సవాలే! 15-24 సంవత్సరాల వయసు మధ్య వారికి నిజంగా ప్రయోజనం కలిగించే విద్యావకాశాలు కల్పించాలి. దీనివల్ల మనకు శిక్షణ నైపుణ్యం అందించడమంటే అతి క్లిష్టమైన విషయమని అర్థం అవుతుంది. ఒకే మూస విధానం అన్నిచోట్లా పనిచేయదు. వివిధ వర్గాలు, ప్రాంతాలు, వారి వారి అర్హతలు వంటి విషయాలకనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించు కోవాలి. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానము, యువత తమ అర్హతలను కూడా అతివేగంగా నవీకరించుకుంటూ వుండవలసిన అవసరాన్ని నొక్కి చెపుతున్నది.

**విద్యార్హతలను పెంపొందించడానికి అవకాశాలు/మార్గాలు :** ఎప్పటికప్పుడు లేబర్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నవారిలో అత్యధికులకు తగిన విద్యార్హతలూ, నైపుణ్యము ఉండటంలేదు కనుక, దీనికి తగిన చర్యలను వెంటనే చేపట్టాలి. విద్యా హక్కు చట్టం 2009, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ వంటి పథకాలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కొంత మేలు చేస్తున్నాయి. అయినప్పటికీ శిక్షకులను మరింతమందిని తగిన అర్హతలతో అందుబాటులోకి తెచ్చేందుకు విస్తృతమైన ఏర్పాట్లు అవసరం. నైపుణ్యాభివృద్ధి విషయంలోనైతే,చాలామటుకు కార్యక్రమాలు ప్రభుత్వాలు రూపొందించినవో, లేదా ఆయా పరిశ్రమలు రూపొందించినవో మాత్రమే అయివున్నాయి. జాతీయ నైపుణ్యాభివృద్ధి విధానం వెనుకబడిన వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, జాతులు, మహిళలూ, అల్ప సంఖ్యాక వర్గాలూ, మధ్యలో బడిమానేసిన వారు వంటి వారికి ప్రత్యేక ఏర్పాట్లను సూచించింది.

**విద్య-శిక్షణ-ఉపాధికి మధ్య సంబంధం:** యువత నేర్చుకుంటున్న విద్యకు, వారు అందుకుంటున్న ఉపాధి అవకాశాలకూ మధ్య సంబంధం లేని పరిస్థితులు ఒక పెద్ద లోపంగా పరిణమించాయి. చదివిన చదువుకూ, చేస్తున్న పనికీ సంబంధం లేకపోతే, ఉత్పాదకత సరిగా ఉండదు, పనివారికి ఉపాధిలో సంతృప్తి కూడా ఉండదు. అందుకనే, పాఠశాల స్థాయిలోనే అందుబాటులోనున్న, లేదా అందుబాటులోకి రానున్న ఉపాధి అవకాశాలకుసంబంధించిన ప్రాథమిక శిక్షణ పాఠ్యాంశంగా ఉండాలి. అంతేకాదు, యువతకు ముందుగానే తమ వృత్తి శిక్షణను ఎంచుకునే అవకాశం వుండాలి. ఎలానంటే, మనదేశంలో కులవృత్తుల సంప్రదాయం ఉన్నది కనుక కొన్ని కులాలలో పుట్టిన వారికి జన్మతః కొన్ని కొన్ని వృత్తులలో కొంత సౌలభ్యం/నిపుణత ఉంటుంది. దీనిని మెరుగు పెట్టె శాస్త్రీయమైన విధానావకాశాలు ఉండటం అభిలషణీయం. మరికొన్ని సందర్భాలలో ఎంతో మెరుగైన కళానైపుణ్యం చూపుతున్న పనివారు సైతం తగిన గుర్తింపు ఉన్న విద్యార్హతలు లేక మెరుగైన అవకాశాల కోసం తిప్పలు పడుతున్నారు. అయితే, ఉడాన్, హిమాయత్, ప్రవాస్, నయీ రోషనీ, స్టెప్ అప్ వంటి పథకాలు కొంతలో కొంత సహాయపడుతున్నాయి.

అందరి సహకారంతోనే మనం ఈ నైపుణ్యాభివృద్ధి సవాలును ధీటుగా ఎదుర్కోగలము. మొత్తం మీద చెప్పొచ్చేదే మంటే, నైపుణ్యాభివృద్ధి అనేది అవకాశాలకు రాజమార్గం. అయితే దీనికోసం ప్రస్తుతమున్న విద్యావిధానాన్ని సమూలంగా మార్చాలి. ■

# ప్రపంచ శాంతికి, మానవీయ విలువలకు గాంధీ సిద్ధాంతాలు



**అనేక దేశాల మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలు ఒడిదుడుకులకు లోనౌతూ అస్థిరత్వానికి గురౌతున్నాయి. ప్రపంచ దేశాలన్నీ సుస్థిరాభివృద్ధి అనే భావనవైపు పరుగెడుతున్నాయి. ఈ సందర్భంగా మనం గాంధీజీ యొక్క ఆర్థిక స్వావలంబన సిద్ధాంతాన్ని అర్థంచేసుకొని ఆచరించినట్లయితే సుస్థిరాభివృద్ధికి పునాదులు వేయవచ్చును.**

ఇరవైవ శతాబ్దపు మనిషిగా, ఈ సహస్రాబ్ది మహోనీయునిగా అభివర్ణించబడి ప్రపంచ చరిత్రలో భారత స్వాతంత్ర్యోద్యమ పోరాటానికి రక్తరహిత పోరాటంగా చోటు కల్పించారు. టైమ్స్ పత్రిక గాంధీజీని ఈ శతాబ్దపు అత్యంత ప్రధానమైన వ్యక్తిగా గుర్తించినది. యావత్ మానవ జాతికీ నిర్దేశకునిగా శాంతి ప్రబోధకునిగా ఒక మానవీయ సమాజ స్థాపనకు కృషిచేసిన ఒక మహా మనిషి మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ. ఆయన ప్రబోధించిన సూత్రాలు, సిద్ధాంతాలు ఉత్తమ జీవనానికి దిశానిర్దేశాలు. నేడు మన భారతదేశమే కాకుండా యావత్ ప్రపంచం కూడా శాంతియుత సహజీవనానికి, మానవతావిలువలకు గాంధీ సిద్ధాంతాల అవసరాన్ని గుర్తించాయి. ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక రంగాలలో అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్న నేటి ప్రపంచానికి గాంధీ సిద్ధాంతాలు అత్యంత విభిన్నమైన, విశిష్టమైన ఆశాకిరణాలుగా ఉన్నాయి. శాంతి, సామరస్యాలకు, అభివృద్ధికి అభ్యున్నతికి, మానవ జాతి మనుగడకు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం గాంధీ సిద్ధాంతాలే. గాంధేయ విధానం ప్రస్తుత ప్రపంచ సమస్యలన్నింటికీ ఒక క్రొత్త ఆశ మరియు అన్నింటికీ మించి ఒక నూతన సవాలు. మానవాళి శాంతి యుతంగా జీవించాలన్నా అభివృద్ధి సాధించాలన్నా గాంధీజీ సిద్ధాంతాలు, మార్గాలు అవగాహనతో ఆచరించడమే ఏకైక మార్గం.

మానవ నాగరికత హింసాయుత పద్దతులతో ప్రారంభమై కాలానుగుణంగా అభివృద్ధి చెందిన కొద్దీ అహింసాయుత విధానాలతో కూడిన జీవన విధానాన్ని అలవాటు చేసుకొని ఆచరణలో పెట్టడం ప్రారంభించాము. శాంతి సాధనకు అహింస ఒక్కటే మార్గమని, దానిని ఆచరణలో చూపించి శాంతిదూతగా గాంధీజీ పేరుగాంచారు.

శాంతి సౌభ్రాతృత్వాలు కలసికట్టుగా గాంధీజీ అహింసాయుత విధానాల్లో మాత్రమే మనకు కనిపిస్తుంది. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ ప్రబోధించి ఆచరించిన లౌకికవాదం అత్యవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. తనకెంతో ప్రీతి పాత్రమైన సబర్మతీ ఆశ్రమాన్ని హరిజనుల సంక్షేమంకోసం నిర్వహించే కార్యకలాపాలకు ఆయన అంకితం చేశారు. అస్పృశ్యత, కులవ్యవస్థలపై గాంధీజీ సల్పిన పోరాటం

**దిరిశాల వెంకటేశ్వర రావు,** డైరెక్టర్, గాంధీ అధ్యయన కేంద్రం, శ్రీవైఎన్ కళాశాల, నరసాపురం

వాస్తవానికి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంగానే చెప్పవచ్చును. ఒకానొక సందర్భంలో గాంధీజీ మాట్లాడుతూ కుమారుడు పుట్టినందుకు సంతోషించటం, కూతురు పుట్టినందుకు విచారించటంలోని ఔచిత్యం ఏమిటో నాకు అర్థంకావటంలేదు అని అన్నారు. ఆయన దృష్టిలో లింగవివక్షత లేదు. ఇద్దరూ సమానమే. బాల్య వివాహాలు వరకట్నం లాంటివి నైతికంగానూ, చట్టపరంగానూ కడా దురాచాలే నని ఆయన పేర్కొన్నారు. పరస్పర సహకారం సంప్రదింపుల ద్వారా లింగ సమానత్వం సాధించవచ్చునని గాంధీజీ సూచించారు.

విద్య గురించి విద్యావ్యవస్థ గురించి గాంధీజీ వెలిబుచ్చిన అభిప్రాయాలు సూచించిన విధానాలు నేటి మన ప్రభుత్వాధి నేతలు మరియు విద్యావేత్తలను కూడా వారు అనుసరిస్తున్న విధానాలు పునరాలో చించుకునేవిగా ఉన్నయి. కారణం నేటి విద్యావ్యవస్థ వ్యాపారధోరణితోను, డిగ్రీలు ఇచ్చే ఉత్పత్తి యంత్రంగా మాత్రమే కొసాగుతున్నది. నేటి కార్పోరేట్ విద్యావ్యవస్థ విద్యార్థుల మనోవికాసానికి, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేయటం లేదు. సరికదా వారిని ఒక మరమనుషులుగా తయారు చేస్తున్నది. గాంధీజీ అభిప్రాయంలో విద్య మానవులను పరిపూర్ణులుగా తీర్చి దిద్దేదిగాను సమాజంలో మౌలిక విలువల్ని ప్రతిబింబించేదిగాను ఉండాలి.

గాంధీజీ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి విద్య యొక్క అవసరాన్ని కూడా తెలియచేసారు. నిజమైన విద్య మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ స్థిరంగా పనిచేసేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యం సమర్థవంతంగా పనిచేయాలంటే కావాల్సింది గణాంకాలు లేదా వాస్తవాలు తెలుసుకోవడం కాదని నిజమైన విద్య ఒక్కటే ముఖ్యమని వివరించారు. మౌలికమైన విద్య విద్యార్థులను దేశంలో ఏమూల ఉన్నప్పటికీ అత్యుత్తమమైన శాశ్వతమైన ఆర్థిక, రాజకీయ సామాజిక అంశాలకు అనుబంధం చేస్తుందన్నారు. విద్యావ్యవస్థ స్వాలంబనతో పాటు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉండాలని, వ్యక్తుల పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించేదిగా ఉండాలన్నదే గాంధీజీ అభిమతం. నేటి మన విద్యా వ్యవస్థను సంస్కరించి అసలు సిసలు విద్యను అందించాలంటే గాంధీ విధానాలే శరణ్యం.

నేటి ప్రైవేటీకరణ మరియు ప్రపంచీకరణల నేపథ్యంలో ప్రపంచం లోని అనేక దేశాల మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలు ఒడుదుడుకులకు లోనౌతూ అస్థిరత్వానికి గురౌతున్నాయి. అందుకనే ప్రపంచ దేశాలన్నీ సుస్థిరాభివృద్ధి అనే భావనవైపు పరుగెడుతున్నాయి. ఈ సందర్భంగా మనం గాంధీజీ యొక్క ఆర్థిక స్వాలంబన సిద్ధాంతాన్ని అర్థంచేసుకొని ఆచరించినట్లయితే సుస్థిరాభివృద్ధికి పునాదులు వెయ్యవచ్చును. ఆర్థిక స్వావలంబన వ్యక్తులకు, దేశానికి తప్పనిసరి అని దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికలను ఆయన రూపొందించారు. ఆర్థిక కార్యకలాపాలతో ముడిపడిన మనిషి జీవితం నైతిక విలువలకు అనుగుణంగా, అహింసాయుతంగా ఉండాలన్నదే ఆయన భావన. సర్వోదయలాంటి ఉపాధి అవకాశాలు కల్పించే ఆర్థిక వ్యవస్థ గురించి ఆయన ఆలోచించారు. దేశంలోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించే ఆర్థిక విధానాలు రూపొందించాలని ఆయన ఆకాంక్షించారు. పెట్టుబడిదారీ విధానం, నిరుద్యోగం, అసమానతలు లాంటివి పేదరికానికి దారితీస్తాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థే దేశ అవసరాలకు ఖచ్చితంగా సరిపోతుందని ఆయన విశ్వసించారు. చిన్నతరహా మరియు కుటీర పరిశ్రమలు దేశ ఆర్థికాభివృద్ధిలో విశిష్టస్థానం ఆక్రమిస్తాయని, పటిష్టమైన మానవశక్తి, పశుసంపద, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు దేశం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా అభివృద్ధిచేసేందుకు దోహదం చేస్తాయని ఆయన నమ్మారు. చైనా ఇజ్రాయిల్ దేశాలలోని ఆర్థిక వ్యవస్థ, జపాన్‌లోని చిన్నతరహా పరిశ్రమల వ్యవస్థ గాంధీ ఆశయాలకు దగ్గరగా ఉంటాయనేది మనం గమనించాలి. అంతేగాక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా, జపాన్‌లాంటి దేశాలు ఎంతటి భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయనేది కూడా అర్థంచేసుకోవాలి. కాబట్టి గాంధీజీ ఆలోచనలు ఆచరణాత్మకంగా ఉండటమే గాక ప్రస్తుత ప్రపంచ వ్యవస్థకు సరిపోయే విధంగా ఉన్నాయనే విషయాన్ని గ్రహించాలి.

గాంధీజీ మెరుగైన మానవ సమాజ రూపకల్పనకు శాంతి భద్రతల పరిరక్షణకు మానవుడు మానవునిగా జీవించగలిగే ఒక మానవీయ సమాజ స్థాపనకు విశేషంగా కృషిచేశారు.సమాజంలో సమానత్వం, స్వేచ్ఛా, సౌభ్రాతృత్వాలు నెలకొల్పాలంటే సామ్యవాద ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటు కావాలి. అప్పుడే ప్రజలందరి మధ్య సమన్వయం సహకారం పెంపొంది సర్వమానవ శ్రేయస్సు నెలకొల్ప బడుతుంది. సర్వమానవ శ్రేయస్సుకు వలస పాలన నిర్మూలనకు సర్వోదయ సమాజం ఒక్కటే పరిష్కారం అని గాంధీజీ సూచించారు. నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న తీవ్రవాదం లాంటి సవాళ్ళను ఎదుర్కోవడానికి గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని మించినది మరొకటి లేదు. కానీ మన పాలకులు ఆయన భావ జాలాన్ని విస్మరించటం ఎంతో దురదృష్టకరం. అవసరాలకనుగుణంగా ఉండే సాంకేతిక పరిజ్ఞానం ప్రజల స్థితిగతులపై వాస్తవిక అంచనాలు రూపొందించటం, సామాజిక దృక్పథం గల ఆర్థిక వ్యవస్థ, ప్రజలందరికి నిర్మాణాత్మక సహకారం, గ్రామీణ జీవనంలో సంస్కరణలు పర్వమానవ సంక్షేమం లాంటి గాంధీజీ ఆలోచనలు మనం విశ్లేషించి నట్లయితే గాంధీజీ గతం కాదని, వర్తమానం మరియు భవిష్యత్తు అని అర్థమౌతుంది. గాంధీజీ మరణించి 65 సంవత్సరాలు గడిచినా ఆయన చరిత్ర పుటల్లో కూరుకు పోయే వ్యక్తిగాదు. ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా రక్తమాంసాలతో కూడిన ఇలాంటి వ్యక్తి (గాంధీజీ) ఈ భూమి మీద నడయాడాడంటే భవిష్యత్ తరాల వారు నమ్మడం కష్టం అంటే అతిశయోక్తికానే కాదు. ■

స్ఫూర్తి

# ఆధునిక గ్రంథాలయ శిల్పి డా. ఎస్.ఆర్. రంగనాథన్



**గ్రంథాలయ కళకు శాస్త్ర హోదా కల్పించడానికి, గ్రంథాలయ శాస్త్రంలోని వివిధ సంక్లిష్ట భావాలను స్పష్టపరచడానికి గాను డాక్టర్ రంగనాథన్ సాంకేతిక పదావళిని సృష్టించారు. దీని సాయంతో ఆయన భావాలను, సిద్ధాంతాలను విశదపరచారు. ఆయన సృష్టించిన పదాలను వాడకుండా గ్రంథాలయ, సమాచార శాస్త్ర రంగాలలో భావాలను వ్యక్తపరచడం దాదాపు అసంభవము అనే చెప్పాలి.**

వ్యక్తిత్వ వికాస నిర్మాణదశలో పుస్తక పఠనానికి మహత్తరమైన స్థానముంది. అందుకేనేమో "చినిగిన చొక్కానైనా తొడుక్కో, కాని ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో" అంటారు కందుకూరి. పుస్తకం హస్త భూషణమైనప్పుడు ప్రయోజనంలేదు. మస్తక భూషణం అయినపుడే ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేస్తుంది.

పరంపరగా మనకు ఎన్నెన్నో లక్షణాలు రావటం జగద్విదితమే. ఐతే అలాంటి వారసత్వపు సంపదగా సద్గ్రంథ పఠనం రంగనాథన్‌కు అబ్బింది. తల్లి దండ్రులైన సీతాలక్ష్మి, రామామృత అయ్యర్ నిత్యం వేద వేదాంగ ఇతిహాస గ్రంథపఠనం చేసేవారు. ఆగష్టు 12, 1892న తమిళనాడు లోని – తంజావూరు జిల్లాలోని షియాలి గ్రామంలో శ్రీరంగనాథన్ జన్మించారు.

ప్రతి జాతిలోను, ప్రతి సంఘంలోను గొప్పవారు ఉద్భవిస్తుంటారు. వారికి లభించే అవకాశాలను బట్టి వారి ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది. బాలబాలిక అభివృద్ధి, స్థితి, దేశ పురోగతికి సజీవ సాక్ష్యంగా భావించాలి. పిల్లలు చక్కని అలవాట్లు, క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యాభ్యాసం చేస్తే వారి తల్లితండ్రులకు, సంఘానికి తద్వారా దేశానికి ఎంతో ఖ్యాతి వస్తుంది. పసిప్రాయం నుండే నీతిదాయక పరిజ్ఞానము, సద్గ్రంథ పఠనం వలన భావిజీవితంలో ఎదురయ్యే ఇబ్బందును అధిగమించి మంచి పౌరులుగా వారు తయారౌతారు.

దీనిని చక్కని ఉదాహరణ డా.ఎస్.ఆర్. రంగనాథన్. వీరి పూర్వీకుల గొప్పదైవభక్తి పరాయణులు. పలు ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేసి, ఇతరులకు బోధించేవారు. ఇటువంటి గొప్ప కుటుంబం లో జన్మించిన రంగనాథన్ హిందూ మతం లోని అత్యున్నత సిద్ధాంతాలను, వేదాంతాలను సహజంగానే ఆకళింపు చేసుకొని వాటిని తన జీవితాంతం ఆచరణలో పెట్టారు.

**జీవిత విశేషాలు**

గణితశాస్త్రంలో ఎమ్.ఏ. పట్టా పుచ్చుకొని, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకులుగా 1921 జనవరిలో బాధ్యతలు స్వీకరించిన రంగనాథన్ 1924 జనవరిలో మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథపాలకులుగా బాధ్యతలు స్వీకరించారు. అదే సంవత్సరం

**డా. జి.ఎ. ప్రసాదరావు,** గ్రంథాలయ విభాగ అధిపతి, ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ. ఫోన్: 9248850020

సెప్టెంబరు నుండి జులై 25 వరకు తొమ్మిది నెలలపాటు ఇంగ్లాండులో గ్రంథాలయ శాస్త్రాన్ని అధ్యయనం చేశారు. అదే కాలంలో ఆ దేశంలోని వివిధ గ్రంథాలయాలను దర్శించి ఆవి అన్ని వర్గాలకూ అందిస్తున్న సేవలను గమనించారు. ఆ తొమ్మిది నెలల అధ్యయనం రంగనాథన్‌పై చెరగని ముద్రవేసింది. గ్రంథపాలకునిగా, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకునిగా, పరిశోధకునిగా ఆయనకు ఒక గమ్యాన్ని నిర్దేశించింది.

ఇంగ్లాండు నుండి తిరిగి వచ్చిన తరువాత మదరాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. చదువరులను గ్రంథాలయానికి ఆకర్షించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టి సఫలీకృతుయ్యారు. వీరి గ్రంథాలయ సేవలను గుర్తించి ప్రభుత్వం విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి ఇతోధిక వార్షిక గ్రాంట్లను మంజూరు చేసింది. మదరాసు యూనివర్శిటీ లైబ్రరీ ఆయనకు ప్రయోగశాలగా ఉపయోగ పడింది. పాఠకులకు అనేక సదుపాయాలు కల్పించారు. చదువరి స్వయంగా పుస్తకమును ఎంచుకొనుటకు స్వేచ్ఛోపలబ్ధిని (Open Access) ప్రవేశపెట్టారు.

రంగనాథన్ లండన్‌లో ఉన్నప్పుడు పాశ్యాత్య గ్రంథాలయశాస్త్ర పద్ధతులు ముఖ్యంగా వర్గీకరణ పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించాడు. ఈ పరిశీలన వలన పాశ్చాత్య వర్గీకరణ పద్ధతులలో ఉన్న లోపాలను తెలుసుకొని వీటిని తొలగించి, నూతనవర్గీకరణ పద్ధతిని రూపొందించి గ్రంథాయ వర్గీకరణ చరిత్రలో నవయుగ ప్రారంభానికి నాందిపలికారు.

**రచనలు**

గ్రంథాలయ, సమాచారశాస్త్రాలలో అరవైపైగా ఉద్గ్రంథాలను, దాదాపు 2 వేల పరిశోధనా వ్యాసాలను రచించిన ఈయన కృషి కొన్ని ముఖ్య ఘట్టాలను గూర్చి తెలుసుకుందాం.

**గ్రంథాలయశాస్త్ర పంచసూత్రాలు (Five Laws of Library Science)**

గ్రంథాయ సేవను రూపుదిద్దే కార్యక్రమంలో భాగంగా ప్రప్రథమంగా గ్రంథాలయ శాస్త్ర సిద్ధాంతాలను ప్రతిపాదించారు. దీనిని 1928వ సం.లో ప్రచురించారు. దీనికి గ్రంథాలయ శాస్త్ర అభ్యాసకులకు ప్రామాణిక గ్రంథంగా జాతీయ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ గ్రంథాలయ శాస్త్ర పంచసూత్రాలు గ్రంథాలయ సేవకుల శాస్త్ర అధ్యయనానికి ఒక ఒరవడిని ఒక సమగ్ర, సహేతుక దృక్పథాన్ని ఏర్పరిచింది. ప్రపంచ దేశాన్నిటిలోను గ్రంథపాలకుల, గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులు ఈ పంచసూత్రాలను చదివి అమలులో వుంచటం తమ ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నారు.

**ఆచూకీ సేవ** (Reference Serivce)

మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథాలయాన్ని ప్రయోగశాలగా, అక్కడి చదువరులకు విస్తృతంగా ఆచూకీ సేవందించటంలో ఈయన చొరవ తీసుకొని తాను స్వయంగా ఆచరణలో పెట్టారు. తన అనుభవాలు, సూత్రాలను క్రోడీకరించి భావితరాల వారికి ఉపయోగపడేటట్లు ఆచూకీ సేవపై సవివరమైన పుస్తకాన్ని ప్రచురించారు. వీరు ప్రతిపాదించిన పుస్తక సేకరణ విధానం వర్గీకరణ, సూచీకరణ, స్వేచ్ఛోపలబ్ధితో పాటు వ్యక్తిగత సమాచార సేవలు కూడా బహుళ ప్రజాదరణ పొందటంవల్ల ఆచూకీసేవలు, నిర్వహణను మరింత సులభసాధ్యం చేశారు. ఆచూకీ సేవా విధానంలో డాక్టర్ రంగనాథన్ వివరించిన భావాలనే మరో రూపంలో యూజర్స్ ఎడ్యుకేషన్ పేరుతో పాశ్చాత్య సమాచార శాస్త్రజ్ఞులు నేడు ప్రపంచంలో చలామణి చేస్తున్నారు.

**గ్రంథాలయ నిర్వహణ**

గ్రంథాలయ నిర్వహణలో శాస్త్రీయ పద్ధతిని పొందుపరచి, క్రమబద్ధీకరణ విధానాల ద్వారా గ్రంథాలయ సేవాగమ్యాన్ని సులభతరంగా, నిశ్చయంగా చేరేవిధానాన్ని గ్రంథాలయ నిర్వహణం అనే పుస్తకంలో విశదీకరించారు.

**పదావళి**

గ్రంథాలయకళకు శాస్త్ర హోదా కల్పించడానికి, గ్రంథాలయ శాస్త్రంలోని వివిధ సంక్లిష్ట భావాలను స్పష్ట పరచడానికి గాను డాక్టర్ రంగనాథన్ ఎంతగానో శ్రమించి గొప్ప సాంకేతిక పదావళిని సృష్టించారు. ఈ పదావళి సాయంతో ఆయన భావాలను, సిద్ధాంతాలను విశదపరచాడు. ఆయన సృష్టించిని పదాలను వాడకుండా గ్రంథాలయ, సమాచార శాస్త్ర రంగాలలో భావాలను కమ్యూనికేట్ చేయడం దాదాపు అసంభవము అనేచెప్పాలి.

**ద్విబిందు వర్గీకరణం Colon Classification) (C C)**

అదివరకే వున్న వివిధ వర్గీకరణ పథకాలను రంగనాథన్ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. వాటితో సంతృప్తి చెందక ఇందులో తనకు తెలిసిన లోటుపాట్లను సవరించే ఉద్దేశంతో ద్విబిందు వర్గీకరణ పథకాన్ని 1933వ సం.లో ప్రచురించారు. విశ్లేషణా సంయోజనాత్మక వర్గీకరణ పథకానికి ప్రథమ ఉదాహరణగా, ద్విబిందు వర్గీకరణాన్ని మనం పేర్కొనవచ్చు.

ప్రతి విషయాన్ని మూలం నుండి విశ్లేషించి, తిరిగి కొన్ని అనుసంధాన సంజ్ఞలను నిర్దేశించిన ముఖసూత్రాన్ని ఒక క్రమరీతిలో సంయోజనపరచి, వర్గ సంఖ్యలను నిర్మించు విధానాన్ని ఈ వర్గీకరణ పథకంలో ఆయన ఇచ్చారు.

నూతన విషయాలకు సముచితమైన వర్గసంఖ్యలు నిర్మించు స్వేచ్ఛ వర్గీకణకారులకు కల్పించబడింది. ఇతర పథకాలతో పోల్చిచూస్తే ఆ పథకంలోని మిశ్రమ సంకేత విస్తరణ శక్తి చాలా ఎక్కువ.

**వర్గీకృత సూచీకల్పము** (Classified Catalogue Code) (CCC)

ద్విబిందు వర్గీకరణ ప్రచురణ తరువాత రంగనాథన్ గ్రంథసూచి నిర్మాణానికి ఒక నిర్దిష్టమైన కల్పాన్ని నిర్మించారు. వారి పరిశోధన, తోటి ఉద్యోగులతో జరిపిన చర్చల సారాంశాన్ని ప్రమాణాలుగా తీసుకొని గ్రంథసూచీ సిద్ధాంతాలను 1934లో ప్రతిపాదించారు. ఇదే వర్గీకృత సూచీకల్పం, వారు చెప్పిన గొలుసు క్రమం, నిబంధనలు, నార్మేటివ్ సూత్రాలు ఇత్యాది అంశాలను ఆ కల్పంలో విపులంగా చర్చించారు. నూతన విషయాలను జోడిస్తూ 1964 వరకు ఐదు కూర్పులను తీసుకు వచ్చారు. ఇది పాఠ్యాంశంగా ఉండేది. తమిళనాడులోని చాలా గ్రంథాలయాలు నేటికీ దీనిని పాటిస్తున్నాయి.

1969లో రంగనాథన్ ప్రస్తావించిన క్యానన్ ఆఫ్ రీకాల్ వ్యాల్యూ గ్రంథ సూచీలను తయారు చేయుటలో కొన్ని ప్రత్యేకమైన మార్పులను తెచ్చింది. దీనికి అనుగుణంగా సూచీకరణ ప్రయోగము Cataloguing Practiceఅనే పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకంలో చెప్పిన విషయాల ప్రకారం CCC ఐదవ కూర్పును సవరణ చేయాలన్నది వారి ఆకాంక్ష. కానీ వారు మరణించారు సవరణ ప్రణాళిక కూడా వారితోపాటు గతించి పోయింది. అందుచేత ఈ పుస్తకం వాడుకలోకి రాలేదు. ప్రస్తుతం CCలాగానే CCC కూడా చాలా తక్కువ గ్రంథాలయాలలో ఉపయోగిస్తున్నారు.

గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించి అన్ని విషయాలపై వీరు రచించిన ప్రమాణ గ్రంథాలు, పరిశోధనల వ్యాసాలు అనేకం. వాటినన్నింటినీ గురించి చర్చించాలంటే ఒక ఉద్గ్రంథమే అవుతుంది. గ్రంథాలయ భవనాలు, గ్రంథాలయ సేవ, సిబ్బంది, అర్హతలు, విధులు తదితర విషయాలపై మనదేశ, కాలానుగుణమైన ప్రమాణాలను వీరు రూపొందించారు. గ్రంథాలయ శాస్త్ర బహుముఖ అభివృద్ధికి వీరు చేసిన కృషి అపారం. గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులకు, గ్రంథపాలకులకు వీరు పూజనీయులు. అనితర సాధ్యమైన వీరి కృషి నభూతో నభవిష్యతి. అందువలననే వీరిని మనం గ్రంథాలయ శాస్త్ర పితామహులని ప్రేమ, ఆదరాలతో గౌరవించుకొంటున్నాము.

**తత్వవేత్తగా**

కుటుంబ వారసత్వం, తండ్రిగారి గ్రామ భక్తికూటమి ప్రభావంతో రంగనాథన్‌కు తాత్విక చింతన గొప్పగా అలవడింది. ఈ శక్తి వలన ఆయనను ఒక గొప్ప తపస్సంపన్నుడిగా భావించి అందరూ గౌరవించేవారు. మద్రాసు నగరంలో పర్వదినములందు, సెలవు రోజుల్లో కొన్ని సాంఘిక సంస్థలు మరీ ముఖ్యంగా రోటరీ క్లబ్ వారు రంగనాథన్‌చే రాముడు, కృష్ణుడు వేదాంతాలను గూర్చి ప్రసంగాలు ఏర్పాటు చేసేవారు.

రంగనాథన్ తన ఉద్యోగ ధర్మంలో చెమటోడ్చి సంపాదించిన ఒక లక్ష రూ.లను 'శారదా రంగానాథన్ ఎండోమెంట్' పేరిట మద్రాసు విశ్వవిద్యాయంలో గ్రంథాలయ శాస్త్ర పీఠాన్ని స్థాపించడం ఆయనలోని దాతృత్వ గుణానికి నిదర్శనం. ఇప్పటికీ ఇది సజీవంగా, విజయవంతంగా ప్రజాభిమానాన్ని చూరగొంటోంది.

ఆయన తన ద్విబిందు వర్గీకరణ పథకంలోని మూలతత్వాలైన PMEST ను పంచేంద్రియాలతో పోల్చి, వీటిలో పదార్థం (Matter) శక్తితో (Energy) కలుపగా వచ్చిన ఫలితాన్ని మూర్తి మత్వంగా (Personality) పోల్చి, తనలోని వేదాంత ధోరణిని నిరూపించు కొన్నారు. రంగనాథన్ చిరస్మరణీయు, గ్రంథాలయ సమాచార వృత్తిలోని వారు ఎల్లవేళలా గుర్తుంచు కోవలసిన మహాపురుషులు.

**ముగింపు**

గ్రంథాలయ సమాచార సేవకులు, శాస్త్ర పరిశోధన, బోధనకు మన దేశంలో ఒక నిర్దిష్టమైన రూపాన్నిచ్చి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకు రావటానికి నిరంతర కృషిచేసి సఫలీకృతులైనారు. వీరి కృషిని, మేధను బ్రిటిష్ భారత ప్రభుత్వం గుర్తించి 1935లో 'రావ్‌సాహెబ్' బిరుదును, స్వతంత్ర, గణతంత్ర భారత ప్రభుత్వం 1957లో 'పద్మశ్రీ' బిరుదును, ఇచ్చి, 1965లో 'జాతీయ పరిశోధనా ఆచార్యునిగా' (National Research Professor) గౌరవించింది.

ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను, గౌరవాలను అందుకొన్న గొప్ప నిగర్వి, నిరాడంబరుడు. ముఖ్యంగా వర్గీకరణ సిద్ధాంతం, ప్రయోగం, అభివృద్ధికి రంగనాథన్ గారి కృషి అపారం. ఈ రంగంలో వారు చేసిన కృషి మరే ఇతర గ్రంథాలయ శాస్త్రజ్ఞుడు చేయలేదంటే అతిశయోక్తికాదు. గ్రంథాలయ రంగంలో భారత దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయంగా సాధించి పెట్టిన రంగనాథన్ అందరికీ ఆదర్శనీయుడు. నేటి తరానికి ఒక గొప్ప ఆధునిక గ్రంథాలయ శిల్పి. ■

# మానవజాతి మనుగడకు మూగజీవాల సంరక్షణ



**జంతువులు మానవాళికి జన్యుపరంగా వైద్యరంగంలో, రసాయన పారిశ్రామిక రంగంలో ఇలా ఎన్నో రకాలుగా మానవ జీవనానికి పరోక్షంగా రక్షణ కల్పిస్తున్నాయి. ప్రత్యక్షంగా సహజసిద్ధ పారిశుధ్య కార్మికులుగా ఉపయోగపడు తున్నాయి. అలాంటి జంతు జాలాలను రక్షించాలని ప్రపంచదేశాలు నిర్ణయించుకున్నాయి.**

"**జం**తునాం నరజన్మ దుర్లభం" – "అనేక కోట్ల జీవరాసుల్లో మానవజన్మ లభించడం చాలా గొప్ప అదృష్టం". ఇలాంటి అదృష్టంతో ఉన్న మానవులు చేయవలసిన ఎన్నో పనుల్లో అతి ముఖ్యమైనది "జంతు సంరక్షణం" మన హోదాకు, రక్షణకు బాసటగా ఉన్న జంతు సంరక్షణ మన విధి.

గాంధీజీ "ఒక దేశ ఔన్నత్యం జంతువు పట్ల వ్యవహరించే తీరుపై ఆధారపడి ఉంటుంది" అన్నారు.

జార్జి యిలియట్ మాటల్లో "జంతువులు ఉత్తమ మిత్రులు, అవి ప్రశ్నలు వేయవు. ఏ విమర్శలు చేయవు".

అనిబిసెంట్ తన భావాన్ని ఇలావ్యక్తం చేశారు. "జంతువులకన్నా మనం మేధావులం, సమర్థులం కనుకనే వాటి క్షేమానికి మన కర్తం.

"జంతువులన్నీ కేవలం మానవుని అవసరార్థమే సృష్టించబడ్డాయన్నది వాస్తవం" అనే పీకాక్.

వీరందరి గొప్పవాక్కులో ఉన్న అర్థం "జంతు సంరక్షణం"

ప్రకృతిలో ప్రాణులు మృతకళేబరాలతో భూమండలం నిండి పోకుండా ఆహార చక్రం ద్వారా శుద్ధి ప్రక్రియలకు అవకాశం కల్పించింది. ప్రకృతి కొన్ని రకాల జంతువులను సహజ పారిశుధ్య కర్మచారులుగా నియమించుకుంది. ఒక జాతికి చెందిన వివిధ రకాల మొక్కలను, జంతువులను భద్రంగా చూసుకొనవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ప్రతి జాతిరకంలోను దానికి అభిలాక్షణికమైన జన్యువులు ఉంటాయి. ఒక శ్రేణికి చెందిన ఈ వివిధ రకాల జన్యువుల కాలుష్య ప్రభావాలను, వ్యాధులను, పరిసరాల్లో కలిగే ఇతర మార్పులను మానవులు తట్టుకొనడానికి దోహదం చేస్తాయి. మొక్కలు, జంతువులకు సంబంధించిన రకాలలోని వైవిధ్యం తగ్గితే జన్యువు వైవిధ్యం కూడా తగ్గిపోతుంది. వృక్ష సంపద వైవిధ్యాన్ని బట్టే జంతువైవిధ్యం కూడా ఉంటుంది.

**సుసర్ల మాధవి,** ఫ్రీలాన్స్ రచయిత్రి

**జంతువు :** ప్రధానంగా ఆహారం కొరకు మొక్క మీద ఆధారపడే జంతువు (Herbivores) ఆహారం కొరకు జంతువు మీద ఆధారపడే ఇతర జంతువులు (Camivores). ప్రతి ఒక జాతి మొక్కతో 30 జాతుల జీవరాసులు నశిస్తాయని అంచనా. అంటే ఒకజాతి మొక్క ప్రకృతిలో అంతరిస్తే దానిపై ఆధారపడిన జంతు జీవరాశి, పక్షిజాతికి చెందిన జీవరాశి మొత్తం నశిస్తుంది. భూమిపై సుమారు 30 మిలియన్ జీవరాసులున్నాయి. వీటిలో 1.5 మిలియన్‌లు మాత్రమే గుర్తించి నమోదు చేయడం జరిగింది. వీటిలో 7500 కీటకాలుగా గుర్తించారు. మిగిలినవి వెన్నెముక గల జంతువులు (సకసేరుకాలు), వెన్నెముక లేని జంతువులు (అకసేరుకాలు) మరియు బూజు, సూక్ష్మజీవులు మొదలైనవి.

**జీవ వైవిధ్యం - ప్రపంచ దేశాల కృషి**

ఈ భూమిపై మానవునితోపాటు సమస్త జీవకోటి, భూ అటవీ, జల తదితర సహజ వనరుల సంపద యావత్తును జీవవైవిధ్యంగా పేర్కొంటాం. పరస్పర ఆధార సహకారాలతో వైవిధ్యభరితమైన జన్యుచక్రం కొనసాగుతుంది. ప్రకృతి సమతుల్యతకు జీవవైవిధ్యం ముఖ్యం.

జంతువులు మానవాళికి జన్యుపరంగా వైద్యరంగంలో, రసాయన పారిశ్రామిక రంగంలో ఇలా ఎన్నో రకాలుగా మానవ జీవనానికి పరోక్షంగా రక్షణ కల్పిస్తున్నాయి. ప్రత్యక్షంగా సహజసిద్ధ పారిశుధ్య కార్మికులుగా ఉపయోగపడు తున్నాయి. అలాంటి జంతు జాలాలను రక్షించాలని ప్రపంచదేశాలు నిర్ణయించు కున్నాయి.

అక్టోబర్ 4న "జంతు సంరక్షణా దినోత్సవము'' ను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలని 1931లోనే ప్రకటించు కున్నాయి. కాలగమనంలో ప్రకటనను పక్కన పెడితే 1992లో రియోడిజెనిరో ధరిణీ శిఖరాగ్ర సదస్సులో జీవవైవిధ్య సదస్సు అమలుకు వచ్చింది. జీవవైవిధ్య పరిరక్షణ అమలు, జీవవైవిధ్య అంశాల సుస్థిర వినియోగం, జన్యు వనరుల వాడకం ఇలాంటి అంశాలపై దృష్టినుంచింది. జీవ వైవిధ్య సదస్సుకు ఐరోపా యూనియన్‌తో సహా మొత్తం 193 దేశాలు సమ్మతి తెలిపి ఈ భూమండలంపై గల అన్ని జీవులు పరిరక్షణకు ప్రపంచ, ప్రాంతీయ, జాతీయస్థాయిలో జరిగే వినాశన రేటును తగ్గించడానికి ప్రయత్నించేలా సమావేశం జరిపారు. ''జీవవైవిధ్య వ్యూహాత్మక ప్రణాళిక 2011-20" ఎన్నో ఒప్పందాలు చేసింది. "ఐక్యరాజ్య సమితి" 2011-2020 దశాబ్దాన్ని జీవవైవిధ్య దశాబ్దంగా ప్రకటించింది. 2050నాటికి జీవవైవిధ్యానికి విలువనిచ్చి పరిరక్షించడంతోపాటు పునరుద్ధరించి విజ్ఞతతో పర్యావరణ వ్యవస్థ సేవలు వినియోగించుకోవాలని పేర్కొంది.

వ్యూహాత్మక గమ్యంలో అడవులతో సహా అన్ని సహజ ఆవాసాల క్షీణత రేటును కనీసం సగానికి లేదా సంపూర్ణంగా నిలువరించాలి.

అన్ని మత్స్య, వెన్నెముక లేని జీవ సంపద, నీటిలో పెరిగే మొక్క సుస్థిర పెంపకం చేపట్టాలి. అంతరించిపోతున్న జంతు జాలాలను పరిరక్షించాలి.

ఈ 2015 నాటికి సాగుమొక్కు, పంటలు, పెంపుడు జంతువు, వన్యమృగాల జన్యువైవిధ్యాన్ని కాపాడి జన్యుక్షీణత అరికట్టాలని నిర్ణయించారు.

**వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972**

వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లో అమలు చేశారు. ఈచట్టంలో జంతువుల వివరణకు మొత్తం 6 షెడ్యూల్స్ పేర్కొన్నారు. ఎన్నోరకాల పార్కును ఏర్పరచి ఈ షెడ్యూల్ ప్రకారం జంతువులను పేర్కొని ఆ అడవి పార్కులో ఏవిధమైన వేట, నరికివేత లేకుండా ఎన్నో చర్యలు తీసుకుంది. ఎన్నో రకాలుగా వేటను అరికట్టి వేటాడిన వారికి కఠిన శిక్షలు విధిస్తుందని ప్రకటించింది. వన్యప్రాణిని ఎవరైనా శారీరకంగాకాని, మానసికంగాకాని హింసిస్తే వారిని కఠినంగా శిక్షించేలా 1972 చట్టంలో ఎన్నో సెక్షన్‌లు చేసింది.

మనదేశంలో పాడిపశుసంపద ద్వారా మనకు పాలు, గ్రుడ్లు, మాంసం, ఊలు, చర్మాలు మొదలైనవి లభిస్తున్నాయి. అలాగే సంప్రదాయక వ్యవసాయ కార్యకలాపాల్లో కావలసిన పని సామర్థ్యాన్ని సమకూర్చే జంతుసంపదను ఎన్నో కుటుంబాలు జీవనాధారం చేసుకొని ఉన్నాయి. అంతేకాక కొన్ని ప్రత్యేక పర్వదినాలు, జంతువు పండుగలో వాటిని అలంకరించి మానవులతో సమానంగా చూసే సంస్కృతి మనది. 2002లోనే భారత్ జీవవైవిధ్య చట్టాన్ని చేసిన తొలి దేశాల క్రమంలో నిలిచింది.

ఎన్నో రకాలుగా మానవజాతికి, జీవజాతికి ఉపకరించే జంతువులను ఎంతో ప్రేమతో, మానవత్వంతో, దయతో కాపాడు కోవాలి. మానవులు కాలుష్యంలో జీవించినట్లు మానవేతర జీవాలు జీవించ లేక తమ ఉనికిని తమకు తాముగా అంతం చేసుకుంటున్నాయి. మనుగడ సాగించలేక పోతున్నాయి. పర్యావరణ కాలుష్యం, అడవుల నరికివేత తగ్గిస్తే అన్ని జీవాలూ రక్షించబడతాయి. ■

# పోలీసు అమరులు



**అక్టోబర్ 21 చైనా సరిహద్దులో జరిగిన పోరాటంలో 10 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. నాటి నుండి ప్రతి అక్టోబర్ 21న "పోలీసు అమర వీరుల సంస్మరణ దినంగా" పాటించాలని నిర్ణయించారు.**

ప్రపంచంలో ఏ దేశంలోనయినా పోలీసు వ్యవస్థ అనివార్యం. ఎటువంటి పాలనా వ్యవస్థ ఉన్నా పోలీసులు లేకుండా పరిపాలన సాధ్యం కాదు. పోలీసు వ్యవస్థ ప్రభుత్వ వ్యవస్థను కాపాడుతూ, సుస్థిర పాలనకు బాటలు వేస్తుంది. ప్రజా జీవితంలో శాంతి భద్రతలకు కాపాడు తుంది. ప్రజల ధన, మాన ప్రాణాలకు అనునిత్యం రక్షణ కల్పిస్తుంది. నేడు పోలీసువ్యవస్థ ఉగ్రవాదులు, నక్సలైట్‌లు, దోపిడి ముఠాలు, హంతకులు, అసాంఘీక శక్తులు, రాజకీయ, మతపరమైన తీవ్రవాద వర్గాలతో పోరాడవలసి వస్తున్నది. వీరిని నియంత్రించే క్రమంలో పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోతున్నారు. అనునిత్యం సమాజహితం కోసం పాటు పడుతూ విధి నిర్వహణలో ఉగ్రవాదుల గ్రెనేడ్‌కూ, నక్సలైట్ల తుపాకి తూటాలకు, మాఫియా ముఠాల కత్తి పోట్లకు, రౌడీల భౌతిక దాడులకు పోలీసులు అసువులు బాస్తున్నారు. ఏటా అక్టోబర్ 21న మనం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపు కుంటున్నాము.

**చైనా సైనికులతో విరోచిత పోరాటం**

భారత్–చైనా సరిహద్దుల్లో ఉన్న లధక్‌లోని అక్సాయ్‌చిన్‌లో 1959అక్టోబర్ 21న చైనా సైనికులతో పోరాటంలో 10 మంది C.R.P.F.జవానులు ప్రాణాలు కోల్పోయారు. నాటి నుండి ప్రతి అక్టోబర్ 21న "పోలీసు అమర వీరుల సంస్మరణ దినంగా" పాటించాలని నిర్ణయించారు.

**పోలీసు వ్యవస్థ – సమస్యలు, సవాళ్ళు**

**1) ఉగ్రవాదం :** మన దేశం నేడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఉగ్రవాదం. మన దేశ ప్రజాస్వామ్యాన్ని, సార్వభౌమాధికారాన్ని, లౌకిక తత్వాన్ని, ప్రగతిని విచ్ఛినం చేయాలని ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారు. అమాయక ప్రజలను, పోలీసులను, ప్రముఖులను కాల్చి చంపుతున్నారు. ప్రభుత్వ, రక్షణ, మత ప్రదేశాలలో, పర్యాటక ప్రదేశాలలో బాంబు దాడులతో విధ్వంసం సృష్టిస్తున్నారు. మన దేశంపై లష్కరే

**ఎ. కుమార స్వామి,** ప్రభుత్వ పాలనా శాస్త్ర పరిశోధకుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్. e-mail : akswamy2013@gmail.com

తోయిబా, హుజీ, జైషే మహ్మద్, సిమి, ఇండియన్ ముజాహిద్దీన్ మొదలైన ఉగ్రవాద సంస్థలు దాడులు చేస్తున్నాయి. జమ్ము-కాశ్మీర్‌లో 1988-2014 ఏప్రిల్ నాటికి 14,676 మంది పౌరులు, 6,104 మంది భద్రత సిబ్బంది ఉగ్రవాద హింసకు బలి అయ్యారు. దీన్ని బట్టి ఉగ్రవాదులు ఏ స్థాయిలో హింసకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. మార్చి 12, 1993న ముంబాయి వరుస బాంబు పేళ్లు (250 మంది మరణించారు) 2001న పార్లమెంట్‌పై దాడి, మే 18, 2007 హైద్రాబాద్ మక్కామసీద్ బాంబుపేళ్లు, 2008న ముంబాయి ఉగ్రదాడి (166 మంది మరణం), ఫిబ్రవరి 21, 2013న దిల్‌సుఖ్‌నగర్ బాంబుదాడులు వంటి సంఘటనలు ఎన్నో ఏప్రిల్ 03, 2014 నల్గొండ జిల్లా సూర్యాపేటలో ఉగ్రవాదుల దాడిలో ఒక ఎస్.ఐ., కానిస్టేబుల్ , హోంగార్డు మృతి చెందారు. పంజాబ్ లోని గురుదాస్‌పూర్ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌పై ఉగ్రవాద దాడిలో ఒక ఎస్.పి., నలుగురు సిబ్బంది, నలుగురు పౌరులు మరణించారు.

నవంబర్ 26, 2008 నాటి ముంబాయి దాడిలో 166 మంది అమాయకపు పౌరులతోపాటు పోలీసులూ మరణించారు.

**సైబర్ దాడులు**

దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థలను విచ్ఛిన్నం చేయటానికి ఉగ్రవాదులు సైబర్ దాడులకు కూడా పాల్పడుతున్నారు. మన దేశంలో ప్రతి ఏటా 42 లక్షల సైబర్ నేరాలు నమోదవు తున్నాయి. నిమిషానికి 80 మంది సైబర్ నేరాల వలలో చిక్కుకుంటున్నారు. సైబర్ నేరాలు వలన మనం ఏటా 800 కోట్ల డాలర్లు నష్టపోతున్నాం. మన దేశం సైబర్ దాడులకు గురి అవుతున్న దేశాలలో మూడవ స్థానంలో ఉంది. దీని నివారణకై పోలీసు వ్యవస్థ ప్రత్యేకంగా "సైబర్ సెల్" ను ఏర్పాటు చేసింది.

**సిబ్బంది కొరత - పెరుగుతున్న పనిభారం**

ప్రతి ఏటా ఉగ్రవాద, నక్సల్స్, మతాల దాడులు, ఉద్యమాలు, ఆందోళనలు, ఉత్సవాలు, బంద్‌లు పెరిగిపోతున్నాయి. కానీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పెరగటం లేదు.

కాగా Bureau of Police Research & Developement (BPR&D) వారి జనవరి 1, 2011 నాటి నివేదిక ప్రకారం పోలీసులు, ప్రజల నిష్పత్తి కనీసం ఉండవల్సిన దానికంటే చాలా తక్కువ ఉన్నట్లు పేర్కొంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రతి 222 మంది పౌరులకు ఒక పోలీసు ఉండాలి. కానీ మన దేశంలో 761 మంది పౌరులకు ఒక పోలీసు చొప్పున ఉన్నారు. మెట్రోనగరాల్లో పోలీసులు ప్రజల నిష్పత్తి వరుసగా ఢిల్లీలో 1:262, ముంబాయిలో 1:334, కలకత్తాలో 1:474, చెన్నైలో 1:614, హైదరాబాద్‌లో 1:653, సైబరాబాద్‌లో 1:895 నిష్పత్తిలో ఉన్నారు. కాగా అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికాలో 1:334, బ్రిటన్ 1:290, జపాన్ 1:303, జర్మనీ 1:298 నిష్పత్తిలోనూ ఉన్నారు.

దేశంలోని మొత్తం పోలీసుల సంఖ్య 20, 64, 370 కాగా వీరిలో సుమారుగా ఐదు లక్ష (31%) పోలీసు పోస్టులను భర్తీ చేయవలసి ఉంది. ఈ కారణాల వల్ల కేసులు వేల సంఖ్యలో పేరుకుపోయి పోలీసులు పని చేయరు అనే అపవాదు, పనిభారం రెండు ఉన్నాయి. 2012 National Crime Records Bureau (NCRB) లెక్కల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2,47,757 కేసులు నమోదయ్యాయి. వీటిలో కేవలం 29.7శాతం కేసుల్లో మాత్రమే నిందితులకు శిక్షలు పడ్డాయి.

**పోలీసు ప్రజా సంబంధాలు**

ప్రజాస్వామ్య విజయం ప్రజల భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుంది. పోలీసు వ్యవస్థ సమర్థతకు కూడా ప్రజల సహకారం, భాగస్వామ్యం చాలా అవసరం. అప్పుడే పోలీసు వ్యవస్థ విజయవంత మవుతుంది. పోలీసుల వ్యవహార శైలిలో మార్పులు అత్యంత ఆవశ్యం. ఇందుకుగాను ఉన్నతాధికారులు ఎంతో కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజలతో ఎక్కువ సంబంధాలు కల్గి ఉండే కింది స్థాయి సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

**పోలీసు సంస్కరణలపై సుప్రీం కోర్టు తీర్పు:**

పోలీసు సంస్కరణల కోసం కాలానుగుణంగా వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. సుప్రీం కోర్టులో 2006వ సం.లో ప్రకాశ్‌సింగ్ (Ex.DGP, U.P) పోలీసు సంస్కరణలకై ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (PIL) దాఖలు చేశారు. జనవరి 3, 2007న సుప్రీం కోర్టు తీర్పు ఇస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోలీసు సంస్కరణల అమలుకై ఆదేశాల్ని జారీ చేసింది. ఇందులోని ముఖ్యమైన సిఫారసులు : (1) కేంద్ర స్థాయిలో కేంద్ర భద్రత మండలి (2) రాష్ట్ర స్థాయిలో - రాష్ట్ర భద్రత మండలి ఏర్పాటు (3) నూతన పోలీసు చట్టం రూపకల్పన (4) డి.జి.పి. నియామకాల్లో పాదర్శకత (5)

దర్యాప్తు – శాంతి భద్రతల శాఖలను వేరు చేయాలి (6) పోలీసు వ్యవస్థీకరణ బోర్డు ఏర్పాటు (7) పోలీసు ఫిర్యాదుల సంస్థ మొదలగునవి

**తెలంగాణ ప్రభుత్వం-పోలీసు సంస్కరణలు**

జూన్, 2, 2014 న 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు రాష్ట్ర అభివృద్ధికి పోలీసుల పాత్ర కీలకం అని భావించి పోలీసుల సంస్కరణకు శ్రీకారం చుట్టారు.

ఏదైనా ప్రమాద ఘటనా స్థలానికి తొందరగా చేరుకునేందుకు వాహన శ్రేణికి రూ.310 కోట్లు కేటాయించారు. గస్తీని ముమ్మరం చేశారు. మొదటగా 300 ఇన్నోవాలు, 500 ద్విచక్రవాహనాలను ఆగస్టు 14, 2014న ప్రారంభించారు.

**ఆరోగ్య భద్రత పథకం**

పోలీసు శాఖలో "ఆరోగ్య భద్రత పథకాన్ని"జనవరి 15, 1999న హెచ్.జె. దొర, డి.జి.పి.గా ఉన్న సమయంలో ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కిందిస్థాయి సిబ్బందికి ఉన్న రూ. 1 లక్ష ఆరోగ్య బీమా పరిమితిని 5 లక్ష రూపాయలకు పెంచారు. పై స్థాయి అధికారుల సీలింగ్‌ను రూ. 2.5 – 7.5 లక్ష రూపాయలకు పెంచారు.

**పోలీసు అమరులకు ఎక్స్‌గ్రేషియా పెంపు**

విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరుల కుటుంబాలకు చెల్లించే ఎక్స్‌గ్రేషియాలను తెలంగాణ ప్రభుత్వం భారీగా పెంచింది. కానిస్టేబుల్ నుండి ఎ.ఎస్.ఐ. స్థాయి వారికి 25 లక్ష నుండి 40 లక్షలకు పెంచారు. ఎస్.ఐ.కి 25 నుండి 45 లక్షలు, సి.ఐ. నుండి అదనపు ఎస్.పి.కి 30 లక్షల నుండి 50 లక్షలకు, ఎస్.పి / ఐ.పి.ఎస్.స్థాయి అధికారికి 50 లక్షల నుండి 1 కోటికి పెంచారు. వాటితోపాటుగా అమరుల కుటుంబాల పిల్లలు చదువు, ఇంటి నిర్మాణం ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు.



**హోంగార్డు వేతనం పెంపు**

పోలీసులకు విధి నిర్వహణలో సహాయ, సహకారాలు అందించేవారు హోంగార్డులు. వీరికి ఇంతకు ముందు రూ. 250/– దినసరి వేతనంగా చెల్లించే వారు. జీతం పెంచాలన్న హోంగార్డు విజ్ఞప్తిని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళారు. దీంతో ప్రభుత్వం హోంగార్డు దినసరి వేతనాన్ని రూ. 400 లకుపెంచింది.

**యూనిఫాం – అలవెన్స్ పెంపు**

పోలీసు సిబ్బందికి యూనిఫాం ఖర్చు నిమిత్తం సంవత్సరానికి 2వేల రూపాయలు చెల్లించేవారు. ప్రస్తుతం దానిని 3,500 రూపాయలకు పెంచారు. గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందికి 5000 నుండి7500 రూ.లకు యూనిఫాం అలవెన్స్ పెంచారు.

**ఎస్.ఐ.లకు గెజిటెడ్ హోదా**

ఇదివరకు ఎస్.ఎచ్.ఓ నుండి డి.జి.పి. స్థాయి అధికారులు మాత్రమే. గెజిటెడ్ హోదా కలిగి ఉండేవారు. మండల స్థాయిలో శాంతి భద్రతలు కాపాడుతున్న ఎన్.ఐ.కు కూడా గెజిటెడ్ హోదా ఇవ్వనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది.

**ముగింపు**

"థామస్ జెఫర్సన్" "స్వేచ్ఛ అనే మహా వృక్షానికి అనునిత్యం దేశభక్తులు రక్త తర్పణమనే నీరుపోస్తూ ఉండాలి" అని అంటారు. దీనికి పోలీసులు చక్కని ఉదాహరణ. ఎండలో, వానలో, రాత్రిపగళ్ళు పని చేస్తున్నారు. పండగలను, కుటుంబాలను వదిలి కేవలం విధి, కర్తవ్యం అనే పవిత్ర కార్యం కోసం పని చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంకోసం తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నారు. పోలీసు అమరుల కుటుంబాలకు వెన్ను దన్నుగా నిలుస్తూ వారి సేవలను జ్ఞాపకం చేసుకొని "పోలీసు అమరులకు నివాళులు అర్పిద్దాం". ■

# నూతన దృక్పథంలో ఉపాధి అవకాశాలు : సమగ్ర అభివృద్ధి



మహిళలకు ఉపాధి అవకాశాలు లేకపోవడం, అసమానతలు, ఉపాధి రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష మరొక కీలక సవాలుగా నిలుస్తోంది. మహిళా కార్మికులలో అత్యధిక శాతం మంది పురుషులతో పోల్చి చూసినపుడు అల్ప ఉత్పాదకత, అల్పాదాయ ఉపాధికే పరిమితం అవుతున్నారు. విద్యారంగంలో రాయితీలు కల్పించడం, కుటుంబ ఆదాయాలు పెరిగిన ఫలితంగా మహిళల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నది.

ఇంచుమించుగా గడచిన మూడు దశాబ్దాల కాలంలో, 1990 ఆరంభం నుంచి 2012 వరకు మన దేశం ఆరు శాతం వార్షిక వృద్ధిరేటుతో అభివృద్ధి పథంలో వేగంగా అడుగులు వేసింది. అయితే ఆ తర్వాత రెండు సంవత్సరాలపాటు జాతీయ, అంతర్జాతీయ కారణాలు ఏవైనప్పటికీ, దేశంలో వృద్ధిరేటుతోపాటుగా పొదుపు పెట్టుబడుల రేటు గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఇపుడు మళ్ళీ పరిస్థితి మారింది. పట్టాలు తప్పిన ఆర్థిక వ్యవస్థ మళ్ళీ పట్టాల పైకి వచ్చింది. వృద్ధిరేటు వేగం పుంజుకుంది జాతీయ ఆర్థిక గణాంకాల అంచనాల నూతన విధానం ప్రకారం చూస్తే, మన దేశం 7 శాతం వృద్ధిరేటుతో చైనా ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేఖను దాటి ముందుకు సాగుతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరుగులు తీస్తున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయిని అందుకుంది.

మరో వంక మన దేశంలో జనాభావృద్ధి రేటు క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. 1980లో 2.5శాతం ఉన్న జనాభా వృద్ధిరేటు ప్రస్తుతానికి 1.5శాతానికి తగ్గింది. దీంతో తలసరి ఆదాయం సుస్థిరంగా పెరుగుతుంది. ఫలితంగా పేదరికం గణనీయంగా తగ్గడమే కాకుండా, విద్యా, వైద్యం వంటి ఇతర జీవన ప్రమాణాల సూచికలలో గణనీయ ప్రగతి కనిపిస్తోంది. ఇలా విజయపరంపర కొనసాగుతున్నప్పటికీ ఇంకా ఈ నాటికీ మన దేశంలో పేదరికం విస్తృతంగానే ఉంది. ఉపాధి రంగం అవ్యవస్థీకృతంగా ఉన్న నేపథ్యంలో అవకాశాలు ఆశించిన స్థాయిలో అందిరావడం లేదు. ఈ చేదు నిజాలను ప్రముఖంగా పరిశీలించవలసిన అవసరం ఉంది.

**అసంఘటిత ఉపాధి రంగం**

అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు అత్యధికంగా పనిచేసే దేశాలలో మన దేశం కూడా ఒకటి. 2011-12 గణాంక వివరాల ప్రకారం అన్ని రంగాలలో కలిపి పనిచేస్తున్న వారిలో కేవలం 18శాతం మంది మాత్రమే వ్యవస్థీకృత ఉపాధితోపాటుగా సామాజిక భద్రత కూడా లభిస్తోంది. ఇదిలా ఉంటే గత కొన్ని సంవత్సరాలుగా వ్యవస్థీకృత రంగంలోనూ సాధారణ (క్యాజువల్) ఒప్పంద (కాంట్రాక్టు) పనివారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇపుడది సుమారు 58శాతానికి చేరింది. ఇలా సాధారణ, ఒప్పంద కార్మికులు

**అలఖ్ ఎన్. శర్మ,** ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ. e-mail : alakh.sharma@ihdindia.org

లేదా ఉద్యోగులకు సామాజిక భద్రత అనేది ఎండమావిగానే మిగిలింది. ఈ రంగంలో పనిచేసే వారికి జీతాలు తక్కువగా ఉంటాయి. అదే సమయంలో వారి ఉత్పాదకత కూడా తక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితులలో పేదరికం పరిమాణపరంగా తగ్గినా, ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిలోనే ఉంది. భారత కార్మిక ఉపాధి నివేదిక 2014 (మానవాభివృద్ధి సంస్థ) ప్రకారం మన దేశ కార్మికులు, ఇతర ఉపాధి ఆధారిత ఉద్యోగ వర్గాలలో నాలుగింట ఒక వంతు మంది అధికారిక దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ప్రస్తుతత దారిద్ర్య స్థాయిని ప్రస్తుత స్థాయి (1.5 డాలర్లు) నుంచి 2 డాలర్లకు పెంచితే కార్మిక జనాభాలో 58శాతం అధికారికంగా పేదరికం పరిధిలోకి వస్తారు. మరో వంక శాశ్వత ఉద్యోగులు దేశం మొత్తం మీద కేవలం మూడు శాతం మంది మాత్రమే ఉన్నారు. దినసరి లెక్కన చూసినా ఇది 6 శాతం దాటదు. అంటే మన దేశంలో నిరుద్యోగం కంటే అవ్యవస్థీకృత రంగంలో ఎక్కువ శాతం మందికార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన దేశంలో నిరుద్యోగం కంటే పని చేస్తున్న పేదలు సమస్య మూలబిందువుగా నిలుస్తున్నారు.

ఇదొకటి అయితే, ఇవి కాకా మన దేశంలో నమోదవుతున్న అధికవృద్ధిరేటు సమ్మిళితంగా లేదని తెలియచేసే సూచికలు ఇంకా ఉన్నాయి. ఇందులో మొదటిది ప్రాంతీయ వ్యత్యాసాలు, వ్యవస్థీకృత ఉపాధి అవకాశాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. మధ్య, ఈశాన్య ప్రాంతాల్లో గిరిజనులు, ఇతర బలహీన వర్గాల జనాభా అధికంగా ఉంటుంది. దేశజనాభాలో 48శాతం మంది ఈ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. అయితే మొత్తం దేశంలో వ్యవస్థీకృత ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న మొత్తం కార్మికులు, ఉద్యోగులలో ఈ ప్రాంతం వాటా కేవలం 27శాతం మాత్రమే. ఇక దక్షిణ, పశ్చిమ ఉత్తర ప్రాంతాల జనాభా దేశ మొత్తం జనాభాలో 49శాతం, కానీ, ప్రైవేటు ఉద్యోగాలలో నాలిగింట మూడు వంతులు ఈ మూడు ప్రాంతాల్లోనే కేంద్రీకృతం అయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి ప్రక్రియ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతీయ వ్యత్యాసాలు నిజంగా ఆందోళన కలిగించే అంశం.

మహిళలకు ఉపాధి అవకాశాలు అంతగా లేకపోవడం, అసమానతలు, ఉపాధి రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష మరొక కీలక సవాలుగా నిలుస్తోంది. మహిళా కార్మికులలో అత్యధిక శాతం మంది పురుషులతో పోల్చి చేసినపుడు అల్ప ఉత్పాదకత, అల్పాదాయ ఉపాధికే పరిమితం అవుతున్నారు. విద్యారంగంలో రాయితీలు కల్పించడం వల్లనైతే నేమి, కుటుంబ ఆదాయాలు పెరిగిన ఫలితంగానైతే నేమి మహిళలలో విద్యావంతుల సంఖ్య పెరుగుతుంది. కానీ ఆ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగక ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్యం తగ్గుతోంది. ఇందుకు మహిళలకు తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇటీవల కాలంలో మహిళలు అధిక సంఖ్యలో ముందుకంటే ఎక్కువగా చదువుకుంటున్నారు. కాబట్టి, చదువుకున్న మహిళల సంఖ్య ముందు ముందు మరింత గణనీయంగా పెరుగుతుంది. దేశంలో చదువుకున్న మహిళలలో నిరుద్యోగులు 23శాతం మంది ఉన్నారు. ఇది పురుషుల నిరుద్యోగ శాతం కంటే రెట్టింపుగా ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ చదువుకున్న మహిళలు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం మన ముందున్న మరో సవాలు అనుకోవచ్చును. ఎందుకంటే పితృస్వామ్య వ్యవస్థ స్వభావం గల మన దేశంలో పురుషుల్లాగా మహిళలు ఉపాధి, ఉద్యోగం కోసం వేరే ప్రాంతాలకు వెళ్ళలేరు. కాబట్టి మహిళా ఉపాధి మరింత జటిలం అయ్యే అవకాశం ఉంది.

**సమస్య పరిష్కారం**

పేదరికాన్ని ఒక స్థాయి వరకు తగ్గించడంలో మన దేశం కొంతవరకు విజయం సాధించింది. అయితే, పనిచేసే చేతులకునాణ్యమైన ఉపాధిని కల్పించడంలో మాత్రం అంతగా విజయం సాధించలేదు. ఈ నేపథ్యంలో ఇపుడు మన దేశం ముందున్న ప్రధాన సవాళ్లలో ఉపాధి అవకాశాలు ప్రాధాన్యత గల సమ్మిళిత అభివృద్ధి విధి విధానాలను, వ్యూహాలను రూపొందించు కోవడం అనేది అత్యంత ప్రధాన సవాలుగా నిలుస్తోంది. నిరుద్యోగం, పాక్షిక నిరుద్యోగం, పేదరిక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సుస్థిర అభివృద్ధి అత్యవసరం . ఇందులో మరో అభిప్రాయానికి తావులేదు. అదే సమయంలో అది మాత్రమే సరిపోదు. సంపూర్ణ, సుస్థిర పేదరిక నిర్మూలన, సంపూర్ణ ఉపాధి సాధించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో అభివృద్ధి ప్రక్రియకు నూతన దశ దిశను నిర్దేశించుకోవడం అలాగే విధివిధానాల పునః నిర్మాణం కూడా ఎంతో అవసరం. ఇందుకు సంబంధించి ద్రవ్య, అర్థ విధానంతో సమ్మిళితమైన సంతులిత స్థూల ఆర్థిక విధానం అత్యంత కాలక పాత్రని పోషిస్తుంది. ఉపాధి లక్ష్యాలను వేరుగా కాకుండా దేశ స్థూల ఆర్థిక ద్రవ్య విధానాల్లో సమ్మిళితం చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చును. అదేవిధంగా, ఈ విధానాలలో వెనక బడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం, వెనకబడిన ప్రాంతాలలో తగిన విధంగా పెట్టుబడులు ప్రోత్సహించడం, ప్రోత్సాహక యంత్రంగాన్ని ఏర్పాటు చేయడం కూడా అంతే అవసరం. ఈ అసమానతలను, మార్కెట్ ప్రేరేపిత అభివృద్ధి ప్రక్రియ సరి చేస్తుందని ఆశించలేము. ఈ విషయంలో బలమైన స్థూల ఆర్థిక విధానాలు, వ్యూహాలు ఎంతో

అవసరం. ప్రభుత్వ జోక్యంలేకుండా ఈ లక్ష్యాలను చేరుకోవడం అయ్యే పని కాదు.

కార్మికులకు అల్ప ఆదాయ ఉత్పాదకతలకు నాసిరకం విద్య, నైపుణ్యరాహిత్యం ప్రధాన కారణం. కాబట్టి మానవ వనరుల రంగంలో, మరీ ముఖ్యంగా విద్య, నైపుణ్యం, వైద్య రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులు చాలా చాలా అవసరం. భౌతిక మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వెనకబడిన ప్రాంతాలు సాపేక్షంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలకంటే చాలా వెనకబడి ఉన్నాయి. కాబట్టి, వెనకబడిన ప్రాంతాలలో ప్రతికూల పరిస్థితులలో నివశించేవారి ఉపాధి కల్పించేందుకు మొత్తంగా అభివృద్ధి ప్రణాళిక పునః నిర్మాణం చాలా అవసరం. ఇది కేవలం ఉపాధి కల్పనకు మాత్రమే కాదు. సుస్థిర అభివృద్ధికి కూడా ఎంతో అవసరం.

**ప్రత్యేక ఉపాధి కార్యక్రమం పాత్ర**

డెబ్బయ్యవ దశకం మధ్యకాలం నుంచి ప్రభుత్వాలు ఉపాధి కల్పన పేదరిక నిర్మూలన లక్ష్యంగా అనేక ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. అభివృద్ధికి నోచుకోని ఉపేక్షిత బడుగు బలహీన వర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు కాలానుగుణంగా కార్యక్రమాలను ప్రవేశపెట్టి, అమలు చేయడం జరిగింది. నిర్దేశిత లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమాలను ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించవచ్చును. అందులో ఒకటి స్వయం ఉపాధి కార్యక్రమాలు అయితే రెండవది వేతన ఉపాధి కార్యక్రమాలు.

**స్వయం ఉపాధికార్యక్రమాలు :** గ్రామీణ స్వయం ఉపాధి కార్యక్రమాలన్నింటిని 1999లో స్వర్ణజయంతి స్వరాజ్ గార్‌యోజన పేరిట ఒకటిగా సమ్మిళితం చేశారు. ఎస్‌జీఎస్‌వై కార్యక్రమం ప్రధానంగా కొంత ప్రభుత్వ సబ్సిడీ కొంత బ్యాంకు రుణం రూపంలో నిధులను సమకూర్చి సూక్ష్మ సంస్థల స్థాపనపై దృష్టిని కేంద్రీకరించింది. అలాగే స్వయం సహాయక సంఘాల ఏర్పాటు వాటిని సామర్థ్యాన్ని పెంచడం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అదేవిధంగా సామూహిక ఆర్థిక కార్యకలాపాల యోజన అందుకు అవసరమైన మౌలిక సాంకేతిక సదుపాయాల కల్పన, శిక్షణ వంటి అనేక ఇతర అంశాలను ఇందులో పొందుపరిచారు. ఈ అన్ని విషయాలలోనూ బలహీనవర్గాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు.

అయితే ఎస్‌జీఎస్‌వై కార్యక్రమ పరిధిలో స్వయం ఉపాధి కార్యక్రమాల అమలులో అనేక కొత్త అనుభవాలు ఎదురయ్యాయి. అనేక పాఠలు నేర్చుకోవాల్సి వచ్చింది. అక్షర గానం అంతగా లేని ఆస్తులు అసలే లేని, అల్పాదాయ వర్గాల ప్రజలు స్వయం ఉపాధి వైపు మొగ్గ చూపలేక పుతున్నారని అందుకు అనేక కారణాలున్నాయని గుర్తించారు. బలహీన వర్గాల ప్రజలు స్వయం ఉపాధి వైపు మొగ్గ చూపకపోవానికి కేవలం ఆర్థిక వనరులు లేకపోవడం ఒక్కటే కాదు. నైపుణ్యం, సామర్థ్యం సుస్థిర సంస్థాగత మద్దతు లేకపోవడం కూడా ఒక ప్రధాన అవరోధంగా నిలిచింది. ఎస్‌జీఎస్‌వై పరిమితులను గుర్తించిన ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం అజీవిక (జీవనోపాధి) అని నామకరణం చేసింది. ఈ కార్యక్రమాన్ని 2011 (ఎంఓఆర్‌డి 2012) లో లాంచనంగా ప్రారంభించారు.

అజీవిక, పేద ప్రజలను ఒకటిగా చేసే స్వయం సహాయక బృందాలేర్పాటు చేయడం ఆ బృందాలను గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సామూహిక జీవనపోధి కేంద్రాలు, సమాఖ్యలు వంటి బలమైన వ్యవస్థల నిర్మాణంపై దృష్టిని కేంద్రీకరించింది. ముఖ్యంగా ఉపేక్షిత వర్గాల ప్రజలను స్వయం సహాయక బృందాలలో చేర్చడం ద్వారా వారి భాగస్వామ్యాన్ని ప్రాతినిధ్యాన్ని పెంచడంపై దృష్టి నిలిపింది. అలాగే నైపుణ్యాభివృద్ధి శిక్షణలకి కూడా ప్రాధాన్యతను ఇచ్చింది. ఇదిగాక 2008 ఆగస్టులో గ్రామ, పట్టణ ప్రాంతాలు రెంటిలోనూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం పిఎంఈజీపీ) పేరిట, రుణ అనుసంధాన పథకాన్ని ప్రారంభించింది. వ్యాపార దక్షతను పెంచడం ఈ స్వయం సహాయక కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ పథకం పరిణామ క్రమంలో రుణ అవసరాలు లభ్యత మధ్య చాలా పెద్ద అగాధం ఉన్న విషయం బయటపడింది.

ఇలా మొత్తంగా చూస్తే ఒక్క పీ ఎం ఈ జీ పీ మినహా స్వయం సహాయక పథకాలు, ఇటు జీవన ప్రమాణాలు పైన అటు ఉపాధి కల్పనలోనూ పెద్ద ప్రభావాన్ని చూపలేకపోయాయి. అంతేకాదు అలాంటి ఆర్థిక మద్దతు ఆశిస్తున్న వారి అవసరాలతో పోలిస్తే చేసిన ఖర్చు చాలా తక్కువగా ఉంది. ఒక్కొక్క లబ్దిదారునికి లభించే మొత్తం అయితే మరీ తక్కువగా ఉంది. ఇది చాలదన్నట్లుగా బ్యాంకులు, ప్రభుత్వ యంత్రాంగం రెడ్ టిపీజయం వెరసి ఈ పథకాల పనితీరుపై ప్రభావం చూపాయి. అయితే ఈ అవరోధాలను అధిగమించిన చోట్ల, ఉదాహరణకు కేరళ కుటుంబశ్రీ కార్యక్రమం, ఆంధ్ర ప్రదేశ్‌లో స్వయం సహాయక బృందాలు లాగా మంచి ఫలితాలను సాధించడం జరిగింది.

**వేతన ఉపాధి కార్యక్రమం**

గ్రామీణ వేతన ఉపాధి కార్యక్రమంలో 2005 చేసిన మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఇ)తో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. ఉపాధి హక్కుగా మారింది. ఈ చట్టం గ్రామీణ ఉపాధిని చట్టబద్ధం చేసింది. కనీస వేతనాలతో కోరుకున్న వారందరికీ సంవత్సరానికి వందరోజుల

ఉపాధి హామీని ఈ చట్టం కల్పించింది. అలాగే ఈ చట్టం ఆస్తుల కల్పన ద్వారా గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించే బలోపేతం చేసే వ్యవస్థ నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వాస్తవానికి, ఈ పథకాన్ని అమలు చేసే పంచాయతిరాజ్ సంస్థలు ఈ కార్యక్రమాన్ని పంచాయతి రాజ్ వ్యవస్థ సాధికారిత దిశగా వేసిన ఇక ముందడుగుగా భావించాయి. అలాగే ఈకార్యక్రమం పెద్ద ఎత్తున గ్రామీణ ప్రజానీకాన్ని ఒక క్రమపద్ధతిలో సమీకరిస్తున్న నేపథ్యంలో ఇది వారికి వారి ఉపాధి హక్కుల సాధనలో దళితులు, మహిళలు ఇతర బడుగు బలహీన వర్గాలకు ఒక చక్కని అవకాశంగా నిలుస్తుందని భావించారు. నిజంగా కూడా ఈ పథకం పరిణామ క్రమంపై జరిపిన అనేక అధ్యయనాల్లో గ్రామీణ కుటుంబాల వేతన స్థాయి గణనీయంగా పెరిగిందని అదేవిధంగా వలసలు గణనీయంగా తగ్గాయని తేలింది. ఎంజీఎన్ఆర్ఇజీఏ భూమిలేని కూలీలు, చిన్న సన్నకారు రైతులు, షెడ్యూల్ కులాలు, తెగలు పేద ప్రజలు ఇలా అనేక వర్గాల ప్రజలకు చేరువైంది. పేదరికానికి, ఉపేక్షకు గురయ్యే ప్రమాదమున్న ఈ వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా వారి ఉపాధి అవకాశాలు మెరుగువడమే కాకుండా వారి జీవన ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగయ్యాయి.

ఎంజీఎన్ఆర్జీఏ పథకం క్రింద ఉపాధి పొందిన వారి సంఖ్యకు సంబంధించి ప్రాంతాల మధ్య వ్యత్యాసం ఉన్నపటికీ, దేశం మొత్తం మీద చూసినపుడు పని డిమాండ్ చాలా ఎక్కువగానే ఉంది. ఈపథకం కింద ఒక్కొక్క కుటుంబానికి సంవత్సరానికి వంద రోజులు మాత్రమే పని కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ అంతకంటే ఎక్కువ పనిదినాలు కావాలన్నా డిమాండ్ లేకపోలేదు. అయితే, సాంకేతిక యాజమాన్య సామర్థ్యం లేకపోవడం వంటి అనేక కారణాల చేత స్థానిక ప్రభుత్వాలు ప్రజలు కోరుకున్న మేరకు పని చూపించలేకపోయాయి. అయితే కూలీలు నిరంతరాయంగా పని కారవాలని అదేవిధంగా పని స్వభావం ముందుగానే తెలపాలని కోరుకోవడం ఇందుకు ఒక కారణం అనుకోవచ్చును. అవిభక్త ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఈ పథకం ఇతర రాష్ట్రాలకంటే ఎంతో మెరుగ్గా ఉంది. ఇందుకు కారణం ఈ రాష్ట్రాల్లో దీర్ఘకాలంపాటు నిరంతరాయంగా పని దొరకటమే కాకుండా వ్యవసాయ పనులు లేని కాలంలో ఎంజీఎన్ఇజీఎస్ పనులు చేపట్టడం కూడా ప్రధాన కారణం అని చెప్పవచ్చును. ఇతర రాష్ట్రాల్లో ఈ పరిస్థితులు ఏలకపోవడం వలన ఆశించిన ఫలితాలు రాలేదు. ఇలా వ్యవసాయ పనులు ఉన్న రోజుల్లో ఆ పనులు అవి లేని రోజుల్లో ఉపాధి హామీ పథకం పనులు చేసుకుంటూ అందుకు తగట్టుగా కూలీలు ఉపాధి క్యాలెండరును నవరించుకున్నారు. తద్వారా, ఒక సంవత్సరకాలంలో అత్యధిక ఉపాధి పొందే ప్రయోజనాన్ని పొందారు. అయితే, బీహార్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో వ్యవసాయ పనులతోపాటే ఉపాధి హామీ పనులు సాగడంతో పని దినాలు తగ్గిపోయి వ్యవసాయ పనులు లేని రోజుల్లో కూలీలు వలస బాట పట్టారు. చాలా వరకు రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా ఉత్తరాధి రాష్ట్రాల్లో ఉపాధిహామీ పథకం ఆశించిన స్థాయిలో విజయవంతం కాకపోవడానిక, పంచాయతీరాజ్ సంస్థలకు నిర్వహణ సామర్థ్యం లేకపోవడం సిబ్బంది కొరత, సాంకేతిక సిబ్బంది లేకపోవడం వంటి అనేక కారణాలున్నాయి. అదేవిధంగా ఈ పథకం అమలులో ఆస్తుల కల్పనపై తగినంత దృష్టి పెట్టలేదనే విమర్శతోపాటుగా కేవలం కేటాయించిన నిధులను ఖర్చు చేయడంపైనే దృష్టిని కేంద్రీకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఇలా ఎన్ని ఆరోపణలు, లోపాలు ఉన్నా గతంలో అమలు చేసిన గ్రామీణ ఉపాధి పథకాల కంటే ఉపాధి హామీ పథకం ఎంతగానో విజయవంతమైంది. అదే సమయంలో ప్రస్తుతం అమలవుతున్న నైపుణ్య శిక్షణ వంటి అభివృద్ధికార్యక్రమాలతో సమ్మిళితం చేస్తేనేగానీ ఎంజీఎన్ఇజీఎస్ పథకాన్ని అట్టేకాలం అమలు చేయలేము. అన్న అభిప్రాయం కూడా విస్తృతంగా వినవోస్తుంది.

గ్రామీణ ఉపాధి పేదరిక నిర్మూలనలతోపాటుగా పట్టణ ప్రాంత ఉపాధి పేదరిక నిర్మూలన కోసంగా కూడా కేంద్ర ప్రభుత్వం కొన్ని పథకాలను అమలు చేస్తోంది. పట్టణ ప్రాంత నిరుద్యోగులకు లేదా పాక్షిక ఉపాధి పొందుతున్న వారికి ప్రయోజన కరమైన ఉపాధి కల్పించడంకోసం స్వయం ఉపాధి లేదా వేతన ఉపాధిపథకాలను కేంద్రవప్రభత్వం స్వర్ణజయంతి షహరీ రోజ్‌గార్ యోజన వంటి పథకాలను అమలు చేస్తోంది. స్వర్ణజయంతి షహరీ రోజ్‌గార్‌యోజన పథకంలో రెండు ప్రధాన భాగాలున్నాయి. అందులో మొదటిది, పట్టణ ప్రాంత స్వయం ఉపాధి కార్యక్రమం రెండవది పట్టణ ప్రాంత వేతన ఉపాధి పథకం ఈ రెండుకూడా అత్యంత ప్రాధాన్యత గల కార్యక్రమాలు యుఎస్ఇపి పథకం పరిధిలో పట్టణ ప్రాంత పేద ప్రజలకు సొంత వ్యాపారాలు చేసుకునేందుకు సహాయం అందిస్తారు. యుడబ్ల్యుఇపీ పథకం పరిధిలో పేదిక దిగువన ఉన్న పట్టణ ప్రాంత పేదలకు పట్టణ ప్రాంత స్థానిక సంస్థల పరిధిలో నిర్మించే సామాజికంగా, ఆర్థికంగా ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తుల నిర్మాణ పనుల్లో ఉపాధి కల్పిఇస్తారు. అయితే ఇంతవకు నిరుద్యోగులకు గానీ, లేదా పాక్షిక ఉపాధి పొందుతున్న పేదలకు గానీ ఈ పథకం వలన అంతగా ప్రయోజనం కలిగిన దాఖలాలు కనిపించడం లేదు. ఇందుకు సంస్థాగత అవరోధాలు కొంత వరకు కారణం అయితే ఈ పథకం అమలుకు గల పరిధి మరీ తక్కువగా ఉండడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ■

విశేష వ్యాసం

# విద్య - వృత్తి విద్య

**ఉపాధ్యాయ శిక్షణార్థులతో గాంధీజీ సంభాషణల నుండి, ఫిబ్రవరి 3, 4, 1939**

**వా**ర్ధాలో 1939లో మూడువారాల పాటు ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాలు జరిగాయి. దేశం నలుమూలలనుంచి దాదాపు 75మంది ప్రతినిధులు హాజరయ్యారు. శిక్షణానంతరం వారు తిరిగి వారి స్వరాష్ట్రాలకు వెళ్ళేముందు గాంధీగారిని కలిసారు. వారితో ఫిబ్రవరి 3,4 తేదీల్లో జరిపిన ఇష్టగోష్ఠి సందర్భంగా మహాత్మాగాంధీ వెల్లడించిన అభిప్రాయాలలో కొన్ని ఇలా ఉన్నాయి.(విమర్శల సుడిగుండంలో వార్ధా పథకం' పేరుతో ప్యారేలాల్ రాసిన పుస్తకం నుంచి వీటిని సంగ్రహించడం జరిగింది.)

తకిలీ (చేతితో నూలు వడికే సాధనం)తో సంబంధంలేని ఏ ఒక్కమాట కూడా పిల్లలతో ఉపాధ్యాయులు మాట్లాడ కూడదనేది ఈ పథకం సారాంశమా? అని గాంధీగారిని ఆయన స్నేహితుడొకరు ఈ సమావేశానికి ముందు అడిగారు. సభలో అందరిముందు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ గాంధీజీ ఇలా అన్నారు.

" ఇది నన్ను నేరుగా నిలదీయడమే! నిజమే, ఒప్పుకుంటా. పిల్లలకు మనం నేర్పించేదంతా ఏదో ఒక మౌలిక వృత్తివిద్యతో సంబంధం ఉండాలని చెప్పినమాట వాస్తవమే. ఒక పనిని గురించి లేదా ఒక పరిశ్రమ గురించి 7-10 ఏళ్ళ మధ్య వయసున్న పిల్లలకు చెప్పేటప్పుడు అదితప్ప దానితో సంబంధంలేని ఇతర విషయాలేవీ మొదట్లో మాట్లాడకూడదు. దానివల్ల మొదట్లో గుర్తుకురాని చాలా విషయాలు పోనుపోను మీకే తెలుస్తుంటాయి. ఇలా చేస్తే మీకూ పిల్లలకూ కూడా పెద్దగా శ్రమ ఉండదు. ఇది పూర్తిగా కొత్తపద్ధతి. ఇలా బోధించాలి, అలా ఉండాలి అని చెప్పడానికి మనకు ఏ పుస్తకాలు సిద్ధంగా లేవు. ఏ మార్గదర్శకాలు అసలే లేవు. లోగడ ఇటువంటివేమీ జరగలేదుకూడా. అందువల్ల మనం కొద్దిగా నింపాదిగా అడుగులు వెయ్యాలి. ఇక్కడ ఉపాధ్యాయులు వారి ఆలోచనలను తాజాగా ఉంచుకోవాలి. వృత్తివిద్యతో సంబంధంలేని విషయాలేవీ మీకు తోచనప్పుడు అదేపనిగా బాధపడకండి. దాన్ని పట్టుకువేళ్ళాడకండి. దాన్ని వదిలేసి మీరేది చెప్పగలరో అదే చూసుకోండి. మీకు తోచని విషయాలు మరో టీచర్‌కు తోచవచ్చు.ఆయన దానితో సంబంధమున్న విషయాలు సక్రమంగా బోధిస్తూ పోతాడు. ఇటువంటి వాళ్ళ అనుభవాన్నీ చూసుకుంటూపోతుంటే మీకు దిశానిర్దేశంచేసే పుస్తకాలు తారసపడతాయి. ఆ తర్వాత మిమ్మల్ని అనుసరించే విద్యార్థులకు పనితేలికవుతుంది.

మన విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులురావాలి. "మెదడుకు చేత్తో పాఠాలు బోధించాలి". నేనే కవిని అయినట్లయితే.... చేతికున్న ఐదువేళ్ళు చేయగల విన్యాసాలమీద చక్కటి కవితలు చెప్పి ఉండేవాడిని. అసలు మెదడే సర్వస్వం అనీ, చేతులూ కాళ్ళూ ఎందుకూ కొరగానివనీ మీరెందుకలా అనుకుంటారో నాకర్థంకాదు. ఎంతసేపటికీ మెదడుకు పదును పెడుతూ చేతులకూ చేతి వేళ్ళకూ కూడా మంచి శిక్షణ ఇవ్వలేకపోతే మీ జీవితంలో రసానందం పోయినట్లే! కేవలం పుస్తకాల్లో తలదూర్చడం పిల్లలకు కూడా అసలు ఇష్టం ఉండదు. అన్నింటినీ మర్చిపోయి మీరుచెప్పే పుస్తకాల పాఠాలు తదేకంగా వారు వింటూ కూర్చోలేరు. ఎక్కువమాటలు వినే కొద్దీ మెదడుకు కంపరం మొదలవుతుంది. అది వాటిని తప్పించుకుని ఎక్కడో తిరగాలని చూస్తుంటుంది. మెదడు చెయ్యలేనివి చెయ్యిచేసి చూపిస్తుంది. మెదడు చూడలేనివి కళ్ళు చూస్తాయి. మెదడు వినలేనివి చెవులు వింటాయి. పిల్లలకు ఏదికావాలో సక్రమంగా ఎంచుకోవటం మనం నేర్పించలేదు. మంచీ చెడులను పోల్చుకోగలిగిన విషయాలు నేర్పనిది, ఏది జీర్ణించుకోవాలో ఏది వదిలి వేయాలో నేర్పనిది అది విద్యఎలా అవుతుంది ! ఒక అపోహగానే మిగిలిపోతుంది.

**శ్రీమతి ఆశాదేవి ప్రశ్న : చేతులతో మెదడుకు శిక్షణ ఇవ్వడమా ? అదెలా సాధ్యం ?**

**గాంధీజీ :** పిల్లలకు ఉండే పాఠ్యాంశాల్లో వృత్తివిద్యకూడా ఉందికదా ! మామూలు పాఠాలతో సంబంధం లేకుండా ఈ వృత్తి విద్యను పిల్లలకు ప్రత్యేకంగా నేర్పిస్తుంటారు కదా! ఇది పాత పద్ధతి. నా దృష్టిలో అది పెద్దతప్పు. అలా చేయకూడదు. పిల్లలకు నేర్పే వృత్తివిద్యను ప్రతి టీచర్ నేర్చుకోవాలి. తన సబ్జెక్ట్ పరిజ్ఞానాన్ని ఆ వృత్తివిద్యకు అన్వయించి పిల్లలకు చెప్పాలి.

ఉదాహరణకు తకిలీతో నూలు వడకడమే తీసుకోండి. నాకు లెక్కలు రాకపోతే నేను ఎన్ని గజాలు వడికిందీ ఎలా తెలుస్తుంది? ఏ రకం నూలు కౌంట్ ఎలా వేయాలి, ఎంతసేపు పనిచేస్తే ఎంతనూలు వస్తుంది...ఇవన్నీ నేనుఎలా చెప్పగలను? అలా చేయాలంటే నాకు అంకెలు తెలిసి ఉండాలి. అలాగే కూడికలు, తీసివేతలు, భాగాహారాలు, గుణింతాలు కూడా. అవి పూర్తిగా చిక్కులెక్కయితే నేను వాటికి చిహ్నాలు ఉపయోగించాల్సి ఉంటుంది. అంటే అల్జీబ్రా తెలియాలి. ఇక్కడ కూడా నేను ఏమంటున్నానంటే అంకెలు రోమన్‌కు బదులు మన భారతీయ భాషల్లోని అంకెలను నేర్పండి.

ఇక జామెట్రీ(రేఖాగణితం)తీసుకోండి. వృత్తం గీయాలి. ఎలా గీయాలో చెప్పడానికి తకిలీ కింద చక్రం చూపండి. గణితశాస్త్రజ్ఞుడయిన యూక్లిడ్ పేరెత్తకుండా ఎన్ని రకాల వృత్తాలయినా ఎలా గీయాలో నేను బోధించగలను.

ఇప్పుడు మళ్ళీ మీరేమని అడుగు తారంటే..'ఇది సరే...జాగ్రఫీ(భూగోళశాస్త్రం), హిస్టరీ (చరిత్ర) పాఠాలను నూలువడకడానికి ఎలా అన్వయించగలరు ?" అని. కొంత కాలం క్రితం నేనొక పుస్తకం చదివా. దాని పేరు 'Cotton-The Story of Mankind' అది ఎంత అద్భుతంగా ఉందో తెలుసా ! ! ! ఏదో ప్రేమకథలను చదివినట్లు ఆసక్తికరంగా సాగింది. ఎప్పుడో తాతలు, ముత్తాతల కాలంలో పత్తి ఎలా పండించేవారో, ఆ తరువాత అది అభివృద్ధి ఎలా అయిందీ, వివిధ దేశాల మధ్య దానితో వ్యాపారం ఎంత పెద్ద ఎత్తున ఎలా సాగిందీ.... అంతా ఆసక్తికరంగా ఉంది. వివిధ దేశాల ప్రస్తావన వచ్చినప్పుడు... ఆ దేశం ఎక్కడ ఉంటుందీ, ఎలా ఉంటుందీ కూడా విద్యార్థులకు చెప్పాలిగదా ! ఎవరిపాలనలో ఎటువంటి ఒప్పందాలు అయ్యాయి, కొన్ని దేశాలు బట్టలు దిగుమతి చేసుకుంటే మరికొన్ని దేశాలు నూలును మాత్రమే ఎందుకు దిగుమతి చేసుకుంటాయో చెప్పాలిగదా ! అసలు ప్రతిదేశం దానికి అవసరమైన పత్తిని ఎందుకు పండించు కోలేదు? ఎటువంటి నేలల్లో పత్తి పండిస్తారు, అదెలా పెరుగుతుంది, పండిన తరువాత ఏం చేస్తారు, అలా అన్నీ చెప్పాల్సి వస్తుంది. అంటే నేను ఇంకా ఎకనామిక్స్ (అర్థశాస్త్రం), వ్యవసాయ శాస్త్రం...ఇవన్నీ కూడా చెబుతున్నట్లే కదా ! అంటే తకిలీతో నూలు వడకడం నన్ను ఎక్కడికి తీసుకెడుతున్నదో చూడండి. ఆరోజుల్లో బట్టలు నేసిన తరువాతి పరిస్థితిని చెప్పినప్పుడు సహజంగానే ఈస్టిండియా కంపెనీని గురించి చెప్పాలి. వాళ్ళిక్కడకు ఎందుకు వచ్చారో చెప్పాలి. వాళ్ళు మననేత పరిశ్రమను ఎలా ధ్వంసం చేశారో చెప్పాలి. ఆర్థిక కారణాలతో వచ్చినా వారికి రాజకీయ ఆకాంక్షలు ఎలా ఏర్పడిందీ చెప్పాలి. అది మొగలాయీలు, మరాఠాల పతనానికి ఎలా దారితీసిందీ చెప్పాలి. క్రమేణా వాళ్ళు ఇక్కడ ఎలా పాతుకుపోయిందీ, వాళ్ళను సాగనంపడానికి మనవాళ్లను మనం ఎలా చైతన్యవంతం చేసిందీ చెప్పాలి...ఓహ్ ! ! ! అంటే ఈ కొత్త పథకంలో విద్యాబోధన అనంతంగా సాగుతూపోతుంది. అనవసరంగా తరగతిగది పాఠాలతో బుర్రబద్దలు కొట్టుకోకుండానే పిల్లలు ఎన్ని విషయాలు ఎంత త్వరగా నేర్చుకుంటారో చూడండి.

ఇంకాస్త వివరంగా చెప్పాలంటే మీరు బయాలజిస్ట్ (జీవశాస్త్ర నిపుణుడు) కావాలను కుంటే మీకు జీవశాస్త్ర ప్రాథమిక సూత్రాలతోపాటూ మిగిలిన చాలా విషయాలు తెలియాలి. టీచర్ పాత్ర పోషించే సీనియర్ విద్యార్థి తకిలీని గురించే ఇంకాస్త ఎక్కువ ఆలోచించాడనుకోండి. తకిలీతో ఎలాగూ నూలు వడకగలుగుతాడు కాబట్టి, తకిలీ యాంత్రికంగా ఎలా పనిచేసేదీ అతనికి

తెలుస్తుంది. కానీ దాని వెనుక ఉన్న స్ఫూర్తి ఆలోచన, దానితో ముడిపడిఉన్న ఇతర విషయాలను గురించి కూడా ఆలోచించాలి. అంటే దీనికి కింద ఇత్తడి చక్రం (డిస్క్) ఎందుకు ఉంది? కండొ స్టీలువే ఎందుకు? వీటి వాడకానికి చాలాకాలం ముందు తకిలీ చక్రాలు పలకముక్కతో, బంకమట్టితో చేసేవారు. కండొ చెక్కతో చేసేవారు. కానీ తరువాత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందాక వాటికి ఇత్తడి, స్టీలు ఉపయోగిస్తున్నారు కదా! వీటినే ఎందుకు ఉపయోగించాలి? దీనికి ఇప్పుడున్నంత వ్యాసమే ఎందుకుండాలి, ఎక్కువతక్కువంటే ఏమవుతుంది? ఈ ప్రశ్నలన్నీ ఇలా టీచర్ ఆలోచించి సమాధానాలు కనుక్కుని పాఠాలు చెప్పడం మొదలుపెడితే మీ పిల్లలు మంచి ఇంజనీర్లవుతారు. తకిలీ 'కామధేను' (అడిగినవన్నీ ఇచ్చేది) అవుతుంది. ఇక్కడ మీరు మూడు వారాలపాటు ఉన్నారు. ఈ పథకానికి సంబంధించి మీరిక్కడ గడిపిన సమయం సద్వినియోగ మయిందనే అనుకుంటున్నాను.

తకిలీ, నూలు వడకడం గురించి ఎందుకు చెప్పానంటే – నాకది బాగా తెలుసు కాబట్టి. నేను వడ్రంగిని అయిఉంటే వడ్రంగి పనిద్వారా ఈవిషయాలన్నీ చెప్పి ఉండేవాడిని.

ఈ విధమైన జిజ్ఞాసతో వ్యవహరించే అసలు సిసలు విద్యావేత్తలు మనకు కావాలి. పిల్లలకు పాఠాలు చెప్పడానికి వెళ్ళే ముందు రాత్రింబవళ్ళు వాళ్ళు దాని గురించి ఆలోచించాలి. దుమ్ముపట్టిన పుస్తకాలనుండి టీచర్లకు ఈ జ్ఞానం అందదు. తమ ఆలోచనలకు, పరిశీలనాశక్తికీ బాగా పదునుపెట్టాలి.

అదంతా ఒంటపట్టించుకుని వృత్తివిద్యను ఊతంగా చేసుకుని విద్యార్థుల మనసుల్లో నాటుకునేలా చెప్పగలగాలి. అంటే పాఠాలుచెప్పే విధానంలో ఈ పద్ధతి టీచర్ల దృక్పథంలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తుంది.

**ప్రశ్న : సీనియర్ విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చేటప్పుడు–ముందుగా వారికి వృత్తివిద్యను నేర్పి, ఆ తరువాత దానిని వారు బోధించే సబ్జెక్టులకు ఎలా అన్వయించాలో నేర్పితే బాగుంటుందేమో కదా ! ఇప్పుడున్నది ఉన్నట్లుగా అయితే – వాళ్ళకేం చెబుతున్నామంటే – "వృత్తి విద్యను నేర్చుకునేముందు మిమ్మల్ని మీరు ఏడేళ్ళ వయసున్న పిల్లలుగా భావించుకోండి. వృత్తివిద్య ద్వారా అన్నీ మళ్ళీ నేర్చుకోండి" అని. ఈ లెక్కన వాళ్ళు ఈ కొత్త పద్ధతిలో ఆరితేరి మంచి సమర్థులైన టీచర్లనిపించు కోవడానికి ఏండ్లు పడుతుందికదా ?**

**గాంధీజీ :** ఏళ్ళెందుకు !!! టీచర్ మనదగ్గరికి వచ్చేటప్పటికీ, వారివారి సబ్జెక్టుయిన లెక్కలు, చరిత్ర వంటి వాటిలో వాళ్ళు నిష్ణాతులయ్యే ఉంటారు గదా! మనం ఇక్కడ ఏం చెబుతున్నాం. నూలు ఎలా వడకాలి ? కార్డుబోర్డు పెట్టెను ఎలా తయారుచేయాలి? అని ఆది నేర్చుకునేటప్పుడే దాన్నుంచి లెక్కలు, చరిత్ర, భూగోళ శాస్త్రం ఎలా తెలుసుకోవచ్చో సూచనప్రాయంగా చెబితే చాలుకదా ! అతనే దాన్ని వృత్తివిద్యకు ఎలా అన్వయించాలో చూసుకుంటాడు. దానికంతకాలం ఎందుకు పడుతుంది ? మీకొక విషయం చెబుతా– నేను ఏడేళ్ళ వయసున్న నాకొడుకును తీసుకొని ఓ ప్రాథమిక పాఠశాలకు వెళ్ళాననుకోండి. మేమిద్దరం నూలువడకడం నేర్చుకుంటాం. నూలు వడకడంతోపాటూ అంతకుముందు నాకున్న విషయపరిజ్ఞానాన్ని దానితో అన్వయించుకోగలను. కానీ నా కుమారుడికి అదంతా కొత్త. 70 ఏళ్ళున్న నాకు, తెలిసిన విషయాలే కొత్త వాతావరణంలో చెప్పినట్లు అనిపిస్తుంది. దీనికి కొద్దివారాలు చాలు. అందువల్ల కొత్త విషయాలు తెలుసుకోవాలని ఏడేళ్ళ పిల్లవాడికుండే తహతహ ఆ టీచర్‌కు లేకపోతే, యాంత్రికంగా నూలువడకడానికే పరిమితమవుతారు. అటువంటి టీచర్లు ఈ కొత్తపద్ధతికి పనికిరారు.

**ప్రశ్న : ఈ మౌలిక విద్యాపథకం అనేది ప్రధానంగా గ్రామాలకు ఉద్దేశించినట్టుగా ఉంది. మరి నగరంలోని పిల్లల మాటేమిటి? వాళ్ళు గానుగెద్దుల్లాగా పాత ఒరవడిలో పోవలసిందేనా?**

**గాంధీజీ :** ఇది మంచి ప్రశ్న. కానీ దీనికి ఇదివరకే 'హరిజన్' పత్రికద్వారా వివరంగా చెప్పా. ఇవ్వాళ్టికి ఇది చాలు. తినగలిగిన దానికంటే ఓ ముద్ద ఎక్కువే తిన్నాం. ప్రస్తుతానికి ఏడులక్ష గ్రామాల విద్యాబోధన సమస్యలను పరిష్కరిస్తే అదే చాలు. విద్యావేత్తలు నగరాల గురించి కూడా ఆలోచిస్తున్నారు. ఇప్పుడు పల్లెతోబాటూ పట్టణాలను కూడా దీన్లోకి లాగితే మనకున్న శక్తి కూడా ఆవిరయిపోతుంది.

**ప్రశ్న : ఒక ఊళ్ళో మూడు బళ్ళున్నా యనుకుందాం. మూడింటిలో వేరువేరు వృత్తివిద్యలు నేర్పుతారు. ఒకవేళ ఒక బడిలోని వృత్తివిద్య మిగిలిన రెండింటికంటే బాగా ఉంటే పిల్లలను ఏ బడికి పంపాలి ?**

**గాంధీజీ :** అసలా పరిస్థితి ఎందుకు రానీయడం! అసలు మన పల్లెలు ఎంత చిన్నవంటే ఒక బడి ఉండడమే గగనం. పెద్ద ఊరయితే ఇంకో బడుండవచ్చు. అప్పుడు అన్నింటిలో ఒకే వృత్తివిద్య ఉండాలి.అయితే ఇదిలా అదలా అని నేను గీతలు గీయను. మన అనుభవాలే మనకు మంచి మార్గం చూపుతాయి. ఎక్కువ వృత్తివిద్యలు ఆదరణ పొందడం అనేది పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేయడం మీద ఆధారపడి ఉంటుంది. అసలు విషయం ఏమిటంటే – మీరు ఏ వృత్తివిద్య పెట్టినా అది పిల్లల సామర్థ్యాన్ని పూర్తిగా, సమానంగా వెలికితీసేదిగా ఉండాలి. ఆ వృత్తివిద్య పల్లెకు సంబంధించి మాత్రమే అయి ఉండాలి. అది ఉపయోగకరంకూడా అయి ఉండాలి.

**ప్రశ్న : ఒక పిల్లవాడు భవిష్యత్తులో వేరే వృత్తుల్లోకి వెళ్ళే అవకాశాలు ఉన్నప్పుడు వాడు ఒక వృత్తివిద్యను నేర్చుకుంటూ ఏడేళ్ళు ఎందుకు వృథా చేసుకోవాలి ? ఒక బ్యాంకు ఉద్యోగి కొడుకుంటాడు. పెద్దయితే బ్యాంకింగ్ రంగంలోకి వెళ్ళవచ్చు. వాడు ఏడేళ్ళు నూలు వడకడం ఎందుకు నేర్చుకోవాలి ?**

**గాంధీజీ :** కొత్త పథకం ఏమిటో అసలు తెలుసుకోకుండా అడిగిన ప్రశ్న ఇది. ఈ పథకం కింద పిల్లవాడు బడికి వెళ్ళేది కేవలం వృత్తివిద్య నేర్చుకోవడానికి మాత్రమే కాదు, ప్రాథమిక విద్యను వృత్తివిద్య ద్వారా నేర్చుకోవడానికి వెడతాడు. మామూలుగా బడికి వెళ్ళివచ్చిన పిల్లవాడికంటే ఏడేళ్ళ వృత్తివిద్య ద్వారా ప్రాథమిక విద్యను ఈ పథకం కింద నేర్చుకున్న విద్యార్థి పెద్దయితే మంచి బ్యాంకర్ అవుతాడు. ఆ శిక్షణ లేకుండా మామూలుగా చదువుకున్న విద్యార్థి మెదడు సామర్థ్యం దానికి తగిన శిక్షణ పొందలేదు కనుక బ్యాంకింగ్‌లోకి వెడితే వాడు పనిలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటాడు. కొత్త పథకం అంటే నాలుగు అక్షరం ముక్కలు నేర్పి, కొత్తగా వృత్తివిద్య అంటే ఏదో చెప్పి పంపేది కాదు. వృత్తివిద్య మాధ్యమం ద్వారా ప్రాథమిక స్థాయి విద్యను అది పూర్తిగా అందిస్తుంది.

**ప్రశ్న : ఒక బడిలో ఒకటికంటే ఎక్కువ వృత్తివిద్యలు నేర్పించడం మంచిదికదా ! లేకపోతే ప్రతిరోజూ, ప్రతినెలా, ప్రతి సంవత్సరం చేసిందే చేసి వారికి విసుగు పుడుతుంది కదా !**

**గాంధీజీ** : నెలరోజుపాటు నూలు వడికించిన టీచర్ ఆ తర్వాత పిల్లలకు ఏ మాత్రం ఆసక్తికరంగా చెప్పలేక డీలాపడిపోతే నేను ఆ టీచర్‌ను తీసిపారేస్తా. ఒకే పిల్లనగ్రోవి మీద ఎప్పటికప్పుడు కొత్తరాగాలు పలికించినట్టుగా ప్రతిపాఠం కొత్తగా చెప్పాలి. వృత్తివిద్యలు ఒక దానినుండి మరొకదానికి మారుస్తూ పోవడం అంటే – కోతి, ఒక కొమ్మనుంచి మరొక కొమ్మకు దూకుతూ పోయినట్టుంటుంది. నేను ముందే మీకు చాలా వివరంగా చెప్పాను. వైజ్ఞానికస్ఫూర్తితో, అదే ఉత్తేజంతో నూలువడకడం నేర్పించడం అంటే వడకడంతోపాటూ చాలా విషయాలు వారికి నేర్పించడం అని. పిల్లలు సర్వశక్తి సమర్థులుగా తయారుకావడానికి టీచర్లు వైజ్ఞానిక స్ఫూర్తితో వృత్తివిద్యను బోధించాలి. ■

# ఈ-రూపంలో మహాత్మగాంధీ రచనా సంకలనం

బహుళ ప్రచార మహాత్మగాంధీ రచనా సంకలనం ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మగాంధీ (సిడబ్ల్యూఎంజి)ని డిజిటల్ రూపంలో విడుదల చేశారు. ఈ 55వేల పేజీలు, 100 పుస్తకాల సంకలనం ఇప్పుడు ప్రపంచ వ్యాప్త గాంధీజీ అభిమానుల కోసం ఎలక్ట్రానిక్ రూపంలో లభ్యమవుతోంది. ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న ఈ-సిడబ్ల్యూఎంజిని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అరుణ్ జేట్లీ 8 సెప్టెంబర్,2015న గాంధీ పీస్ సెంటర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్ కూడా పాల్గొన్నారు. అలాగే మంత్రి జేట్లీ గాంధీ వారసత్వ పోర్టర్‌లో ఈ సంకలనం లింక్‌ను ప్రారంభించారు. ఈ పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్కృతిక శాఖ అధ్వర్యంలో నడిచే సబర్మతి ఆశ్రమం ప్రిజర్వేషన్ మరియు మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఈ గాంధీ రచనా సంకలనం ఎలక్ట్రానిక్ రూపంలో ప్రజలకు అందుబాటులో ఉంచడంతో అమూల్యమైన జాతీ సంపదను సంరక్షించి మానవ జాతికి అందజేయడమేనని కేంద్రమంత్రి అరుణ్ జేట్లీ తెలిపారు. గాంధీగారు స్థాపించిన సంస్థ సహకారంతో ఈ పథకం నిర్వహించడం సంతోషకరమని, అలాగే దీని హిందీ రూపం సంపూర్ణ గాంధీ వాఙ్మయాన్ని కూడా అంకీక రూపంలో మార్చనున్నట్లు ప్రకటించారు.




***ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మగాంధీ(సిడబ్ల్యూఎంజి)ని ఈ-రూపంలో గాంధీ హెరిటేజ్ పోర్టల్‌లో విడుదల చేస్తున్న కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అరుణ్ జేట్లీ, చిత్రంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి కర్నల్ రాజవర్ధన్ సింగ్ రాథోడ్ (రిటైర్డ్), ప్రముఖ గాంధేయవాది దీనాబేన్ పటేల్ కూడా ఉన్నారు.***

ప్రచురణ విభాగం సిడబ్ల్యూఎంజిని ఎలక్ట్రానిక్ రూపంలో మర్చడానికి సెప్టెంబర్,2011న గుజరాత్ విశ్వవిద్యాలయంతో ఒక ఒక అవగాహనను కుదుర్చుకుంది. ప్రముఖ గాంధేయవాదులు, గుజరాత్ విద్యాపీఠ్ విశ్రాంత ఉపకులపతి ప్రొఫెసర్ సుదర్శన్ అయ్యంగార్, గాంధేయవాద రచయిత్రి ధీనాబేన్ పటేల్, శబర్మతి ఆశ్రమం ప్రిజర్వేషన్ మరియు మెమోరియల్ ట్రస్ట్, సంచాలకులు త్రిదీప్ సుహృద్‌తో కూడిన కమిటీ ఈ సంకలనం అన్ని విధాల ప్రమాణికంగా ఉండే విధంగా రూపొందించింది.

ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మగాంధీ (సిడబ్ల్యూఎంజి)ని ప్రచురణల విభాగం 1956-94లో గాంధీజి 1884 నుంచి ఆయన మరణం 30 జనవరి,1948 వరకూ వ్రాసిన లేఖలు, ప్రసంగాలతో కూడిన ఈ చిరస్మరణీయమైన గ్రంథ సముదాయాన్ని ప్రచురించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గాంధీజీ రచనలను క్రోడీకరించి ఒక అద్భుత పాఠ్యక్రమంలో రూపొందించారు.

Publishing date 9th October 2015, Posted on 12-13 October, 2015
Yojana (Telugu) October 2015 RNI Regd. No. 37729/80 Regd. No. H/HD-663/2015-17

# విజ్ఞాన ప్రదాయిని యోజన మాస పత్రికకు చందాదారునిగా చేరండి.




వివరాలకు
**ఎడిటర్,**
**యోజన** (తెలుగు)
10-2-1, ఎఫ్.డి.సి. కాంప్లెక్స్
మహవీర్ హాస్పిటల్ ఎదురుగా
ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్ - 500 028.
ఫోన్ : 23310162, 23315288
e-mail : yojana_telugu@yahoo.co.in

**చందా వివరాలు**

1 సంవత్సరానికి - రూ. 100
2 సంవత్సరాలకు - రూ. 180
3 సంవత్సరాలకు - రూ. 250

ప్రచురణల విభాగం విక్రయ కేంద్రం చిరునామా
**పబ్లికేషన్ డివిజన్ సేల్స్ ఎంపోరియం**
ఫస్ట్ ఫ్లోర్, బ్లాక్ - 4, గృహకల్ప కాంప్లెక్స్
ఎం.జె. రోడ్, నాంపల్లి, హైదరాబాద్ - 1
ఫోన్ నెం.: 040 - 24605383

Printed and Published by Mrs. Sadhana Rout, Additional Director General & Head on behalf of Publications Division, Ministry of I & B, Government of India and Printed at Micro Offset Printers, 11-6-868, Red Hills, Lak di ka pool, Hyderabad - 500 004. Ph. 040 - 66750291 and Published at Yojana (Telugu) 10-2-1, F.D.C. Complex, A.C. Guards, Hyderabad - 500 028. Senior Editor : **Vijayakumar Vedagiri,** Tel : 23315288